# శ్రీ సీతా మహాసాధ్వి



రచయిత

ఆర్షవిద్యాలంకార

కల్లూరి చంద్రమౌళి, బి యస్‌సి. (ఎబర్డీన్)

ఓం.

ఆర్

కుర్గంటి. సీతారామాచార్య

మహోదయులకు

సంస్కృతాంధ్ర పండితులు

691

ఉదయించని నిరీక్షణ.

ప్రేమ పూర్వకముగ

నిరీక్షణ — కవితా. బండ్ల చంద్రశేఖర

6-10-79.

# సీతా మహాసాధ్వి

రచయిత

ఆర్షవిద్యాలంకార

కల్లూరి చంద్రమౌళి, బి. యస్‌సి. (ఎజిర్గిక్)

సిద్ధార్థి శ్రావణము కృష్ణాష్టమి

1979

సర్వస్వామ్యములు
రచయితవి

ప్రతులు : వేయి
౧౦౦౦

వెల : రు 10-00

ముద్రణ :
జూపిటర్ ప్రింటింగ్ ప్రెస్
అరండల్ పేట, గుంటూరు-2

కళాప్రపూర్ణ

డాక్టరు. దివాకర్ల వేంకటావధాని

ఎం. ఏ. (ఆనర్సు) పిహెచ్. డి.

శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు రచించిన 'సీతామహాసాధ్వి' యను సద్గ్రంథము నత్యంతాదర గౌరవములతోఁ జదివి మహానందభరితుఁడనైతిని. భారతీయసంస్కృతి మహత్త్వము నుగూర్చి తెలుపు నుత్తమగ్రంథము లెన్నో వారిదివఱకు రచించి యుండిరి. అవియన్నియు లక్షణప్రవచన పరాయణములుకాఁగా, నిది లక్ష్యప్రదర్శన పాటవమగుచున్నది. సంస్కృతవాఙ్మయమున వాల్మీకి యాదికవియేయైనను అంతటిమహాకవి యేవాఙ్మయమునఁగాని మరల జనియింపలేదనుటలో నతిశయోక్తి లేదు. అతని శ్రీమద్రామాయణము భారతీయసంస్కృతిమహోజ్జ్వలతకు దర్పణమగుటయేకాక భారతీయకవితాకౌశలమునకుగూడ పరమావధియని చెప్పఁదగియున్నది. అతఁడందలిపాత్రల నన్నింటిని - అవి ప్రధానములుకానిండు, అప్రధానములు కానిండు - సుస్పష్టరేఖలతోఁ దీర్చిదిద్దియుండెను. ఆపాత్రలహారమునకు సీతపాత్ర నాయకమణి. ఆమె మహాసాధ్వి; మహాపతివ్రత; సత్యవాక్య నిష్ఠాపరాయణ; ధైర్యశాలిని; నీతినిధానము; ఆమెకామెయే సాటి. ఆమెవిషయమున శ్రీ చంద్రమౌళిగారుద్ధరించిన వివేకానందస్వామివాక్యములు సర్వశిరోధార్యములు.

సార్థకనామధేయుఁడైన యాస్వామిపుంగవుఁడు విమర్శకులకు దలమానికముకదా !

వాల్మీకిమహాకవి శ్రీమద్రామాయణమును పౌలస్త్యవధమనియు, సీతాయాశ్చరితమ్ మహత్తనియుగూడఁ బేర్కొనియుండెను అతడా కావ్యమును సీతాసాధ్వీచరితముగాఁ బేర్కొనుటకుఁ గారణమేమో యీగ్రంథమును జదివినవారికి దేటతెల్లముగాఁగలదు. ఆమెయందు ప్రదర్శించిన సాధ్వీత్వము, ధర్మపరాయణత్వము, శీలమహత్త్వము నాన్యతో దర్శనీయములు. సీత భూజాత. భూమినుండి పుట్టి చివర మరల భూమాతగర్భముననే లీనమై పోయినది. ఈమధ్యకాలమున నామె మానవజాతికిఁ జూపిన యాదర్శ మమోఘము; అప్రతిమానము.

రామాయణకథ నెఱుఁగనివా రక్షరాస్యులైన భారతీయులలో నెవ్వరు నుండరు. నిరక్షరాస్యులకుసైత మందలికథ సుపరిచితమే. కథయేకాదు అందలిపాత్రలును సర్వసుపరిచితములు. రామాయణము పఠించువారికి సీతాసౌశీల్యము విషయమున నాలుగైదు సందేహములు కలుగుచుండును. వనవాసమున కరుగుముందు తన్ను నివారించు రామునితో నామె రాముని జనకుఁడు "స్త్రియా పురుష విగ్రహమ్" గా భావించునని పల్కినది. సువర్ణమృగాకృతితో వచ్చిన మారీచుని గ్రహించుటకై రాముం డరిగినపు డాతఁడు వంచనకై పలికిన పల్కులాలించి లక్ష్మణుని రామరక్షణార్థమై వెళ్ళుమని చెప్ప సందర్భ

కులము, విద్య, వంశము దుర్మతులకు మదము కలిగించును; సజ్జనులకు అణకువయు, వినయమును ఇచ్చునని భారతము చెప్పినది. చంద్రమౌళిగారు సత్పురుషుడు. కావున దానికి తగినలక్షణములే వారి కబ్బినవి.

వీరికి రామాయణమనిన ప్రీతి ఎక్కువని చెప్పవలెను. సీతారాముల పుణ్యగాథ ఎవరి కిష్టముగాదు? 'రామాయణ సుధాలహరి' రచించుటతో తృప్తిపడని చంద్రమౌళిగారు ఇప్పుడు 'సీతామహాసాధ్వి' యను చక్కని గ్రంథము రచించినారు. వారి పరిశోధనాత్మకమగు దృష్టి, సరళసుందరమైన వారి రచనా విధానము నెరిగినవాడను గనుక సంప్రదాయ మమకారచారుతైన వారి యీ నూతననిర్మాణమును శ్రద్ధగా అవలోకించితిని; ఆనందపరవశుడ నయితిని.

రామాయణ వ్యాఖ్యల నెన్నింటినో వారు చాల నిశితముగా పరిశీలించిరి. అందు కల్లిడైకురిచ్చి సంస్కృత కళాశాలా ప్రధానాధ్యాపకులైన బ్రహ్మశ్రీ శంకరశాస్త్రిగారి 'సీతా రాక్షసీ సంవాదతత్త్వము' వాల్మీకిహృదయము నెరిగినదని, సత్యప్రకటన సమర్థమని వారు గుర్తించినారు. రమణీయార్థ పరిపుష్టమైన శాస్త్రిగారి సమీక్షావిశేషముల నందించి చంద్రమౌళిగారు సీతాతత్త్వమును హృదయగతము చేసినారు. వాల్మీకి మహర్షి సీతను సంబోధించుచు వాడిన 'సుభగ-సాధ్వి' ఇత్యాది తొమ్మిది పదములలోని అర్థవిశేషములను వివరించి ఆమె

శీలమహాత్త్వమును స్పష్టపరచుటలో వారి కృషి శ్లాఘ్యము. రామరాజ్య వైభవాభ్యుదయమునకు సీతామహాసాధ్వియే హేతుభూతయని నిరూపించి, ఆమె సౌశీల్య సౌభాగ్య సౌజన్యముల మహాత్త్వమును అందించిన కల్లూరివారు ధన్యులు. అట్టి రామరాజ్యమును జీవితధ్యేయముగా పెట్టుకొని కృషిచేసిన బాపూజీమార్గమే నేటి ప్రభుత్వమున కాదర్శము కావలెనని వారు భావించుచున్నారు. అది సహజము.

భారతీయసంస్కృతివాసనగలవారి కీ గ్రంథము రుచించి తీరును. మూలము చదువక రామాయణముగూర్చి ఏవో మాటలాడువారికి ఇటువంటి గ్రంథములు కనువిప్పు కలిగించును. కాన సహృదయులు పఠింతురుగాక! భావింతురుగాక!!

సాధుపురుషుడైన చంద్రమౌళి బుధుండు
సీతతత్త్వ మెరుగజేసె నేడు
ప్రజ్ఞగలుగువాడు రామాయణరహస్య
వేత్తయగుట సహజవిషయ మిదియు.

పేరు చంద్రమౌళి - ప్రేమ రామునిపైన
భక్తి జనకరాజపట్టిపైన
నిష్ఠ-రామరాజ్య నిర్మాణమందున
ధన్యు డితడు సుజనమాన్యు డితడు.

పదవు లెన్నొవచ్చె వానియంతట నవి
నిర్వహించె మిగుల నేర్పుమీర
అతడు వీడనట్టి ఆర్షధర్మము భక్తి
సుజను నతని కరుణ జూచుగాక!

మున రామునిమహాత్త్వమును, రాక్షసులమాయను పూర్తిగా నెఱిఁగిన లక్ష్మణుఁడు తానరుగవలసిన యవసరము లేదని పల్కఁగా నతని ననరానిమాటలని వనమునకుఁబంపి యాపద చేతులారఁ దెచ్చుకొన్నది. లంకలో నామెతో హనుమంతుఁడు ప్రసంగించి వెడలినపిమ్మట రాక్షసాంగన లాతఁ డెవరని యడుగఁగా తనకుఁ దెలియదని పైకి గోచరించు సమాధానము చెప్పినది. ఇది యసత్యభాషణము కాదా? యని యెవ్వరైన శంకింప వచ్చును. తరువాత నగ్నిప్రవేశము చేసినది. రామప్రేషితయై వాల్మీక్యాశ్రమమున కరిగి దుఃఖమయమైన జీవితము పుచ్చినది. చివరి కెల్లరు చూచుచుండ భూగర్భ విలీనయైనది. ఈసన్నివేశముల నన్నిటిని శ్రీ చంద్రమౌళిగారు సవిమర్శముగా జర్చించి సీత సాధ్వీత్వమును నిరూపించినారు. శ్రీ శంకరశాస్త్రిగారు రచించినగ్రంథము నాధారముగా గ్రహించి సీత రాక్షసాంగనలతోఁ బల్కిన పల్కులందలి వ్యంగ్యవైభవమును వెల్లడించి యామె యసత్యము వచింపలేదని విశదీకరించినారు. వారు సీత శీలమునందలి ప్రతిసూక్ష్మాంశమును కుశాగ్రబుద్ధితోఁ బరిశీలించి యామె శీలసువర్ణమునకుఁ బరిమళసంపదను సమకూర్చినారు

ఈగ్రంథమున వారిశైలి సరళమై, సుబోధమై, భావ నిర్భరమై, నిర్దుష్టమై, నిరుపమానమై, సీతశీలమువలె పవిత్రమై సాగిపోయినది. ఒకసారి చదువుటకై గ్రంథము తెఱచినవారు ముగియువరకు దానిని విడువజాలరు. కారణములు రెండు.

ఒకటి సీత శీలసంపద, రెండు గ్రంథకర్తగారి శైలీమాధుర్యము. వారు ప్రతివిషయమునకును ఆదికవి రామాయణమునుండి ప్రమాణము లొసంగియున్నారు. నిరాధారమైన సమర్థన మిందొక్కింతయు లేదు. ప్రాయపుప్రొద్దు పడమటికిఁ జేరిన యీ వయస్సునఁగూడ శ్రీ చంద్రమౌళిగా రిట్టి సద్గ్రంథమును రచించి ప్రచురించినందుకు వారికి నాహృదయపూర్వక నమస్సుమాంజలులు సమర్పించుచున్నాను.

చంద్రమౌళిః శివ స్సాంబః రక్ష త్వాచంద్ర తారకమ్.

# సీతాయాః శ్చరితం మహత్

ఓహో !

ఏమి యీచిత్రము! ఒకవంక ప్రాచీనసరస్వతీ స్వరూప నిరూపకములగు సద్గ్రంథములు వెలయుచునేయున్నవి. ఒకవంక ప్రాతసాహిత్యసరస్వతికి నవరంధ్ర బంధనము జరుగుచునే యున్నది.

ఎప్పటి రామకథ! ఎప్పటి వాల్మీకి రచన! పెద్దలు నిత్యనూతన మహార్థవిస్ఫూర్తితో ఆరామకథాస్వరూపమును స్వానుభవముతో ననుభవించి లోకశ్రేయమును సంధానించుచున్నారు. ఆ సంధాతలలో శ్రీ కల్లూరి చంద్రమౌళిగారొకరు. ఈ వీరి జీవితము రామసేవా పర్యవసన్నము. కొందరికి రామకథ ప్రాణాధిక ప్రీతిపాత్రము. రామకథతో నెవ్వరికెన్ని జన్మల స్నేహమో ఎవ్వరెరుగుదురు ?

ఈకాలమున నొకవిచిత్రమైన చిత్రణము జరుగుచున్నది. అదేమనగా పెద్దలను, వారుకావించిన పనులను, వారిసాహిత్యమును బహువిధములు దూషించుట. అది వారి నిష్కపటత్వమును, వ్యక్తిత్వ సమగ్రతను, అపూర్వప్రతిభా వైశిష్ట్యమును వెల్లడించునని వారి భావన. ఆభావన యేర్పడినపిమ్మట ఎన్నెని నేటి వ్యవహారముల దృష్టిలో నుంచుకొని ప్రాచీనములను దూషించుసివ మబ్బుట. చూచిన లోకమెల్ల 'హీహీ'యనుట

ఈ పద్ధతిలో గ్రంథమును ఆనుపూర్విగా సేవింపక వెఱ్ఱితొఱ్ఱి పలుకులు పలుకు వ్యాధి సంక్రమించినది. ఆ వ్యాధిగ్రస్తులు మృత్యుముఖమున బడకుండ చంద్రమౌళి సుధాలహరి ప్రవహింపజేయ దలచినాడు. చేయుచున్నాడు.

శ్రీమద్రామాయణమునందు సర్వవిధముల నొరపిళ్ళుపడి రత్నములవలె ప్రకాశించు ప్రాంతములు సర్వజగదాదర్శకల్పములు చాలకలవు. కాని వాల్మీకి భక్తితో, గౌరవముతో వాత్సల్యముతో, ప్రపత్తితో, ఆత్మానుబంధముతో పరవశించి "సీతాయా శ్చరితం మహత్" అన్నాడు. అనగా శ్రీమద్రామాయణమంతయు సీతామహత్వముతో నిండియున్నదనుట. బాలకాండలో తండ్రిచాటుబిడ్డయై మనకు గోచరించిన సీతమ్మ మహానదీప్రవాహమువలె పోనుపోను రామాయణ మహాకావ్యమునెల్ల తనమహత్వముతో నింపినది. ఈ విషయము ఉత్తమ సంస్కారముచేతకాని గోచరింపదు. ఒకేవస్తువు వారివారి సంస్కారమునుబట్టి, బుద్ధివైభవమునుబట్టి, జ్ఞానమునుబట్టి, అనుభవమునుబట్టి భిన్నభిన్నములుగా గోచరించుట లోకసిద్ధము. అట్లే రామాయణము, అందును సీతారాములు, లక్ష్మణాంజనేయులు, సుగ్రీవవిభీషణులు, పనికిమాలినవారుగా కొందరికి గోచరింపవచ్చును. రావణకుంభకర్ణులు, ఖరదూషణులు, ఇంద్రజిదాదులు ఉత్తములుగా గోచరింపవచ్చును. అది వాల్మీకి తప్పుకాదు. అనేకజన్మలనుండి వారు సంపాదించుకొని మూటగట్టుకొని తెచ్చుకొనిన సంస్కారమట్టిది. ఆ

సంస్కారము వికారపెట్టగా ఎన్నియేని వికృతములగు మాటలు వచ్చుచునే యుండును. అవి కొన్నాళ్ళు లోకమును దుర్గంధగంధిలము చేయును. కాని అదియును మేలునకే. లేకున్నచో ఈ "సీతామహాస్వాధి" పుట్టునా? ఈ చంద్రమౌళి ఇంత ఉపాసించునా! రామాయణతత్త్వమును? కాళిదా సబద్ధమేల పల్కును? "జ్వలతి చలి తేంధనోఽగ్నిః"

బహుకాలముగా చంద్రమౌళి మానసిక క్షోభమును పొంది రామాయణమును, కథాంతర సంవాదములను వానిని గూర్చి మహాతపస్వులైన పెద్దలుచేసిన ప్రసంగములను, కావించిన బోధములను, రచించిన వ్యాఖ్యానములను అవలోకించి యవలోకించి తనవాక్కున కమృతత్వసిద్ధిని కల్పించుకొని ఈ మహాగ్రంథమును వ్రాసినారనుట కేవల సత్యము.

ఈ గ్రంథమున నాకు మహానందమును కలిగించు ఘట్ట మొకడున్నది. అది శంకరశాస్త్రిగారి సమన్వయపద్ధతి. నిరంతర రామాయణ తాత్పర్యముతో కలిగిననాయనుభవముతో ఈ యర్థమునే గోష్ఠులలో మనవి చేయుచుందును. కాని పెద్దలు ఒప్పుదురో? ఒప్పరో? ప్రాచీను లేమనిరో? యను సంశయము నాకు పోలేదు. ఈనాటితో నాకాబాధ తీరిపోయినది చంద్రమౌళిగారి చలువవలన. నేను పెద్దలమార్గముననే నడచుచున్నాడనన్న తృప్తి యేర్పడినది.

ఎవ్వరైనను రామాయణవిషయమున ఏమాత్రము సందియముకలిగినను చంద్రమౌళి జాటాజూటాటవీ మహాలంకారమగు సుధాంశులహరిలో మునకలాడుడు. వారికి ఆత్మవ్యాధి నశించును. వారియాత్మకు మంచి యారోగ్యముచేకూరును. చంద్రమౌళికలుగ శ్రీమద్రామాయణమువైపు చురచుర చూచువారుందురా? భక్తిభావమున తలవాల్చవలసినదే. ఆ చంద్రమౌళివలెనే ఈచంద్రమౌళియు కపటమెరుగని సత్యవాక్యములవాఁడే. రామాయణప్రాణిని నేను మెచ్చుకొనుట కాదు. యావదాంధ్రలోకము, భాషాంతరీకరింపబడెనేని యావత్ప్రపంచమును సీతామహాసాధ్వికి తలయొగ్గునని నాదృఢవిశ్వాసము.

ఇట్లు
రామాయణప్రాణి
కోగంటి సీతారామాచార్యులు

# సహృదయోల్లాసః

కోగంటి సీతారామాచార్యః

సీతాయనం రామకథా విధానం
విచిన్త్య ధన్యా హ్యభవన్ భవన్తః
అనేన రామాయణ కల్పవృక్ష
నిరాసకాః దూర మపోహితాస్స్యుః

సర్వత్ర రామాయణ సత్ప్రబంధే
స్థితాని సందేహ పదాని యాని
సమ్యగ్విచార్య స్థిరబుద్ధి మత్వాత్
సిద్ధాంత సిద్ధేః ఖలు రక్షితారః

ప్రాయ స్ససందేహ పదేషు సర్వే
బుద్ధే ర్విచారాలసతాం భజన్తే ।
నిర్ణేతు మల్పార్థ మపిస్మ కావ్యే
కిమత్ర రామాయణ సచ్చరిత్రే ॥

విచారణాయాం పరవారణాయాం
సిద్ధాంత సామ్రాజ్య విచారణాయామ్ ।
దృష్టా సమగ్రా ప్రతిభా త్వదీయా
జాతోఽపి తత్ఖండన ఖండనాయ

సీతాసాధ్వీచరిత్రం విశదయుతి మహాక్లేశతో జ్ఞాయమానాన్
శ్రీమద్రామాయణస్యా నతివిపులతరం సంశయాంశ్చాప్యవేలమ్
తస్మాత్సర్వే త్వదీయం విబుధమణిగణాః భిన్నసామాజికాశ్చ
జ్ఞాత్వా మోదం లభంతా మితి మమహృదయం భావయత్యాంతోపి

ఉల్లాసాయ కవీంద్రాణాం
విదుషా ముత్సవాయచ।
త్వయైవ రచితా సీతా -
మహాసాధ్వీ సతాం ముదే॥

ఉల్లాసశ్శాస్త్రజన్యాద్భుతమతి విలసత్పండితాగ్రేసరాణా
ముత్సాహో నైకజన్మార్జిత సుకృతవతాం తత్త్వనిశ్చాయకానామ్
సమ్మోద స్సత్కవీనాం కలితబహుకలాకల్య భవ్యోదయానాం
గ్రంథోఽయం చంద్రమౌళే! విదధతి నితరాం జానకీవైభవాఢ్యః

చంద్రమౌళికృత పుణ్యవల్లికా
శాయమాన మధురా సరస్వతి
రామసాగర మనోజ్ఞగామినీ
పావనాయ జగతాం ప్రవర్తతామ్.

డాక్టర్, ధూళిపాళ అర్కసోమయాజి
M. A., Ph. D., (Maths)
కార్యదర్శి, హిందూ ధర్మ ప్రతిష్ఠానము, తిరుపతి.

ఆర్ష విద్యాలంకార మ॥రా॥శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు విరచించిన 'సీతామహాసాధ్వి' యనుగ్రంథము నామూలచూడముగ పరిశీలించు నవకాశము నాకు కలిగినది. పాశ్చాత్యవిద్యానిష్ణాతులు, రాజకీయరంగమునందు చిరకాలము జీవితమును గడపిన వారయ్యు శ్రీ చంద్రమౌళిగారు సాహిత్యరంగమందనన్యాన ప్రతిభావంతులగుట విద్వాంసులకు ముదావహము. ఇతఃపూర్వము వారు రచించిన గ్రంథము లనేకములుండ నీ నూతన గ్రంథ రచన వారి సాహిత్యరసపిపాసకు తార్కాణము ప్రతిక్షణము వారిజీవితము భారతీయ సంస్కృత వాఙ్మయమందే గడచుట వారి జన్మాంతరభాగధేయము. నిత్యము విద్వత్పరివార పరివృతులగుచు ధార్మికదృష్టితో వీరుజేయు సాహిత్యగోష్ఠి ఆంధ్రవిద్వల్లోకమునకు సుపరిచితమే.

ప్రస్తుతమైన 'సీతామహాసాధ్వి' యనుగ్రంథము వీరి విమర్శనాశక్తిని వ్యక్తీకరించును. అందు కుదాహరణము "సీత అబద్ధమాడెనా ?" యను ఘట్టమునందు వారి భావములు మనోరంజకములుగా విద్వాంసులకు గోచరింపక మానవు. పాశ్చాత్యగ్రంథరాజములను విద్వద్విమర్శకులు శోధించువిధమున శ్రీచంద్రమౌళిగారీగ్రంథమును రచించిరి. ఆంగ్ల భాష

యందు ‘Coleridge, Bradley, Johnson ప్రభృతు లెట్లు ‘Poetic appreciation’ యను శీర్షికతో ననేకగ్రంథములు రచించియుండుట జగద్విదితమే. అట్టితఱి శ్రీమద్రామాయణ మువంటి మహాగ్రంథమునుగూర్చి యెంతగా వ్రాయవలసిన యవసరమున్నది? సంస్కృతశాస్త్రజ్ఞులు శాస్త్రముల పఠన పాఠములందే పర్యవసన్నులగుచు, సాహిత్యగ్రంథముల నుపేక్షించిరా? యను యనుమానము దోపకమానదు. కొద్దిమంది యాలంకారికులు కొన్ని కావ్యములందలి కొద్దిశ్లోకములు విమర్శించినమాత్రమున సాహిత్యరసికులకు తృప్తి చేకూరదు. వాల్మీకి వ్యాస కాళిదాస భవభూత్యాది విరచిత మహాగ్రంథముల నుద్దేశించి విమర్శనాత్మకగ్రంథము లెన్నియో రచింపబడవలసియున్నది. తాదృశ దృక్పథముతో శ్రీ చంద్రమౌళిగారింకను గొన్నిగ్రంథములను రచింపగలరని నాయాశయము. పరమేశ్వరుఁడు వీరి కాయత్నమం దుత్సహింప. దీర్ఘాయురారోగ్యముల ప్రసాదించి, ఆర్ష విద్యామకుటాలంకారులుగ వీరిని ప్రకాశింప జేయగలడని నాదృఢ విశ్వాసము.

శ్లో॥ ఆశాస్యం పునరుక్త మేవ భవతి శ్రేయాంసి భూయాంసియత్
ప్రాక్సర్వా ణ్యాధి జగ్ముషః సహృదయ! శ్రీచంద్రమౌళే తవ!
విప్రత్వాదుత సోమయాజికతయా యుత్క్రించి దాశాస్మహే
పూర్ణాయు ర్భజతా త్వయా భగవతీ వాగ్దేవ తోపాస్యతామ్॥

# ఆదర్శదేవి

శ్రీ వెలువోలు సీతారామయ్య

భారతీయస్త్రీలకు మహాసాధ్వి సీత ఆదర్శప్రాయురాలు. స్త్రీజాతి చరిత్రలో మనకు దృగ్గోచరమగు భారతీయ ఆదర్శాలు అన్నీ సీతాదేవిచరిత్రను ఆధారంచేసుకొని ఆవిర్భవించిన వే. మహామహిమసమన్వితయగు సీత కష్టసహిష్ణుతకు, పరిశుద్ధతకు ఆలవాలమై నిలచినది. అత్యంత దుఃఖకరమగు జీవయాత్ర సాగించుటలోకూడ ఎంతమాత్రం చలించకుండా, సదా శుద్ధ స్వభావంతో కాలం గడిపింది. సీతాసాధ్వి మానవలోకంలోనే కాకుండా - దేవలోకంలోకూడా ఆదర్శదేవిగా ప్రస్తుతింప బడిన అవతారమూర్తి. అట్టి పవిత్రతాశిరోమణి - సీతామాత చరిత్రను - వినూత్నపంథాలో కువిమర్శలకు అతీతంగా మరుగుపడిన అనేక మహోజ్జ్వలఘట్టముల నభివర్ణించుచు, "సీతామహాసాధ్వి" అను గ్రంథమును అత్యంతపరిశ్రమ ఫలితంగా తేటతెలుగులో ఆంధ్ర పాఠకలోకమున కందించిన శ్రీ చంద్రమౌళిగారు ఎంతయు ప్రశంసాపాత్రులు.

# అభినందనము


పండిత తుమ్మల వెంకటరత్నము
ప్రముఖ తెలుగు పండితులు, గోవాడ.

"మధుమయ ఫణితీనాం మార్గదర్శి"యైన మహర్షి సత్య సుందరముగా దిద్దితీర్చిన మహాకావ్యము "యావత్ స్థాస్యంతి గిరయ స్సరితశ్చ మహీతలే, తావ ద్రామాయణకథా లోకేషు ప్రచలిష్యతి" అని జేగీయమానమగుట అబ్బురముగాదు. సమస్త దేశములలో సర్వభాషలందు అనూదితమై ప్రశస్తి కెక్కిన దాని యితివృత్తము ముగ్ధమనోహరము. అందలి ధర్మములు సర్వకాలీనములు. సతీపతుల అన్యోన్యతాధర్మము, సోదరుల ఐక్యతాభావము, భృత్యామిత్రుల అవ్యాజమమతా విస్ఫూర్తి సర్వజనాదర్శములు. కనుకనే రామాయణకథ శ్రవ్యకావ్యములుగా దృశ్యకావ్యములుగా గద్యపద్యాత్మకములుగా గేయకృతులుగా విభిన్నరూపములతో వెలసినది; వెలయుచున్నది. ఎవ్వరెన్నిరీతుల వెలయించినను అందలి సౌందర్యము నిత్యనూతనమై హృదయరంజకమై విలసిల్లును. ఎన్నిసార్లు పఠించినను, మరెన్నిసార్లు గానముచేసినను తనివి తీరని మనోహరాకృతి ఆ కృతి. రామభక్తులు రామాయణ ప్రియులునైన రచయితల లేఖినులు సహస్రములుగా రామాయణ కథాకృతులను ఆవిష్కరించి లోకమును పావనము

గావించుచున్నవి. వారును ధన్యులగుచున్నారు. బహు సహస్రాబ్దములుగా ధారావాహికముగా సాగుచున్న యుద్యమమిది.

శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు సుప్రసిద్ధ రచయితలుగాను, రామభక్తులుగాను జగమెరిగినవారు. అనువంశికమైనది వారి భక్తిభావసంభరితమైన ఆస్తికతాసంపత్తి. శ్రీ సీతారామచంద్రపాదపద్మారాధనతత్పరము వారి హృదయము. తొలుత మాతృదేశారాధనమున పునీతమైనది వారి జీవనము. కారాగారావాసమందును, అమాత్యపదవీ బాధ్యతానిర్వహణసమయమందును రామాయణపఠన పరిశీలనములు గావించి, అనేక ధర్మసూక్ష్మములను గుర్తించి, ఆంతర్యము వివరించి, వానికి భాష్యకర్తలైనారు. పరిపాలనారంగమును, గ్రంథరచనా రంగమును సమముగా నిర్వహించియున్నారు. అనేకరీతుల కృతికర్తలుగాను, కృతిభర్తలుగాను రాణించినారు. మున్నెన్నడో రామాయణ కథామర్మములను, ధర్మములను విశదీకరించుచు "రామాయణసుధాలహరి" యన్న బృహద్గ్రంథమును రచించి, పండితుల ప్రశంస లందుకొన్నారు. రామకథామననమున తనివితీరక తన్నాయక గుణగణ ప్రశంసాత్మకముగా "రామకథ" యను మరొక వచనకావ్యమును రచించినారు. సీతారామభక్తిప్రవణమైన వారిచిత్త మంతటితో తృప్తి చెందలేదు. ఇప్పుడు లోకపావనియైన సీతాదేవి చరిత్రమును "సీతామహాసాధ్వి" యన్న పేరున రచించి, తద్ద్వారమున భారతనారీధర్మ

మును జగత్తున చాటుచున్నారు. పవిత్రగృహిణీధర్మమును ప్రకటించుచున్నారు. ఇట్లు రామాయణగత ప్రతిపాత్రమును నిశితముగా పరిశీలించి ఆయాధర్మములను మర్మములను విశదీకరించుచు సులభసుందరముగా నెన్నెని గ్రంథములను వారు వ్రాయగలరు. వారి శైలి సరళము సరసము ధారాళము నగుటచే హృద్యమై రమణీయములైన భావములవెంట పాఠకుల మనస్సులను పరుగులు దీయించును. శ్రీ చంద్రమౌళిగారు ఐతిహాసిక ధర్మమార్గములను వివరించుచు లోకశ్రేయస్సునకై యింకను అనేకకృతులను వెలువరించుటకు సీతారాములు కటాక్షింతురుగాక !



ర చ యి త

మా తా పి త రు లు

వెంకమాంబా – సుదర్శనార్యులు

భగవద్భక్తులు, ఆదర్శగృహస్థులు,

నిరతాన్నదాతలు, అతిథిసేవాపరాయణులు

శ్రియైనమః

# ఆశీస్సు

తిరుమల తిరుపతి దేవస్థాన
ఆస్థానవిద్వాంసులు
చతుశ్శాస్త్ర విద్వాన్
శ్రీమాన్ వేదాంతం జగన్నాథాచార్యులు

ఈ 'సీతామహాసాధ్వి' అను గ్రంథమును రచించిన ఆర్ష విద్యాలంకార సర్వస్వభూతులగు శ్రీ కల్లూరి చంద్రమౌళి గారు సత్పురుషోత్తములగుటచే చిన్ననాటినుండియు సోపాధిక మాతాపితరులగు వేంకమాంబా సుదర్శనార్యులయందేగాక నిరుపాధిక మాతాపితరులగు శ్రీ శ్రియఃపతులయందును కడుంగడు భక్తి శ్రద్ధా విశ్వాసములుకలవారై వెలుగుచుండెడు వారు.

వీరు వైష్ణవాంశకలవారగుటచే భారతభూమియందు ద్రవిడాంధ్ర దేశములు ఏకీభావముగానున్నతరి మదరాసు రాష్ట్రమునకును, విభాగము నొందినపిదప ఆంధ్రరాష్ట్రమునకును సంపూర్ణ ప్రజామోదముచే మంత్రిసత్తములుగా నేర్పడి, తరతమభావముల నెంచక ప్రజలనందరిని తృప్తిదీర చట్టసమ్మతముగా పరిపాలన మొనరించి, వారల నానందసముద్రమున ముంచివైచిరి.

ఇటుల మహాయోగమును తమకు ప్రసాదించిన దైవమును సింహావలోకమునుచేసి ప్రభుత్వాఽఽహింత సభాధ్యక్షతా శక్తిగలవారై, ఆశ్రితవాత్సల్యజలధియై ప్రజారక్షణమునకుగాను అర్చావతారమున సప్తగిరులయందు వేంచేసియున్న శ్రీ వేంకటేశమహాప్రభువుయొక్కయు, భద్రగిరి వేంచేసియున్న శ్రీరామచక్రవర్తియొక్కయు యోగక్షేమములను శక్తిమీర విచారించి, వారల యనుగ్రహమును సంపాదించుకొనగలిగిరి.

ఇదియుంగాక భారతీ కృపాతరంగ స్ఫురత్సాహితీ విలాసములచే 'శ్రీరామాయణసుధాలహరి' యను గ్రంథరాజమును వాల్మీకిమహర్షి భావరత్నపేటికగా రచించి విద్వత్ప్రశంసల నందగలిగిరి. మఱియు అనేకములైన ధర్మన్యాయబద్ధములగు మధురాతిమధుర భావములచే తొణికిసలాడు గ్రంథరాజములను రచించి ప్రకాశింపజేసిరి.

అంతచే తృప్తిజెందక మానసమున మాతృభక్తి భావతరంగములు ప్రభూతములై పెంపెసలార శరణ్యాదంపతులై లక్ష్మీనారాయణుల యవతారములగు శ్రీ సీతారాములలో అగ్రిగమనశీలయు - ప్రియవాల్లభ్యరాశియు - పురుషకారభూతయు-జగన్మాతయునగు సీతయొక్క చారువృత్తశీలములను సహృదయహృదయంగమముగా వెల్లడింపఁబూను టెంతయో సంతోషము.

ఆదర్శభావములను వెల్లడింపజూచుట ఆదర్శపురుషుల కృత్యమనక తప్పదు.

ఇంతియేగాక "కావ్యం రామాయణం కృత్స్నం సీతాయా శ్చరితం మహత్" అను వాల్మీకిమహర్షి వచనభావమును పురస్కరించుకొని "రమాయాః ఇదం రామం తస్య అయనం రామాయణం" అను వ్యుత్పత్తిని స్ఫురింపజేయుచు రామాయణమును ప్రత్యేకింపజూచుట సుధీజన సముదయమున కత్యంతము ముదావహమనుటలో నాక్షేపము లేదు.

ఇటుల అమూల్యములగు విషయములను భావములను ఆంధ్రభాషలో ప్రజల కందజేయుచు, ఆచరణమార్గ ప్రదర్శకులగు (శ్రీ) చంద్రమౌళి మహాశయులకు ఆయురారోగ్య సౌభాగ్యముల నాశరణ్యదంపతులు ప్రసాదింతురుగాక !!

**
*

# ఆమోదము

అవధానిశేఖర, ఆశుకవికేసరి
ప్రౌఢభారతి, కవితాసుధాకర
సరస్వతీకంఠాభర ఇత్యాది బిరుదాంచిత
డాక్టరు. ప్రసాదరాయ కులపతి, *M.A., Ph.D.*

శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు భారతీయతత్త్వ స్వరూప నిరూపకములయిన గ్రంథము లెన్నో రచించినారు. రాజకీయములలో సంచారము చేయువారిలో ఈవిధమగు సంస్కారము, సారతర ప్రజ్ఞాప్రాభవము అరుదని అనేకు లనుచుండుట నేను విన్నాను. నాకును అప్పుడప్పు డటులే అనిపించుచుండును. కాని కొంచెము పరిశీలనాత్మకముగా ఆలోచించినచో అది సరికాదనిపించును. ఎందుకనగా రాజకీయములనగా ఇప్పటి కలుషిత, దుర్గంధ, దుశ్శీల దుర్భావుకులను దృష్టిలో పెట్టుకొనరాదు. మహాత్ముడగు గాంధీగారి కాలమునాడు రాజకీయ రంగములో శతసహస్రసంఖ్యలో పుణ్యత్యాగశీలురు దేశ వాతావరణమును పవిత్రీకృతము చేసెడివారు. చంద్రమౌళిగారు ఆ తరమునకు చెందినవ్యక్తి. కనుకనే ఆయనలో తాదృశ సుగుణపుంజము దర్శనమిచ్చును. అది మావంటివారికి సహజముగానే భాసించును.

శో॥ ధర్మమూలం హి లోకోఽసౌ
కామార్థౌచ తథాహితౌ
ప్రజావతీ భవేత్సాధ్వీ
భారతీ ధర్మమూలతః.

శో॥ పతిం స్థాపయితే ధర్మే నారీ పత్యనువర్తనాత్
పతిః పతిత్వ మాప్నోతి పత్న్యాః కీర్తిం చ పాలయన్.

శ్లో॥ కామార్థౌ ప్రాప్య చాలంబం
నశ్యేయుర యశస్కరం
ధర్మం త్యక్త్వా న రోనార్యః
యథా రావణపాలితాః.

శ్లో॥ ఇత్థం బ్రువతి ధర్మాత్మా
చంద్రమౌళి ర్మహాయశాః
కృత్వా "సీతామహాసాధ్వీ"
లోకే ధర్మం ప్రసాధయన్.

ఓం

శ్రీ లలితాయై నమః

# ఉద్గీతి

డాక్టర్. రత్నాకరం శ్రీనివాసాచార్యులు

సీతాదేవిచరిత్ర గొప్పదని వ్రాసెన్ మున్ను వాల్మీకి - ఆ
సీతారాములయందు మిన్నయగు మాసీతమ్మ యం చెంచియే
ఊతంబిచ్చుచు సత్యవాక్కులకు-నో హెూ యంచనన్ పండితుల్
'సీతాసాధ్వి' కృతిన్ ముదంబుమెయి కూర్చెన్ చంద్రమౌ
ళియ్యేడన్.

సీత యబద్ధమాడదని చిత్తమునందు ధ్రువీకరించుచున్
సీత యబద్ధమాడెనని చెప్పెడు నాస్తికహేతువాదముల్
ప్రీతి మథించి తేల్చి వివరించెను జానకిదివ్యగాథ భ
క్త్యాతిశయంబునన్ విబుధతల్లజు లందఱ కింపునింపుచున్.

తనకు కీడుచేయఁ దలఁచువారినిగూడ
కరుణతోడఁ జూచి కలుషములను
కడిగి వత్సలతను కనికరించును - సీత
పురుషకారభూత పూజ్యమాత.

కటుమృద్వాసనగల్గు నవ్యతృణమున్ ఘ్రాణించి గోమాత మే యుట మానున్- తన గర్భమున్ వెడలి సద్యోజాతమౌ వత్సపుం బటుమాలిన్యమొ? నాకివైచు శుచికాన్ వాత్సల్యపూర్ణాత్మయై - అటులే భక్తుని కిల్బిషంబడచి పుణ్యాత్మున్ దగన్ జేయుచుం డుట నైజం బిల జానకమ్మ-కిట నీడున్‌రాడు శ్రీరాముడున్.

'సత్యమె వాల్మీకిరచన -
నిత్యంబగు' ననెను నలువ - నిత్యవ్రతులౌ
నిత్యులె యందరి పాత్ర - ల
సత్యము సీతమ్మనోట జారదు విధిగన్.

# సత్యవాణి

శ్రీమాన్ బృందావనం రంగాచార్యులు
ప్రధానాంధ్రోపాధ్యాయుడు
వై. ఆర్. హైస్కూలు, పరుచూరు.

జనకునిబిడ్డ - న్యాయగుణసంపద పెంపువహింప భవ్యభా
వన వెలయించజాలిన శుభంకరసుందరశీల - కష్టమున్
గణన మొనర్పబూనక సుఖాలకు పొంగనిదౌ ధరిత్రినం
దన-రఘురాముదేవి-చరితన్ సృజియించెను సీత; సాధ్వియై,

కలికితనమ్ము, యోగ్యతయు, గౌరవభావన, ధర్మదృష్టి, ని
స్తుల పతి పావనాంఘ్రియుగ తోయజసేవ - పతివ్రతాత్వ మం
జుల మహనీయ వైఖరియు సొంపుల నింపగ–ఆర్షభూమిలో
నెలకొనజేసె సాధ్వి గణనీయయశమ్ము దిగన్తరమ్ములన్.

ఆమహనీయురాలు హృదయమ్మున దాశరథిన్ స్మరించుచున్
ప్రేమకు నర్థమున్ విపుల విస్తృతలీల వచించె, మించె-సే
వా మహితైక యోచనకు భాష్యముసల్పె – వసుంధరానురా
గామృతధారలో దడిసి అవ్యయకీర్తిగడించె సాధ్వియై.

లోకపథమ్ము నారసి ప్రలోభగుణమ్ము ప్రచండదౌష్ట్యముల్
ప్రాకెడి జాతిలో సహనభావనసృష్టి యొనర్పనెంచి - వా
ల్మీకిమహర్షి గానమొనరించిన గీతమె సీత-అమె అ
ప్రాకృత భవ్యగాథకు ప్రపంచ మొసంగు నివాళి సర్వదా.

శీలప్రాభవవైభవోన్నతికి రాశీభూతరూపమ్ముగా
కాలాతీతయశమ్ము గన్న ధరణీకన్యాచరిత్రమ్ముపై
లీలన్ చక్కనివ్యాఖ్యలెన్నియొ సముల్లేఖింపగా - "ఆర్షవి
ద్యాలంకారుడు" పూనె దత్కృషి ప్రశస్తమ్మై ప్రకాశింపగన్.

జనకరాజర్షి పూజల పుణ్యబలమున
లబ్ధమైనట్టి వరాలపంట,
రామయ్య అనురాగరసధారలం గ్రోలి
ధన్యతంగన్న కథాక్రమమ్ము,
ఘోరాటవుల పతిగూడి సంబరమున
పయనింప నీకొన్న పత్నిదీక్ష
జంకెరుంగక రాక్షసప్రకరమ్ముల
నదలింపజాలిన ఆత్మశక్తి

అనగ - "సీతామహాసాధ్వి" అనుపమాన
దివ్యతేజో విశేషసందీప్త హృదయ -
ఆమె సత్కథగల సుధనరసి తరచె
సాధుజనమౌళి కల్లూరిచంద్రమౌళి.

ఆయన రాజకీయముల కాయువుపట్టు - నిజమ్ము - వాఙ్మయ
శ్రీయని విశ్వసించిన ప్రసిద్ధరసజ్ఞుడు దైవభక్తితో
ఆయన కూర్చినట్టి పరమాద్భుత భావనిధానమైన రా
మాయణ గద్యభాష్యమె మహత్తరకీర్తినిగూర్చు నేటికిన్.

పలికినపల్కు రిత్తయగు పల్కుగ పల్కు లెరుంగనట్టి ధీ
కలితు డటంచు కన్గొనిన కావ్యకళావిదు లెందరెందరో
పలికెడుపల్కు సత్యమని పల్కగ నెంచుచు చంద్రమౌళియే
పలికెను నేడు పూజ్యగుణభాసుర సీతను గూర్చి యీకృతిన్.

రచనసేత వేఱు - రమణీయరచనను
మెచ్చుకొనుట వేఱు - మేలి చెలిమి
కలిమి పంచిపెట్టగలుగుట వేరైన
చంద్రమౌళిపట్ల సహజము లివి.

మమతల మండపమ్మగుచు మానవలోకము నుద్ధరింప ధ
ర్మమునకె రూపమాయె రఘురాముడు - సీత; పవిత్రభావ రా
జ్యమునకు రాణియైనిలిచి సాధ్విగ మన్ననలంది, నిత్యస
త్యమునకె రూపమాయె కవితాగగనమ్మున దివ్యదీప్తితో.

# కల్యాణతిలకము

భాషాప్రవీణ
చింతలపాటి నరసింహదీక్షితశర్మ
కోగంటిపాలెము - అగ్రహారము
(Via) అచ్చమ్మపేట P. O. సత్తెనపల్లి Tq.
గుంటూరు జిల్లా

శ్రీలీలా మకుటాకృతిన్ మెఱయు నా సీతామహాసాధ్వి యు ద్వేలౌన్నత్య కళాప్రసాదము శుభావిర్భూతియై "ఆర్షవి ద్యాలంకార" మనస్సుధాబ్ధి మథనవ్యాపార సంజాత న వ్యాలంకారము, పూరుషోత్తమ మనోజ్ఞాకల్పమై వెల్గుతన్ -

రామకథా సుధారస మాధురిని భక్త
జన సంతతులకుఁ బంచిన కరమ్ము
స్వాంతదర్శన కళాకాంతమ్ము యుగసమీ
క్షాకావ్య ఘటకమ్ము క్రాంతదృష్టి
అతిలోక భారతీయప్రతిభాలోక
చిద్విలాసశ్రీలు చిల్కు పల్కు
వేదసుధాకర విమలరోచిర్వీచి
చలువల వెల నుల్లసిలు మనీష

కలిగి, చరితార్థత వహించు వలఁతి "చంద్ర
మౌళి" బుధమౌళి-యామహామహుని పూర్ణ
పురుష విభవమ్మునకుఁ జిరస్ఫూర్తిఁ దీర్చ
దిద్దు" సీతామహాసాధ్వి" దివ్యశక్తి -

సామాన్యంబొకొ? సత్కృతి ప్రవణతా సామ్రాజ్యపీఠిన్ రమా
రామా సాషమ నూత్నరత్న రుచిరగ్రైవేయ కాలంకృతి
శ్రీ మేల్కొల్పి యనల్ప కల్పమధువుల్ చిందించు నైపుణ్య! మా
సామంజస్యము చంద్రమౌళికి యశస్సంపత్తి హత్తించుతన్.

లలితవాక్శుద్ధి వాక్సిద్ధిగల తపస్వి
సభ్యతాసంభృత మనస్వి, చతుర వచన
రచన-సంకలి తార్షధర్మ ప్రబోధ
రత్నదర్పణ సౌందర్య రంజితమ్ము —

అలఘు రసస్రవంతి, సముదాత్తసరస్వతి, సారవైదుషీ
విలసిత నవ్యవాఙ్మయ సువృత్త మనోహరహేల, యీ మహో
జ్జ్వలకృతి - సాహితీపథిక సంతతికిన్ జలువల్ వెలార్చి, ని
ర్మలిన సతీశిరోమణి పరంపరకున్ విలువల్ ఘటించుతన్ —

ధర్మనిర్వహణ సిద్ధాంత వైశిష్ట్యమ్ము, స్వాభిమా నౌదాత్త్య
వైభవమ్ము
భవ్యపాతివ్రత్యభావ మాధుర్యమ్ము, బంధు రాదర్శదాంపత్య
లీల
నాన్యతోదర్శనీయ ప్రౌఢవాగ్రీతి, సముదార భావనా స్వాదుధార
విశ్వకల్యాణ నైవేద్యసందేశమ్ము, దైవర్షి సాధువాద ప్రశస్తి

నెఱపి, బంగారుబాటయై, సరసహృదయ
భావసౌరభ్యముల మూటయై, వివేక
చాతురీశ్రీకి సుందరాస్థాన మగుచు
చందమౌళీశ్వరుని కృతీశ్వరి వెలుంగు.

# మేలుబంతి

శ్రీ ప్రతాప వేంకట సుబ్రహ్మణ్యము, M. A.
తెలుగు లెక్చరర్, చీరాల.

శ్రీకరుడైన రామవిభు లీలల నల్లము పల్లవింప వా
ల్మీకి రచించె పండితులు మేలు భళీ యని ప్రస్తుతింప నీ
లోకులు భిన్నరీతుల విలోకనచేయగ తత్వమెంచె సు
శ్లోకుడు 'చంద్రమౌళి' రుచిరోక్తుల నార్షమతానుగామియై.

కాలంపున్ గతి మారినంతట మహాకావ్యార్థముల్ మారబో
వేలీలన్ - ఋషివాక్కు శాశ్వతము - లే దేనాడు నాశమ్ము - సీ
తాలోలాత్ముని ధార్మికత్వము ప్రశస్తమ్మంచు నీ 'యార్షవి
ద్యాలంకారుడు' చాటిచెప్పె పరమార్థంబెంతొ తెల్లమ్ముగా

జనకభూధవుడు మేదిని దున్ను సమయాన
నవతరించిన సిరి యవనిజాత
నారాయణు నిజావతారమ్ము శ్రీరాము
చెట్టపట్టిన సాధుశీల సీత
కట్టుకున్న మగండు సట్టడవుల కేగు
ననువున వెంబడించిన సుశీల
కామించు దశకంఠు కన్నెత్తిచూడక
లంకనుండిన నిష్కళంకహృదయ

అనలమందు పరీక్షకాగిన పురంధ్రి
పతివియోగాగ్ని గ్రాగిన భవ్యచరిత
యిడుమ లన్నింటి దాను సహించి మంచి
పేరు తెచ్చెను పతికి సాధ్వీలలామ.

చదివెన్ దేశవిదేశభాషలను శాస్త్రజ్ఞాన మార్జించె కో
విదుడై యార్షకవిత్వతత్వగత గాంభీర్యమ్ముతోడన్ రసా
స్పదవాక్యమ్ముల జానకీసతి కథాసారమ్ము వ్రాసెన్ మహా
భ్యుదయప్రక్రియ 'చంద్రమౌళి' బుధుడెంతో భక్తిభావమ్ముతో.

జగతి కాదర్శదంపతుల్ జనకపుత్రి -
దాశరథియును ధర్మసంస్థాపకులు ప
విత్రహృదయులు వారిచరిత్ర కెపుడు
నాశ మొదవదు కల్ప మున్నంతవరకు.

స్వస్త్యస్తు.

శ్రీః

# ఉపగీతి

శ్రీ వి. సంపత్కుమారాచార్య
హిందూకళాశాల, గుంటూరు.

చారుశుభ్రశీల మహత్వ సంపదలతో -
సమత మమతానుకంప సౌజన్యమహిమ
మెయిని - పుడమి మహిళలకు మేలుబంతి
యగుచు - 'సీతామహాసాధ్వి' అలరుచుండు -

ఏమి సౌశీల్యసౌభాగ్య ? మేమి యామె
సౌమనస్యసంపద ? ఏమి సౌహృదయంబు ?
ఏమి యాపతివ్రతనిష్ఠ? ఏమి యామె
పరమ పావిత్ర్యభావన ? భావమందు
గాంచినంత గగుర్పాటు గలుగు - నకట !

నేటి హేతువాదజగము నిష్ఠురముగ
పలుకనెంచు నేల? పలుకు పలుకఁగ నెటు
మనసు కలుగు? ఆమె పవిత్రమానసంబు —
ధర్మకలితబుద్ధి - కరము తలఁచలేదొ ?

ధర్మమున కేకమూర్తియై ధరణియందు
రామభద్రుండు రంజిల్ల - రమణి సీత
సత్యమున కేకరూపిణి సర్వసుగుణ
జాలమున కేకవాణియై సన్నుతిగను.

లోకములకు మాతయగుచు - 'లోకమాత'
రూపధారిణియయి సీతారూపమునను
జనకసుతయయి - సాధ్వియై - సరసమతిని
దానవుల మలచగలిగె మానవులుగ.

సీత యెన్నడును నసత్యశీల గాదు-
కావ్యగతమగు సరసంపు కాకువులను
వ్యంగ్యవిలసిత రమ్యంపు వాక్యగతి - గ్ర
హింపఁగావలె సుగుణమహితులు - హితులు.

రమ్య రామకథామృతరసము పరమ
భక్తి తాను గ్రోలుటకాక - భక్తతతికి
పంచిపెట్టెడి ప్రపణత పరిఢవిల్లు
చంద్రమౌళి 'సీతాసాధ్వీచరిత' గూర్చె.

శ్రీకరమయి మధురసుధా శీకరముల
మానవాళిపై చిందించు మాననీయ
జానకిచరిత మనినంత చంద్రమౌళి
బుధవరున కెంత ప్రేమయొ బోధపడును.

రామచంద్రుండు తనకు నారాధ్యదైవ
మైన - లోకపావని - సీత అనవరతము
తనహృదయపీఠమ లాసనస్థయయి పూజ
లందుకొను - 'సర్వజగమందు నామె కెచట
నెవరు నీడు రా రనుచుండు' రెపుడు - వారు.

×× ×× ××

రామాయణాంతర రమణీయ భావముల్
నిత్యము భావించి నెగడుచుండు
అందున - సీతామహాసాధ్వీచరితమ
నిన హృదయము పొంగి నెనరు చూపు
చంద్రమౌళి విబుధచంద్రుని మనము నా
వర్ణించుకొనగల వ్యాఖ్య సలిపి
'జనకపుత్రి క్లిష్టసమయమందైనను
ననృతము పల్కలే' దని యసదృశ

ఫణితి పండితుల్ మెచ్చు వివరణమొసంగి
పండితపరమేశ్వరుడయి ప్రఖ్యాతికెక్కు
సత్యశోధన ప్రవణుని సరసహృదయు
సన్నుతించెద శంకరశాస్త్రివర్యు.

# ఆమోదః

న్యాయరత్న
బ్రహ్మశ్రీ గబ్బిట ఆంజనేయశాస్త్రి

అబోధపూర్వం సుమహ ద్వచ స్తై
రామాయణాంభోనిధి రత్నదీపమ్
దృష్టం మయా న్యాయప థానువ ర్తినా
మోముద్యతే సభ్యజనై ర్నితాన్తమ్.

మహత్త్వం యత్సువిస్పష్టం సంప్రదాయైకశోభితమ్
శోభయఃఖిలం చంద్రమౌళే! త్వ త్సేవితం జగత్.

యస్య వాణీ బ్రహ్మనిష్ఠా
యత్కర్మ బ్రహ్మ ముచ్యతే
యద్ద్వయం తద్ద్వయం సత్యం
చంద్రమౌళే! త్వయా కృతమ్.

# వ్యోమగంగ

దీవి దీక్షితులు
ఆంధ్రోపన్యాసకులు,
సంస్కృత కళాశాల, పొన్నూరు

సీతామహాసాధ్వి జీవితమే పావనం
జీవనాడియై జాతిని నీతినింపు ననుదినం
జానకీమాతగాథ జనావళికి మణిదీపం
భారతీయసంస్కృతికే భవ్యదివ్యస్వరూపం
"ఆదర్శనారి" పదమె - ఆకారము దాల్చినట్లు
భారతమహిళా లోకపు ప్రతినిధిగా నిలచె సీత
నాగేటిచాలువలె నాణ్యమైనవర్తనతో
'సీత' అనెడి నామమ్మును సార్థకమొనరించె సీత
మహాలక్ష్మి అంశపృథివి, మైథిలిగా నుద్భవించి
అందరి డెందమ్ములందు నహరహమ్ము విరాజిల్లు
వలపుతలపుతోటలోన పల్లవింప ఆశాలత
రాఘవమేఘమ్ముచెంత రమణీయత సంతరింప
కృపావృష్టి సూచనగా సీతఅయ్యె శంపాలత
పరిణయవేదికనుండి ఫలితమ్ముల నందువేళ
వనవాసముచేయుటకై పతిని అనుసరించువేళ
"వీర్యశుల్క" సీత అనుచు విశ్వసించినట్టి జనకు

మనసులోని భావాలకు మాన్యత సమకూర్చె సాధ్వి
అనసూయాదేవినుండి అంగరాగ మందుకొనుట
ఆమెశీలసంపదకే అలంకార మద్దుకొనుట
అట్టిమహాసాధ్వినోట అబద్ధమ్ము వచ్చుటయా?
అపహాస్యమ్మునకైన అసంభవ మ్మట్టిమాట
నిప్పుకు చెదలంటుననుట నిజమౌనె ఎన్నడైన
నిప్పువంటి సీతమ్మను నిందించుట చేదుతినుట.
సీతలోని ధర్మనిష్ఠ సీతలోని కర్మదీక్ష
తలచినమాత్రాన చాలు పులకరించు తనువెల్ల
పౌలస్త్యుని హెచ్చరించి భాషణమ్ము సలుపునాడు
పావనితో పలుకునాడు పావకు ప్రార్థించునాడు
వాల్మీకి మహర్ష్యాశ్రమమున కుశలవులను కనిననాడు
'రామగాథ' వినిననాడు రసాతలము కేగునాడు
రామునిపై మదినిండిన ప్రేమనె ప్రకటించె సాధ్వి
ఆమహాసాధ్విప్రేమ కక్షరరూప మ్మియ్యది
వైదేహీహృదభావ సందర్శన దర్పణ మిది
కష్టమైనసమస్యనే కావలెనని కోరుకొని
చక్కగపరిష్కరించుట చంద్రమౌళి కిష్టమెప్పుడు
హాలాహలము మ్రింగువేళ కోలాహలము చేయలేదు
అమృతమ్మును పంచునాడు ఆశను ప్రకటింపలేదు
విధిని నిర్వహించుటలో విశ్రాంతికి లొంగ డెపుడు
విధిని విశ్వసించుటలో వేఱుగ భావింప డెపుడు

నియమనిష్ఠలున్న మనిషి నీతికి నిలిచిన మనీషి
చేపట్టిన విమర్శలో చేవకు కొదవే ముందును ?
ప్రతివిషయమ్మునందు ప్రమాణమ్ము నింపుటకై
భాగ్యచరితపాత్రలో ప్రతిభ వెల్లడించుటకై
చేసినఅలోచనలకు మాసిపోని రూపమ్మిది
రామకథామాలికలో రమ్యమైన రత్నమ్మిది.

—

ధర్మాకృతి దాశరథి - సత్యమె సీతాసాధ్వి
ధర్మ సత్య ప్రేమామృత దాంపత్యము వారిది
జీవశక్తినిలయమైన సీతామాత జీవితమ్ము
సత్యమునకు 'కంచుకోట' విశ్వమునకు వెలుగుబాట.

# పరిచయము

శ్రీమద్రాయణ మహాకావ్యసృష్టి విశ్వప్రజల భాగ్య ఫలము. మహోగ్రతపస్సు గావించి, పరిపూర్ణ శక్తిసంపన్నుడైన ఋషిపుంగవుడుగా ప్రపంచ ప్రఖ్యాతి నార్జించిన వాల్మీకి మహర్షి ఈకావ్యకర్తయగుట —మఱొక మహాదృష్టము. 'నా నృషిః కురుతే కావ్య' అనెడి సూత్రానుసారముగ త్రికాలజ్ఞుడై - క్రాంతదర్శియై - అనుభూతిసంపన్నుడై విరాజిల్లిన వాల్మీకికవిచంద్రుడు శ్రీమద్రామాయణసృష్టికి పూనుకొనుటయే ఒకమహోజ్జ్వల సన్నివేశముగా ప్రపంచసాహిత్య చరిత్రలో పేర్కొనబడదగినట్టిది.

అట్టిమహాకవి వ్రాసినది ప్రత్యక్షరము సత్యమేయని విధాతసైతము వక్కాణించియున్నాడు. అశోకవనమున సీతతో హనుమంతుడు సంభాషించిన సందర్భములో రాక్షసాంగనలకు సీత అబద్ధమును చెప్పెననెడి యొకఅపవాదును కొందరు వ్యాఖ్యాతలు లేవదీసిరి.

శ్రీరామసందర్శనప్రాప్తి యీజన్మకిక లేదనెడి దైన్యమున సీతమునిగియున్న తరుణములో-కావలికత్తెలు గాఢనిద్రామత్తలైయున్న సమయమున ఆంజనేయుడు సీత సన్నిధికేతెంచి, శ్రీరామలక్ష్మణుల క్షేమవార్తను వినిపించి సెలవు

గైకొనినాడు. సీతలో తిరిగి ఉత్సాహ మురకలు వేసినది. ఇంతలో శ్రీరాముడు వచ్చుననియు - రావణవధ గావించు ననియు - తనను గొనిపోవుననియు బంగారుకలలు గనుచు - శ్రీరామమూర్తినే తిలకించుచు బ్రహ్మానందమునందుచున్నది సీత. ఆంజనేయుడు అశోకవనమును భంగమొనర్చుచున్న ఫెళఫెళధ్వనులకు నిద్రించుచున్న రాక్షసస్త్రీలు మేల్కాంచి అశోకవన విధ్వంసమొనర్చుచున్న భీమరూపుడైన హనుమంతునిగాంచి భయపడి సీతవద్దకువచ్చి, మహదానందము నందున్న సీతనుగాంచి, 'విశాలాక్షి!, సుభగే, అసితాపాంగే' అని సంబోధించిరి. సీతలో సముత్సాహస్థితినే రాక్షసస్త్రీలు దర్శింపగలిగినారు. నల్లని విశాలమైన క్రీగంటిచూపులుగల యామె సౌందర్యరేఖావైభవమునకు మురిసిపోయినారు. బయలుదేరివచ్చునపుడు వారి వెనువెంటనంటివచ్చినభీతి సీత స్థితిని గమనించుటతోడనే తొలగిపోయినది. ఆమె సంతోష ముగ సర్వము నెరింగింపగలదను విశ్వాసము వారిలో క్రమ ముగ బలపడినది. చనవుగొలది యెట్లేని యేమేని సీత నడుగ వచ్చుననియు నిబ్బరముగ తెలిసినవిషయమునే ఆమె వినిపింప గలదనియు గాఢముగ విశ్వసించిరి. "సీతా! ఎవడు వీడు? నీవు మంచిఉత్సాహముతో నున్నావు. నమ్ము జూచి భయపడ వలదు. వాస్తవము వచింపుము" అని పలికిరి.

అంతట "అథాబ్రవీత్ తదా సాధ్వీ సీతా సర్వాంగ సుందరీ" - సర్వాంగసుందరియు - సాధ్వియు-ఉన్నది ఉన్నట్లు

చెప్పుచే నైజముగాగల జనకసుత వారితో నిట్లు పలుక దొడగినది.

"రక్షసాం భీమరూపాణామ్ విజ్ఞానే మమ కా గతిః
యూయ మేవాభిజానీత యోఽయం యద్వా కరిష్యతి
అహి రేవ హ్యహేః పాదాన్ విజానాతి నసంశయః
అహ మప్యస్య భీతాస్మి నైనం జానామి కోన్వయమ్
వేద్మి రాక్షస మేవైనం కామరూపిణ మాగతమ్."

— ఈపలుకులను వినగనే రాక్షసాంగనలు రావణుని వద్దకు వెళ్ళి, "న చ తం జానకీ సీతా హరిమ్ హరిణలోచనా" ... ప్రభూ! నైష్ఠికుడైన, మహాయోగసంపన్నుడైన జనకుని బిడ్డయు, నాగేటిచాలువలె తిన్ననైన వర్తనగల్గియుండి మమ్ముల నాకర్షించుకొనజాలిన హరిణలోచనయునగు సీత మాకు విషయములను సంక్షిప్తముగనే - వాస్తవముగనే వచించినది. మే మెన్నిసార్లు పదేపదే అడిగినను మాకు మరలమరల ఒకేవిధముగనే సమాధానము చెప్పినది. కావున ఆమె దండనార్హురాలు కాదు. అశోకవన విధ్వంసనకారుడైన వానరుడే శిక్షార్హుడు" అని చెప్పిరి. కావున నిట సీత యనృత మాడలేదనుటకు దానవాంగనల వాక్యములే ప్రబల సాక్ష్యములు.

కాని! సీతపలికిన యీపలుకులకే విపరీతార్థములజెప్పుచు కొందరు వ్యాఖ్యాతలపుడపుడు 'అత డెవరో? నాకు తెలియదనియు, కామరూపుడైన వానిని గురించి మీకే తెలియువలసి

యున్నదనియు, పాముపాదములజాడ పాములకే తెలియు ననియు, వానినిగాంచి నేనును భయపడితిననియు విశదీక రించుచు, సీత అబద్ధమాడె''నని సంకుచితదృష్టితో కుమర్శల గావించుచున్నారు. కాని యిందు సత్యములేదు. పైన బేర్కొనిన తొమ్మిదిసంబోధనలద్వారా సీత పలుకులలో సత్యమును విశదీకరించుచు వాల్మీకి హృదయమును గుర్తింప జాలిన పండిత శంకరశాస్త్రి మహోదయు లిట్లు ముక్తకంఠ మున సత్యమును వక్కాణించియున్నారు.

"నన్ను గురించిన విజ్ఞానము భయంకరస్వరూపిణులగు రాక్షసాంగనల కేమి తెలియును? అత డెవరో? ఏమొనర్చునో? ముందుముందు మీకే తెలియును. పాముపాదములజాడ పాములకే తెలియునట్లు మాయుభయులనుగురించిన విషయ ములు మాకే తెలియును. పరులకు తెలియవు. నేనతనిని గురించి భయపడ లేదు. అతడెవరో నేను బాగుగ నెరుగుదును. లంకలో రావణునియొక్క, రాక్షసులయొక్క సకలరహస్యము లను గుర్తింపవచ్చినవాడని నే నెఱుగుదును" అనెడి సమంజస మైన, సత్యసమ్మతమైన, సరలమైన వ్యాఖ్యతో శ్రీశంకర శాస్త్రిగారు చక్కని సమాధానమిచ్చియున్నారు. దీనినిబట్టి సీతపలికినది ముమ్మాటికి సత్యమే. అది పరమసత్యము. మహా మహులగు పండితప్రకాండు లీవిషయమును ఆమోదించిరి. సంశయగ్రస్తులైనపండితు లీవ్యాఖ్యను వినుటతోడనే సంశయ

ములు వీడి, సంతృప్తి పొంది, సంతోషముతో నేకకంఠముతో నంగీకరించిరి.

తరములు మారవచ్చును. యుగములు గడువవచ్చును. విశ్వజనీనములైన సాహిత్యప్రవాహకడలు వెట్టితలలు వేయుట యెన్నడును జరుగదు. మనయూహాలపై నేర్పడిన మసక పొరలను తొలగించుకొని పెద్దల సూచనలనెడి నిర్మలదర్పణ మున సత్యభావప్రతిబింబమును సందర్శింపవలయును.

ఆదృష్టితోడనే నాకు తోచిన కొలది-గురుదేవుల చరణ సన్నిధిలో రామాయణాంతరార్థములను నేనుగావిని అవగాహన చేసికొనగలిగినంతమేరకు శంకరశాస్త్రిమహోదయులవంటివారి సూచనల సహకారముతో సమస్యను పరిష్కరింపగలిగినంత వరకు యత్నమును కొనసాగింపనెంచితిని. వాల్మీకికృత శ్రీమద్రామాయణమును ఒరవడిగాపెట్టుకొని అందలి శ్లోక ములయం దంతర్గర్భితమైయున్న భావనను బహుముఖవిద్వత్తు గల పండితప్రకాండుల ఆలోచనలతో సమన్వయించి వర్తమాన కాలమునవచ్చుచున్న సందేహముల నివారించుటకై సాగించిన కృషియే 'సీతామహాసాధ్వి' అనెడి గ్రంథరూపమును దాల్చి నది. శ్లోకములయొక్క, శ్లోకాంతర్గత పదములయొక్క, పద ములకుగల విశేషార్థములయొక్క, కాకువునకుగల మధురిమ యొక్క ప్రత్యేకతల నన్నింటిని నొక్కచోట సంతరించి చూచినగాని యిట్టిసందర్భములలో పరిష్కారమార్గములు కనబట్టనేరవు.

వార్థకముచే ఆరోగ్యము సరియైనస్థితియందున్నను లేకున్నను నాశక్తికొలది యీగ్రంథమును సిద్ధపరచుటకై తగినరీతి కృషియొనర్చితిని. నేనెంతవర కీవిషయమున సఫలీకృత మనోరథుడనైతినో సహృదయపాఠకులు నిర్ణయింపవలసి యున్నది.

అత్యుదాత్తధోరణిలో సునిశితప్రతిభను వెలార్చుచు, సముచితవాఖ్య నొనర్చి శ్రీమద్రామాయణసరస్వతీ సత్యస్వ రూపావిష్కరణకు సంపూర్ణసహకారమును గ్రంథరూపమున మున్నెన్నడో నిక్షిప్తపరచియుంచిన శ్రీశంకరశాస్త్రి వరేణ్యు లకు ముందుగా కృతజ్ఞతాపూర్వక సహస్రాభివందనముల సమర్పించుకొనుచున్నాను.

గ్రంథమును సమగ్రముగవిని, సవరణలు సూచించి, గ్రంథము నిర్దుష్టముగ తయారగుటకు వలయుమనోబలము నం దించిన మహాకవిపండితులు – టి. టి. డి. ఆస్థానవిద్వాంసులు, మహాపండితులు శ్రీమాన్ వేదాంతం జగన్నాథాచార్యులుగారు. వారి అపారకరుణావిశేషమునకు నా నమోవాకములు.

నాచేరచింపబడిన అన్నిగ్రంథములకువలెనే ఈగ్రంథ విషయమునకుగూడ సముచితములైన సూచనల నిచ్చుచు – సముదాత్తధోరణిలో రచనకొనసాగించుటకు పలురీతుల సహా కరించిన పండితమిత్రులు శ్రీమాన్ రత్నాకరం శ్రీనివాసా

చార్యులు, శ్రీమాన్ బృందావనం రంగాచార్యులుగారలు. వారి అవ్యాజమైన మిత్రభావమునకు సర్వదా కృతజ్ఞుడను.

గ్రంథమునకు శుద్ధప్రతిని తయారుచేయుటలో-ముద్రణ విషయమున సంపూర్ణ సహకారము నందించుటలో - బాధ్యత నంతయు పైనవైచుకొని యెంతో శ్రద్ధవహించి పరిశ్రమను గావించిన శ్రీమాన్ వేదాన్తం సంపత్కుమారాచార్యుల గారికి నా ప్రత్యేకాభివందనములు.

కోరినంతనే నా యీపరిశీలనాత్మక గ్రంథమును పఠించి సుహృద్భావమున వారివారి అభిప్రాయములనిచ్చిన కవి పండిత మిత్రవరేణ్యుల కందరికిని అభినందనముల నందించుకొను చున్నాను.

కల్లూరి చంద్రమౌళి.
రచయిత.

## నోముల పంట

పండిత. గుత్తికొండ సీతారామయ్య
భాషాప్రవీణ - తెలుగుపండితులు
కొల్లూరు.

కాలమమోఘప్రభావము. నిత్య నవ్య పరిణామసంకలితము. ఉచ్చనీచములు, మంచిచెడ్డలు, సారస్యవైరస్యములు, వెలుగుచీకట్లు ఈ కాలగర్భకఠోరకుహరమున విలీనించియున్నవి. వానిని తెలిసికొనుటయే విశ్వలీల. ఏతాదృశ విశ్వలీలాపరిణామమునకు, రామరాజ్యసంస్థాపనకు సూత్రధారి ఆదర్శప్రేమైక జీవియగు సీతామాత యనుకల తెలుం గెతెంగించినారు శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు. తమ "సీతామహాసాధ్వి" హృద్యగద్య విమర్శనా గ్రంథరాజమున ... తోడనే వారి యెడందయందు కవికులతిలకుడగు ఆదికవి వాల్మీకిమహాకవిపై, భక్తిభావనాప్రవృత్తి "ఉపక్రమణ"లో వేయిరేకులతో విప్పారినది. శ్రీ కల్లూరివారు రామాయణమహాకావ్యమహోదధిని తమ అపూర్వమేధాసంపత్తిచే మథించి "రామాయణసుధాలహరిని" ఆంధ్రావళి మోదముం బొరయునట్లుగ ఇతఃపూర్వమే విరచించి "ఆర్షవిద్యాలంకార" బిరుద మందుకొన్న మహామనీషి.

విశ్వశ్రేయమునకై, రసాత్మకవాక్యవిన్యాసముతో, రమణీయార్థ ప్రతిపాదక శబ్దజాలముతో ఆదికవి వాల్మీకిమహాకవి

రామాయణమహాకావ్యమును రమణీరమణీయముగ గీర్వాణ వాణికి సమలంకరించిన యోగిసత్తముడు. నిఖిలవనితా జనతా శేఖరీభూతయైన సీతామతల్లి పవిత్రచరిత్రమును కమనీయ రూప రేఖా విలాసాదులను రమణీయముగ రూపొందించిన కవ్యగ్రణి.

భావాంబరవీధి విశ్రుతవిహారియై, సాంఘికరుగ్మతలను పంచబంగాళముచేసి, సామాజికస్ఫూర్తితో సౌజన్య, సౌశీల్య, సౌభాగ్య, సౌభ్రాత్ర, సౌమనస్యముల భారతీయహృదయక్షేత్ర ములలో గాటముగనాటి సాహిత్యమధువును, కవితాపీయూష మును చవిచూపించిన రససిద్ధులు.

ఒకకన్ను ధర్మదేవతవంకను, వేరొకకన్ను కళాదేవత వంకను దృష్టినినిల్పి, రచన సాగించిన క్రాంతదర్శి. ఈకారణ ములచే వాల్మీకికవికోకిల ఆంధ్రుల ప్రాసాదములలో, కుటీరము లలో పూజనీయుడైనాడని శ్రీ చంద్రమౌళిగారు ఉపక్రమణలో పేర్కొనిన విషయములు వారి ఉపజ్ఞతకు నిదర్శనములు...
"చంద్రునియందలి కాంతి" "పుష్పమునందలి సౌరభము" "కావ్యమునందలి రసము" చేతికందరానివనియు, వాని నాస్వా దించి యానందించు నధికారము సహృదయునకు మాత్రమే కలదని ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారు చెప్పినచొప్ప నిక్కముగ శ్రీ చంద్రమౌళిగారియెడ సార్థకతనందినది.

శ్రీ చంద్రమౌళిగారు సహృదయవతంసులు కావున నే వాల్మీకిరామాయణమునకు నిక్కమైన భాష్యకారులుగ వ్రాసి

కెక్కి, వారికవితాహృదయము కంఠదఘ్నముచేసికొని, తమ సునిశిత మేధాసంపదచే ఈనాడు "సీతామహాసాధ్వి"ని ఆంధ్ర సాహితీలోకమున కందించి వాల్మీకిహృదయ మధురానుభూతు లను పచరింపచేసినారు.

ఆనందరసనిష్యందమగు వివాహబంధమును పవిత్రానుబంధముగ భావింపలేక పాశ్చాత్యవ్యామోహమున కొట్టుమిట్టాడు కొందరు మోహవ్యామోహముచే భ్రమలుపెంచుకొని, మమతలు త్రుంచుకొని విడాకులవరకు పరుగులెత్తువారికి సీతాకల్యాణ మహోదాత్తపర మార్గము కనువిప్పు కల్గింపగలదని శ్రీ కల్లూరివారు ఇందు ఎలుగెత్తి చాటిన ఘట్టము అత్యంత హృదయంగమము.

"సీతాపరిణయ" శీర్షికలో -

శ్రీరాముని కరకమలములకు సీతనప్పగించుచు జనక రాజర్షి చే ప్రవచింపచేసిన —

"ఇయం సీతా మమసుతా సహధర్మచరీ తవ
ప్రతీచ్ఛ చైనాం భద్రంతే పాణింగృహ్ణీష్వ పాణినా"

అను వాల్మీకి సుమధురసుశ్లోకమునకు శ్రీ కల్లూరివారు చేసిన క్రమంపువ్యాఖ్య వారి అపారపాండితీప్రతిభకు దృష్టాంతము.

పితృవాక్య పరిపాలనాతత్పరుడైన రాముడు అడవుల కేగుచు సీతను అయోధ్యలోనే ధైర్యమువహించి యుండుమని

నపుడు మహాసాధ్విసీత వచించిన పసిడిపలుకులు భారతమహిళా లోకమునకు ముత్యాలమూటలు. బంగరుబాటలు.

"సీతధర్మావేదన"లో

కర్తవ్యప్రబోధాత్మకములైన గులాబీగుత్తులను గ్రుమ్మరించి, మల్లెలరాల్చి, మొల్లలను గురియించి, సీతామహాసాధ్వి పవిత్రచరిత్ర దర్పణమునుండి తరతరాలవారు సతీధర్మములను తిలకింపగలరని శ్రీ చంద్రమౌళిగారు ధార్మిక పారిజాతప్రసూనాల నెత్తావుల విరియించిన తీరు సుమనోమనోహరము.

"సీత అసత్యమాడినదా" ?

హనుమచరితము తనకు తెలిసియు తెలియదని రాక్షస కాంతలతో సీతపల్కిన పల్కు లసత్యములా ?

- అనుఅంశముపై షుమారు 48 పుటలలో అసంఖ్యాక గ్రంథావలోకనముచే రాబట్టిన విభిన్న పండితప్రకాండుల వాదోపవాదములను సాకల్యముగ, సహేతుకముగ, సప్రమాణముగ, సక్రమముగ విపులీకరించినతీరు మంజులతాశోభితము. అనిదం పూర్వము, అనితరసాధ్యము. ఇది వారి ప్రతిభాసామర్థ్యమునకు, వాదనాపటిమకు, పాండితీప్రకర్షకు నికషోపలము.

ఇందు పాఠకుడు కేవలము నిమిత్తమాత్రుడుగ నుండి కిమ్మనకుండగ వారి వాదనాప్రవాహమున మున్కలిడుచు

తెలుసుకొనవలసినదియే. రచయిత సిద్ధహస్తుడైనపుడే యిట్టి తాదాత్మ్యము సిద్ధించును.

మహోత్తుంగశృంగముల కెగబ్రాకిన భారతీయసంస్కృతీ సభ్యతలు, సనాతనధర్మము, ఆస్తికత, ప్రభ్రష్టములగుచున్న ఈతరుణమున ఆర్షసంస్కృతిలోగల వేదాంతార్థములను, ధర్మశాస్త్రరహస్యములను, నైతికవిషయములను దృష్టాంతపూర్వకముగా వివరించునట్టి "సీతామహాసాధ్వి" ధన్యమ్మాన్య.

శ్రీకల్లూరివారు ఇందు ఇంద్రియములకు ఆత్మకు నిరంతరము జరుగు పోరాటమును హృద్యముగ వివరించినారు.

నీతియుక్తమైన ఆదర్శగృహస్థజీవితమును వాచ్యముగను, వ్యంగ్యముగను సాహితీలోకమునకు వెల్లడిచేసినారు.

విరుద్ధభావసంఘర్షణలను పాఠకులకు చక్కగ, చిక్కగ చవిచూపి పాఠకులను తమవాదము ప్రక్కకు త్రిప్పుకొనిన రససిద్ధులు శ్రీకల్లూరివారు. సార్వజనీన ప్రేమభాజనమగుకథ యిందుంటచే విశ్వజనీనత దీనికి ఉపలబ్ధమైనది.

కష్టసహిష్ణువై, జీవితములో మువ్వంతులు నియమపాలన నెఱపి, భరతావనికి ఆత్మీయ ఆదర్శ ప్రేమైక దాంపత్య జీవితమును గఱపి, మనపాలిట నోములపంటలైన సీతారాములు సర్వదా, సర్వథా సజీవులై యున్నట్లు రసభావభావుకుల మనోనయనములకు గోచరించుచుందురు.

నామమాత్రోచ్చారణముచేతనే సమస్త లక్షణలక్షితములైన పాత్రలు రామాయణమునకే అగ్రతాంబూలమందింపగలవు. విశేషించి సీతామాతకే ఆ గౌరవభాజనము దక్కును.

"సీతామహాసాధ్వి"పై ఎందరెన్ని గ్రంథములు రచించినను, విశిష్టములు, విలక్షణములు, చమత్కారజనకములగు అసంఖ్యాకసన్నివేశము లిందు కొట్టివచ్చినట్లు కన్పించుచున్నవి.

ప్రాసంగికముగా "స్త్రీస్వాతంత్ర్యము" "వివాహబంధము" "రామరాజ్యము" "సంపూర్ణప్రజాస్వామ్యము" "ప్రేమతత్వము" "ఉత్తమసతీధర్మములు" మున్నగునంశములపై వీరు వెలుబుచ్చిన అభిప్రాయములు సత్యధర్మనిరూపకములు. సాధుతాసుందరములు.

"అగ్నిప్రవేశము" "సీతాపరిత్యాగము" "రసాతల ప్రవేశము" మున్నగువానిని తిలకించిన పాఠకులకు కరుణరసము బిందువంది, జాలై, తరగలై సాగరముగమారును.

ఇక వీరిరచననుగూర్చి రెండుమాటలు.

ఇందలి ధారయా గంగాప్రవాహము. రచనయా తెలుగు జాతీయములతో, లోకోక్తులతో విరాజిల్లినది.

వీరి శైలీమాధుర్యమునకు నిదర్శనము......

"సీత శ్రీరామపాదారవింద సంలగ్నమానసయై, అగ్ని యందు ప్రవేశించనే ప్రవేశించినది. ఏమి యీ పాతివ్రత్య తేజో విరాజమాన గంభీరప్రవృత్తి! ఏమి యీ మనోభవ ప్రభావవైభవ వైశిష్ట్యము! ఏమి యీ యచంచల నిర్ణయాచరణ చణ సముజ్జ్వల సాధు సాహసవైఖరి! ఏమి యీ యకుంఠి తాత్మగౌర వాభిమానపూర్వక ప్రతిజ్ఞాపాలనతత్పరత! ఏమి యీ నిరుపమాన నిరుపష్ట నిర్మల ప్రవర్తన!" – సీతామహాసాధ్వి – 164వపుట.

ఆర్ష సంస్కృతీవిస్ఫూర్తికి ఆదర్శప్రాయమై, ఆధ్యాత్మిక చింతనకు పట్టుగొమ్మయై, సంస్కృతసంస్కారమునకు కలికితురాయియై, గీర్వాణవాణిలోని మాధుర్య గాంభీర్య లాలిత్యాదులను వెలార్చు వేగుచుక్కయై, నిద్రాణమైన తెలుంగు జాతికి వెలుంగులనీనుచు 'ఈసీతామహాసాధ్వి' చిరంజీవియై విరాజిల్లగలదు......

ఇతిశమ్.

శ్రీః

# అనుభూతి


పండిత శ్రీమాన్
యన్. ఆర్. చక్రవర్తిభట్టాచార్యులు

గీ॥ పలుకు పలుకున బాష్పము లొలుకుచుండ
సాగినది పఠనం బెద కాఁగిపోయె
విఁకె కన్నుల నీరము - లెండె గళము
శోకి కెటువచ్చుమాట సుశ్లోకవినుత.

గీ॥ వచ్చెనట వంతమునిగిన వల్మికజని
కట్టి గట్టిగుండె నాకెటు కలుగనేర్చు
కరగిపోయితి సీతమ్మకథను జదివి
పలుకలేనయ్య నోటికి పలుకురాదు.

శ్లో॥ ధన్య జీవితం చాస్య చారిత్రం చారిత్ర వత్సరం
ప్రియాసల్లాప సక్తోపి సీతారామం ప్రకీర్త్యతే.

శ్లో॥ చంద్రమౌళి రిహాఽముత్ర
ప్రకాశ్యతి ప్రకాశయన్
రామాం సీతామహాసాధ్వీం
సత్యనిష్ఠ గిరాస్పదాం.



రచయిత దంపతులు

శ్రీర్విజయతే

# శ్రీ సీతా మహాసాధ్వీ

## ఉపక్రమణము

కవితాప్రపంచము కమనీయమైనది మాత్రమే కాదు- కర్తవ్యసూచకమైనట్టిది. జనగణముల కార్యోన్ముఖుల గావింప దక్షమైనట్టిది. సువిశాలసుందర భావనాంబరముల విహరించు రసలోలుపమానసుడగు కవి కావ్యజగత్తును సృష్టించును. సామాన్యమానవులు చర్మచక్షువులతో తిలకింపజాలని నయన మోహనమైన మనోజ్ఞప్రపంచమును నిర్మాణము గావించుట నిన సామాన్యమా ? మానవాతీతమైన యొకానొక మధుర మోహన తేజోమయ మహత్తరశక్తి కవిలేఖినిపై గావించెడి అపూర్వ లావణ్య పరిపూర్ణ నృత్యలీలయది - అసాధారణ వాఙ్మయ హేల యది. బ్రాహ్మీమయ తేజో విరాజమాన సరస సౌందర్య సంపన్న వాక్చతురతకు సుందర సూత్రమది. కవి పాఠకలోకమునకు - నవానుభూతులను మాత్రమే పంచడు;

సారస్వత వీధులలో విహరింపజేయు పాత్రలద్వారా నూతనానుభూతులను మాత్రమే చదువరుల కందించడు. మహాకవి తన రచనారంగమున-ప్రచురమైన, ప్రతిభావంతమైన, ప్రసన్నమైన, ప్రస్తుతిపాత్రమైన, ప్రజాభిరుచులకు ప్రతిబింబమైన, పరమాదర్శ ప్రాయమైన యొక ముద్రవేయును. దానికి తన సాహిత్య రసాయన ప్రవిమల ప్రశస్తిద్వారా శాశ్వతత్వము ననుసంధించును. కావ్యమున కవీంద్రు డద్దిన ముద్రలబలమున కవితకే కాక, కవికిగూడ శాశ్వతత్వము సిద్ధించుననుట తథ్యము. విశేషవైదుషీ విలసితమైన యా ముద్రయే కావ్యకర్తను మహాకవుల కోవలో నిల్పగల్గుచున్నది. మహోజ్జ్వల స్థాయినీ నా కవికి సమకూర్పగల్గుచున్నది. అట్టివారే మహాకవులు. వారే జాతికి పూజనీయులు. వారే సకల మానవాళికి సర్వకాల వందనీయులు. వారు రచించిన ప్రతిపుటలో చటుల భావసంపుటులు సదా సాక్షాత్కరించుచుండును. వారు వ్రాసిన ప్రతివాక్యమున భాసమానాసమానభావ వికాస పరంపర మోసులు వారుచుండును. వారి నోట వెలువడిన ప్రత్యక్షరమున నిత్యసత్యము ద్యోతకమై అత్యద్భుతాహ్లాదము నందర కన్నివేళల బంచిపెట్టుచుండును. వారి యూహావిహాయసమున మేలిమెఱుగు లీనుచు రూపుదిద్దుకొన్న ప్రతి పాత్రయు ద్రఢిష్ఠమైన ఆత్మవిశ్వాసమును వ్యక్తీకరించుచు, వరిష్ఠమైన వర్తనా వైశిష్ట్యమును విశదీకరించుచు, గరిష్ఠమైన సందేశమును మందార మకరందధారాసదృశవేగముతో సకలావనీతలమున ప్రవహింపజేయుచు జాతిపురోగ

మించుట కాక జ్యోతిరీతి సహకరించుచుండును. వారి నిరుప మాన నిస్తుల కృషికి సార్వకాలిక ప్రజాకోటియు ఋణపడి యుండెనని ముక్తకంఠమున వక్కాణింపవచ్చును. తిరుగులేని వాదమిది. మారుపలుకులేని మాటయిది.

ఇట్టి మహోన్నత మహోదాత్త లౌకిక వాఙ్మయ జగద్విధాత - మహాకవిలోక నేత - ఆర్ష ధర్మసంత్రాత అయిన మహాకావ్య ప్రణేత, ఆదికవి వాల్మీకిమునిచంద్రుడు. వల్మీక సంభవుని యామహాజగత్తున దివ్యదీధితుల వెలయించుచు- మేలి కాంతులను విరియించుచు - పాఠకుల మనముల నలరించుచు - సార్థకతను, చరితార్థతను సముపార్జించుకొన్న సన్నివేశము లెన్నియో కలవు. పరిపూర్ణతను ప్రస్ఫురింపజేయు పాత్ర లెన్నియో కలవు

"యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చమహీతలే
తావద్రామాయణకథాలోకేషు ప్రచరిష్యతి"

గిరులు, తరులు, నదులు, వసుంధరపై ఎంతకాలమునిల్చునో మహాకవి వాల్మీకి మహర్షి విరచిత రామాయణము సైత మంతకాల మీ నేలపై నిలిచియుండును. తాదృశ ప్రఖ్యాతి కాలవాలముగనిల్చి లౌకిక వాఙ్మయమునం దాదికావ్యముగ పేరెన్నికగన్న శ్రీమద్రామాయణ మహాకావ్యాంతర్గత లోకోత్తర పరమార్థ విశేషము మాటలతో వాకొనుట కలవిగానిది; వ్యాఖ్యాన విశేషములతో వివరించుటకు వలనుపడనిది.

అది యొక రసోదార సుధాధార. అదియొక రమణీయ భావతరంగ సంగత పుణ్య సందేశ గంగ. ఆ పుణ్యకావ్య కల్ప వృక్షచ్ఛాయన సేదదీరని జీవి నేటిదనుక కనుపింపడు. రేపు రాగలడను విశ్వాసములేదు. ప్రతియొకరికిని కాలావధుల పరి గణనతో నిమిత్తములేకయే కళ్యాణ భావనను గలుగజేసి శ్రేయమును గూర్పజాలినశక్తి శ్రీమద్రామాయణ మహా కావ్యమునకు గలదనుమాట రెండు వాదములకు తావులేనిది.

అందలి ప్రతిపాత్రయు సార్వకాలికమైన సమాజ ప్రజా నీకమునకు సన్నిహితమై సచ్చరిత్రను వ్యక్తిత్వమునకు సంత రించి పెట్టుచుండుననుట సత్యము. శారదా మధుర మంగళకర దివ్య తేజోవిశేషముతో మహాకవు లావిధముగ అవనీతలమునకు సేవగావించినారు. అపారయశము నార్జించినారు. అమరత్వ మును సాధించినారు.

వారి రచనలో ఆంతరికమైన యొక వెలుగున్నది. వారి సన్నివేశ నిర్మాణమున గర్భితమై ఆలోచనల వెల్లువలను పొర లింపజాలిన యొక మహత్తర శక్తియున్నది. వారి కథాకథన మున జాతిని చైతన్యవంత మొనరింపగల యొక సంజీవియున్నది. వారి పాత్ర సృష్టిలో సర్వసామాన్యమైన భావనా సరళికి అందనియొక నిత్యతేజోవిలసితమైన సందేశవాహిని యున్నది. కావుననే రామాయణమునకు, మహాకవికి యేకాలమునందేని కగ్గని తగ్గని యశస్సు సముపలబ్ధమగుచునే యుండును. పాలక

పాలితులకు-పతిపత్నులకు-అగ్రజానుజులకు-స్వామిభృత్యులకు; పితృపుత్రులకు - గల ప్రగాఢ పవిత్రబంధమును విపులీకరింప నేర్చిన విస్పష్టీకరింపజాలిన మరొక మహాగ్రంథము మన కేది ?

ఏపాత్ర కాపాత్రయే స్తుతిపాత్రమై లోకము నొక పవిత్ర సందేశ సూత్రముతో నవలీలగ గట్టివేయ గలుగుచున్నది. అన్నియును గలిసి ముత్యములు హారమునకు సొగసును జేకూర్చుటలో పరస్పరము సహకరించుచు మరల దేనికదియే తన విశిష్టతను వెలయించుకొనగలిగిన చందమున శ్రీమద్రామాయణ కథలో నెదురయ్యెడి ప్రతిపాత్రయు దేనికదియే పాఠకుని నిలువరించి పులకితాంతరంగు నొనరించుచునే అన్నియు గలిసి పూర్ణకథాభాగ సౌభాగ్యమునకు నిండుదనమును-సొగసును-ప్రాశస్త్యమును సంఘటించి పెట్టుచుండును.

తారహారమున ముత్యములెవ్వి యెట్లున్నను వానిదీప్తి హారమున కెట్టి యందమును దిద్దినను-నాయకమణికిగల విలువ నాయకమణిదే. దాని స్థాన మద్వితీయమైనదే. దానిదీప్తి అనన్యమైనట్టిదే. అట్లే శ్రీమద్రామాయణమునగల పాత్ర లన్నియు నన్నియే. ప్రతియొకటియు ప్రధాన కథాభాగ పరిపోష ణకు సహకరించునదియే. అయినప్పటికిని యేపాత్ర ప్రశస్తి యాపాత్రకే కలదు కౌసల్యదొక కాంక్ష - లక్ష్మణుని దొక దృష్టి - భరతుని దొక భావన - దశరథుని దొక మార్గము. ఊర్మిళ దొక బాట-తారదొక తత్పరత-సుగ్రీవునిదొక వైఖరి-

విభీషణునిదొక విధానము - సరమదొక సరళి - రావణునిదొక రాజసము - మండోదరిదొక మహనీయత - పవననందనునిదొక పద్ధతి-జటాయువుదొక సాధన - శ్రీరామచంద్రునిదొక సిద్ధాన్తము. పై పాత్రలన్నియు వానివాని వ్యక్తిత్వమునకు వన్నె పెట్టుకొనుచునే యిక్ష్వాకు వంశ మహోజ్వల చరిత్రమగు శ్రీమద్రామాయణ గాథపై వెన్నెల జల్లులనే వర్షించినవి.

కాని! వీనిలో శ్రీమద్రామాయణేతివృత్తముమీద శరత్కాలపు పండు వెన్నెలను గురియించి యీ దివ్యహారమున నాయికమణిగా విరాజిల్లిన సీతామహాసాధ్వీజీవిత లీల నాన్యతోదర్శనీయమైనట్టిదని అంగీకరించి తీరవలసినదే — అదియొక అద్భుత సృష్టి. అదియొక అమృతరసాకృతి

కావుననే రామాయణమును కొందరు సీతాయణ మనుచున్నారు. వీరి పలుకులలో కొంత అతిశయోక్తి యున్నదనుకొన్నను "సీతాయాశ్చరితం మహత్" అని ప్రత్యేకముగా వాల్మీకి మహర్షి పలికిన వాక్యము రామాయణమును సీతాయనమనుట కవకాశమునిచ్చుచున్నది. సీతాయనమనుమాట యొక్కటే యామెసాధ్వీత్వము నెలుగెత్తి చాటుచు సీతామహాదేవి శీలవైభవమునకు వన్నెలను దిద్దుచున్నది.

ఇట్టి దివ్యపాత్రల మహామహిమలను సారస్వతలోకమున మనకు సాక్షాత్కరింపజేసిన మహాకవులకు జాతి సర్వకాల సర్వావస్థలయందును ఋణపడి యుండెనని యొప్పకొనక

తప్పదు. సారస్వతము చదువుల తల్లియైన సరస్వతీ స్వరూపమే. కావ్యసంపద యేరూపమునందున్నను వాణీ చిద్విలాసమే కావచ్చుగాక! భారతీ రుచిరరూపలావణ్య రేఖా లాలిత్యమును మన మనోమందిరమున నిలుపువారెవ్వరు ? సకల విద్యాధి దేవతయైన శారదామంజులచరణ మంజీర మనోజ్ఞ వివాద పరంపరలతో మనకు శ్రవణపేయము గావించు వారెవ్వరు ? వారిలో ఘనులెవ్వరు ? వారిలో ప్రథములెవ్వరు ? వారిలో ప్రస్తుతిపాత్రులెవ్వరు ?

నిస్సంశయముగ సరస్వతికన్న సరస్వతీ పదపద్మారాధకులైన సారస్వతస్రష్టలే ముందుగ నారాధనీయులయినవారు. కావ్యదేవతగా ఖ్యాతిగన్న కమలగర్భుని రాణికన్న మున్నుగ సంస్తుతింపదగినవారు- స్తవనీయ సాహిత్య ప్రపంచమున సజీవ పాత్రలనిల్పి, వాని ద్వారా సందేశామృతమును మన దోసిట బోయించుచున్న రసమయ సాహిత్యలోక దేవేంద్రులయిన సరసకవీంద్రులే.

ఆదికావ్యమునకు (శ్రీ)కారముచుట్టి అపార కావ్య సంసార సృష్టికి మూలకారణభూతుడైన మహాకవి వాల్మీకి యట్టి యని తరదుర్లభమైన ప్రయత్నమునకు నడుముగట్టి నడచి, ముందు నకుసాగి, ఫలిత సాధన మొనర్చి మిన్నకున్నాడు. కాని ! తరువాతి కాలమున క్రమక్రమముగ నాయనయడుగుజాడలలో ముందుకుసాగి, ఆయన నడచిన బాటలలో కోటి దివ్వెలను

వెలిగించి, తీయని పాటలను బాడి ధరణీతలమును పరవశత్వ మున ముంచి తేల్చిన కవికులతిలకు లందరీ సత్యమును వేయి నోళ్ళ కీర్తించినారు. కీర్తించుచు నే యున్నారు. కీర్తింపగలరు.

ఆ కమనీయగళధ్వానముల వంకకు చెవిద్రిప్పుడు. కర్ణ పేయ కమనీయ కావ్యరీతి-మధుర గీర్వాణ సారస్వత స్వరూప గీతి-అయిన భవభూతి కంఠమది. ఆయన కమలగర్భునిరాణికన్న కవీంద్రుని వాణిమిన్నయనుటలోగల పరమార్థము నరయుడు.

"ఇదం కవిభ్యః పూర్వేభ్యో నమోవాకం ప్రశాస్మహే
వందే మహి చ తాం వాణీం అమృతామాత్మనః కలామ్"

ఆ మహానిర్ణయమున కొక పరమార్థము లేకపోలేదు, ప్రత్యేకాశయము లేకపోలేదు. ముందుగా అక్షరమయ జ్ఞాన దేవతలగు పూర్వకవుల కందరికిని మ్రొక్కి - తరువాత తదధి దేవతయగు భారతికి మోకరిల్లుచున్నాడు భవభూతి. ఆయన యూహాపథమున వాణి అమృతస్వరూప; ఆత్మకళ; ఆమె లలిత మనోహరాకార సమారాధనకు దొరకొన్న భవభూతి-భారతీ దేవిని, అమృతస్వరూపిణిగా, ఆత్మకళగా సంభావించుటలో ఆశ్చర్యమేమున్నది ? ఆ యమృతకళాప్రపూర్ణ మంజులరూప మునే, ఆ బ్రాహ్మీప్రసన్నాకారవైభవశోభనే; భవభూతి పూర్వ కవుల పలుకులలో తిలకించియుండును. ప్రభుసమ్మితములై ప్రపంచభద్రతకు పరమేష్ఠిచే నలుమోముల సమావిష్కృత మొనర్పబడిన చతుర్వేదములలో శ్లోకప్రవాహ వేగోద్ధతినే

శ్లోకస్వరూపమున వెలయించి కారుణ్యజలధిగా, ధర్మసందేశ నిధిగా వాల్మీకిచే సంతరింపబడిన ఆదికావ్యమగు శ్రీమద్రామాయణములో లోకవిధ్వంసకారకమైన ప్రచండరణమునకు భ్రాతృత్వమును బలిపెట్టుటకేని వెనుకాడనితరుణమున - ధర్మదేవత యెట్లు తనయొడిలో సత్యానురక్తులకు సేదదీర్చి శాంతిపీఠమున వారినధిష్ఠింపజేసెనో! విశదీకరించిన వ్యాసమునిచందుని భారతసారములో — భగవంతునికన్న భాగవతులే మిన్నయని సోదాహరణముగా నుద్ఘాటించుచు రసమయములైన బహుగాథలద్వారా దివ్యప్రేమ విజయలక్ష్మీ విశృంఖల విహారమును వర్ణించిన భాగవతములో - భవభూతి మహాకవి యీవాణికిసంబంధించిన అమృతస్వరూపము నే ఆత్మకళ నేదర్శించియుండును. భవభూతికవీంద్రుని కావ్యగ్రంథములలో సారస్వత ప్రస్తారదశలో సరస్వతీముగ్ధ మోహనాకృతి కాక - తత్సరస్వతీ చరణ పంకేరుహ కైంకర్యమగ్నహృదయులయిన కవీంద్రులే సాక్షాత్కరించియుండురు. కావుననే అపూర్వానందప్రదాతలుగా - అసాధారణకావ్యామృతదాతలుగా - అనితరదుర్లభ సారస్వత ప్రపంచవిధాతలుగా భూతలమున - రాజ్యాధినేతలందజాలనిఖ్యాతితో శాశ్వతత్వమును సముపార్జించుకొని ధ్రువతారలై నిలిచిపోయిన "పూర్వేభ్యో కవిభ్యో నమోవాకం ప్రశాస్మహే" అని భవభూతి నిర్వివాదముగ నుద్ఘాటించియుండును. భారతికన్న మున్నే భారతీచరణపరిచరణులు నిర్మల

కవితారసతరంగితాంతఃకరణులు నయిన కవులకు నమస్కరించి యుండును. సముచితము సముదాత్తమునగు విధానమిది.

కవి సరస్వతీ స్వరూపుడు మాత్రమే కాదు; ఋషికల్పుడు. 'నానృషిః కురుతే కావ్య'మనెడిది సత్యసూక్తియే. త్రికాలజ్ఞుడు, క్రాంతదర్శి, మహర్షితుల్యుడునగు కవి— మంత్రార్థములను దర్శింపనేర్చిన మాన్యుడు. మంత్రమహిమల నాకళింపునకు దెచ్చుకొనజాలిన ధన్యుడు. ఇట్టి వారిచే విరచితములై వారి సరససూక్తి పరంపరద్వారా ప్రవచితములై యెల్లరి యుల్లములను బల్లవింపజేయుచు సముల్లాస శక్తిని సర్వకాలములలో జనగణములకు సంతరించి పెట్టెడి కావ్యరత్నములే ప్రగతికి మార్గదర్శకములు. ప్రజావళికి హితప్రబోధకములు. అవియే మహాకావ్యములు. తాదృశమహాశక్తితో విలసిల్లని కావ్యములు కేవల కావ్యనామమాత్రములే. తత్కర్తలు సాధారణ కవిశబ్ద వాచ్యులే. ఆ కావ్యములకుగాని తత్కావ్య స్రష్టలకుగాని శాశ్వతత్వమును గడింప వీలును గలిగించు యోగ్యత లేదు. ప్రాశస్త్యమునురాదు.

మహాకావ్య నామాంచితములై మణిదీపికలుగా ప్రకాశించెడి కావ్యములు మనకు సంఖ్యామాత్రములుగనే యున్నవి. మహాద్భుత భావబలములతో వజ్రసదృశ సందేశ పరంపరతో సానలుదీరిన జాతిరత్నములవంటి పాత్రలదృష్టితో మహాకవులుగా పేరెన్నికగన్న మహనీయులుగూడ మనకు కొలదిమందియే

యున్నారు. లౌకిక సంస్కృత భాషలో ఛందోరూపమున తొలిసారిగా మహాకావ్యమును సమావిష్కరించిన ఘనత మహాకవి వాల్మీకిమహర్షికే దక్కెనని చెప్పవలెను. విశ్వ సాహితీ సుందరనందనవనమున వాల్మీకిమహర్షి భావకల్పవృక్షముపై వికసించిన కావ్య పారిజాత సుమనోరాజమే శ్రీమద్రామాయణ మహాకావ్యము. వాస్తవముగ నాటికి - నేటికి - రేపటికి నదియే యాదికావ్యమని రసజ్ఞపాఠకలోకము కరములుమోడ్చి మ్రొక్కుచుండును.

విశ్వవిఖ్యాత యశమును గడించిన మహాకావ్యమగు శ్రీమద్రామాయణ సమావిర్భావమే యొక రసోజ్జ్వల హృదయస్పందనాత్మక సుందర సన్నివేశము. దారుణారణ్య సీమల మారణకాండకు బూనుకొని ఘోరక్రూర వికటాట్టహాసములతో విశృంఖల విహారము గావించుచున్న యొకానొక కిరాతుడు కీర్తనీయుడైన కవిమూర్తిగా మారుటకన్న వింత విషయమేమిగలదు? వానికి నారదమహర్షి సాక్షాత్కరించుట, వానికి మనోవైకల్య మేర్పడుట, నారదుడు జ్ఞానోపదేశ మొనర్చుట— కిరాతుడు తపోదీక్షా పరతంత్రుడగుట — క్రౌంచమిథునమున గల మగపక్షిని క్రూరాతిక్రూరముగ వధించిన బోయపై మండిపడుచు వల్మీకసంభవుడు హృదయావేదనను, కంఠగత శోకమును శ్లోకరూపమున వెలార్చుట మున్నగునవి యన్నియు మహాశ్చర్యకర సన్నివేశములుగావా?

ఈ సంఘటనలనుండి—కరుణార్ద్ర చిత్తుడైన వాల్మీకినోట - అమృతపుటూటగా - ఆర్షసంస్కృత రసాయనపు తేటగా - మహర్షుల బాటగా-మానవజాతి పాలిటికి ముత్యాలమూటగా శ్రీమద్రామాయణగాథ సమావిష్కృతమైనది.

స్వయముగ పరమేష్ఠియేవచ్చి...

"శ్లోక ఏవ త్వయాబద్ధః నాత్రకార్యా విచారణా
మచ్ఛందా దేవతే బ్రహ్మన్! ప్రవృత్తేయం సరస్వతీ"

అని చెప్పుటతో ఈ దివ్యకృషికి పరిపూర్ణత వచ్చినది. ఈ పవిత్ర సన్నివేశమునకు ప్రశస్తివచ్చినది. ఈ వాఙ్మయము నకు మహాకావ్యత్వసిద్ధి సమకూరినది.

"నాయనా! నీవు పల్కినది నిస్సంశయముగ శ్లోకమే. నా అనుజ్ఞతోనే యీ సరస్వతి నీ నోట నర్తించినది. నీనోట అనృతమురాదు. నీవు సృష్టించిన ఆదర్శపాత్రలన్నియు నిజమునే పలుకగలవు" అని వాల్మీకిని వెన్నుదట్టి ప్రోత్సహించి ఆశీర్వదించిన బ్రహ్మ-

"కురు రామకథాం పుణ్యాం
శ్లోకబద్ధాం మనోహరాం"

బా. కా. స. 2. శ్లో. 36

"మనోహరశ్లోకరాజములతో విరాజిల్లుపగిది పుణ్యప్రదమైన రామకథను వ్రాయుము" మని యాజ్ఞాపించినాడు.

కావలసినవన్నియు నట్లు కలసివచ్చినవి. దయాశూన్యహృదయుడైన బోయవాడు కమనీయకవితాహృదయుడైనాడు. కారుణ్యరసభాసురుడైనాడు. కావ్యస్రష్టయైనాడు. మహాకవియైనాడు. ఆదికవియైనాడు.

శ్రీమద్రామాయణగాథాసృష్టి వెనుకగల యాంతర్యమిది. ఇందలి పవిత్రత యిది.

"కృతం మయేదం భగవన్ కావ్యం పరమ పూజిత"

వ్యాసమహర్షి భారతరచన మొనర్చి తాను కావ్యమును వ్రాసి తెచ్చితినని బ్రహ్మతో మనవిచేయగా, "నీవు కావ్యమనుచున్నావు. కాన నది కావ్యమేయగుగాక!" అనెనట! శ్రీమద్రామాయణవిషయ మట్లుగాదే? వాల్మీకి యొకేయొక శ్లోకమును యాదృచ్ఛికముగా తననోట వెలువరించినాడు. వాణీధవుడైన బ్రహ్మ స్వయముగ తానేవచ్చి- 'నీనోట వెలువడినది శ్లోకమే. నీవు రామకథను వ్రాయుము. అది మహాకావ్యముగా మనగలుగు'ననెనట.

ఈ సన్నివేశద్వయమును సూక్ష్మముగ పరిశీలించినచో శ్రీమద్రామాయణమునకుగల ప్రాశస్త్యమెట్టిదో మనకు సులభముగ నవగాహనమగును. అది మహాకావ్యముగా మానవులచే ప్రస్తుతింపబడకముందే విధాత దానిని మహాకావ్యముగ బేర్కొనినాడు. మహాకావ్యనామకరణ మొనర్చినది కవిగాదు. ప్రజలుగాదు. మున్ముందుగ నద్దానిని చతురాస్యుడైన బ్రహ్మదే

మహాకావ్యమనినాడు. కావున నది మహాకావ్య మేయైనది. మహాకావ్యధర్మములనే లోకమున జాటినది. మహాకావ్యముగనే మనుగడసాగించినది. మహాకావ్యముగనే నిల్చిపోయినది. మహాకావ్యముగనే నిలువగలదు. సంఘమును - సంఘదురాచార సదాచార విశదీకరణమును - సంఘమునగల భిన్న విభిన్న పాత్రల మనస్తత్వవిశ్లేషణమును - సన్నివేశముల యౌచిత్యమును- సంఘ క్షేమంకరసందేశమును కథాభాగమునకు మూల బీజములుగా నిడుకొని సృజింపబడిన కావ్యమే మహాకావ్యత్వము నందుకొనగలదు.

వాల్మీకి శ్రీమద్రామాయణ కథాభాగమునకు సంఘమును పునాదిగ గైకొనినాడు. సంఘశ్రేయస్సునే పరమలక్ష్యముగ నిడుకొని రామాయణరచన నడచినది. మొత్తముమీద సంఘజీవిత వైశిష్ట్యమును సమగ్రసుందరముగ, సరసముగ భాగ్యదాయకముగ జిత్రింపబూనుటే మహర్షి యిందుగావించిన ముఖ్యకృషి. శ్రీమద్రామాయణమునందువలె - ఈ విషయముల చిత్రీకరణలో శ్రద్ధవహించిన కావ్యము మరొండు లేదు. కావుననే యిది నిక్కముగ మహాకావ్యమనియే వ్యవహరింపబడుచున్నది. సంఘము భిన్న విభిన్న భావసరళుల సంఘర్షణ కూటమి. ఇందేకత్వమును సౌమనస్యమును సాధింపబూనుట- ఇసుమున తైలము దీయుపూనుటే కాగలదు. కాని మహాకవి తన యంతర్వాణి ప్రబోధబలముతో తన సిద్ధవాక్కుల వైభవ

ముతో - అఘటనఘటనాచతురతను ప్రదర్శించి సఫలీకృత మనోరథుడు కాగలడు. మహర్షి వాల్మీకి యీ మహత్కార్య మునే తన కావ్యరంగమున జిత్రించి పాఠకుల బరవశులగావించి ప్రశస్తికెక్కినాడు.

సంఘజీవులైన వ్యక్తులు - పరస్పరముగ నొండొరుల యెడ నెట్లు వ్యవహరింపవలెనో! ఎట్లు సంచరించుట ధర్మమో! దర్పణమునబోలె ప్రదర్శించిన ప్రతిభావంతమైన మహాకావ్య మిది. సంఘజీవితలీలకు సరియైనస్థాయిలో ఛాయాచిత్రముగ నిల్చిన యీ మహాకావ్యమునందలి కథానాయకుడు శ్రీరామ చంద్రమూర్తి - ఆదర్శ గృహస్థుగా మన కిందు సాక్షాత్కరిం చుట విశేషము. కథానాయికయైన యొక మహోజ్జ్వలరత్నము కేవలము రత్నమనుమాట యామె విషయమున చాలనిదే. ఒరపిడిపెట్టిన వజ్రము. చెక్కినరత్నము. ప్రముఖపాతివ్రత్య ప్రభావయుత దీపకళిక. కావుననే రామకథను అమంగళ పరిహా రార్థము, సర్వమంగళానుగ్రహ సిద్ధ్యర్థము, పరమార్థప్రాప్తి నిమిత్తము నాటినుండి నేటివరకు - రేపును - ప్రాజ్ఞులు పారా యణము చేయుచున్నారు. పలురకములగు ఫలితముల సాధనకు ప్రత్యేక ప్రత్యేక కాండల విభాగమును పెద్దలు పేర్కొన్నారు. పారాయణమా ప్రకారముగ సాగుచున్నది. ఫలితము ఆలావిధ ముగనే దక్కుచున్నవి. ఈ విశిష్టత యీ కావ్యమునకేగల విశేషములలో నొకటి. ఇట్టికావ్యము లెన్నియుండును? లెక్కిం చుటకేని యున్నావా? ఉన్నచో నవియెన్ని? ఉన్నను వ్రేళ్ళపై

లెక్కింపదగినవిగనే యుండును. పతితలకు వ్యవహార వేత్తృతను పరిపూర్ణముగ ప్రసాదింపజాలిన రసానంద ప్రదాన సమర్థమగు మహాకావ్యములకు సంఖ్యతో పని లేదు. లెక్కకొక్కటియున్న-నొక్కటియున్నను జాతిమొత్తమునకు మొక్కవోవని యాత్మ శక్తిని అనుగ్రహింపగలదు.

విశాలదృక్పథముతో సంఘమును సమీక్షించిన ధర్మ నీతిజ్ఞుడగు మహర్షి వాల్మీకి విశ్వహితైకభావుకుడై తనగావ్య మున సర్వప్రాణికోటికి సముచితస్థానము నొసంగినాడు. వేదసారభూతమును, చతుర్వింశత్యక్షర పరిమితమునునగు గాయత్రీ మహామంత్రమునందలి యక్షరసంఖ్య కనుగుణముగ నిరువది నాలుగు వేలశ్లోకములతో రామాయణరచన గావింప మహాసంకల్పమొనర్చిన - మహర్షి. "ఆత్మవ త్సర్వభూతాని" అనెడి పవిత్రసూక్తిని దృష్టియందుంచుకొని పావనత్వమును సంతరించు కొనిన మనుజగణముతో బాటుగ పశుపక్ష్యాది గణమునకుగూడ తనగావ్యమున నొక ప్రత్యేకస్థానమును గల్పించుట యందబ్బురమేమున్నది? రామచరితను - రామాయణసంహిత యనుట ప్రత్యక్షరసత్యమైన విషయమే. లోకోత్తర-గుణోత్తరుడుగా మహోదాత్త రసవత్తరచరిత్రుడుగా - ఆదర్శవర్తనుడుగా శ్రీరాము డిందు వర్ణింపబడుటచే శ్రీమద్రామాయణమనెడి సార్థకాఖ్య యీమహాకావ్యమునకు తగియున్నది.

అట్లే తన సౌశీల్య సౌజన్య సౌభాగ్య సౌమనస్య వైభవములతో వెలుగొందు సచ్చరిత్రగలి - సకలనారీలోక శిరో

మాణిక్యముగా-సర్వసద్గుణసంపత్తికి కాణాచిగా-సతీతిలకముగా సాధ్వీరత్నముగా జగత్ప్రశంసల బడయనేర్చిన సీతమ్మపావనగాథ యందు శ్రవణపర్వముగ వర్ణితమైయుండుటచే యీమహాకావ్యమును "సీతాయాశ్చరితం మహత్" అని యెల్లరు భక్తిశ్రద్ధాబద్ధబుద్ధులతో వాకొనుచున్నారు.

'రమాయాః ఇదం రామం - తస్య అయనం రామాయనం' అను వ్యుత్పత్తినిబట్టి లక్ష్మీస్వరూపురాలైన సీతామహాసాధ్వీ చరిత్రయే యీ మహాకావ్యమున ప్రధానముగా వర్ణింపబడినట్లుండుటయు పైవారు వాకొను తీరునకు బలమును గూర్చుచున్నది.

ఇంకను రామాయణమను నామమునకుగల వైశిష్ట్యమును వెల్లడించుటకై అనేకులనేకవిధముల వ్యుత్పత్త్యర్థముల జూపుచున్నారు. వీరి వివరణలకుగల యంతరార్థములు వారి వివరణలకును గలవు. వాని నన్నింటి నిటుదడవవలసిన యవసరమును లేదు. సమయమునుగాదు. కాదనియావనికి బూనిన ప్రత్యేకముగ రామాయణ నామౌచిత్య వివరణాత్మకమైన యొకానొక వచన ప్రబంధ మేర్పడగలదు. కావున దానినట్లుంచి ప్రకృతము ననుసరింతము

## సాధ్వీ సీత

సర్వలక్షణ లక్షితమైన శ్రీమద్రామాయణమును వాల్మీకి మహర్షి రామకథతో బాటుగ-గట్టిగ జెప్పదలచిన-రామకథకన్న

కొలదియో గొప్పయో మిన్నగనే సీతాదేవి సచ్చరిత్ర ప్రభావమును వివరించెననియే యొప్పుకొనకతప్పదు. పతిగాథకన్న సతి కథకే అధికతమ ప్రాధాన్య మొసగెననుట నిర్వివాదాంశము. జానకి పుణ్యశీల. పావనచరిత. దివ్యవర్తన. సౌశీల్యభూషణ. సాధుభావన. సరసహృదయ కరుణామయాంతఃకరణ.

"వరిష్ఠా సర్వనారీణా మేషాచ దివి దేవతా"- సకల స్త్రీ లోకమున శ్రేష్ఠురాలుగా దివినుండి భువికిదిగివచ్చిన దేవతగా సీత వాల్మీకివాక్కులలో వర్ణింపబడినది. సీతామహాసాధ్వియొక్క దైహిక మానసిక లావణ్యాతిశయ విశేషములను న్యూనాతిరిక్తముగ వర్ణించి సుగుణ సుమసౌరభముల ప్రసారించి పాఠకులదృష్టిలో నామెను భారత-అదేమి? ప్రపంచ నారీలోక గర్వకారణభూతురాలినిగా ప్రాచేతసుడు శాశ్వతముగ నిలుపజాలినాడు. రామాయణచరిత్రపుటల దెరువగనే సర్వాతిశాయియగు గాథాసుధతో బునీతచరిత్రగా సాక్షాత్కరించెడి యీ సతీమతల్లి జననీజనకు లెవ్వరు? శ్రీమద్రామాయణ దివ్యచరిత్రాకాశమున ధ్రువతారగా- అనంతకాంతుల వెలార్చుచున్న యీ కాంతామణి ప్రవిమలజన్మ పావనత్వమును ఘటించుకొనిన అదృష్ట ప్రదేశమెద్ది? ఆమె పుట్టుక వెనుక దోబూచులాడుచున్న మహారహస్యమెద్ది? కాలగర్భమున దాగియున్న యీ సత్యము నెవరు వెలికి దీయగలరు? భావికాల ప్రజలకు గూడ నియ్యది దుర్భేద్యముగనే యుండుననిని తపోమహాత్త్వ సం.

పన్నడు క్రాంతదర్శియునగు వాల్మీకి కవిచంద్రుడు సముచిత పథకము నొకదానిని సంఘటించి తత్ప్రకార- మాగుట్టును బట్ట బయలొనర్చి పుణ్యము గట్టుకొనినాడు.

బ్రహ్మర్షియగు విశ్వామిత్రుడు, దేవర్షియగు నారదుడును తమతమ తపశ్శక్తులద్వారా-దివ్యవీక్షణ పరంపరద్వారా సీతను దివ్యశక్తి సముద్భూతగా-అయోనిజగా - లోకకల్యాణార్థమై యావిర్భవించిన సాధ్వీమణిగా గుర్తించి ప్రస్తుతించినారు. వాల్మీకి ఈ సన్నివేశముల నన్నింటిని అతిలోకరమణీయముగ వివరించియున్నాడు. మానవులందరు స్త్రీగర్భసంజాతులే. కాని! సీతమాత్రము భూగర్భజాత. అదియే విశేషము. "భూతలాదుత్థితా సా"- ఆమె భూతలమునుండియే జన్మించెనని వాల్మీకి నిష్కర్షగ జెప్పియున్నాడు.

తద్వివరణ యిట్లున్నది.

జనకుడు రాజర్షిగా మహనీయమైన మనుగడను కొనసాగించుచున్న విదేహ సామ్రాజ్య చక్రవర్తి. సరస సౌశీల్య సదాచార సముపార్జిత సత్కీర్తి. ఆయన యజ్ఞము నొకదానిని విధివిధానముగ నిర్వహింప దీక్షితుడై తదనుకూల ప్రదేశము నిర్ణయించుకొని పరిశుద్ధిగావించుటకై భూమినిదున్నుటకు బూనుకొనినాడు. నాగేటిచాలునకు సంస్కృతమున 'సీత'యని పేరు. భూమిని దున్నుతరి నాగేటిచాలున జనకుని భాగ్యవశముననో దక్కిన పెన్నిధిగా- అదృష్టవశమున లబ్ధమైన వరముగా-

అపూర్వ తేజోవిరాజమానమైన యొక 'బాలిక' దొరకినది. విదేహరాజ్య ప్రజలు విస్మయాశ్చర్యానందముల మునిగితేలినారు. జనకుడు బ్రహ్మానంద రసాస్వాదనా పరతంత్ర హృదయుడై నాడు. నాగేటిచాలున నందనవన మందారముగా అనుకొనకయే మహాఫలము లభ్యపడినది. కనుక ఆ బాలికకు 'సీత' యని జనకుడు ముద్దుగ నామకరణ మొనర్చుకొనినాడు. భగవద్వరప్రసాదముగ రాజర్షి జనకునకు దక్కిన మణిదీపికయే రామాయణ గగనసీమల మహోజ్జ్వల కాంతుల వెదజల్లినది. రామాయణమున కథాభాగము తిరిగినమలుపులన్నింట సీతామహాసాధ్వీ భావజ్యోతిర్దీప్తులు ప్రసరించుచునే యున్నవి. కథ పట్టుగ నడచునప్పటినుండి సీతతో ప్రసక్తిలేని సన్నివేశమే కనిపించదు. కథాంశమునం దంతర్లీనముగ ప్రతిభాసించెడి జీవరేఖ యామెయే. ఆమెను చుట్టుకొనియే కథయంతయు తిరుగుచుండును. కథలో – ఉత్సాహోద్రేకములుగాని – ఆనందావేశములుగాని – విషాద వీరములుగాని – విపుల సంకుల సమర విజయ విశేషములుగాని సీతామహాసాధ్వీ చరిత్ర విశేషాంశములననుసరించియే యుండును. వాస్తవముగ నొక్కమాటలో రామాయణమే సీత. సీతయే రామాయణమని చెప్పనొప్పును. జనకుని ముద్దుల కుమార్తె యగుటచే జానకియనియు, మిథిలానాథుని తనూజ యగుటచే మైథిలియనియు, విదేహప్రభుపాలిత సంతానమగుటచే వైదేహియనియు, భూమినుండి సముద్భవిం

చిన బాలయగుటచే భూజాతయనియు సీతను పలునామములతో ప్రజలు పిలుచుకొనుచుండెడివారు.

పుష్పము లెన్నియున్నను-మల్లెకుగల మధుర పరిమళము మల్లెదే. సంపెంగకుగల సరస సౌరభము సంపెంగదే. అట్లే నాగేటి చాలున దొరకిన బాలకు కావలెనని కోరి యెవరెన్ని పేర్లనెట్లు పెట్టుకొన్ననేమి? ఎట్లు పిలుచుకొన్ననేమి? ఆ "బాలిక" కు 'సీత'యను నామమే సార్థకమైపోయినది. సీతయను నామము జిహ్వాగ్రమున నిలువగనే యొడలు పులకరించును. మనసు మయూరమై నటనము సాగించును. తదితర నామములన్నియు నాయా యర్థములకు సంకేతములుగా నాయా సన్నివేశములలో మాత్రమే యుపయుక్తమగుచుండును. సీతయను పేరు మాత్రము సన్నివేశముతోగాని, పెనవైచుకొనియున్న ప్రత్యేకార్థముతోగాని సంబంధము లేనిదానివలె సహజనామమైనట్లుగనే యొప్పారుచుండును.

ధర్మశీలుడును, మహాత్ముడును నగు మిథిలాధిపతియైన జనకుని పాలిత పుత్రికయనెడి భావనయే 'సీత' యను పేరు దలచగనే స్ఫురణకు వచ్చుచుండును.

సీత సుగుణ విశేషమును - శీల ప్రభావమును దెలిసినవాడగుటవలననో! ఏమో! జనకుడామెకు బాల్యమునందే సుశిక్షణమొసగి యోర్మి కూర్మల నుగ్గుబాలతో నూరిపోసినాడు. సుఖదుఃఖాది ద్వంద్వముల కతీతముగ వర్తించుట భోగ

భాగ్యాదులను త్యాగబుద్ధితో మాత్రమే అనుభవించుట యనెడి సల్లక్షణములను జనకుడు జానకిచే గోరుముద్దలుగా దినిపించెను. మానవులందరు భగవత్సృష్టికి చెందినవారైనను దివ్యాంశ సంభూతులస్థాయి వేరుగనే యుండును. సామాన్యులకును వారికిని యనంతమైన యంతరము స్పష్టముగ గోచరించుచుండును. సీత అయోనిజ. శ్రీమహాలక్ష్మియొక్క అంశతో ఆవిర్భూతమైన యామె. ఆమె మానవరూపముననున్నను దేదీప్యమానముగ దీపించుచు దివ్యబాలికగనే ద్యోతకమగుచుండును. చుక్కలమధ్య చంద్రునివలె - రాళ్ళనడుమగల రత్నముపగిది సహజకాంతులను విరియించుచునే యుండునుగదా!

## సీతాపరిణయము

విశిష్టలక్షణ సంపన్నయగు సీతకు జనకుడు పరిణయ మొనర్ప సంకల్పించినాడు. 'నా వంశీయులగు దేవరాతులకు న్యాసముచేయబడి చిరకాలముగ పూజలందుకొనుచు నాయింట నున్న శివధనస్సు నెక్కుపెట్టగల క్షత్రియకుమారుడే నాపుత్రికను వివాహమాడుగాక! ఆమె వీర్యశుల్క' అని జనకుడు స్వయంవరమును ప్రకటించినాడు. స్వయంవరమున కెందరో వచ్చిరి. వచ్చిన యవీర్యులు-అల్పవీర్యులు - సందిగ్ధవీర్యులు-ప్రతిలబ్ధవీర్యులు మొదలగు రాజులెల్లరు ధనుర్విక్షేపణమును చేయజాలక మిన్నకుండిరి.

విషయమంతయు బోధపడినది. విశ్వామిత్రమహర్షి శ్రీరాముని వంకకు జూచినాడు. శ్రీరాము డత్యుత్సాహముతో లేచినాడు. ఇక్ష్వాకువంశమున పూర్ణావతారుడుగా శ్రీమన్నారాయణాంశమున జన్మించిన మహనీయునుగదా! శ్రీరాముడు. ఆయనగాక మరియింకెవ్వరు పూని లేవగలరు? ఇట్టి పౌరుషప్రధాన కార్యనిర్వహణకు కావలెనని వెంటనిడుకొని తెచ్చి - బలాతిబలల నుపదేశించి - తాటకని జంపించి - యాగసంరక్షణము వారిచేతనే చేయించి అహల్యకు స్వస్వరూపానుసంధానప్రాప్తి గలిగించి, సర్వవిధముల గురువై తనను నడిపించుచున్న విశ్వామిత్రుడు సూచనప్రాయమైన యనుమతి నొసగిన యనంతరము శ్రీరాము డింకేల బూనుకొనకుండును?

శ్రీరాము డవలీలగ - మత్తగజము చెరకుగడను ఫెళ్ళున విరిచినంత సులభముగ - సునాయాసముగ శివధనస్సు నెక్కు-పెట్టినాడు. చూచువారిగుండె లదరుచున్నవి. ఇంతలో నది రెండు తునియలుగానే యైనది. సీతమనస్సు - జనకుని ఆలోచనాత్మక హృదయము - పాల్గొనవచ్చినవారిగుండెలు నొక్క-సారిగ జల్లుమన్నవి. శివుని విల్లు ఫెళ్ళుమన్నది.

సీతను రామునికి పత్నిగా సమర్పింపవలసిన శుభసమయమది. మృదుమధుర గంభీర హృదయముతో జనకుడు సీతను వెంటనిడుకొని రామునివద్దకు వచ్చినాడు. చిరునవ్వులు - సిగ్గులు నునుబుగ్గలపై లేతగులాబీ మొగ్గలలీల ప్రకాశింప

జానకి శ్రీరామునిగళమున పూలమాలవైచి తలవంచి నమస్కరించినది. రాముడు సీతను పుష్పహారముతో నలంకరించినాడు. "ఇయం సీతా మమసుతా సహధర్మచరీ తవ-ప్రతీచ్ఛ చైనాం భద్రం తే-పాణిం గృహ్ణీష్వ పాణినా" ప్రేమగ శ్రీరామునితో జనకరాజిట్లనినాడు.

"పతివ్రతా మహాభాగా ఛాయే వానుగతా సదా
ఇత్యుక్త్వా ప్రాక్షిపద్రాజా మంత్రపూతం జలం తథా !

శ్రీరాముని కరకమలములకు సీతనప్పగించుచు జనకరాజర్షి ప్రవచించిన సువర్ణాంచిత సుమధుర సులలితాదర్శవాణి యిది. ఆయన వాక్శుద్ధియు, వాక్సిద్ధియుగల తపస్వి. యోగ్యతగల మనస్వి. అయన పలుకులు ప్రత్యక్షర సత్యములగుట రానున్న కథాభాగమున విశదముగ మన మరయగల్గుదుము.

భారతీయ వివాహ క్రియాకలాపమున లక్ష్యభూతము లైన మహోన్నత భావపరంపరల నెన్నింటినో! కవి యీ ఘట్టమున ప్రదర్శించినాడు. జనకుని నోట వాల్మీకిమహర్షి యనిపించిన ప్రతిమాటయు రతనాల మూటయే.

"ఇయం" అనుటతో సీతయొక్క సౌందర్య సౌశీల్యాదులనిర్వచనీయ ప్రతిభామయములని ద్యోతక మొనర్పబడినది. సామాన్య మానవ కాంతగ నీమెను భావింపవలదనియు - మాన్యగుణ పరిపూర్ణ యనియును వ్యక్తీకరించుటకే "సీతా" యనెడి పదము ప్రయోక్తమైనది. పుట్టినది నాగేటి చాలు

నందేయగుగాక ! కాని ! ధర్మబద్ధనియమ సమన్విత జీవిత విధానమున మనుగడ సాగించు మహర్షితుల్యుడైన జనకుని కనుసన్నల బెరిగినది సీత. కావుననే యామె మెట్టినింట పుటము బెట్టిన పదునారవవన్నె బంగారపుగుట్టలనే వెలయింపగలదు. కులమునే పరిపూత మొనర్పగలదు. ఉభయ వంశముల యశోవైభవ ప్రాభవముల కాలవాలముగ నిలువగలదు. కావుననే జనకుడు పరువమును - గరువమును వెలువరించుచు "మమ సుతా" అనుట జరిగినది. భర్త యెచట నున్ననేమి? ఏమొనర్చుచున్న నేమి? ధర్మాచరణమున వెన్నంటి యుండెడి దీక్షయు, భక్తిప్రపత్తులును జానకియందు విరాజిల్లుచుండెనని వివరించుటకే "సహధర్మచరీ తవ" అని చెప్పబడినది.

ఇట్టి సుగుణాలకుప్పను-లావణ్యరాశిని హృదయపూర్వకముగ స్వీకరించి మమతతో సమాదరింపుమని శ్రీరామునకు సూచించుటకే "ప్రతీచ్ఛ చైనాం" అనెడి పద ముపయోగింపబడినది.

"భద్రం తే" అను పలుకు సీత నర్ధాంగిగ స్వీకరించుట వలన సకలశుభములు సమకూరునని సూచింపబడుచున్నది. వివాహమునకు పాణిగ్రహణము అను పదము నిజమైన అర్థవంతమైన నామాన్తరము. 'నీ చేయూతనిమ్ము. నీ చేతితో నామె చేతిని కలుపుము అవి రెండు నొక్కటే. పత్ని పాణిని నీ పాణితో పరిగ్రహించి పరస్పరసహకార బలమున ముందునకు

సాగి యెల్లెడల నొకరికొకరు కొండంత అండగనుండి చల్లగ కాలము గడపవచ్చును. సర్వసుఖముల ననుభవింపవచ్చు' నని హెచ్చరించుటకే శ్రీరాము నెదుట జనకుడు "పాణిం గృహ్ణీష్వ పాణినా" అని ప్రవచించుట జరిగినది.

ప్రతి పదము రసోపేతము. ప్రతి పలుకు మహార్థ సమన్వితము. మహర్షి తుల్యుడైన మహనీయుడైన జనకచక్రవర్తి యొక్క గళసీమనుండి వెలికురికిన మంగళకరధ్వానములు గదా! అవి; అవి మంజుల మనోజ్ఞ నిక్వాణక్వాణము లెట్లు గాకుండును? ఆర్ష సంప్రదాయమున వివాహము కేవలముగ కామ పురుషార్థ పరిమితము కానేకాదు.

"తవ హృదయం మమ హృదయమస్తు
మమ హృదయం తవ హృదయమస్తు"

విభిన్నములై అపరిచితములుగనున్న రెండు హృదయములు- జన్మాంతర సంస్కార సుకృతబలప్రభావమున అభిన్నములై, సుపరిచితములై యేకత్వమునంది ధర్మసంరక్షణకొరకై యేక ముఖ దీక్షవహించుట పాణిగ్రహణ పరమాశయము.

చతుర్విధ పురుషార్థములలో మూడవస్థానము నందున్న కామము వివాహలక్ష్యములం దొకటియగు సత్సంతాన ఫల ప్రాప్తికి సాధనభూతమైన దగుగాక ! కాని పరిణయపరమాశయము ధర్మ నిర్వహణము మాత్రమే. ధర్మనిర్వహణ కుపక్రమణ

మొనర్చిన కల్యాణమగుటం జేసియే సీతారామకల్యాణము జగత్కల్యాణముగ విలసిల్లగల్గుచున్నది. పతిపత్నులకు పాదములు నాలుగు. వారు ధర్మవర్తనులగుటయే ఉభయవంశ శ్రేయోదాయకమైన యంశము. ధర్మము నాలుగు పాదములతో గమనము సాగించినపుడే సకల శుభములు సిద్ధించుననుటలోగల యంతరార్థ మిదియేకావచ్చును.

పాశ్చాత్యుల ననుకరించుచు నేడు మనవారు కొందరు ధర్మమును నాలుగు పాదములతో నడుపలేక శుభంకర సుందర వివాహబంధమును పవిత్రానుబంధముగ భావించలేక దైహిక సుఖమునకే ప్రాధాన్యమిచ్చి భ్రమలు పెంచుకొని - అనతి కాలముననే మమతలు త్రెంచుకొని విడాకులవరకు పరువెత్తుచున్నారు. మాంగల్యమహిమను చిన్నచూపు చూచుచున్నారు. ధర్మమును విస్మరించుచున్నారు. సహధర్మచారిణీత్వము నపభ్రంశ మొనర్చుచున్నారు. సాధ్వీత్వమునకు కళంక మాపాదించుచున్నారు. సుఖదుఃఖములు, మంచిచెడుల లోతుపాతుల దెలిసికొనజాలకున్నారు. మోహవ్యామోహమున మునిగి తేలుచున్నారు. "సీతాకల్యాణ" మహోదాత్త పరమార్థ మిట్టివారికి కనువిప్పు గలిగించుగాక! సీతామహాసాధ్వీత్వ మిట్టివారికి మేలుకొలుపగుగాక! శ్రీరామ హృదయారామ దివ్యప్రేమ సుమపరిమళ పంక్తు లిట్టివారి మనోమాలిన్యమును దుడిచివైచి సుగంధబంధురముగ వారి హృదయ నందనమును పరివర్తన మొనర్చుగాక!

చిత్తశుద్ధితో శిరసావహింపదగిన గృహస్థాశ్రమ క్రమము కలదు గదా! ప్రేమైకజీవులుగా సతీపతులా క్రమమునకు గట్టువడి యుండుట ముదావహము - శుభావహమునగు పవిత్రవిధియని యెల్లర కెఱుకపఱచునదియే సీతామతల్లి పావనగాథ. ఆర్ష నియమబద్ధమగు వివాహబంధము ప్రేమకు దివ్యత్వమును, మహోత్త్వమును సంఘటింపగలదు. పైపై మెఱుపుల మోజు నకు లోబడు వివాహము ప్రేమలో అల్పత్వము నుద్దీప్త మొనర్చును. ఆర్షధర్మసహితప్రేమ గాఢమైనది; శాశ్వత మైనది. తదితరము నిమిత్తమాత్రమైనది; తాత్కాలికమైనది. భౌతిక దైహిక వాంఛలకు నియమనిగ్రహములను కాపు బెట్ట గలదియే వాస్తవమైన కల్యాణము. జీవిత క్రమ వికాసమునకు, ధార్మిక భావ సముద్దీప్తికి సోపానముల జూపగల్గునదియే వివాహము.

శ్రీసీతారాముల చరిత్రాత్మక ప్రణయభావ సుందర పరమ పావన పరిణయలీల యట్టిది. ఆ లీలను ప్రతివత్సరము మనస్స్మృతిపథమున బ్రకాశింప జేసికొనుటకొరకై మనము గావించెడి మంచిప్రయత్నమే శ్రీసీతారామ కల్యాణమహో త్సవసమాచరణము. సీతారాముల శరీరములు వేరుగావచ్చును. వారేకత్వమునే ప్రకటించిరి. వారి యూహ యొక్కటే. వారి గమనవృత్తి యొక్కటియే. వారి ధర్మాచరణ విధాన వైఖరి యొక్కటియే. వేయేల! వారి జీవితము గూడ నొక్క టియే. వారి దాంపత్యవైభవము పూర్ణావతార పురుషవరి

మళ్ళై భూలోకమున వ్యాపించినది. ఆ సుగంధ మలముకొనిన ప్రాంతమంతయు మధురాహ్లాదమునే యనుభవించెను. మహానీయతనే యందుకొనగల్గెను. మహోజ్జ్వలతనే వెల్లివిరియించెను. వారిరువురు గాదు. సత్యముగ నొక్కరే. వారి చరిత్రలు రెండుగావు. యథార్థముగ నొక్కటియే వారి దివ్యచరిత్ర దెస లన్నింటిని తేజఃపుంజ రంజితముల గావించి దీర్ఘాయువు పోసికొనినది.

## వనవాసము

జానకి రామునితో అయోధ్యలో గడపినకాల మెంత యని పరిగణింప నవసరము లేదు. అది కొంతయే యగుగాక! చెప్పుకొన దగినంత కాకపోవచ్చుగాక ! కాని అదియంతయు హాయిగా స్థాయిగా గడచె ననుమాట మాత్రము తథ్యము. కారణము వారి దాంపత్యమునకుగల పవిత్రతయు, దన్మహిమయు నట్టివి.

మానవజీవితములో సుఖములతో బాటుగ కష్టముల యనుభవమును సర్వసాధారణమే. కాలము కలిసిరాకపోవుటన నదియే. కైకకు దురూహ యేర్పడుటయు - మంథరకు వక్ర భావన సముత్పన్నమగుటయు నట్టివే. పినతల్లి కోర్కె ననుసరించి - పితృవాక్య పాలనమును ధ్యేయముగ నెంచి రాముడరణ్యావాసమునకు బూనుకొనుటతో శ్రీమద్రామాయణకథ క్రొత్తమలుపు తిరుగును. జరుచున్న దంతయు మనమంచికేయని

భావించుట ధీరోదాత్త పురుషలక్షణము. కష్టములనుండి పిరికివాని వలె పారిపోవ సంకింపక నిబ్బరముగ నిలబడుటయే మహాత్ముల జీవితరీతి. ఇచట సీత వ్యక్తీకరించిన భావనలు పరమాదర్శపాత్రములు. పడుగు పేకలవలె నల్లుకొనిపోయిన వారి జీవితమును వేరువేరుగ విడదీసి పరిశీలించుటకు వీలుపడదు. శ్రీరాముడడవి కేగ సీత రాణివాసమున నుండునా? చంద్రుడున్నచోటనే చంద్రిక యుండుట సహజము.

తండ్రిగారి వాక్యమును సత్యబద్ధమొనర్చుటకై "నేనడవుల కేగుచున్నాను. నీవిచటనే ధైర్యమువహించి యుండుము. నేను కుశలముగ తిరిగివత్తును" అని సీతకడకరిగి శ్రీరాముడు పలికిన పలుకులివి. సీత యీసందర్భమునందెంత యుదాత్తముగ మాటలాడెనో! గమనించిన మనసు కరగును. వారి యన్యోన్యత యర్థమగును.

"రామా! తల్లిదండ్రులు, అన్నదమ్ములు, కొడుకులు, కోడండ్రు వారి వారి పుణ్యములను వారే యనుభవింతురు. వారి వారి భాగ్యములకు వారే భోక్తలగుదురు. పతిపత్నుల విషయ మట్టిది కాదుగదా! భర్త భాగ్యమును, పుణ్యమును సమానముగ ననుభవమునకు దెచ్చుకొనునది భార్య యొక్కతియే. మీరిట్లనదగదు. నే వినజాలను. మనము సహధర్మచారులము. నేను మీ అర్ధాంగిని. అర్ధాంగమును వదలి అర్ధాంగమెట్లు పయనింపగలదు? నేనుగూడ

సాగింపగలదు ? ధర్మబద్ధులగు దంపతులను విడదీయుట విధాత కును తరముగాదు. నా మనవిని మన్నింపుడు. నా కోరికను తిరస్కరింపకుడు. కోపద్వేషముల నిర్జించిన పరమశాంత మూర్తీ! అపకార మొనర్చిన పినతల్లిని సైత మాదరింపగల సహనము నీకున్నది. తనకొమరునకే రాజ్యము నిచ్చుకొన వలెనన్న యామె యభిమతమును సంతోషముగ నంగీకరించితివి. ఈసుగుణగణ ప్రకటన నీ సుచరిత్ర కెంతయు దగినదే. అందరివలె నీయందును కోపద్వేషాహంకారాసూయలున్న నింక విశేష మే మున్నది? అన్నియును బాగుగనే యున్నవి. నీవు గావించిన నిర్ణయమునుండి నిన్ను వైదొలగుమని నే ననబోవుట లేదు. నన్నిచటనే పడియుండు మనుటేమి యని మాత్రమే నే నడుగ దలచితిని. నేను నీవెంట నుండదగినదానను! కాదా! కాదని నీ వనజాలవు. అయిన నన్నింటనే వదలి వెళ్ళుటయనుట భీరుత్వమే యగుగాని ధీరత్వము కాదుగదా! బాగుగ నాలోచించి నిర్ణయింపవలసినదిగా ప్రార్థించుచున్నాను.

నే నేపాపము నెఱుగనిదానను గదా! నా కిట్టి కఠోర శిక్ష నేల విధింప బూనితివి? నిన్ను వదలి యేకాకిగ నుండుట కన్న నాకు మిన్నయగు దండన వేరొకటి యున్నదా? నాకు సర్వమును నీవే. నీ సర్వస్వమును నేనే. నా ఆనందమునకు సుఖమునకు కేంద్రము నీవే. నీ అనుభూతులకు, అభిరుచులకు లక్ష్యము నేనే. నీవు లేని నే నెక్కడ? నేను లేని నీ వెక్కడ?

ఊహించుటకుగూడ సాధ్యముగాని విషయమిది. భావించుటకు గూడ భయంకరమైన అంశమిది. ఆర్యపుత్రా! నీవు చెంతలేని తరి నాకమైనను నాకు నరకమే. నీవు జతజేరినపుడు వనమైనను రాజభవనమే. — భయ విషాద శోకములు ముప్పిరిగొన్నను గుండె దిటవు చేసికొని సీత పలికిన పలుకు లివి. అట్టి సమయమున సీతామహాసాధ్వివంటి ఉత్తమకాంతారత్నము మాత్రమే యిట్లు మాట్లాడగలదు. పొల్లుపోవనిరీతి–మనసు నొవ్వని పగిది మగని మానసమున జాలి జాలువారు చందమున భాషింప గల్గుట పతివ్రతా శిరోమణియైన సీతామహాసాధ్వికే చెల్లినది. ఆమె కేవల సీతగాదు. అయినచో ఆమె పలుకుబడి మరియొక తీరుగ నుండెడిది. ఆమె మహాసాధ్వి అగుటవలననే ఆమె మాటల యొరవడి యిట్లాదర్శప్రాయముగ గొనసాగినది.

శ్రీరాము డామెకు నచ్చజెప్ప నెన్నియో తెఱగుల యత్నించినాడు. సీత వినదలచ లేదు.

"భర్తుః పాదచ్ఛాయా విశిష్యతే"

భర్తృపాదముల నీడన నిల్చుటయే భార్య కర్తవ్యము. చిన్ననాటి నుండి కన్నవారు నన్ను తీర్చిదిద్దిన విధమిది. ఎన్నడో! నేను వారి కడ నేర్చుకొన్న పాఠమిది."

సీతా సంప్రార్థనము శ్రీరాముని చలింపజేయ లేదు. మరల మరల నామెను ప్రయాణవిముఖను గావింప పలురీతుల యత్నించినాడు. వనవాస క్లేశముల నేకరువు పెట్టినాడు. దట్టపు

టడవు లందనుభవింపవలసిన యిక్కట్టులగూర్చి వివరించినాడు. సీత మాత్రము వెనుకంజవేయునా? అన్నియు విన్నది. తుద కిట్లన్నది.

"అగ్రతస్తే గమిష్యామి మృద్నంతి కుశ కంటకాన్"
"నాథా! నేను నీకంటె ముందునడచుచు నీ గమనమునకు ప్రతిబంధకములుగ నుండెడి లూనదర్భ సముచ్చయమును, ముళ్ళపొదలను తొలగించివైచి మీకు మార్గమును సుగమమొనర్తును.

అచ్చపు పాతివ్రత్య బలము పలికించిన పలుకు లివి. వినయ విధేయతా భావ మాధుర్య సంపన్నములయిన జానకి పలుకులను విని రాముడు విచలితుడైనాడు. సీతకుగల భర్తృ పాదసేవపట్లగల ప్రగాఢభక్తికి ముగ్ధుడయినాడు. శ్రీరాముడు నిశ్చేష్టుడై మౌనముగ నుండుట గమనించి సీతామహాసాధ్వీ రత్నము మరల నిట్లు వాకొనసాగినది.

'మనోహరా! నన్ను నీ వెంట రానీయ నొల్లవేని నాకీ బ్రదుకేల ? నాకీ అంతఃపు రానంద నివాసమేల? రాజ్యసుఖానుభవమేల? అనల మున్నది! గరళ మున్నది! దేనినో యొక దాని నాశ్రయింతును. వానికేని దయగల్లదా? అవియేని అనుగ్రహింపవా?''

నిరాశా భరితములైన ధరాసుత వాక్యములు రాముని గుండెలను పిండుచున్నవి. కాని! అంతమాత్రముననే ఆయన అంగీ

కారముగ తలనూచెడి సూచన గన్పించుటలేదు. ఆయన పట్టుదలయే యట్టిదో! కాక! అదియొక పరీక్షయో! తర్జనభర్జనల యనంతరముగాని, తథ్యమిథ్యా వాదముల పిమ్మటగాని సత్యము బహిర్గతముగా నేరదు. తరచిన తరువాతనే కదా వెన్న కన్నుల బడునది.

శ్రీరాముని యుపేక్షాభావము, మౌనము, సీతకొకింత బాధనే కల్గించినవి. ఆమె మనస్సు చురుక్కుమనినది. ఆమె అభిమానవతియైన జనకపుత్రి. అనుకూలవతియైన శ్రీరామ చంద్రుని అర్ధాంగి.

ఆమెలో అభిమానము పెరిగినది. ఆత్మఘోష హెచ్చినది. పతి యెడబాటునే సతి సహింపగలదు? భర్త యనంగీకార వైఖరినే భార్య భరింపగలదు? ఆయన తనను వీడునట! తానయోధ్యలో నుండవలెనట! సహధర్మచారిణియగు తనకీ పలుకులు ములుకులు గావా! మానినీమణిగా తోడివారిచే మన్ననలందుకొన్న తా నీ వియోగము నోర్వగలదా? ఓర్చి మనగలదా? మనసు చిక్కబట్టుకొనినది. గుండెకు దిటవు దెచ్చుకొనినది. ఆమె రాముని దెస నలవోకగ జూచినది. సాహసించి పరుషముగ నిట్లన పాగినది.

"కిం త్వా మన్యత వై దేహః పితా మే మిథిలాధిపః
రామ జామాతరం ప్రాప్య స్త్రియం పురుషవిగ్రహం."

"రామా! నీవు గొప్పధైర్యశాలివని నాతండ్రి భావించినాడు.

తానే! యింత పిరికివాడవని ఆయన కలనైన దలంచియుండడు. కూతురి నొంటరిగ వదలి అల్లుడడవులకు వెళ్ళెనని మిథిలాధిపతి యైన నాతండ్రి విన్నచో పురుషాకృతిలోనున్న స్త్రీని నా కూతురు పెండ్లాడెనని భావించును.

పరవళ్ళు ద్రొక్కుచు గుండెను వ్రయ్యలు గావించు చున్న సీతాదుఃఖజలధి కట్టలుద్రెంచుకొని చెలియలికట్టదాటి బయటపడినది. వేదనాత్మకమైన హృదయసంఘర్షణనుండి సముద్భూతమైన వాక్యపరంపర యింత నిశితముగ నుండునని మహాకవి సూచించుచుండెనేమో!

ఒకే దేహమునకుగల కుడి యెడమ భాగములవంటి వా రనదగిన భార్యాభర్తలు విడిపోవవలసినపుడు వచ్చెడి మాట లిట్లుండును గాబోలు. గాఢప్రేమ బద్ధ మానస మిట్లు పదు నైన భావములను విసరును గాబోలు. కావుననే "జాయా పత్యోర్న్న విభాగః" భార్యాభర్తలు విడివడుటకు వీలు లేదని ఆపస్తంబు డనినాడు. భార్యాభర్తల పవిత్ర ప్రేమబంధము మిక్కిలి పటిష్ఠమైనది. ఈపవిత్రబంధమునకు ప్రతీకయే అర్ధనారీ శ్వర భావమును ప్రస్ఫురింపజేయు పార్వతీ పరమేశ్వరరూప విలాసము.

మరల సీత తన యభిమతమును సమర్థించుకొనుచు భాషింపసాగినది. "హృదయేశ్వరా! శైలూషుని పగిది తన యర్ధాంగిని పరుల సంరక్షణకు వదలి నిశ్చింతగ నుండువాడు

పురుషుడగునా? అట్టివానినిగూడ నీవు పురుషమాత్రునిగ నెంచిన నెంచుదువుగాక! నేను మాత్రము పరపురుషుల యాశ్రయమునం దుండుటకుగాని, వారి రక్షణ నభిలషించుటకుగాని లవలేశమేని సమ్మతించను. నిన్ననుగమించుటయే నా విధి. నీ వెన్నంటి నేనున్న లోటేమున్నది? పవిత్రమై-స్వచ్ఛమై-పాలవలె ప్రకాశించు సుక్షత్రియ వంశమున నే జన్మించినాను. తత్త్వవేత్తలకే తలమానిక మనదగిన రాజర్షి జనకుడు నా జనకుడు, స్వాతిశయ మనుకొన్న- వాస్తవముగ నభిమానమనెడి యుగ్గుబాల బలమున పెరిగి పెద్దయైనదానను నేను. భారతస్త్రీ ధర్మమును పరిశీలనాత్మకముగ పసితనమునుండియే నే నలవరచుకొంటిని. ఇక్ష్వాకువంశ క్షీరజలధికి పున్నమి చందమామ యనదగిన శ్రీరామభద్రుని యిల్లాలినైన నాకు నేడు క్రొత్తగ స్త్రీ ధర్మము లెవ్వరును బోధింపవలసిన యవసరము లేదు. వాని యందు శిక్షణ పొందవలసిన పని యంతకన్నను లేదు. నీతో వనవాసము విధిలేక చేయుటలేదు. పరాప్రేమ వహించి-వలచి నిశ్చలముగ నిలిచి-నీతోపాటుగ గొనసాగింప నిర్ణయించుకొన్న వనవాస మాయాసజనక మెట్లగును? నీ సన్నిధి నాకు పెన్నిధి. అది లేకున్న తరి నాకు మిగులునది వేదనయే. అది యున్న సమయమున భీకరారణ్య సీమలు సైతము ప్రియతమ సుందర సుమారామములే కాగలవు. నామనవిని మన్నించుడు. నన్ను వెంటగొనిపోవుట కంగీకరించుడు. నా ప్రార్థన సఫలమొనర్పుడు".

ఉదాత్తత, నమ్రత, ప్రేమ, స్వాభిమానము సమరీతిలో నుట్టిపడు తెలుగున జానకి యీపగిది శ్రీరాముని సన్నిధిలో తన యుత్కంఠను సమగ్రముగ విశదీకరించినది. ప్రగాఢ ప్రేమతో బాటుగ-అర్ధాంగిగ తనకుగల యధికారమునుగూడ సీత తన పలుకులలో ప్రతిధ్వనింప జేసినది. తాను వెంటవచ్చి తీరవలసిన యవసరమును విపులముగ విశదీకరించినది. అందు విన్నపముతో బాటు విధ్యుక్త ధర్మముగూడ సుస్పష్ట మగునట్లు నిర్ద్వంద్వముగ నిర్వచించినది.

భార్య కట్టి స్వాతంత్ర్యముకలదని శాస్త్ర ముద్ఘోషించు చున్నది కదా! ఆమె యీ స్వాతంత్ర్యమును సవ్యమైన ధోరణిలో సానునయముగ విదితమొనర్చినది. గుర్తునకు దెచ్చినది. గుండె కుదిలించి పతిముందు కుప్పబోసినది.

కాని రాముని యెదలో కదలిక యిసుమంతయేనియు గన్పట్టలేదు. సుదృఢాభిప్రాయము నాయన మార్చుకొన నిచ్చగించడాయెను. జానకి మనస్సును నొప్పించియైనను తన యుద్దేశమునే యమలుపరచవలెనని యాయన యభిప్రాయము. రోగి యూహ కనుగుణముగ నౌషధ మొసగుట వైద్యుని ధర్మమెన్నటికిని గానేరదు. కారాదు. వ్యాధిగ్రస్తున కనిష్టమైన దే యగుగాక - రోగనివారణశక్తిగల మందునే ఫలితసాధన కొరకు భిషగ్వరుడు ప్రయోగించి తీరవలెను. స్వీకరించుటకు చేదుగనున్నను- రసమిశ్రితమైన దఘ్నునను తుదకు గరళము

నైనను సందర్భోచితముగ సాహసించి వైద్య ముపయోగించి తీరవలసిన యవసరము తొక్కొక్కప్పు డేర్పడును. చికిత్సకు డట్టి సమయములలో వెనుకాడరాదు.

సీత పరిస్థితి యిపుడట్లున్నది. ఎంతగ ప్రార్థించినను, ఎన్నివిధముల అభ్యర్థించినను, ఎన్ని ధర్మసూక్ష్మముల జ్ఞప్తికి దెచ్చినను మారని మనసుతో మాటలాడుచున్న మగని విషయమున సీత పరుషముగ పలుకవలసివచ్చినది. కఠినోక్తులతో కసరుకొనక తప్పలేదు. కావుననే హెచ్చరికలయినవి. ఎత్తిపొడుపులు వచ్చినవి. ములుకులవంటి పలుకులు పలుకుటారంభమైనది.

జానకి హృదయమున నాథునిపట్ల గౌరవభావ మించుకేనియు లేదు. ధర్మనిర్వాహణదీక్షలో తాను భర్తపాదసన్నిధి యందుండవలెనను నదే యామె పరమాదర్శము. మనోధవుని యెడగల యత్యంత గౌరవాదరముల పరిణామమే యది. ఎట్లేని తన యాశయమును ధవుని మనఃఫలకమున ప్రతిబింబింపజేయగల్గుటే—స్మృతిపథమున మెరయజేయుటే యామె పరమలక్ష్యము. కావుననే సీత యట్లు మాట్లాడినది. కాదు కాదు. పరిస్థితులట్లు మాట్లాడించినవి.

రాము డేమనగలడు? మారుపలుకుటకు మార్గమున్నదా? తనపౌరుషము నామె శంకించుచు నిశితముగ విమర్శించినను శ్రీరాము డాగ్రహించలేదు. సీతామహాసాధ్వి శీలసంపద

యామహావీరుని మనసున కింపును ఘటించినది. ఆమె వెలువరించిన సాహసాత్మక సంభాషణా చాతుర్యమునకు - ధైర్య సమన్విత భావధోరణికి విస్తుపోయినాడు. విభ్రమాశ్చర్య చకితుడైనాడు. వినియు విననివాని పగిది శిరఃకంప మొనర్పుచు స్థిరహృదయమున నిలిచినాడు. ప్రత్యుత్తర మొసంగుట కాయనవద్ద సముచిత సమాధాన మున్నదా? వాదనలతో నామెను మెప్పించుటకు దగినభాష యున్నదా? క్రోధమా! పెరుగదు. ప్రేమయా! తరుగదు. ద్వేషమా! జనించదు. రోషమా! సముద్భవించదు. నిస్తరంగ నీరధివలె నయినది రాముని హృదయము.

ఆసమయమున శ్రీరాముని మానసమును కించిన్మాత్రమేని సహించగలస్థితిలో సీత లేదు. ఆమె మనస్సు తీవ్రముగ వేగిరపడుచున్నది. ఆశించిన అంగీకార మొక్కటే యిప్పుడామె కూరట గల్పింపగలదు. అది లభ్యమగునా! తన కోరిక ఈడేరునా! తన యభిమతము ఫలించునా! ఏమగును? ఏమో!

అది యామె హృదయమున మెదలుచున్న సందేహడోల. ఈడోల యాగునా? అట్లే యూగునా! ఇదే యామెను కలవరపరచుచున్న యంశము.

భర్త తనను వెంటగొని పోవుటకు సమ్మతింపడేమో! అట్లయిన నిక తన యావేదనకు హద్దుగలదా? అప్పుడింక చేయనగిన దేమి? అట్టిపరిస్థితి నే యెదుర్కొనవలసివచ్చిన తన

కింక మిగులున దేమి? అట్లని మిన్నకుండు టెట్లు? మిన్నకుం డక వాకొనదగినది మిగిలి యే మున్నది?

ఆస్థితిలో స్త్రీ యేమియు చేయలేదు. చేయజాలదు. ప్రయత్నము లన్నియు నిష్ఫలములుకాగా, కర్తవ్య శూన్యయై బావురుమనును. గుండెల పొదివిపట్టుకొని కొండంత ఆశతో నున్న యామె కోర్కె ఫలింపదనెడిశంక జనింపగనే అది హృదయ కుహరమునుండి దూసుకొని రోదనరూపమున వెలి కురుకును. జానకి విషయమున గూడ నట్లేయైనది. కాంతలు తమ మనోహరుల యంతరంగములను సమూలముగ సంచ లింపజేసి - తమ యాకాంక్షలను సాధించుకొనుటకై సాగించిన సర్వప్రయత్నములు విఫలములుకాగా - బలముకొలది గుండెల మీదికి సూటిగ జూచి ప్రయోగించెడి చివరి యాయుధ మదియే. అయోనిజయయ్యును సీత యుగధర్మానుసారముగ సామాన్య మానవకాంతవలె చివరి కీసాధనము నే శరణుజొచ్చినట్లున్నది.

"ఇతి సా శోకసంతప్తావిలప్య కరుణం బహు
చుక్రోశ పతి మాయస్తా భృశ మాలింగ్య సస్వరమ్."

బిగ్గరగ నేడ్చుచు గాఢోత్కంఠతో పతి నాలింగనము జేసికొని తనను వెంటతీసికొని పొమ్మని వేడుచున్నది సీత. ప్రయాణశ్రమ నవలీలగ నోర్తు నన్నది. భోగములమాట తల పున కేని రానీయనన్నది. దుర్గమారణ్య సంచార సమయమున నెదురయ్యెడి క్రూరమృగ భయంకర రావములకు జంకనన్నది. వెంటవచ్చుట కనుజ్ఞ యొసంగిన జాలునన్నది.

దుఃఖావేశ పరితప్తహృదయయైన సీత నయనయుగళము నుండి అశ్రుకణపంక్తి అరణినుండి యగ్నికణములు రాలునట్లు రాల నారంభించినవి. సరోవరమునుండి వెలికి పెరికి వేయబడిన సరసిజము మండు టెండకు మాడి వాడిన చందాన - ఆనారీ శిరోరత్నముయొక్క ముఖపద్మము విషాదాతిరేకమున విలవిల లాడి కళాకాంతుల గోలుపోయినది.

ఆమె యప్పటిస్థితి బహుశః ఆమెకే తెలిసియుండదేమో! ఆమెమనస్సున మరియొక యాలోచనకే తావులేదేమో! భర్త వెంట వెళ్ళి తీరవలెననెడి బలమైన భావన యొక్కటే ఆమె గుండెల లోతులలో పరచుకొని నిండి పోయినది.

స్మృతివిహీనయైన తెఱగున చేష్టలుడిగి దైన్యస్వరూపిణిగ దుఃఖితయై నిల్చియున్న జానకిని గనినంతనే రాముని హృదయము ద్రవించినది. ఇక నామె నుపలాలన మొనర్ప కాలసించు టుచితము గాదనుకొనినాడు. క్షణకాలమేని యుపేక్ష వహించిన సీతస్థితి యేమగునో! యనెడి జంకొదవినది శ్రీరామునకు. తడవుసేయుట తగదనుకొనినాడు. నిరాకరించుట విరమించుకొనుటయే మంచిదనియెంచి, ఆమెను తనవెంట గొనిపోవ సంతోషముగ సమ్మతించుటే యుచితమని భావించినాడు.

"జానకీ! సగూఢములు- నిగూఢములునగు నీ యభిప్రాయముల గుర్తింపలేక నీకు వ్యథ గలిగించితిని. నీ కానం

దము నందింప లేని యేపనియును నాకు రుచింపదు. నా అడుగు జాడల నీడల నీవు యథేచ్ఛముగ నడయాడ నీ కథికారము కలదు. నన్ను నడపగలశక్తి నీకే కలదు. కారణాంతరములచే కఠినముగ వలదని శాసించితిని. కాని కర్తవ్యము పునరాలోచన మొనర్చిన యనంతరము నిన్ను వెంటడీసికొని వెళ్ళుట కే నిశ్చయించుకొంటిని. బేలవై యిక జాలిగొలుపు లీల విచారమున దేలియాడవలసిన పనియే లేదు. నీయభిమతము ఫలించెగదా!" యనుచు విషణ్ణవదనయైయున్న సీత నూరడించి నాడు శ్రీరాముడు.

దుఃఖోద్వేగమున సీత రాము నాలింగన మొనర్చుకొని నది. కారుణ్యాభావమున పరితాపతప్తయై పడిపోవనున్న తరి సీతను బాహువులతో పొదివిపట్టుకొని ధైర్యముగూర్చినాడు రాముడు. ఈయాలింగనము - పొదివిపట్టుకొనుట యనునవి భారతీయ సంప్రదాయ సమ్మతములా! అనెడి ప్రశ్న రావచ్చును. కాని! అట్టి ప్రశ్న వాస్తవముగ తలయెత్తరాదు. రాదగని సమయ మది. వచ్చినచో నీఘట్టమున శృంగార భావన ద్రష్టలకు కాదుగదా - కనీసము శ్రోతలకు సైతము కలుగ బోదని - కలుగుటకు వీలు లేదని నిస్సంశయముగ చెప్పవచ్చును. ఇచ్చటిస్థితి శృంగార దృశ్యమునకు సాభాసయే. యథార్థముగ శృంగారచర్య కాదిది. ఇచటి పరిస్థితి కరుణరస మున కాలంబన మగునుగాని కామమున కాలంబనము కాజాలదుగదా! కావున నిట్టియూహ కిచట తావే లేదు.

స్త్రీస్వాతంత్ర్యమును గూర్చి ముక్తకంఠమున నుద్ఘోషించెడి నేటినాగరక ప్రపంచము భార్య కఠినముగ విమర్శించిన దట్టుకొని కరుణ నొలికించి గౌరవింపగలదా? భార్యల మందలింపులలోగల పరమార్థమును గుర్తెరిగి వినీతభావులై మన్నింపగల భర్త లెందరుందురు?

చేతులు చేతులు కట్టుకొని లజ్జవిడిచి వీథులవెంట విశృంఖల విహారమొనర్చెడి స్త్రీపురుషులు పరస్పర ప్రేమాభిమానపూర్ణహృదయులై ఒకరి యాలోచనను వేరొకరు గౌరవించుకొనుచు జీవించుచున్నారా? అట్లు తిరుగుటే స్వాతంత్ర్యమా? ఒకరి యభిప్రాయమునగల యౌచిత్యమును వేరొకరు మన్నించుట నేర్వని స్వాతంత్ర్యమున కర్థము గలదా?

సీతామహాసాధ్వి పవిత్రచరిత్రమనెడి దర్పణమున తరతరములవా రీసత్యమును తిలకింపగలుగుదురుగాక! భారత మహిళాలోకము జానకిగాథలోగల యాంతర్యమును గుర్తించి సముచిత స్వాతంత్ర్యసిద్ధికి పాటుబడునుగాక!

సీత రాముని వెంట వెళ్ళవలెనని ప్రగాఢభక్తితో ప్రవిమల ప్రేమతో నేమేమియో పలికినది. ఆ పలుకులలో భాషావిషయికమైన పారుష్యమేగాని మనోగత కాఠిన్యము మాత్రమును లేనియు గన్పట్టదు. ఆ కాఠిన్యముగూడ ధర్మకార్యసాధనకొరకై సందర్భానుసారముగ దెచ్చిపెట్టుకొన్నదే. కాని స్వభావసిద్ధమైనది కానేరదు.

మార్దవ మామెకు నేస్తము. "కర్కశత్వ"మను పలు కామె యెన్నడు వినియుండ లేదు. పాతివ్రత్య సిద్ధాంతమున కామె పెట్టనికోట. మానవలోకమున వెలసిన దివ్యాంగన. పతిప్రియ. పతి క్షేమార్థము వ్రతము లాచరించుటయందే మనస్సును నెల కొనజేయు పతివ్రత.

కావున నేకైక ధర్మవ్రతుని గావింప రామునితో నామె పలికిన పలుకు లవమానకరము లనుకొనరాదు. అవి పతి హృదయ బాధకములుగావు. ధర్మకార్య ఫలసాధకములు. ధర్మనిర్వాహణమున సీతారాము లిరువురు నొకరికన్న మిన్నగ వేరొకరు తహతహపడువారే. సమయసందర్భముల ననుసరించి యీ ఘట్టమున ఆందోళన, ఆక్రోశము, తహతహ చెందవలసిన వంతు సీతకు వచ్చినది. అంతే.

కష్టసహిష్ణుత సీతకు లేదనెడి వేదనతో రాముడు రావ లదనినాడు. జానకిపై ప్రేమ రామున కపారముగనే యున్నది. ఆమె వియోగము నాయన మాత్రము సహింపగలడా!

ఈ సన్నివేశము నందలి యౌచిత్యము నిట్లు సమర్థించు కొనవలెను. సత్యగర్భితమైన యంశమునకు సమర్థన వాస్తవ ముగ ననవసరమే. కాని సూక్ష్మాతిసూక్ష్మ విషయ విపులీకరణ కిట్టి వివరణ యవసరము.

ధర్మసమ్మతములైన దంపతుల యభిప్రాయము లేకము లయినవి. వా రిరువు రేక మనస్కులై వనవాస క్లేశములను,

కష్టనష్టములను సమముగ సహించుచు సంతోషముగ కాలము గడుప సాగినారు.

అరణ్యముల కేగుటకు ముందుగ సీత—

"అంచితయంతీ త్రీన్ లోకాన్
చింతయంతీ పతివ్రతమ్
శుశ్రూషమాణా తే నిత్యం
నియతా బ్రహ్మచారిణీ
సహరంస్యే త్వయా వీర
వనేషు మధుగంధిషు"

"రామా! లోకత్రయ వ్యవహారముల గొడవ నాకేల ? నియమ యుక్త పాతివ్రత్యముతో బ్రహ్మచారిణిగా నిరంతరము నీసేవల గావింతును. మధుగంధిలములైన వనములలో నీతోబాటుగ క్రీడింతున"ని యనినది.

ఇందామె సుదృఢభావనయు ధర్మదీక్షయు మనకు సువిశదమగును. ఇట్టి మహాసాధ్వీ శిరోరత్న మనదగు సీత పయనించిన బాటలో భారతస్త్రీలోకము పురోగమించెడి పుణ్యకాలము వచ్చుగాక! నియమనిష్ఠలతో స్వధర్మమును మహిళలు నిర్వహింపమూనుటకు సీతాచరిత్రము రాచబాట యగుగాక! విశ్వమునకే వికాసము నందింపగల ఉదాత్తవర్తనతో మగువలు దేశసౌభాగ్యమును, గౌరవప్రతిష్ఠలను సంఘటింపజాలు తెగువగల వారగుదురుగాక!

# అత్రిమున్యాశ్రమ సందర్శనము

ఆత్మశక్తి సంపన్నుడైన మునికులాగ్రణి అత్రిమహర్షి. ఆయన ధర్మపత్ని అనసూయ. సీతారాములాముని ఆశ్రమమునకు విచ్చేసిన తరి - అనసూయ సీతను మన్నన చేసినతీరు మహోన్నతమైనది. అనసూయవంటి మహాసాధ్వియొక్క అభినందన లందుకొనుట కెట్టియర్హత యుండవలెను?

కావుననే జానకియు చరిత్రలో మహాసాధ్విగ నిలువగలిగినది. సీతను చూడగనే అనసూయలో ప్రేమప్రపూర్ణ గౌరవభావ మతిశయించినది. మరుక్షణముననే సీతాపాతివ్రత్య మాహాత్మ్యము నామె లెస్సగ గుర్తింపగల్గినది. ముందుగ సీతా మాంగళ్య రక్షణము నాకాంక్షించి- ఆమె సీత కొక విధమైన అంగరాగమును సమర్పించి స్వీకరింపుమని కోరినది.

ఈ అంగరాగ ప్రభావబల వైభవమే-అరణ్య సీమలలో లంకానగరమున-దుష్టుల దౌష్ట్యమునుండి, ప్రమాదముల బారి నుండి సీతను రక్షించుకొనుచు వచ్చెను.

తదుపరి యొక దివ్య మాల్యమును, వస్త్రాభరణములను సీతకొసగి- అనశ్వర యశస్సంపన్నవు గమ్మని అనసూయ ఆదరణపూర్వకములైన దీవనలు నిచ్చినది. శ్రీరామభద్రునకు సకల భద్రముల సమకూర్చెడి నిజమైన సహధర్మచారిణివిగా విరాజిల్లగల శుభాకాంక్షల దెల్పినది.

ఒక మహాతపస్వి యర్ధాంగి - ఒక మహత్తర పాతివ్రత్య బలప్రభావ సమన్విత - సాధ్వి చేసిన మన్ననలు - సలిపినదీవనలు సీతకు నిత్యశుభదాయకము లయినవి.

తమ యాశ్రమమునకు దర్శనార్థమై యరుదెంచిన పుణ్యదంపతులపై అత్రిమునిచంద్రుడు చల్లనిచూపుల జల్లుల గురియించి 'శుభమస్తు'ని మౌనముగ నేదరహాస రోచులతో వారిని ధన్యుల జేసినాడు. శ్రీరామునితో నేమేమియో ధర్మసూక్ష్మములు మాట్లాడినాడు. మాటలమధ్య ప్రస్తావవశమున నెంతెంతగనో ధర్మప్రబోధ మొనర్చినాడు. అత్రిదంపతుల దర్శనభాగ్యముతో సీతారాముల గుండెలకు కొండంత సత్తువ సమకూరినది. అమందానంద మకరందము వారిచేతుల కందినది. మహర్షి యనుజ్ఞగైకొని సీతాలక్ష్మణ సమేతుడై శ్రీరాముడు దండకారణ్యమున ప్రవేశించినాడు.

## సీత ధర్మావేదనము

సీతారాములు దండకలో ప్రవేశించి శరభంగ మహర్షిని దర్శించి - సుతీక్ష్ణుని జూచి, యనుమతిం గొని యరణ్య ప్రయాణమును గొనసాగించుచున్న సమయమున-సీత శ్రీరాము నుద్దేశించి యిట్లు పలికినది. పలికిన పలుకులన్నియు తేనెచినుకులు - స్నిగ్ధములు - హృద్యములు - శ్రవణానందకరములు.

"ఆర్యా! అరణ్యవాస ధర్మము మహత్తరమైనదే. దీనిని మనము నిస్సంశయముగ నిర్వహింపవలసినదే. ఇది విధివశమున

మనకు సంప్రాప్తమైన యొకానొక ధర్మదీక్ష. ఈదీక్షకు మనము త్రికరణశుద్ధిగ బూనుకొనినాము. కామము వ్యసనత్రయమును రెచ్చగొట్టును. ధర్మదీక్షా నిర్వహణతత్పరు లయిన వా రీత్రయమున కతీతులుగ నుండవలసియున్నది. అప్పుడే దీక్ష యొక్క పరమార్థము సాధ్యము కాగలదు. మిథ్యావాక్య పరదారాభిగమన వైరరహితరౌద్ర ప్రకటనలు మూడును వ్యసనత్రయముగ పరిగణింపబడుచున్నవి. వీనిలో - అసత్యభాషణ మను దానిని భూతవర్తమానకాలములలో నీ వెరుగవు. భవిష్యత్తున నీ కది పట్టువడదు. ధర్మ విధ్వంసకారకమైన పరస్త్రీలోలత నీకు మనస్సునందే కాదు- స్వప్నమందును కలుగబోదని నే నెరుగుదును. సత్యసంధుడవై స్వదారానురాగ మగ్నమానసుడవై పితృనిర్దేశ పాలనాపరతంత్రుడవై శోభిల్లు నీయందు సత్యధర్మాది సకల సద్గుణసంపదలు సుప్రతిష్ఠితములై యున్నవి. జితేంద్రియుడ వగుటవలననే నీ వీసుగుణజాలమును ధరియించి కనుసన్నల నడిపించ గల్గుచున్నావు. వైరభావరహితరౌద్ర మొక్కటియే యిపుడు నిన్నాశ్రయించి యున్నది. పరప్రాణహరణ ప్రేరణాత్మక తృతీయవ్యసన మిది. దండకలో ప్రవేశింపగనే ఋషుల యభ్యర్థనపై రణమున రాక్షసమారణ మొనర్తునని ప్రతిజ్ఞబట్టినావు. మునీంద్రులు గౌరవనీయులే. పరిరక్షణీయులే. కాని! రక్కసులు నీపట్ల నిరపరాధులేగదా ! వైరరహితరౌద్ర ప్రకోపముతోడ వారిపై విజృంభింపనేల ? తమ్మునితోడ కోదండపాణివై దండక జొచ్చుటయు - ఋషుల కిట్టి

వాగ్దానము నిచ్చుటయు-రాక్షసులపై నిర్హేతుకముగ కచ్చెబట్టుటయు నాకు నచ్చలేదు. నీ శీలమునకు, ప్రవర్తనమునకు ముగ్ధురాల నగుచున్న నా మనస్సు ఏలనో యివి యన్నియు జేయివెట్టి కలచివైచుచున్నవి. ధనుర్ధరులై యెదిరింప నుంకించు వనచరులపై బాణపరంపర గుప్పించుటలో తప్పులేదు. శరచాపములు చేతనున్న క్షత్రియునకు-ఇంధనములు చెంతనున్న హుతాశనునకును తేజోబలము మిక్కిలిదీప్తిని గూర్చునను మాట తథ్యమే. అగ్ని కాశ్రయమిచ్చిన పదార్థము తానే దగ్ధమై పోవురీతి- అకారణముగ కరవాలమునకు పనిగల్పించిన మనుజుడుగూడ అపాయము పాలుగాక తప్పదు.

స్నేహభావముకొలది నీవు నాయెడ ప్రత్యేక ప్రేమాభిమానముల బ్రకటించుచున్నావుగాన- చనవున సాహసించి- మీకు గుర్తునకు దెచ్చుచుంటినే కాని మీకు తెలియని విషయములు బోధజేయుటకొరకు కానేకాదు. చేయదగినంత విజ్ఞతయు నాకడలేదు. కాని! ఎంతగ నాలోచించినను నీవు సలుపనెంచిన రాక్షస మారణకృత్యము మాత్రము మంచిది కానేరదు. రాక్షసులు నీ కపకృతి యొనర్చిరా? లేక నిన్నెదిర్చిరా? ఏదియును లేదు. కానినాడు నిర్హేతుకముగ వారిని నీ దారుణ కరవాలమున కెరగావింప నుంకింపనేల? ఇందుకు నాహృదయము సమ్మతించుటలేదు. సందర్భశుద్ధిలేని సాహసకార్యమునకు నీవు సన్నద్ధుడవు గావలదని నామనవి.

వనముల జరించెడి క్షత్రియు లెవ్వరేని ఆర్తరక్షణకో, ఆత్మరక్షణకో ఆయుధముల నెత్తవచ్చును. కత్తులు దూయ వచ్చును. పౌరుషప్రదర్శనకు పరిధి యంతవరకే. హద్దుమీరి యుద్ధమునకు సంసిద్ధపడుట యనుచితమే కాగలదు.

రామచంద్రా! మనము వచ్చినది వనములకు - త్యజింప వలసినది శస్త్రము. ప్రస్తుతమునకు ప్రదర్శింపరానిది క్షాత్రము. తలదాల్పవలసినది తపము. వన మెక్కడ? శస్త్ర మెక్కడ? క్షాత్ర మెక్కడ? తప మెక్కడ! పరస్పర విరుద్ధవిషయములు గావా యివి? వీనికి సమన్వయము గుదుర్పవలసిన తరుణమా యిది? ఎవ్వరైనను వారివారి ఉనికికి మనికికి ననుగుణమగు ధర్మమునే దేశాచారమును పాటించి యాచరింపవలసి యుండును. ఆయుధధారణమువలన అనార్యమైన కలుషబుద్ధియు, కార్పణ్య దృష్టియు, హింసాప్రవృత్తియు, సాత్త్విక భావనివృత్తియు కలుగును. దీక్షపూర్తియై వనవాసము పరిసమాప్తమై అయోధ్యకేగిన యనంతరము క్షాత్రధర్మావలంబన మొనర్చ వచ్చును. బాహుబల ప్రదర్శనము గావింపవచ్చును. ఒక మహాదర్శముకొరకై రాజ్యపరిత్యా మొనర్చి- అరణ్యావాసమునకు సిద్ధపడి ఋషిధర్మమును స్వీకరించిన తరి రజోగుణమును విజృంభింపనీయరాదు. మునివలె కాలక్షేప మొనర్చుట కర్తవ్యము. ధర్మమది. ధర్మాచరణమే అర్థలాభ సిద్ధికి మూలము. సుఖము ధర్మమువలననే సముత్పన్నమగును. సర్వమును

ధర్మము మూలముననే సిద్ధించును. నిజము చెప్పవలసి వచ్చి నచో జగత్తంతయు ధర్మసారమే.

సౌమ్యా ! నీకు తెలియనిది లేదు. తపోవన మిది. ధర్మ సమాచరణమే కర్తవ్యము. స్త్రీ చాపల్యమున పదేపదే చెప్పు చున్నాను. నీవు నీ సోదరునితో గూడ సమాలోచన మొనర్చి సముచిత ధర్మ నిర్ణయమును నీవే యొనర్చుకొని సమాచరణకు గడంగుము. నీకు ధర్మములు విశదీకరింపగల వాడెవ్వడు?"

జానకి పలికిన సాధువాక్యము లివి. ఇట్లు చెప్పుట కెంతటి పరిజ్ఞానము కావలెను? ఎంతటి యుక్తాయుక్త విచక్షణ కావ లెను? ఎంతటి సుశిక్షణ కావలెను? ఎంతటి గుండె నిబ్బరము కావలెను? ఎంతటి వివరణశక్తి కావలెను? ఎంతటి చనువు కావలెను!

మాట్లాడునది రామునితో- ఇపు డాలోచింపుడు. మాట్లాడువ్యక్తి స్థాయి యెంత యున్నతముగ నుండవలెనో ! ఉదాత్తముగ నుండవలెనో! సుస్పష్టముగ నర్థమగును.

అన్నియును గలవు కనుకనే సీత మాట్లాడ దొడగినది. చనవు దీసికొనినది. సాహసము జూపినది. క్రమమును పాటిం చినది. భావమును పదనుగ భాషతో మెదిపినది. కథనమున కాఠిన్యమును కనిపింపనీయక లాలిత్యమునే ద్యోతక మొనర్చుచు లాలనగ భాషించినది. మల్లెలు రాల్చినది. ముల్లల గురియిం చినది. ధార్మిక పారిజాత ప్రసూనాల నెత్తావుల విరియించినది.

కర్తవ్య ప్రబోధాత్మకములైన గులాబీలగుత్తుల మొత్తములను గ్రుమ్మరించినది. అట్లు సీత చెప్పుచుండుటవలననే రాముడు వినినాడు. వినునది రాముడు గనుకనే సీత చెప్పినది. వారిరువురు సీతారాములు గనుకనే వారి సంభాషణాసరళి యట్లు సాగినది. వారిలో సీతపేరు ముందుండుటవలననే యామె ముందుగ చొరవ దీసికొనినది. చెప్పదగిన యంతస్థుగల దివ్య వనితారత్నము గనుకనే చెప్పబూనినది. చెప్పిన విషయము లన్నియు ధర్మసమ్మతములు-యోగ్యతమములు-వాస్తవమునకు సన్నిహితములు గనుకనే ఆమె 'సీత' గాక సీతామహాసాధ్వి యైనది.

సీత వాకుృచ్చిన దంతయు శ్రీరాముడు శాంతముగ సాంతముగ వినినాడు. సతి తనయెడ జూపిన ప్రేమాతిశయము నకు - జనకవంశమునకే కాక, యిక్ష్వాకు వంశమునకు గూడ వన్నెను వాసిని పెంచునట్లుగ బల్కినపలుకులకు పరవశుడై నాడు. సీత వినిపించిన సుదీర్ఘము సహేతుకమునగు సూచన రామునకు నచ్చినది. కాని! తాను చెప్పవలసినదియును గొంత కలదు. జానకి తనయాలోచనల నేతీరున బరిగణించునో గమనింపవలసియున్నది. ఆమె వాడిన భాషగాని, ప్రకటించిన భావములుగాని శ్రీరామున కెట్టి క్రోధమును గలిగింపలేదు. మీదుమిక్కిలి భార్యపట్ల యాయనకుగల యాదరణ భావము ద్విగుణీకృతము గూడ నయినది. తనలో తానొకవిధముగ పారవశ్యము ననుభవించెననియు జెప్పవచ్చును.

కాని! యిట్లని మిన్నకుండుటకు వీలు లేదుగదా! కావున నే అర్ధాంగి యంతరంగమున సముద్భూతములయిన యాలోచనాపరంపరల కొకప్రత్యుత్తరము నొసగవలసిన బాధ్యత యొకటి రాముని కిపుడెదురైనది. ఆయన మాట్లాడ నారంభించినాడు.

“తస్వీ! లోకుల పీడను నివారించుటకే భూపతి చాపధరుడు కావలెనని నీవే చెప్పియుంటివి. దనుజుల క్రూరకృత్యముల సహింపజాలక సంశ్రితవ్రతులగు సంయమీంద్రులు స్వయముగవచ్చి నన్ను శరణువేడుట, సాయము గోరుట నీకు తెలియని విషయములా? ధర్మనిరతులైన వారు దానవ దౌష్ట్యముల భరింపజాలక విలవిలలాడుచుండుట నీవు గమనించలేదా!

మాంసాశనులు వరానుల హాతమార్ప నుంకింప మనల నాశ్రయించుట నీకు గుర్తున్నదికదా! వారి కభయప్రదాన మొనర్చియున్నాను. మాటతప్పుట మాన్యమా? జీవితమునైన త్యజింపనగును గాని సత్యమును విస్మరింపదగదే! ప్రియసహోదరుడైన సౌమిత్రినైన గోల్పోవుట కిచ్చగింతునుగాని చేసిన ప్రతినను విడనాడుట జరుగనిపనియే. మునీంద్రులాపన్నులై యున్నారు. కోరినను కోరకున్నను వారిని గాపాడ కంకణమూనుట క్షాత్రమే. నీవు నాసహధర్మచారిణివి నా ప్రాణముల కంటె మిన్నవు. కాని! నీకన్న మునివరేణ్యుల కొసగిన అభయవాక్యపాలనమే నాకు మిన్నయని – ఉభయవంశ గౌరవ కారణ

భూతురాలవగు నీవు గమనింపవలసియున్నది. ఈవిషయమున రెండభిప్రాయము లనునవి లేనేలేవు. రానేరావు. నాదారి అదే. నీదారియు నదియే. కాని! నాపట్లగల యనురాగాతిశయమున నీ వట్లనుచుంటివి. మనము చేయనున్నది మహోజ్జ్వల ధర్మకార్యము. మనము సాగింపనున్నది - మహర్షిబృంద సంరక్షణాత్మక మహోదాత్త నిరుపమకృషి. మనము నడువనున్నది - యెవ్వరేని యెవ్విధముగనేని వంకలు దిద్దుటకు, చూపుటకును సాధ్యముగాని సత్పథము. మనలక్ష్యము పరమ పవిత్రము. మన ధ్యేయము ధర్మవీర రసోజ్జ్వలము. మనగమ్యము క్షత్రియ కులానుకూలము. నీవు శంకలు మానవలయును. జంకును వీడవలయును. న న్నీధర్మయజ్ఞ దీక్షకు పురికొల్పవలయును. సహధర్మచారిణివిగా నిలిచి సత్ఫలితములను సాధించుటలో సహకరించవలెను.”

శ్రీరాముని ధీర గంభీర వచనముల మహిమ యేమియో! ఎట్టిదో! జానకి పూర్ణాంగీకార సూచక మందహాసముతో శిరమునూపి వందన మాచరించినది.

ఈసంఘటన క్రూరులపట్లగూడ సీతకుగల కరుణార్ద్ర దృష్టిని వ్యక్తమొనర్చుటతో బాటుగ రామునకుగల స్వధర్మ దీక్షాపరతనుసైతము సుస్పష్టమొనర్చుచున్నది. సీతామహాసాధ్వి కోమల మనః ప్రవృత్తియు-శ్రీరాముని దీనజనావనభావనయు నహమహమికతో పోటీలుపడిన సన్నివేశ మిది.

సీత యొక్క యడుగు వెనుకకు వైచినది. అనగా ధర్మమున కొదల వంచినది. రామునకు సత్యమైన సహధర్మచారిణి కాగలిగినది. ఆమెది మంకుపట్టుగాదు. మౌఢ్యము నామె యభిమానించదు. కావుననే యెచటి కచట మనకనులముందు సీత మహాసాధ్విగ ద్యోతకమగుచుండును. కంటకావృత కీకారణ్య మధ్యభాగములలో కాంతునితో సంతోషముగ పయనమును కొనసాగించిన దామె. ఆపదలలో ధైర్యము నామె విడనాడలేదు. సాహసమును ప్రదర్శింప వలసివచ్చినతరి సంభ్రమాశ్చర్యచకిత కాలేదు. రాముని వెన్నంటి నడచినది. రాక్షసుల మాయలను నిర్భయముగ నెదుర్కొన్నది. అదియొక మహత్తరమైన యాత్మశక్తి విశేషమే. రక్కసులు సీతారాముల నెన్నియో దౌష్ట్యములకు గురిగావించిరి. కాని! రాముడు పురోగమనమును విడనాడలేదు. సీత తిరోగమన దృష్టిని ప్రదర్శింపలేదు.

సంఘర్షణాత్మకమునైన రాక్షస దుశ్చర్యలలో పతాకస్థాయి నందుకొన్నదే మారీచుని యింద్రజాలము. సీతాపహరణార్థము రావణుడు వేసినయెత్తిది. ఈచదరంగమున నొకముఖ్యమైన పావుగా రావణునిచే మారీచు డుపయోగింపబడినాడు. తత్పరిణామమే బంగరులేడి సమాగమనము.

సౌందర్యలాలస మానసలగు స్త్రీలకు కొన్ని సందర్భములలో యుక్తాయుక్త విచక్షణ యుండదు. మానవ స్త్రీసహజ

మైన యీచాపల్యమున కద్దము బట్టుటయే సీతకు బంగరు లేడిపై భ్రాంతి యేర్పడుట. కాకున్న కనకమృగము కలదా! అనెడి యోచన రావలదా? అట్టి యూహవచ్చుట జరుగదు. కాంక్ష బలీయము. కాంతా మనోగతాభిరుచుల దీర్ప సమ కట్టుట కాంతుని కర్తవ్యము. లోకమునగల సంప్రదాయమది. కావుననే సీతకోర్కెపై రాముడు మాయామృగము వెంట బడినాడు. కురంగము ముందునకు ముందున కురుకుచున్నది. శ్రీరాముడు తీవ్రగమనమున దాని నందుకొన యత్నించు చున్నాడు. చూచుచు జూచుచుండగనే శ్రీరాముని కనక మృగము చాలదూరము గొనిపోయినదట! ఈ సన్నివేశమును దక్షాధ్వర సమయమున హరిణము వెంట బరువెత్తెడి హరుని వలె శ్రీరాము డపుడున్న ట్లుపమించుట మహాకవి వాల్మీకి యతిలోక ప్రతిభ కొక మచ్చుతునక. రావణ సంహార మహా కార్యక్రమమునకు బంగరులేడివధ బలిహరణము వంటిది. రావణుడు రాక్షస చక్రవర్తి. లేడిరూపమున నున్నవాడు దుష్టమారీచ రాక్షసాధముడు. మృగదేహమున మెసలెడిది మారీచుని యాత్మయే గదా! లేడి హతముకాగా మిగిలిన మారీచ హృదయము మనుష్యస్వరమున మరల నొక మాయా జాలమునే సీతారాములపై విసరినది. "హాసీతా! హాలక్ష్మణా!" అనెడి రాముని గళమునుండి వెలువడినట్లున్న యార్తనాద ప్రసారమే యా దుష్టరాక్షసుడు విసరిన వల యనుకొనవలెను. స్థిరచిత్తుడు - ధీమంతుడు - పురుషసింహమునగు శ్రీరాము

డా వలను జీల్చి వేయగలిగినాడు. కాని! సీత మాత్ర మావలలో స్త్రీసహజ భీరుత్వ విశేషమున దగుల్కొననే తగుల్కొన్నది. మారీచాక్రోశము సీతా మానససరోవరమును కల్లోలపరచినది. ఆమె శ్రీరామప్రియ. ఆమె కాయనయే పంచప్రాణములు. మోజుపడి శ్రీరాముని సాహసమునకు బురికొల్పితినేమో! యనెడి యాలోచన వచ్చినది. ఆమె దుర్బల యైపోయినది. ఇంద్రియములు వశముదప్ప సాగినవి. సుస్పష్టముగ వినిపించినది నిశ్చయముగ నాథుని కంఠస్వరమనియే యనుకొనుటవలన నామె యావేదనయు, నాందోళనయు హద్దుల నధిగమించినవి.

"అతిప్రేమిా విపచ్ఛంకీ' ఆప్తులపట్ల మనకెందముల దోబూచులాడెడి అతిప్రేమ విపత్తును శంకించుట సహజమే.

మిన్ను విఱిగి మన్నుపై బడినప్పటికిని యన్న విపన్ను డగుట జరుగదని సౌమిత్రి కెఱుకయే. ఆయన నిబ్బరముగనే యున్నాడు. చైతన్యస్రవంతివలె నాలోచించుచున్నప్పటికిని యతనిలో గనిపించెడి స్తబ్ధత సీతకు సహింపరానిదై నది. అంతయు వినియు నులుకక పలుకక నచటనే స్థాణువువలె నిలిచి యున్న సౌమిత్రి వైఖరి జానకి యోర్పును పరీక్షకు గురిజేసినది.

లక్ష్మణుని స్థితి యిప్పట్ల నత్యంతశోచనీయమైనది. అన్న బంగరు లేడిని గొనివచ్చుట కేగుచు సీతాసంరక్షణ బాధ్యతను తమ్మునిపై బెట్టినాడుగదా! శ్రీరాముడు వచ్చువరకు వదిన గారిని కన్నులలో నిడుకొని కాపాడవలసిన బాధ్యత తనది.

మధ్యలో నెదురైన విపరిణామము లిట్లున్నవి. అది రాక్షస మాయ సుమా ” యని చెప్పి యొప్పించి సీత నూరడింపగల శక్తి లక్ష్మణునకు చాలినంతగ లేదు. ప్రయత్నము చేయక పోవలేదు. లక్ష్మణుని సర్దుబాటు ధోరణి జానకికి మరింత శంకా పాదక మైనది.

సీత సహనమును గోల్పోయినది. శ్రీరామ క్షేమగత సర్వప్రాణయగు జనకసుత లక్ష్మణునిపై విరుచుకొనిపడినది.

కర్తవ్య నిర్వహణ దీక్షయు - ధర్మాచరణ తత్పరతయు గూడ నొక్కొక్కప్పు డిట్టే దుష్పరిణామములకు దారితీయుచుం డును. లక్ష్మణునిపని యట్లయినది. తెఱమఱుగునగల సత్య స్వరూపము యవనిక తొలగిన యనంతరముగదా! వ్యక్త మగునది. కావుననే విశ్వాసపాత్రుడు, సహోదరుని భంగి సమాదరణీయుడునగు సౌమిత్రి జానకి కన్నులకు మహాపరాధి వలె గన్పట్ట సాగినాడు. కుంభించిన స్వార్థముతో కులుకుచున్న వాని పగిది సాక్షాత్కరించినాడు. పరిస్థితుల ప్రభావ మట్టిది. లక్ష్మణు డేమిచేయగలడు ? జానకి యెట్లు మిన్నకుండగలదు ?

“సౌమిత్రీ ! రాముని యార్తనాదమును వినియు - మీ యన్నగా రాపదలో నున్నారని గుర్తించియు మిన్నకున్న నీ స్థితి నాకవగాహన గాకున్నది. త్వరితముగ బోయి సోదరుని కాపాడుకొనవా? నీ వాలసించుట కంతరార్థ మేమి?”

సీతపలుకులలో కాఠిన్యము కన్నుల నుఱుముచున్నది. పారుష్యము పరవళ్ళు ద్రొక్కుచున్నది. లక్ష్మణుడు పెదవి కదలింపలేని స్థితి యందున్నాడు. కదలించు టెట్లా! యని కలత జెందుచున్నాడు. కదలింపకున్న నేమగునో! యని కల వరపడుచున్నాడు.

లక్ష్మణుడు మాటలమనిషి గాడు. చేతల వ్యక్తి. సేవా భావము గుండెలలో పరువులు దీయుచుండ అన్నవదినల పద పల్లవముల నర్చించుకొనుటకొరకై తనకుగ తానే అభ్యర్థించి-అంగీకారమును సంపాదించుకొని అన్నగారివెంట అడవులకు వచ్చినతమ్ముడు. సమయము క్లిష్టభూయిష్ఠమైనట్టిది. అన్న బంగరులేడికొఱ కరుగుచు వదినను వదలి కదలవలదని యాన పెట్టినాడు.

కర్తవ్య నిర్వహణ మాచరించుటయా? కాదని వాద మునకు దిగక సీత యాదేశించిన రీతి తత్క్షణమే బయలుదేరి అన్న కంఠస్వరము వినిపించిన వంక కరుగుటా! అన్న కేమిటి? ఆపద సంభవించు టేమిటి? ఇది జరిగెడిపనియా! ఇందుకొరకు తాను బయలుదేరవలెనా! అగ్రజు డాచరింపనేరని మహాకార్య మున్నదా? ఉన్నచో తా నద్దానిని నెరవేర్పగలడా? నెరవే ర్పగల్గు టెట్లున్నను ప్రస్తుత మొంటరిగ వదినగారిని వదలి యెట్లు వెళ్ళగలడు? వెళ్ళిన అన్నగారిమాట జవదాటినట్లే యగునుగదా! వెళ్ళకున్న సీత శోకసంతప్తహృదయయై

తనపై విరుచుకొని పడునట్లున్నదే! కర్తవ్యమేమి ? గమ్యము తెలియని పథికుడై నాడు లక్ష్మణుడు. కావుననే పెదవి కదిలింప జాలిన శక్తి యాయనకడ పూర్తిగ లోపించిపోయినది.

జరుగుచున్న యాలస్యమును జానకి సహింపలేని స్థితిలో నున్నది. ఆమె మస్తకమున బహుముఖాలోచనలు పరుగులెత్త జొచ్చినవి. కోపము నాపుకొనలేనిస్థితి క్రిమముగ పెరుగ నారంభించెను. లక్ష్మణునివైపు చుఱచుఱ జూచుచు కర్ణకఠోర భాషణముల నామె మరదిని నొప్పింప బూనుకొనినది.

"లక్ష్మణా! నీ దురాలోచన నాకర్థమైనదయ్యా! గోముఖవ్యాఘ్ర రూపమునందున్న నిన్ను కొమరునివలె నభి మానించుటచే నాపని కొరవితో నెత్తి గోకికొనినట్లయినది. నీ అన్నగారి ఆపదనే నీవు కాంక్షించుచున్నట్లున్నావు. నాయెడ నీకుగల దుష్టవ్యామోహము - పాశవికదృష్టి నాకు బాగుగనే యర్థమగుచున్నవి. చాలుచాలు. నీ విక నేమియు జెప్పవలదు. కించిత్తేనియు మీయన్నగారికి సాయపడవలసిన యవసరము నీ కిక లేదు. కాముకుడవు - లోభాక్రాంత చిత్తవృత్తివియునగు నీ మొగము జూచిన మహాపాతకము లంటును. నీకోరిక నాకర్థ మైనది.

"ఇచ్ఛసి త్వం వినశ్యంతం రామం లక్ష్మణ! మత్కృతే
లోభాన్మమ కృతే నూనం నానుగచ్ఛసి రాఘవమ్."

నాయెడగల ప్రలోభ ప్రభావమున – మహాపదయందున్న యన్న రోదనము వినియు నిర్విచారముగనున్నావు.

"వ్యసనం తే ప్రియం మన్యే స్నేహో భ్రాతరి నా స్తితే!
తేన తిష్ఠతి విస్రబ్ధః తమ పశ్యన్ మహాద్యుతిమ్."

"అన్నపై నిక్కముగ నీకు ప్రేమ లేదు. గౌరవము సున్న. నీవు దుర్వ్యసన పరుడవని – వ్యసనమే నీకు పరమాభిమత విషయమని నేను గుర్తింపజాలితిని."

సీత పలుకులు వినిన లక్ష్మణుడు నిర్విణ్ణుడైనాడు. తన వదిన తనను గూర్చి యిట్లు పలుకునని యేనాడును తాను తలచి యుండలేదు. శరీరము జలదరించినది. మనసునం దొక విధమైన కంపర ముదయించినది. గద్గదస్వరమున సీత కిట్లు విన్నవించసాగినాడు–

"పూజ్యురాలా! దేవ దానవ మానవ సంఘమునం దొక్కరును శ్రీరాముని జయింపజాలరు. మాయన్న పరాక్రమము ముందు పరుల శక్తిసంపద యెంత? ఎవ్వరికేని మాయన్న నెదిరించి నిలువజాలిన ప్రజ్ఞ గలదా? నిలిచినవారు గెలిచిపోవగలవారా? ఎవ్వడో దుష్టుడు మాయన్న కంఠస్వరము ననుకరించుచు మన కిట్టియాందోళనమును గలిగించినాడు. నాకు దెలిసినంతలో నీయరపు నరచినవాడు మారీచుడై యుండవలెను. నాయూహ నిక్కమే కావలెను. నాపలుకులను విశ్వసింపుము. రాముని కెట్టి యాపదయును రాదు. రాబోదు.

నేను నిన్ను వదలి రామున కేదో సాయపడవలెనని పరువులెత్త పూనుట మిక్కిలి యవివేక కార్యమే కాగలదు. నీవు నన్ను నిందింపవలదు. బయలుదేరుమని బలవంతపరుపవలదు. మాయగ్రజుని యాజ్ఞనుల్లంఘించిన దోసమునకు నన్ను గురిసేయవలదు. నిన్ను సేవించుకొనెడి మహాభాగ్యమును వదలుకొని వెళ్ళుమని నన్ను శాసింపవలదు. లక్ష్మణు డెన్ని విధముల సంప్రార్థించినను సీత మనస్సు మారలేదు. రోషకలుషితమానసయగు సామాన్య మానవకాంత లీల కర్ణకఠోర దూషణభాషణాలతో సౌమిత్రిని తీవ్రవేదనకు గురిచేయుచునే యున్నది. "అనార్య! నృశంస! రాముని కష్టము నీకిష్టము. నాభర్తకు జరిగెడి యప్రియమంతయు నీకు ప్రియము. నీకు రాముని గురించిన బాధ లేదు. ప్రేమశూన్యహృదయము నీది. భరతునితో చేతులుగలిపి గుప్తముగ నీవాడుచున్న నాటకమంతయు నాస్మృతిపథమునకు వచ్చినది. నాకంతయు దెలిసినది. ఎంద రేకమై యెదిరించి యభీష్టముల సిద్ధింపజేసికొనవలెనని కలలుగన్నను మీకోరికలు నెరవేరవు. నన్ను స్పృశించుట కేని మీతరముగాదు. మీకుట్ర బయల్పడెనుగదా! నీవింక మాట్లాడవలసినదియును లేదు. నేను వినవలసినదియును లేదు. నీదారిని నీవేగవచ్చును. పెడదారిబట్టిన వారితో నాకు పని లేదు. దారిదప్పని నాకు ధైర్యమే కొండంత అండ. నా ఆశయమునకు సర్వదా విజయమే.

సౌమిత్రి మనమున బాధయు, కోపము రెండును పొంగినవి. వినగూడని మాటలు సీతనోట వినవలసివచ్చునని యాత

డూహింపలేదు. పరిస్థితి చేయిదాటుచుండెనని గుర్తించి తానును కొంతపరుషముగనే వాకొన దొడగినాడు. చురుక్కు-మనిన మనస్సునుండి యీ క్రిందిపలుకులు దూసుకొని వెలి కురికినవి.

"అమ్మా! నీవు నన్ను పార్థ మొనరించుకొంటివి. అన్యాయముగ దూలనాడితివి. నన్ను నీ విట్లాడిపోసుకొనుట నామనస్సున కెంతయో కలతగలుగ జేసినది. శ్రీరాముని యాజ్ఞ మేరకు నేనిచట కట్టుపడి యుండవలసివచ్చినది. అన్న అడుగుజాడలదప్పి నడువనేర్చు టెరుగని నన్నిట్లు దుష్టస్వభావుడనని తూలనాడుదువని యనుకొనలేదు. కానిమ్ము. విధి యిట్లుండుటచే నీచేత నిట్లు పలికించినది.

సకలదేవతలును తేజోరూపమున నిన్ను సంరక్షింపవలసినదిగా నేను ప్రార్థించుచు - నీయాజ్ఞమేరకు శ్రీరామచంద్ర పాదారవిందముల సన్నిధి కేగుచున్నాడను. నీ కోరిక ప్రకారము బయలుదేరక యిచటనే యుండి కర్ణశూలములైన వాక్యముల వినుటకంటె - పాపమో! పుణ్యమో! అన్నగారి వద్ద కేగుటయే మేలని నిశ్చయించుకొంటిని. పలుకో దుర్నిమిత్తములు నా కెదురగుచున్నవి. అయిన నగుగాక! నేను బయలుదేరుటకే నిశ్చయించుకొంటిని. నేను వచ్చువరకు వనదేవతలు నీరక్షణభారమును వహింతురుగాక! అన్నతో తిరిగివచ్చి నిన్ను సేవించుకొనుచు కాలము గడపెడి భాగ్యము నాకబ్బునుగాక!"

అని వచించుచునే లక్ష్మణుడు సీతకు త్రికరణశుద్ధిగ నమస్కరించి తక్షణమే బయలుదేరి వెడలిపోయినాడు.

పిమ్మట గాని తాను కోపావేశమున నిర్దోషియు - నిర్మలాత్ముడునగు మరదిని నిర్హేతుకముగ నిందించితినని సీత గమనించ లేకపోయినది. ఆవేశ మట్టిది. అది యెట్టిపని నేని జేయింప గలదు. మరెట్టి క్రూరవాక్యముల నేని పల్కింపగలదు. పలికిన వారు పలుకులలో వ్యక్తమొనర్చిన పలుకుదనమునుగూర్చి తదనంతరము పరితపించిన ప్రయోజనమేమి? ఆకులు చేతులు కాలకముందే పట్టుకొనవలెననెడిది ప్రబల ప్రమాణవాక్యము. కాని! చేతులు కాలినవెనుక ఆకులబట్టుకొనిన చందమైనది అప్పటి సీతవ్యవహారము.

భర్తృక్షేమాభిలాషతో శ్రీరామున కాపదకలిగెనేమో! యనెడి శంక సముత్పన్నము కాగానే సీత వివేకమును గోల్పోయి యావిధముగ బల్కినది. ప్రమాదవశమున పలికినపలుకులు దారుణములని గుర్తించుటకు వీలుండవచ్చును. కాని దిద్దుకొనుట కవకాశము కలుగదుగదా!

ఈస్వయంకృతాపరాధ ఫలము ననుభవించుటకే సీత రావణునిచే నపహరింపబడినదేమో! తనకర్తవ్యమునకు ప్రాణి తానే భోక్తయగును. సీత విషయ మట్లయినది.

లక్ష్మణుడు బయలుదేరగనే యొంటిగనున్న సీత నపహరింప పరివ్రాజక వేషధారియై రావణు డటకు వచ్చినాడు.

పంచవటిలో పరివ్రాజక స్వరూపముతో రావణుని దుశ్చర్య ప్రారంభమగుట సీతయొనర్చిన నిరపరాధ దూషణఫల మన జెల్లునా ? రావణుని దుర్మార్గములకు పరిపక్వదశ సమీపించు టనవచ్చునా! మాయావులు నమ్మదగిన వేషముల దాల్చి లోకమున విహరింపగలరు. చేయదలచిన దారుణమారణకాండను నిర్దాక్షిణ్యముగ గొనసాగింతురు. ఇట్టి వంచనాశిల్పము లోకమున కొంతకాలముమాత్రమే నెగ్గుకొనివచ్చును. దొంగవేసములతో నందరి నెల్ల వేళల నమ్మించుట యెంతటి గొప్పమాయావులకేని యలవిగాని పనియే. అది తుదకు వారి పతనదశకే హేతుభూతమగును. దైవము వారిని తప్పక శిక్షించును. వారు పరాభూతులు గాకతప్పదు. రావణుడు పరివ్రాజక వేషమునే ధరించుట కొకప్రత్యేక కారణమున్నది. భారతజాతి జీవనమునకు మూలపురుషుడు సన్న్యాసి. మునులన్న సమస్తప్రాణికోటికి గౌరవము మిన్న. ఆవేషముమాటున యెన్నిదుష్కృత్యముల నాచరించినను, నీచములకు పాల్పడినను లోకము మన్నించును. విశ్వసించును. పవిత్ర మునివృత్తిని పాపకార్యములకడ్డుపెట్టుకొన్నవా రెట్టియుత్కృష్టమైన నటన సాగించినను చివరకు నికృష్టులు గాకతప్పదు.

**రావణు డా తెఱగు నవలంబించి పంచవటికి చేరినాడు.**

సూర్యచంద్రులు లేని అపరసంధ్యాసమయమును మహాతమస్సు హఠాత్తుగ నావరించినట్లు రామలక్ష్మణులు లేనివేళ-

ఆశ్రమస్థయగు సీతామహాసాధ్విని తమోగుణ ప్రపూర్ణుడగు రావణు డనూహ్యపరిస్థితులలో సమీపించి మోసగింప నుంకించి నాడు.

ఈయద్భు తోపమానము వాల్మీకికవిచంద్రుని మనోహర వర్ణనాత్మక వైదుష్య వైభవమున కొక సాక్ష్యము. శ్రీకృష్ణ జనన సందర్భమును గూడ విష్ణుపురాణ మిట్లే అత్యంత రమణీయముగ వర్ణించినది.

వేదములలో పలురీతుల పవిత్రతమముగ నభివర్ణితమైన సంధ్యాసమయము నిక్కముగ పవిత్రమైనట్టిదే. పరమసుందరమైనట్టిదే.

అతిలోక రామణీయకముతో నయనముల చకితమొనర్చు సీతాసౌందర్య వైశిష్ట్యమునుగాంచి రావణుడు ముగ్ధుడైనాడు. మరల వెంటనే నిబ్బరించెను. ధరించిన వేషమున కనుగుణమగు బ్రహ్మఘోష మొనర్చుటతో నతని పాపకృత్యము ప్రారంభింపబడినది. "ఔపనిషద మావర్తయేత్" బ్రహ్మఘోష మొనర్చుట సన్న్యాసుల సహజప్రవృత్తి. ఆధ్యాత్మికమార్గమున జరింప సహకారకముగనుండి యోగీంద్రులను తరింపజేయ వినియోగింపదగిన వేషఘోషలను రావణు డిట్టి దుష్కార్యమున కుపయోగించుకొనినాడు. సీతయందమున కూగుచున్న డెందమున రేగెడి భావపరంపరల నెట్లో యణచుకొనుచు నామె నపహరించుకొనిపోవుటకు తగిన తరుణము నన్వేషించుచున్నాడు రావణుడు.

"కమలానాం శుభాం మాలాం పద్మినీవహి బిభ్రతి" అని యతడు భావించినాడు. సీత పవిత్రతరంగిణి. ఆమె తారుణ్యా లావణ్యకాంతులు నదీ తరంగపంక్తులు. ప్రవాహమున కడ్డుకట్ట వైచి యద్దానిని తన యానందమున కుపయోగింప నుద్యమించు చున్న స్వార్థపరుడైన ఖలుడు రావణుడు. న్యాయముగ నది యున్నత్రస్థితి. వేషవిశేషము నరసి రావణుని నిజయతిగనే సీత భ్రమించినది. ఎవ్వరేని యట్లు విభ్రాంతులగుట సహజమే. అతిథిగ వచ్చిన యతిని పూజించుట గృహస్థుల పరమధర్మము. భారతీయ సంప్రదాయము. బ్రహ్మవాదివలె నటించుచు బ్రహ్మ చర్యమునకు విరుద్ధమైన కాముకదృష్టితో పాపకార్యాచరణ మునే పురుషార్థముగ నెంచిన రావణున కీప్రాచీనాచారము చక్కగ నుపయోగపడినది.

తొలుత సీతతో సాధుసంభాషణమునే ప్రారంభించినాడు. క్రమముగ నది కాముకప్రలాపము క్రిందికి దిగినది. చెట్టు చెడు కాలమునకు కుక్కమూతి పిందెలు పుట్టునను టిదియే కాబోలు.

"సీతా ! నీచక్కదనము నామానసమునకు చక్కిలి గింతలు పెట్టుచున్నది. నా యథార్థరూపమును జూడుము. గ్రహించితివా ! నేను పరివ్రాజకుడనుగాను. నీకొరకై పరిత పించుచు నిన్ను నాదానిగ జేసికొనదలచి వచ్చిన లంకా సామ్రాజ్య చక్రవర్తిని. రావణుడను. నీవు నాకర్ధాంగివి గావల యును. నిత్య నిరతిశయానంద సుఖమరందధారల నిన్ను దని

యింతజేయు బాధ్యత నాది. నామాట కాదనవలదు. కాదని మూర్ఖించి వ్యర్థముగ చెడవలదు. రావణుని పలుకులు వినుటతో పరివ్రాజక వేషముమాటున దాగియున్న పాశవిక కిరాతకమూర్తి సీత యెట్టయెదుట సాక్షాత్కరించినది. ఛీ! యనుకొనినది. సన్న్యాసము నెడగల గౌరవాతిశయమును కాలరాచినది. రావణుని తీవ్రముగ గర్హించినది. లక్ష్మణుని నిందించి బలవంతముగ వెడలనంపినందులకు దగినప్రాయశ్చిత్తము ననుభవించుచుంటినని పరితపించినది. సమయము మించిన తదుపరి యేమనుకొనిన నేమి ?

అయినప్పటికి నామెధైర్యము వహించి "తాను పతివ్రతననియు తనయెడ నిట్టి పైశాచిక ప్రకృతి ప్రకటన మాచరించుట క్షేమకరము కాజాలదనియు వివరించినది.

రామరావణులు సింహజంబుకముల వంటివారనియు, కాంచనలోహములకు గల తారతమ్యము వారినడుమ గలదనియు, చందనపంకములకున్న వ్యత్యాసము – గరుడవాయసములకున్న వైవిధ్యము రామరావణుల యెడగలదనియు, బలవంతముగ నన్నుగొనిపోయి వశమొనర్చుకొనుట నీకు సాధ్యముగాని విషయమనియు సీత నిర్భయముగ రావణునియెదుట వక్కాణించినది.

అట్టి ప్రయత్నమునకు గడంగి హతుడవు కావలదని హెచ్చరించినది. రావణుని హృదయాంతరాళములు తూట్లు

పడునట్లు తీక్ష్ణతరముగ గర్జించుచు బల్కినది. మర్మచ్ఛేదకము లయిన యీములుకోలు మాటలతో రావణుని యెడద బ్రద్దలగు నట్లు పల్కినది. కాని! వాని కివి యొక లెక్కయా? వేషము తన పౌరుష్యప్రకటన కడ్డుగ నుండుటచే కొలదిగ తటపటాయించి నాడు. కోపము నాపుకొనలేని స్థితి పెరిగినది. విజృంభమాణ మహాట్టహాస సంరంభముతో బాహువుల నొక్కపరి చాచి, సీతా పరిసరములన్నియు దద్దరిల్లు పగిది యామెను తనరథము పయి బెట్టుకొనినాడు. బుధుడు వియద్వీథిలో రోహిణిని బట్టి నట్లు సీతను రావణుడు పట్టినాడు. దుష్టశక్తుల విశృంఖలవిహార మది. వెనుకముందు లరయక సౌమిత్రివంటి సజ్జనుని తూలనా డిన కారణముగ నేర్పడిన విపరీత విపత్కర పరిస్థితి యది. ఏమైన నేమి?

సీతయును గుండె దిగజారి గొల్లుమన లేదు. తా నొంటరి పాటున నుంటినే యనియును-మహాపద సంభవించెనే యనియు నదర లేదు- బెదర లేదు.

ఆ సమయమున గూడ నట్టిధైర్యస్థైర్యముల ప్రకటించుట సీతామహాసాధ్వివంటి స్త్రీరత్నమునకే చెల్లును. "సర్వనాశ నమునకు సంసిద్ధుడవై నన్నిట్లు చెరపట్ట నుంకించిన నిన్ను నా పాతివ్రత్య మహాగ్ని భస్మ మొనర్చి తీరగలదని రావణు నామె శపించినది. శ్రీరామునే స్మరించుచు గుండెకు దిటవు గూర్చు కొనుచున్నది. ఆమె నిర్భీకత, నిశ్చలత, రామునివంటి క్రూర

రాక్షసుని సైతము విస్తుపోవజేసినవి. మహాశక్తి సంపన్నయగు సీత తన పాతివ్రత్యబలమున గన్నెఱ్ఱజేసి గడ్డిపోచవగిది క్షణమున రావణుని దగ్ధమొనర్పగలదు. కాని యాతడొనర్చిన మహాపరాధమునకు శిక్షింపబడవలసినవాడాతడొక్కడే కాదు. వాని కుటుంబమునగల తాదృశులందరును వాని యనుయాయులతో బాటుగ నీదోషాగ్నిలో శలభములు గావలసియున్నది. దానిని శ్రీరాముడే నెరవేర్పవలయును. మధ్య నెంతయో కథ నడువవలయును. చిత్రవిచిత్ర సన్నివేశము లెన్నియో యెదురు గావలయును. దుష్టు లెందరో! మడియవలయును. శిష్టు లెందరో సంరక్షితులు గావలయును. కావుననే సీత రావణు డొనర్చిన నేరమునకు సముచితమైన దండనమునే విధింప నెంచి మిన్నకున్నది. అగుటవలననే రావణుని యాట తాత్కాలికముగ సాగినది. కావుననే రాముడా శిక్షను తదనంతర కాలమున సవ్యముగ సమగ్రముగ నమలుపరచి లోకశాంతికరుడై ధర్మవీరుడుగా చరిత్రలో విరాజిల్ల గలిగినాడు.

శక్తిచాలకున్నను దుర్మార్గము నెదిరించు సాహసులు సర్వత్ర వసలుచుందురు. వారు సమయమువచ్చినతరి వెనుక ముందు లరయక ధర్మసంరక్షణకొరకై సకలశక్తుల ప్రోదిసేసి కొని నీచశక్తుల నెదిరింప నుద్యుక్తులగుచుందురు. జటాయువు గాథ యాశ్రేణికి జెందినదే. వియన్మార్గమున రావణుడేగుట జూచినది. ఒక మహిళాహృదయ దవానలజ్వాలా మాలికా

పూర్ణ కఠోరవాక్య పరంపరలను వినినది. వెంటనే కర్తవ్యరంగ మునకు దిగినది. రావణు నెదుర్కొన్నది. ఆపోరాటమున రావణుని విల్లు విరిగినది. రథవాహనములు విగతజీవము లయి నవి. సారథి హతుడైనాడు. మాయావి రావణుడు తన గమ నమును కొనసాగించుచునే - ఇక కాలయాపనము పనికిరాద నియు - శత్రువును తత్క్షణమే మట్టుపెట్టక యాలసించుట శ్రేయస్కరము గాదనియు నెంచి, చంద్రహాస ప్రయోగముతో జటాయువును నేల గూల్చినాడు. కొనయూపిరి బిగబట్టుకొని జటాయువు గగనమునుండి ధరణిపయి బడినది. తాత్కాలిక ముగ రావణుని పీడ విరుగడయైనది. ముందుకు సాగినాడు.

ఇంతఘోరము కనులముందు జరుగుచున్నను సీత ధైర్య మును గోల్పోవలేదు. జంకును బ్రదర్శింపలేదు. స్తబ్ధురాలు గాలేదు.

"మాయావీ! దుష్టరాక్షసా! పరదారాపహరణమునకు నీవు లజ్జపడుటలేదా! నీయాగడము లెంతకాలమో సాగవు. నీవు గావించుచున్న నీచకృత్యమే నిన్ను సమూలముగ నిర్మూ లించగలదు. సమయము సమీపించినది. త్వరపడకు" మని నిబ్బ రముగ నతనిని గర్హించుచు పలుకుచునే యున్నది. గమనము సాగుచునే యున్నది.

వైదేహిని రావణుడు లంకకు జేర్చినాడు. వజ్ర మెచట నున్న నేమి? దానివన్నె తగ్గదు. కగ్గదు. మసిపాతి గప్పట

వలన కాంతిలహరి జాలువారుటలో గొంతయాటంక మేర్పడును గాక! దానివలన వజ్రగౌరవ వైభవమును కాదనగలవా రెవరు?

రావణుడు తన భోగములను - పట్టణప్రాభవమును - పరిపాలనా వైభవమును సీతకు వర్ణించి చెప్పుచు "దిక్కులేక యడవులబట్టి తిరుగుచున్న రామునిపై నాసవదలి-ఈసమస్తము నీదే యనుకొని స్వేచ్ఛగ ననుభవింపు మనియు - తన నేలు కొని ధన్యుని గావింపు మనియు - లంకాసామ్రాజ్యమునకు రాజ్ఞివిగమ్మనియు" ప్రలోభ పెట్టి సీతను లొంగదీసికొనవలె నని యెంతగనో కృషి యొనర్చుచున్నాడు. వానికేమి సిగ్గు? తాను-గావించునది యెగ్గని యాతని యెడద కేరీతిగ దోచును? జన్మతః రాక్షసుడు. చదివినపండితుడైనను కాముకవ్యాపార పరతంత్రతవలన భ్రష్టతకు గురియైనవాడు. దుష్టకార్యనిర్వహణతో లోకదూషణకు గురియైనవాడు వానికి యెగ్గుసిగ్గులతో పనియేమి?

ఇక సీతయా! క్షుద్రభోగములపట్ల లంపటలేని లలనామణి. క్షణిక భౌతిక భోగములకు ప్రలోభము నందని పతివ్రతా తిలకము. నశ్వర మహైశ్వర్యసంపద ననుభవింప గాంక్షింపని యసామాన్యురాలు. రావణుని యెత్తుగడ లామెకడ పని జేయునా? వానియత్నము లన్నియు వ్యర్థములయినవి. విసిగివేసారి తుదకామె నశోకవనమునకు జేర్చి గట్టికాపు పెట్టినాడు. సీత హృదయము నెట్లైనను తనయందు లగ్నమగుట కనువుగ దుర్బోధల

జెవినిల్లుగట్టుకొని నూరిపోయ దక్షతగల నీచదానవకాంతల నామెచుట్టును జేర్చినాడు. కాలము గడువవచ్చును. కొలదిగనో గొప్పగనో యాలస్యము జరుగవచ్చును. కాని! తనప్రయత్నము తప్పక ఫలింపగలదని రావణుని యత్యాశ. సీతను తలదన్నిన వారెందరు తన పాదాక్రాంతలు కాలేదులెమ్మని యతడు తనకుదానుగ నచ్చజెప్పుకొనుచున్నాడు. ఐంద్రజాలికుని పగిది రూపము మార్చుకొని యకృత్యము లాచరింపవచ్చిన మారీచునివధ జరిగినది. సాటోపమున సరభసగమనమున పంచవటి కరుదెంచుచున్న శ్రీరామునకు సౌమిత్రి యెదురైనాడు. వెంటనే రాముని వదనమున విషాదరేఖ లలముకొనినవి. సౌమిత్రి శ్రీరాముని వంకకుజూడ వెఱచినాడు. వేదన జెందినాడు.

"తమ్ముడా! ఏమి టీరాక? సీత నొంటిగ వదలివచ్చుటకు నీహృదయమెట్లు సమ్మతించినదయ్యా! విశ్వసించిన అన్ననే యిట్లు విషాదమున ముంచెదవా? నాయాజ్ఞ మీరితివి. ఇక యేమైననేమి? సీత యెట్లున్నదో చెప్పుమని శ్రీరాముడడిగినాడు. సీతాక్షేమవార్తా శ్రవణమునకై వేగిరపడుచున్న అగ్రజుని పలుకులలో లక్ష్మణునకు వేడియు వాడియు స్పష్టముగనే గన్పట్టుచున్నవి. కాని! యేమెునర్పగలడు. బాధ్యత వహించిన నేరమునకు వదినగారట్లన్నది. అన్న యిట్లనుచున్నాడు. మధ్య నవనీతకోమలమైన తమ్ముని మానసము నలుగుడువడుచున్నది. వాస్తవము వాకొనుటకన్న గత్యంతరము లేదు.

మారీ చాక్రందనమును వినుటతోడనే భయవిహ్వాలయై జానకి పలికిన పరుషవాక్కులు వినిపించి, ఆ దుస్థితిని సహింప జాలక వనదేవతలపై భారముంచి తాను బయలుదేరివచ్చిన వృత్తాంతమును జాలిగొల్పునట్లు లక్ష్మణుడు సవిస్తరముగ రామునికి జెప్పినాడు. కన్నీరు మున్నీరుగ విలపించుచున్న తమ్ముని పలుకులు శ్రీరాము నెడదను గరగించి వైచినవి. పరిస్థితులట్లు మారినందుల కాయనయు వగచినాడు. కాని! సీత సంగతియేమి? ఆప్రశ్న యట్లేయున్నది. శ్రీరాముని డెందమున నాందోళన మెండైనది. లక్ష్మణుడు బయలుదేరి వచ్చిన పిమ్మట సీతగతి యేమైనట్లు? రామలక్ష్మణు లిరువురు నురుకులతో పరుగులతో పంచవటివంకకు మరలినారు. వారి కచట శూన్యపంచవటి దర్శన మిచ్చినది. ఆశ్రమమున జనకాత్మజ లేకపోవుటతో నది కళాకాంతి విహీనమైయున్నది. సీతలేని యాప్రదేశమున నిలుచుటకేనియు వారిరువురకు దుర్భరముగ దోచెను.

"హా సీతా! హా సీతా!" యనుచు రాము డొక్కమారుగ నెలుగెత్తి బిగ్గరగ నరణ్యము ప్రతిధ్వనింప విలపించినాడు. సీతలేని యీలోకమున తనకేమియు మిగులలేదని బాలునివగిది బావురుమనినాడు. చైతన్యరహితుడైనాడు. నిట్టూర్చినాడు. నిర్విణ్ణుడైనాడు. శ్రీరామునకు సీతయెడగల మహోత్తరానురాగమునకిది ప్రత్యక్షసాక్ష్యము. పూర్ణావతారుడైన పురుషోత్తముడే శ్రీరాముడు. కాని! యుగధర్మానుు

గుణముగ సతీపతుల విరహవ్యథ నీపగిదిగ నాయన యభివ్యక్తీక
రించెనేమో !

"ఆత్మానం మానుషం మన్యే
రామం దశరథాత్మజమ్"

అని తననుగురించి చెప్పుకొనిన పరమపురుషుడుగదా ! శ్రీరాముడు దశరథుని పుత్రుడట. మానవమాత్రుడట - కావుననే ప్రియావియోగ భారమున కిట్లు తీవ్రముగ కలతజెందినాడు. సహధర్మచారిణియైన అర్ధాంగిపట్ల నుండవలసిన యనురాగమారీతి పతాకస్థాయి నందదగినదే. కావుననే వారి వియోగావస్థ లోకము నెంతగనో ప్రబుద్ధ మొనర్చి ప్రదీప్తముగావించినది.

లక్ష్మణుడు శ్రీరాముని దుఃఖమును గాంచి యెంతగనో వగచినాడు. కాని ! మార్గాంతర మేమి ? తనను తా నూరడించుకొనవలెను. తానే యన్నగారికి ధైర్యము గూర్పవలెను. సౌమిత్రి యందు కుపక్రమించినాడు.

"సోదరా! మాన్యుడవైన నీవు సామాన్యుని పగిది యిట్లు దురపిల్లు టెంతయు శోచనీయాంశము. కర్తవ్యసమాలోచన మొనర్పవలెగదా ! ధీరుడవై తత్ప్రయత్నమునకు గడంగుము. నన్నాదేశింపుము. నీయాజ్ఞల బాలించుటకు నేను సిద్ధముగా నుంటినని ప్రార్థించెను. కాని! రాముని చిత్తవిభ్రాంతి యింకను దొలగలేదు. కేవల మొక యున్మాదివలె ప్రలాపములాడుచున్నాడే కాని ప్రత్యుత్తర మిచ్చుదశలో రాముడులేడు.

దాశరథి మనసంతయు జానకియందే లగ్నమై యున్నది. లోకమంతయు సీతామయముగనే తోచుచున్న దాయనకు. ప్రత్యణువునందును విషణ్ణసీతావదనమే శ్రీరామునకు సాక్షాత్కరించుచున్నది.

"అనుజుడా! అయోధ్యకు పోవవలసిన యవసరము నాకు తీరిపోయినదయ్యా! నాజీవము - నాధారము - నాసర్వస్వము - నాజానకి లేని అయోధ్యయే కాదు - లోకము మాత్రము నాకేల! నీవయోధ్య కరుగుము. రాజకార్యములలో సోదరులకు సహకరించుచు కాలము గడుపుము. ప్రాణపరిత్యాగమొక్కటే నాకిక శరణ్యము."

గుండె లవియజేయు వచనములతో ఘోరవిషాదస్వరూపుడై నిలిచియున్న శ్రీరాముని గని లక్ష్మణు డెన్నియో తెఱగుల ధైర్యవాక్యములతో - అన్నగారిని మామూలుస్థాయికి గొనితెచ్చు నిమిత్తమై అవిరళకృషి సల్పినాడు. దుష్టుల దుండగములను మనమే సైరించి వదలిన, లోకభీకర ప్రళయమారణకాండ నెవ్వ రాపగల రనినాడు. స్త్రీలకు రక్షణ యెట్లుండు ననినాడు. "యత్ర నార్యస్తు పూజ్యన్తే రమన్తే తత్ర దేవతాః" అనెడి సూక్తిని గుర్తునకు దెచ్చినాడు. దుఃఖోపశమనార్థమై పడవలసిన శ్రమ లన్నియుబడి యెట్టకేలకు శ్రీరాముని ధోరణిని మార్చి సీతాన్వేషణమువంకకు ద్రిప్పగల్గినాడు. కృతార్థుడనైతినని మురిసినాడు.

లక్ష్మణు డెంతగ బ్రతిమాలినను - ధైర్యము చెప్పుచు న్నను రామునకు గుండె దిటవు గుదురుట లేదు.

"సోదరా! సీత నెల్లెడల గాలించినను ఆమెజాడ నరయ జాలమైతిమి. నీ వయోధ్య కరుగుము. పరిపాలన విషయమున భరతునకు సహకరింపుము. నే నయోధ్యకు రాదలచ లేదు. నే నిందే ప్రాణత్యాగ మొనర్చుకొందు" నని దీనాతిదీనముగ బలుక సాగెను. లక్ష్మణు డెన్నియోవిధముల ధైర్యము గల్పించి యన్నగారి దుఃఖోపశమన మొనర్చి సీతాన్వేషణకు గడంగుద మని ప్రోత్సహించినాడు. వారిద్ద రెట్టకేలకు జానకిని వెదకు కొనుచు బయలు దేరిరి. మతంగపర్వతాగ్రమున నివసించుచున్న సుగ్రీవునితో హనుమంతునిద్వారా రామలక్ష్మణులకు సఖ్య మేర్పడినది. తమ్ముని భార్య నపహరించి యధర్మ ప్రవర్తనకు గడంగి వ్యవహరించుచున్న వాలిని వధించి సుగ్రీవుని వానర రాజ్యాధిపతిని గావించుటకు, సీత యెచటనున్నదో యన్వేషణ మొనర్చి సుగ్రీవుడు రామలక్ష్మణులతో సంపూర్ణముగ సహాక రించుటకు నొప్పందము గావించుకొని యత్నములు కొనసా గింప మొదలిడిరి. అనుకొన్న మాటప్రకారము సీతాన్వేషణకు గడంగుడని వానరసైన్యమును సుగ్రీవు డాజ్ఞాపించినాడు. బయలుదేరిన వానరులలో దక్షిణదిశకు హనుమదాదు లంగ దుని నాయకత్వమున బయలుదేరిరి.

జానకి లంకానగరమున బంధితురాలై యున్నట్లు సంపాతి వలన వార్త నెఱింగిన కపిసేనలు సీతాన్వేషణార్థము శతయో

జన విస్తీర్ణమైన మహాసముద్రమును దాటి లంకకు జేర నుద్యుక్తులయిరి. కాని! ముందుగ సీత లంకయందున్నట్లు ధ్రువపరచుకొనవలెగదా? అందుకొరకై యొకనిని తత్క్షణమే లంకకు బంపనిశ్చయించినారు. నిర్ణయము జరిగినమాత్రమున సరిపోవునా? సముద్రలంఘన మాచరించి లంకకేగగల సమర్థుడెవ్వరో! తెలవలయునుగదా! ఎల్లరాలోచించి మహాభక్తుడును - శ్రీరామ ప్రియకింకరుడును నగు హనుమంతుని ప్రేరేపించి కార్యసాధన గావించుకొనవలెనని యాలోచించుకొనినారు. మారుతి వారినిర్ణయము నౌదలదాల్చి రామకార్యమగ్నహృదయుడై యెదురైన యెన్నెన్నో కఠినసమస్యల నధిగమించి లంకకు జేరినాడు. జలధి సముల్లంఘన దక్షత యాయనకు వెన్నతో బెట్టిన విద్యయైనట్లుగ నున్నది. పారావారసంతరణసమయమున దన నెదిర్చిన దుష్టశక్తుల నుక్కడగించుటాయన కొకలెక్కగనే యున్నట్లుగ దోచదు. కష్టసాధ్యమైన పనియేయది. కావచ్చుగాక. మహాత్ములగువారికి దుర్ఘటములైన కార్యము లెవ్వియు నుండవుగదా! ఆంజనేయుడు లంకలో నడుగుపెట్టులోపల నెందరో ఆయన పిడికిలి పోటుల రుచిజూచి మడిసిరి. లంకకు జేరిన తరువాత లక్ష్యసాధనకు గడంగినాడు. ఏమహాసాధ్వికొరకై తానిచటి కరుదెంచెనో? ఏపతివ్రతామతల్లి కుశలవార్త వినుటకై శ్రీరాము డుత్సుకుడై యుండెనో! ఏ పుణ్యాంగనా సందర్శనార్థము కపులందరు దననే సమర్థునిగ నెంచి పయనము చేయించిరో! ఆమెయే

కన్నులబడకున్న - ఆమె వార్తయే తానెరుగకున్న తనరాకకు ఫలమేమి ? తనశ్రమకు ప్రయోజనమేమి ?

వగచుచునే యున్నాడు. వెదకుచునే యున్నాడు. వేదన జెందుచునేయున్నాడు. తుట్టతుదకు కృశాంగియయ్యును తేజోరాశివలె విరాజిల్లుచు పవిత్రతను వెల్లివిరియుచు నశోకవనాంతర్గత శింశుపావృక్షచ్ఛాయలో భయంకర రాక్షసస్త్రీ పరివృతయైయున్న యొకానొక నారీరత్నమును దిలకించినాడు. శిరఃకంపన మాచరించి బహుశః యీామెయే మాయమ్మ సీతమ్మయై యుండవలెననెడి యూహజేసినాడు మారుతి. ఆమె యేక వేణిగనున్నది. మలినవస్త్రధారిణియై యున్నది. ఉపవాసాయాసవిశేషకృశాంగియై యున్నది. మూర్తీభవించిన దైన్యమా! యనునట్లున్నది. ధూమలతలచే గప్పబడిన యగ్నిజ్వాలామాలవలె నున్నది. సుస్పష్టమైన వినిర్మల ప్రభలతో వెలుగు లీనుచున్నది. పసుపు వన్నెగల ప్రాతచీర చాల్చియున్నది. భూషణ విభూషిత గాకున్నను పద్మరహిత పంకాన్విత పద్మినియై భాసించుచున్నది.

ఆమె దుఃఖాగ్ని సంతప్తహృదయ. విషాద పరిమ్లానవదన - భర్తసందర్శనైక మహాశయసంయుత తపస్విని. అంగారక గ్రహ పీడ్య రోహిణివలె ఆమె కన్నులవెంట నీరుగార్చుచు రామనామ ధ్యానసమాధియం దుపవిష్టయై యున్నది. రాక్షసస్త్రీ బృంద పరివృతయై వేటకుక్కలచే చుట్టివేయబడిన హరి

ణములీల నలమటించుచున్న యీమె తప్పక సీతామాతయే కావలయునని యాంజనేయు డొకనిశ్చయమునకు వచ్చినాడు. జఘనభాగమువరకు వ్రేలాడుచున్న కృష్ణసర్ప సదృశమైన యేకవేణి మరియెవరి కుండగలదు? విశాలనేత్రదీప్తితో శుష్కశరీరయయ్యును భాసించుచున్న యీమెయే సీతయని హనుమంతుడూహించినాడు.

ఆమె సందిగ్ధస్మృతి రీతి - అణగిన సమృద్ధిపగిది - అకుంఠిత శ్రద్ధచందమున - అప్రతిహతమైన ఆశభంగి - విఘ్నముల నుండి సమావిర్భూతమగు సిద్ధివోలె, కలుషరహిత బుద్ధివిధాన సాక్షాత్కరించుచున్న సాధ్విగాక మరియొకరు సీతకాగలరా? లేదు. నిస్సంశయముగ నామెయే సీత. రామలక్ష్మణులనోటదా నపుడపుడు వినుచువచ్చిన జానకీసౌందర్యరేఖ యీమెలో గన్పట్టుచున్నది. శుభాభరణములను మాత్రమే ధరించి శోభాభరణములను వృక్షశాఖపై వ్రేలాడగట్టినట్లు ఋష్యమూకమున సీతవదలిన నగలతో పోల్చుకొని మారుతి గమనించినాడు. ఏ కాంతారత్నముకొరకై శ్రీరాము డింతవర కనంతచింతతో వంతల గుందుచుండెనో! ఆలలనామణియే యీమెయని నేడి స్థిరనిర్ణయమునకు వచ్చినాడు. ప్రయత్నము విఫలమగుచున్న కొలది పట్టుదల పెరుగవలెను. బాధ లధికమైనపుడే నిరుత్సాహము నవ్వలికి నెంటివైచి సముజ్జ్వలమైన యాత్మశక్తిని బెంచుకొనవలెను. నిరహంకార భావోపాసనతో - భగవత్ప్రార్థనాపూర్వక ప్రయత్నమును - నిశ్చలవిశ్వాసముతో గావించి:

ఫలితసాధన గావించిన సర్వసమర్థు డాంజనేయుడు. సంపూర్ణ సంతృప్తి యాయన వదనభాగమున ద్యోతకమగుచున్నది. కృతకృత్యుడైన రీతి మురియుచున్నా డాయన. సీత మహాసాధ్వి. ఎట్టి దుర్భర దురంత దుస్థితుల మధ్యయందున్నను పతిదైవ ధ్యానమును వీడని యిల్లాలు. భర్తకన్న మిన్నయగు దైవమింకొకరు లేరని యామె విశ్వాసము.

భారతదేశ నారీలోక రక్తనాళములలో తరతరముల నుండి యుగయుగములనుండి అంతర్వాహినిగా ప్రవహించుచున్న పాతివ్రత్యరూప జీవరేఖకు శాశ్వత సాక్షీభూత జానకి. పతివ్రతల పుట్టినిల్లని భారతభూమి ఖ్యాతి గడించుట కిట్టి తల్లులే చల్లని చలువపందిళ్ళు వైచినారు. గుణగణనమునగాని, సద్వర్తనా వైశిష్ట్యమునగాని వ్రేలుమడిచి లెక్కింపబూనిన యిట్టి యంగనామణులు పరదేశములం దెందరుందురు? పరాయి ప్రభువుల పాలనలో భారతదేశము శారీరకముగ మానసికముగ పరమనికృష్ట దుర్భరదాస్యము ననుభవించుచున్నను భారతనారి యాత్మస్థైర్యమును గోల్పోవక చెక్కుచెదరని స్థిరదీక్షతో పావిత్ర్యమును సంపాదించుకొనుచు పాతివ్రత్య వైభవమున కభ్యుదయమునే సంతరించిపెట్టినది. సతీత్వపు విలువలను హెచ్చించినది. సాధ్వీత్వమునకు వన్నెదిద్దినది. వర్తమానకాల వనితలు కొందరు నేడంథల పగిది పాశ్చాత్య నాగరకతా వ్యామోహ కూపములబడి కొట్టుమిట్టాడుచు వైదికధర్మానుకూల వర్తనను

వ్యతిరేకించి విశృంఖల విహారమున కుపక్రమించి పవిత్రతమ ప్రాచీన పాతివ్రత్య సముదాత్తాచార సరళికి మచ్చవచ్చునట్లు మసలుట - మనుగడ సాగించుట విచారకరము. కడుంగడు గర్హణీయము.

ఈభారతీయ సత్సంప్రదాయ పరమపావన వైఖరికి నాడు జయపతాక లెత్తిన జానకిని గాంచగనే మారుతి గుండె నీర యినది. అక్షియుగళమునుండి యశ్రుధార లురలినవి.

"కింకరుడనగు నాకే యీయమ్మ దుస్థితి యిట్టి యఖండ ఖేదము నొదవించుచున్నదే! అర్ధాంగియైన యీమహాసాధ్వి వియోగవ్యథతో నాప్రభువగు రాముడు మేన ప్రాణముల దాల్చియుండుట దుష్కరమే యగును గదా!

ఈయమ్మ పడుచున్న కష్టపరంపర నూహకు దెచ్చు కొన్నను నాస్వామి గుండె లవియుట సాజమే యగునుగదా!" అని మారుతి తనలో దానను కొనుచున్నాడు. సత్యముగ హనుమంతు డనుభవించుచున్న కఠోరమానసికవ్యథ వర్ణనాతీతమైనదే! ఇట్టి సన్నివేశములకు ప్రాణప్రతిష్ఠ యొనర్చి, తనవాక్పరంపరలతో నాయాసందర్భములలో నాయావ్యక్తుల యూహలను, భావసంఘర్షణలను యుగముల తరువాత వచ్చెడి పాఠకులకు గూడ నద్దమునందువలె జూపెట్టగల్గుటయేకదా! మహాకవి లేఖినికిగల ప్రత్యేకత. జగద్విఖ్యాత కవితల్లజుడగు వాల్మీకి మహర్షికి సైతము మారుతి వేదనను విస్పష్టముగ వర్ణింప జేయి

యాడలేదేమో! అట్లున్నది యాసందర్భపు రచనాధోరణి. కావుననే వాల్మీకి హనుమంతుని మానసికస్థితిని - దుర్భరవ్యథను - దురంత సంతాపరీతిని సవివరముగ వర్ణింప నుంకింపక మారుతి ఒక్క త్రుటికాలము ధ్యానసమాధిలో మునిగియుండి- పిమ్మట బాష్పాకులిత లోచనములతో దివ్యతేజస్వినియగు సీతనుగాంచి - ఆమెస్థితిని పునః పునః స్మరణమొనరించి బావురుమని విలపించిన వాడాయె" నని చెప్పి మిన్నకున్నాడు.

హనుమంతుడు వివేకవంతుడే. గుండె చెదరనివాడే. కనులు చెమర్చ నెరుగనివాడే. శోకించి సాధించునది యేమియును లేదని యెఱిగివాడే. కాని! సీతను గాంచగనే యతనిస్థితి యట్లయినది. బిట్టుగ రోదించుట, కన్నీరుగార్చుట మారుతి జీవితచరిత్రమునం దదియే మొదటి పర్యాయము కాగా - అదియే తుదిపర్యాయముగూడ నై యుండును.

"మాఅమ్మవంటి మాన్యురాలికి - పరమ పవిత్రురాలికి గూడ దుఃఖము తప్పలేదే!" యని తలచుకొని యాంజనేయుడు వెక్కి వెక్కి యేడ్చినాడేమో!

"కాలో హి దురతిక్రమః" అనెడి సూక్తిని జ్ఞప్తికి దెచ్చుకొని యట్టిస్థితికి గురియైనాడేమో! ఎవ్వ రెరుగుదురు? ఎవ్వరి యూహాకు దోచును?

సీతారాముల స్నేహబంధము - సత్యముగ నొకపవిత్రానుబంధము. వియోగసమయమున వారిప్రేమయొక్క-

ప్రగాఢస్థితి - విశిష్టస్థితి - లోకమునకు బాగుగ వెల్లడియగునని యనవచ్చును.

సీత యెన్ని విధముల- ఆపన్నయై యల్లాడుచున్నను తన దురదృష్టమును తానే నిందించుకొన్నది. కాని! యొరులను పల్లెత్తి యొకమాట పలుకలేదు. కావలెనని యేయొక్కరిపైన గూడ నొక్క నింద వేయలేదు. తనను నిందించుకొన్నది. తనవారిపై విసుగుకొన్నది. రాముడుగూడ నట్లే వ్యవహరించినాడు.

సీతాసౌశీల్య మెంత మహనీయమో! శ్రీరాముని యసాధారణ ధర్మదృష్టితత్పరతయు నంతగణనీయ మైనట్టిది.

స్థితినంతయు నవగాహన మొనర్చుకొనిన యాంజనేయుడు రాక్షసాంగనల దారుణ క్రూరవచనములకు దల్లడిల్లుచున్న భూజాత దుస్థితికి గుమిలిపోవ దొడగినాడు. విక్రమించుదునా! విషమించునేమో! విషయమును వివరించకయే యిట్లు గావించటంజేసి సీతయు తనను విశ్వసించునో! లేదో! వ్యర్థప్రయత్న మేల? తననుతానే నిగ్రహించుకొని యాయత్నము విరమించి యంతయు దిలకించుచున్నాడు.

'సుదృఢ చిత్తమున రామనామస్మరణ మొనర్చుచు దానవాంగనలమధ్య తపించుచున్న యామె సీతయే కావలెను. సీత యగుగాక!'' ఇట్లు తనకుదాను ధైర్యమును, విశ్వాసమును గల్గించుకొనుచు జానకిని గాంచుచు పరులకు గన్పింపనివాడై యచ్చోటనే నిలిచియుండెను.

ఇంతలో వేగుజామైనది. తూరుపుదెస వెలుగురేకలు వెల్లివిరియ నారంభించెను. వేదవేత్తల సుస్వరాలాపయుత మంత్రగాన మాధుర్యము శ్రవణముల సోకగనే రావణుడు మేల్కాంచినాడు. మేల్కొనుచునే సీతానామస్మరణ మొనర్చుచు నశోకవనమునకు బయలుదేరు సన్నాహము నందుండెను. రావణుడు కాముకుడు. లజ్జలేనివాడు. కాముకుల లక్షణమే యది. సీతాసౌందర్య సంలగ్నమానసుడై - పరిచారికలును - పరివారమును వెంటరా-సాటోపమున-సాట్టహాసమున-సరభసమున బయలుదేరినాడు. భార్యలుగూడ వెంటవచ్చుటొక విశేషము. పరదారాభిగమన దుష్టవాంఛతో జనువాడు స్వదారలగూడ వెంటనిడుకొని వచ్చుటనిన నది యహంకారముగాక యేమగును ?

వాని యహంకృతికి తలవంచి నిరాకరించుటకు జంకి - రావణుని వెంటబడి బయలుదేరుటకు సమ్మతించిరేమో! అంతఃపురకాంతలు. వాని యహంకార ధోరణి యట్లున్నది. రావణుడు సపరివారముగ వచ్చి సీతయెదుట నిలిచినాడు.

వానిం జూడగనే జానకి తీవ్ర ఝంఝామారుతోద్ధతికి ప్రకంపనమునందెడి - కదళీతరుకాండము పగిది గజగజవణుక దొడగెను. శిలలు ద్రవించునట్లు విలపింప దొడగెను. బాహుద్వంద్వముచే పయోధరముల గప్పుకొని - ఊరుయుగముచే నుదరమును గనిపింపకుండున ట్లొనర్చుచు చిత్రగత ప్రతిమవలె

స్తబ్ధయై కూర్చుండెను. జానకిని వశపరచుకొనుటకై రావణు డెన్నియో యెత్తులను వేయదొడగినాడు. బహూపాయములను ప్రకటింప సాగినాడు. పరస్త్రీ గమనాభిరతిగలవాని యూహా లారీతిగ బరువెత్తుచుండును. పరస్త్రీలను బలాత్కరించి స్వశక్తితో వశపరచుకొనుట తమకులాచారమునకు దగిన ధర్మమనియు, నది మావంశ ప్రత్యేకతకు చిహ్నమనియు తన నియమము నామెముందు సిగ్గువిడిచి వెల్లడించుటకుగూడ సిద్ధపడినాడు రావణుడు.

భయమును పరిత్యజించి నన్ను ప్రేమగ వీక్షించి పరిణయమునకు సమ్మతించి నామగటిమికి ధన్యతగూర్పు మనియు పలురీతుల నభ్యర్థించెను. భోగ వైభవవిలాస విశేషములతో నిన్ను సర్వవిధముల సంతృప్తను గావింతుననియు కామోన్మత్తుడై ప్రలపించెను. నాకోరికను మన్నించితివేని యఖిలభూమండలము నీపాదాక్రాంతమొనర్చు బాధ్యతను నేనేవహింతునని విన్నవించుకొనినాడు. తాదృశ ప్రలోభములకు సీతామహాసాధ్వి లొంగునా? ఆశపడునా! అనురక్తి జూపునా? ఆమె కర్ణములకు కఠోరముగ రాముని నిందింప రావణుడు పూనుకొనినాడు. తాను వేయదలచిన యెత్తులయం దదియొకటి.

“సీతా! సావధానవై వినుము. నీవు నాకు పట్టమహిషివైనచో సిద్ధించెడి యోగ్యతావిశేషముల నొక్కపరి స్మరింపుము. నీవు నిండుమనమున నభిలషించుచు నిరుపమప్రేమను

వ్యక్తీకరించుచున్న రాముడు పరమదరిద్రుడు. వానికొరకై నీవిక ప్రాకులాడవలసినపని మానివేయుము."

సీత చెవుల కీపలుకులు వాస్తవముగనే ములుకు లయినవి. ఘోరవిషాద వ్యాకులితచిత్తయగు సీత రాముని మొగము గాంచుచు బ్రత్యుత్తరము నొసగ దలచ లేదట.

"తృణ మంతరతః కృత్వా - ప్రత్యువాచ శుచిస్మితా" తనకు రావణునకు నడుమ నొకగడ్డిపరక బడవైచి, దుష్టబుద్ధి గల రావణుని తృణమునకన్న హీనముగ జూచుచు నిర్భయముగ, నిరాదరణముగ నీరీతి వాకొనదొడగినది.

"రావణా! నీకిట్టి దుర్బుద్ధి తగదు. నీకు గల ప్రేమను నీయంతఃపుర కాంతల వంకకు మరల్చుము. దానంజేసి నీకు శుభ సుఖము లమరును.

నీసతులను పరులెట్లు గౌరవించవలయునని నీవు భావించుదువో! ఇతరుల భార్యల నట్లు మర్యాదగ జూచుట నేర్చుకొనుము. నాడే నీకు మేలుగలుగును. ఇంద్రియ నిగ్రహశూన్యుడైన - పశుప్రవృత్తిగల పురుషునకు పరదారలవలన పరాభవము తప్పదు.

నీవు చూపెడియాసలకు భ్రమనందెడి నీచురాల ననుకొనకుము. "అనన్యా రాఘవే ణాహం భాస్కరేణ ప్రభా యథా" సూర్యభగవానునుండి కాంతిని విడదీయజాలని పగిది రాఘవుని

నుండి నన్ను వేరొనర్పగలశక్తి యెవ్వరికిని లేదని గుర్తింపుము.
సీతారాముల ప్రణయబంధ మవిచ్ఛిన్నమైనట్టిది.

నీకు మంగళము కావలెననుకొందువా! శ్రీరాముని శరణుగోరి నన్నా పూజ్యుని చరణసరోజములకడ సమర్పింపుము. రఘువంశతిలకుడే క్రుద్ధుడైన నిన్ను బోలిన క్షుద్రులెందరేని మనుగడ గడపజాలరుసుమా!" అని తీవ్రముగ రావణుని భయ పెట్టినది. "దుర్మార్గుడా! నీరాజ్యమున నీతియుతులగు బుద్ధి మంతులు లేనేలేరా! ఉన్నను వారి హితబోధల నీవాలిం పవా! దురాచారదూషితమగు నీవర్తన గనుగొనిన యోగ్యుల మంచిమాటలను నీవు పెడచెవి బెట్టెడివాడవనియే నాకును దోచుచున్నది."

రాముని యసామాన్య శౌర్యసాహసముల నభివర్ణించి కామాంధుడగు రావణుని తీవ్రముగ మందలించినది. ఎన్ని వివరించిన నేమి ? ఎంత బోధించిన నేమి? పుట్టెనపుట్టినబుద్ధి పుడ కలతోగాని పోదను మాటను ప్రత్యక్షర సత్యమొనరించు చున్నా"వని కఠినోక్తులాడినది సీత.

అన్నియును శాంతముగ విన్న రావణు డుద్రేకపడక వైదేహికి రెండుమాసముల గడువు నిచ్చుచుంటిననియు, నప్ప టికి దప్పక మనసుమార్చుకొని వశురాలవుగమ్మనియు సీతను హెచ్చరించి - జానకియం దట్టిమార్పు మాసద్వయానంతరము గూడ రానిచో నిరాక్షేపణముగ నామెను నమిలి భక్షింపుడ

నియు రాక్షసాంగనల కనుజ్ఞనొసగి రావణుడు సపరివారముగ బయలుదేరి వెడలిపోయెను.

ఆసమయమున రావణుని పాశవిక వైఖరింగాంచిన సీత క్రోధఘూర్ణిత లోచనయై చురచురజూచుచు తిరుగులేని శాప సదృశములైన పలుకుల నిట్లు పలుకదొడగెను. "దానవాధమా! శ్రీరాముడు చెంతలేని సమయమున పిరికిపందవై దొంగవలె నన్ను బలాత్కరించి తెచ్చితివి. భద్రమత్తేభసదృశ ప్రభుకుల చూడామణి నా నాథుడు. జవసత్త్వము లడంగిన జాతిహీనమైన చెవులపిల్లి వంటివాడవు నీవు. నీదుష్టవీక్షణ ప్రసారముల కాలం బనములయిన నేత్రగోళము లేల నేలరాలిపడలేదో! తెలియ కున్నది. నైష్ఠిక నియమపరాయణను పతిపాదసేవార్పిత ప్రాణను నగు నన్ను గురించి యీరీతి దుర్నీతిపరుడవై ప్రేలుచున్న నీనాలుక యేల చీలి ప్రీలి నేలపడకున్నదో! నా కవగాహన మగుట లేదు. పరమనీచుడా! పాపిష్ఠిస్వభావుడవైన నీకు కాలము ముంచుకొనివచ్చుటవలన నే యీరీతిగ విధివంచితురాలనగునన్ను వ్యథలపాలొనర్చుచున్నావు. నావంటి గృహిణి కన్నీటికణములు నిన్నును, నీవంశమునుగూడ మహాగ్నికణములై మలమలమాడ్చి వేయగలవు. నీకట్లు జరుగవలసి యుండుటవలననే యిట్టి దారుణమున కొడిగట్టితివేమో! కానిమ్ము. నీయాట సాగినంతవరకు సాగని" మ్మనుచు ప్రతిమాటయు రావణుని యెడల జలదరింప జేయుచున్నను నిర్లక్ష్యభావమున 'మీాపిధియట్లున్నది. ఆవిధియే రామునిసైత మిట్లరణ్యాముల ద్రిప్పుచున్నది' యనుచు వెను

దిరిగిచూడక సరభసమున ముందునకే సాగిపోయినాడు రావణుడు.

వెంటనే దానవకాంత లందరును జానకి చుట్టును జేరి సిగ్గు వీడి మరల ప్రాతపాట పాడ నారంభించినారు. సీతహృదయము రవంతేనియు జలింపలేదు. జంక లేదు. వా శేదేదియో చెప్పి రావణుని ప్రస్తుతించు టధిక మొనర్చినకొలది వానిపట్ల యేహ్య భావము పెరగసాగినది. రాయి గ్రుద్దినట్లు తనదృఢాభిప్రాయ మును విశదీకరించి రాక్షసస్త్రీల నందరిని నిశితముగ దూలనాడి నది.

త్రిజట మాత్రము దానవకాంతలను మందలించి ఆశ లణాగారిపోయి - ఆవేశమును దిగమ్రింగుకొని జీవించుచున్న శ్రీరామపత్నిని సముచితలీల నోదార్చి తనస్వప్న వృత్తాంతము నంతయు బూసగ్రుచ్చినట్లుగ వారికి వినిపించి లంక కేదో చేటు వాటిల్లనున్నదని సూచించి సీత నభినందించిన దాయెను.

సీత వామనేత్రము, వామబాహువు, వామోరువు నదరు టతో త్రిజటపలుకులు సత్యములే యని ధ్రువపడుట కవకాశ మేర్పడినది.

ఇంతలో శింశుపావృక్షపు కొమ్మలమధ్యనుండి - దివ్య సౌరభ సంభరిత ప్రసూనపంక్తి విరజిమ్మబడినట్లు హనుమంతుని కోమలగాత్రమునుండి రామనామస్మరణ వినిపించసాగినది. మహిమాన్వితము రామకథ. భుక్తి ముక్తి ప్రదమైన తారకమం

త్రమే రామనామము. శ్రీరామ నామము చెవింబడగనే వాడిన తీగపై నమృతముపోసిన ట్లయినది. అత్యాశ్చర్యకరముగ విశాల వీక్షణములతో వృక్షశాఖలవంక జానకి తేరిపార జూచినది. కొమ్మలమధ్య రెమ్మలచాటున తూర్పుదిక్కున నుదయించెడి సూర్యునివలె భాసించుచున్న మారుతి కనిపించినాడు. బంధువును దర్శించిన ట్లామె యేదో! తెలియని యానందమున దేలసాగినది. దట్టపుజీకటిలో వెలుగురేక కనిపింపకున్న జీవికింక తృప్తియెక్కడ? ధైర్యమెక్కడ? దందోచక్ర పరితపించు సీత వాతాత్మజుని జూడగనే యామెహృదయమున నేదో యాశాకిరణము మెరసినది.

ఆంజనేయు డొనర్చిన రామనామ సంకీర్తనమే జానకి దుఃఖమయ కాళరాత్రికి సుప్రభాతగీతము - కుక్కుటారావము నయినది. ఇంక సత్సంకల్ప సూర్యోదయమున కాలస్యమే లేదు. సత్ఫలకిరణనికరముల సమావిష్కృతికి కొదవేమి?

అంజనానందనుడు శింశుపావృక్షమునుండి మెల్లగ క్రిందికి దిగినాడు. జానకి యెట్టయెదుట నిల్చి యెప్పటినుండియో యొదిగియున్న ప్రాతకాలపుబంటువలె కేలుమోడ్చి యేమియు తెలియని వానిపగిది యామెకథ నామెచేతనే చెప్పింపనెంచి వినయ వినమ్రభావ సుందరుడై - ఆమెతో నిట్లు మాట్లాడ నారంభించెను.

అమ్మా! నీవెవ్వరవో! నేనెరుగజాలకున్నాను. కాని! రాజపుత్రికవని మాత్రము విశ్వసించుచున్నాను. పద్మసమ

ములై విరాజిల్లెడి నీనయనములనుండి మేల యీపగిది బాష్ప ధారాపరంపర ప్రవహించుచున్నది తల్లీ! మరియొకమాట.

"సీతా త్వ మసి భద్రం తే"

అమ్మా! శ్రీరామచంద్రమూర్తి యర్థాంగలక్ష్మివగు సీత వేమో! నీవని నేను సంభావించుచున్నాను. నీకు శుభమగు గాక!"

ఈమాట యెత్తగనే యాంజనేయుని సీత కొంతపరికించి చూచినది. నమ్మదగనితన మావానరుని మొగమునగాని, మాటలలోగాని వ్యక్తమగుటయే లేదు. స్థిరపరచుకొనిన యనంతర మామె యిట్లు ప్రశ్నించినది.

"వానరా! రామలక్ష్మణుల నీవెట్లెరుగుదువు? వారితో నీకు నెయ్యమెట్లు గుదిరినది? నీవు వారిని గురించి తెలిసియున్న వాడ వగుచో వారిలక్షణము లెట్టివో! నాకు వివరముగ దెల్పి సంతుష్టిని ఘటింపు"మని కోరెను.

"అమ్మా! వారు నాకు ప్రభువులు. నేను వారిభృత్యుడను. నీకొరకు వారు సకలవసుంధరాతలమును సమన్వేషించుచున్నారు. మార్గమధ్యమున బోవుచు కిష్కింధకు వారు వచ్చినపుడు నేను వారిసేవకత్వమును కోరికొని తెచ్చుకొన్నాను. కిష్కింధకు రాజైన సుగ్రీవునితో శ్రీరామునికి చెలిమిని గలిపెడి భాగ్యము నాకే దక్కినది. నేనిపుడు వారి దూతగా లంకకు

వచ్చినాడను. నాభాగ్యవశమున హతాశుడనై రిక్తహస్తములతో, శూన్యహృదయముతో తిరిగివెళ్ళవలసిన దౌర్భాగ్యదశ తప్పినది. నీదర్శన మగుటతో నేను ధన్యుడనైతిని. నాదౌత్యము సఫలమైనది. నారాక సార్థకమైనది. సులక్షణలక్షితుడైన తమ్మునితోగూడి యిక్ష్వాకువంశ మణిదీపమనదగు శ్రీరామచంద్రుడు త్వరలోవచ్చి క్రూరరాక్షస సంహారమొనర్చి నిన్ను గొంపోవగలడు. నిస్సంశయాత్మక వచనమిది.” అని జానకి యెదుట హనుమంతుడు సవినయముగ భక్తిప్రపత్తులతో భాషించినాడు. హనుమంతుని పలుకులపట్ల జానకికి విశ్వాస మేర్పడినది. ఆమె కన్నులానందబాష్పపరిపూర్ణములైనవి. నాడు తాను సన్నిహితబంధువు సన్నిధి యందున్నట్లానందము నందినది. ఆమెమొగమున నొక క్రొత్తవెలుగు గోచరింప దొడగినది.

మరల మారుతి యారంభించినాడు. “దేవీ! రామనామాంకితమైన యీ యంగుళీయకమును దిలకింపుడు. దీనింగాంచిన నీకీవిషయము పట్ల పరిపూర్ణవిశ్వాస మేర్పడగలదమ్మా!” యనుచు దాను గొనివచ్చిన యుంగరమును జానకి కర్పించినాడు.

రాముని కరాంగుళి నలంకరించి – ఆపుణ్యమూర్తి తనుస్పర్శతో పావనత్వమును సంతరించుకొన్న యుంగరమును జూడగనే శ్రీరామునిగాంచినంత యానందమామెయెడందలో

పొంగులు వారినది. కనుల కద్దుకొన్నది. శిరమున దాల్చినది. ముదమున తేలినది.

సమర్థుడవయ్యా! హనుమా! శతయోజన విస్తీర్ణపరిమిత సాగరము నెంత శ్రమవహించి లంఘించి వచ్చితివో! నాపతి జాడ దెల్పి నన్నుద్ధరించితివి. ప్రాజ్ఞుడా! నీకృషి వలన నాప్రాణము లిపుడు మేన నిల్చియున్నవి. నీసాహసము నాకీసంబరమును సంఘటించెననుట నిక్కమైన సత్యము – నన్ను కనుగొనుట కెన్నికష్టముల నెదుర్కొంటివోగదయ్యా!" అనుచు మారుతిని సీత పలుతెఱగుల ప్రశంసించినది. మరల నతనిపైపునకు దిరిగి హనుమా! అసురులనేగాక అవసరమగుచో సురలనే యెదిర్చి జయింపగల శక్తిమంతులే రామలక్ష్మణులు. కాని వారు నాదుఃఖమున కీమాత్రముగ నేని యుపశమనము గలిగింప బూనకుండు టాశ్చర్యముగ నున్నది. ఏమైన నేమి? నీమూలముగనైన నేను చాలవరకు దుఃఖోపశమనము గావించుకొన గల్గితిని. నారామచంద్రప్రభువు వ్యథతో గుందుచుండెనా? తనవిధుల దా నప్రమత్తతతో జరుపుకొనగల్గుచుండెనా ? రామునకు నాపై గల ప్రేమభావ మల్లే తరుగకున్నదటయ్యా! ఎప్పటికేని నిన్నీవిపత్తునుండి నానాథుడు నన్నొడ్డునకెక్కించునా? నాకు విముక్తిని బ్రసాదించునా? నాకొరకై రాముడు పరితపించి పరితపించి శుష్కించిపోయినాడా! ఆయనకు నాయెడగల ప్రేమవంటి ప్రేమ తల్లియెడగాని, తండ్రియెడగాని, తమ్ములయెడ

గాని లేదయ్యా! ఆగాఢానురాగబలమును నేనెరుగుదును. కావు ననే ఆయన కుశలవార్తాదికము దెలియనెంచియే యింతవరకును జీవించుచున్నాను."

సీత యీవిధముగ దనయెడదలో రాముని గూర్చి మెదలుచున్న యూహాలన్నింటి నాంజనేయుని ముందు గుండె కదిలించి కుప్పగ బోసినది. మనోజ్ఞములు- మధురాతిమధుర ములునయిన మైథిలి పలుకుల విని మారుతి యుప్పొంగిపోయి మస్తకన్యస్తాంజలియై యామెకడ నిట్లు విన్నవింపదొడగినాడు.

"సంస్తవనీయురాలవైన సాధ్వీమతల్లీ! నీహృదయ మును - నీకు రామచంద్రునిపట్ల ప్రగాఢభక్తిని - ఆస్వామికి నీయెడగల గాఢానురాగమును నే నెఱుగనివాడనుగాను. రాముడు నిస్సందేహముగ లంకకు వచ్చితీరగలడు. తన ప్రయ త్నమున కడ్డుగ నిల్చినవారి నందరిని దారుణముగ జెండాడి రావణుని ఘోరరణమున పౌరుషశక్తితో సమయించి తప్పక నిన్ను వెంటగొని పోవగలడు." హనుమ యిట్లనినాడు.

మారుతి పల్కులన్నియు భక్తిరస ప్రధానములు. సీత విషయ మట్లుగాదు. జానకినోట వెలువడిన ప్రతిమాట-అర్థప్రధా నమైన ట్టిది. రాజనీతియుతమైనట్టిది. కేవలావేశము నిరర్థకము. కేవలావేదనము నిరుపయోగకరము. రాజు సద్ధర్మ పరిపాల నలో చతురుపాయముల నాశ్రయింపకున్న శత్రువిజయము నందజాలడు. కావుననే రాముడు స్థిరచిత్తుడై విధుల నిర్వహిం

చుచుండెనా! - యను మాటలలో రాముని మానసికస్థితి సంచనావైచుటకై ఆంజనేయుని పలురీతుల ప్రశ్నించినది. క్షత్రియమర్యాద నెరిగి వీరవనితగ బలుకవలసినతీరును సీత క్రొత్తగ నేర్వవలయునా? అది చేపపిల్ల కీత నేర్పుట వంటిదే కాగలదు. కావుననే ఆమె యారీతి నర్థవంతముగ మాట్లాడినది.

పిమ్మట ఆంజనేయుని జూచి మారుతీ! రావణనిర్ణయమును నీవును పైనుండి వినియే యున్నావుగదా! మరియింకొక రెండుమాసముల గడువుమాత్రమే మిగిలియున్నది. అది గడచినయనంతర మాఖలుడు - దుష్టరావణు డెట్టిఘోరమునకు బూనుకొనునో! ఎఱుకపడక యున్నది. నీ వీతరుణమును గుర్తునందుంచుకొని ఆర్యపుత్రుని గొనివచ్చి నాకు విముక్తిని గలుగజేసి మాకు సాయపడవలెనయ్యా" అని దీనముగ బల్కినది.

ఆంజనేయుని హృదయ మానందతరంగములమధ్య దేలియాడసాగినది. తాను గావించినశ్రమ ఫలితమునకు రానున్న సూచనలు గన్పించినపు డెవ్వరికేని యిట్టి మోదమే సముదయింపగలదు. కొండ నెక్కినట్లయిన దాంజనేయునిపని. తన శ్రమ రిక్తపోవలే దనెడి ధైర్యము కలిగినకొలది మారుతి గుండెలలో నూతనచైతన్యము ప్రజ్వలితము గాసాగినది. ఆనందాతిశయముతో మహోత్సాహముతో "తల్లీ! వైదేహీ! చింతిల్లకమ్మా! భవిష్యత్తంతయు సంతోషమయమే కాగలదు తల్లీ! శ్రీరాము డపారసేనావాహినితో నిరభ్యంతరముగ నిచ్చటికి

వచ్చి తీరగలడు. విజయ మాయన వంకకే మ్రొగ్గగలదు. నీ విచార మంతరించి తీరవలసినదే. నీ వనుమానింపవలసిన పనియే లేదు. కాదేని! ఆలస్యమేల ? అమ్మా! నీ వనుమతించిన జాలును. నిన్ను నాభుజస్కంధములపై నిడుకొని నిరభ్యంతరముగ నాతండ్రివద్దకు గొనిపోవగలను. నీకీ ఘోరబాధను తండ్రివచ్చియే తొలగింపవలసిన పనిలేదు. నీ వాజ్ఞ యిచ్చిన జాలును. నే నా కొలదిపాటి పని క్షణములమీద నొనర్ప గలను. నాకెవ్వ రడ్డువచ్చెదరో నేను చూచుకొందును. నాకేమియు భయము లేదు- రాదు. నామాట విశ్వసింపుము తల్లీ!" అనుచు హనుమంతు డావేశానందదోద్రేకములు ముప్పిరిగొన జానకికి పరిపూర్ణోత్సాహమును సంఘటించుచు బలికినాడు.

హనుమ యానంద మట్లున్నది. ప్రభుశాసనమును ఫలప్రద మొనర్పజాలిన బంటున కెట్టిప్రమోద మొదవునో! అర్థ మొనర్చుకొనుట కాంజనేయుని వాక్యములే సాక్షీభూతములు. నిజముగ సీత సమ్మతించిన, నట్లామెను బుజములపై నిడుకొని పోవగల సర్వసమర్థుడే మారుతి. కాని! హనుమ యుత్సాహము నామె మన్నింపనేర దయ్యెను.

"ఈదుఃఖజలధినుండి నిన్నుద్ధరింపగల బాధ్యత నాపై నిడుము తల్లీ! నిన్నిప్పుడే రామున కొప్పగింతును. నన్నెవ రేమి చేయగలరమ్మా! అవసరమగుచో లంకనుగూడ సునాయాసముగ రామునివద్ద కెత్తుకొనిపోవగలను తల్లీ"! అని ధీరహృదయమున

బల్కుచున్న ఆంజనేయుని వచనముల కామె సంతసించుచునే సందేహించుచు నిట్లనినది. "హనుమా! నీమాటలు నాకు నవ్వువచ్చునట్లు గావించుచున్నవి. ఇంతదూరము నన్నెట్లు మోసికొని పోవగలయ్యా! యీ నీసాహసము నీవనచరత్వము నకు సూచకముగ నున్నది. అవునో! కాదో! నాకేల? నీ వంతటివాడవే యగుదు వనుకొందును. కాని! పరపురుషస్పర్శ నా కనభిమతము. స్మృతిలేక వివశనై పడియున్న తరుణము ననే రావణుడు సైతము నన్ను స్పృశింపగల్గినాడు. నే నీవిషయ మున చేయగల్గిన దేమియును లేదు. కనుక వానరోత్తమా! నీవు వెంటనే రాముని సన్నిధానమున కరిగి- రాముని ససైన్యముగ గొనివచ్చి నాకు సంతసమును ఘటింపుము." సీత యిట్లు వాకొనగనే "అమ్మా నిన్ను గొనిపోకున్నతరి నేను నీవద్దకు వచ్చి మాట్లాడినట్లు రాముడు గుర్తింపదగిన యొకచిహ్నము నేదేని నాకిప్పింపు"మని మారుతి ప్రార్థించెను.

సీత చూడారత్నమును దీసి ఆంజనేయుని దోసిట నుంచగా - మారుతి యద్దానిని ముమ్మారు కనుల కద్దుకొని భద్రపరచుకొని బయలుదేరుటకు సన్నద్ధుడగుచుండెను.

వానరోత్తమా! నీ మాటలపై గల విశ్వాసమే నాకూపిరియై నిల్చి ప్రాణదాన మొనర్చుచుండును. గడువు ముగియులోపల వచ్చి నేను జీవించియుండుట కెట్టి శ్రద్ధ గైకొనవలెనో! అట్టి శ్రద్ధను శ్రీరాముడు స్వీకరించుటకు తగినమాటలు చెప్పి నాపతి యనుగ్రహము నాకులభ్యపడునట్లు చేయుమని బహు

ముఖముల పదేపదే తనహృదయావేదనను మారుతి ముందామె సమగ్రముగనే విశదీకరించినది. మారుతి మహోత్సాహముతో ముందు కరిగినాడు. సీత సహోత్తేజమున దీపించుచు నచటనే నిల్చినది.

హనుమ సర్వసమర్థునివలె గన్పడుచున్నాడు. పలికిన పలుకులుగూడ విశ్వసనీయములుగ దోచుచున్నవి. నాకష్టము తీరిన నీయన మూలముననే యీడేరవలయును. శ్రీరాము దర్శనభాగ్యము - పునరనుగ్రహసిద్ధియు గలిగిన యితనివలననే కలుగవలయును. దైవము నాపట్ల పరిపూర్ణకృప జూపుచున్నాడు. దురదృష్టవశమున నేనిట నిర్బంధింపబడినను నా భర్త కెట్టిలోటు వాటిల్లనీయని సుగ్రీవునివంటి హితుడు-గుండెలు చీల్చి యిచ్చుటకేని సంసిద్ధుడైయుండి సేవలొనర్చు హనుమ వంటి దాసుడు శ్రీరామునకు లభ్యపడుటయే నామహాదృష్ట మనుకొనుచు, సూహాజగమున దేలిపోవుచున్నది.

"శుభమస్తు తే పంథాః" నీ ప్రయాణము శుభముగ జరుగుగాక! అని ప్రేమాదరముల నొలుకవోయుచు జానకి మారుతి నాశీర్వదించినది. బయలుదేరుట కనుమతించినది. ఆంజనేయుడామెవద్ద వినమ్రుడై సెలవుగైకొని అశోకవనము వంకకు సాగినాడు.

"కూరులైన యీరాక్షసాధములు నాతల్లిని పలుతెఱగుల బాధలపాలొనర్చుచున్నారు. వారు మాయమ్మపట్ల

వహించిన దారుణవైఖరికి, వారికి చక్రవర్తియైన రావణుని యొక్క పశుప్రవృత్తికి తగినగుణపాఠము జెప్పకున్న నాగాకరు ప్రత్యేకార్థమేమి? రావణునికి అత్యంత ప్రీతిపాత్రమైన అశోక వనమును సమూలనిర్మూలమొనర్చి దీనిని మరుభూమిగ మార్చి నగాని తనకు తృప్తి సేకూరునట్లుగ లేదు." మారుతి యిట్లు తల పోసినాడు. వనభంగము జరిగినగాని - ఆయన వీరవిక్రాంతికి విశ్రాంతి లభింపదు. కావున తోరణకవాటము పైకి కుప్పించి యెగసినాడు. వనమంతయు చిందరవందరయై పోవసాగినది. ఆ మహోవానర విక్రమాటోపమునకు రాక్షసాంగనల గుండె లవి యసాగినవి. ఈప్రళయము మిల్లీ కొనసాగిన జరుగగూడని దుష్ప రిణామము లెన్నియో జరుగును. తరువాత చింతించి ప్రయోజ నమేమి? కింకర్తవ్యతా మూఢస్థితి రాక్షసమహిళల నావరించి నది. వారొక్కపెట్టున నుక్కిరిబిక్కిరియై దిక్కుదోచక జానకి వద్దకు బరువెత్తుకొనుచు వచ్చినారు. వారిగుండెలు కొలిమి తిత్తులవలె రొప్పుచు బుసలు గొట్టుచున్నవి. వారిమోములపై విషాదరేఖ లలముకొనియున్నవి. తత్తరపాటున వారిచిత్తము లాకులములై వ్యాకులమున మునుగుచు దేలుచున్నవి. వారు సీతను నిలదీసి భయభ్రాంతులతో ప్రశ్నించుచున్నారు.

"జానకీ! ఎవడీ వానరుడు? ఎవనికి సంబంధించిన వాడు? ఎక్కడనుండి వచ్చినాడు? దేనికి వచ్చినాడు? వీనితో నీవేమి మాటాడితివి?

సీత యంతయు వినినది. వదనమునగాని వాక్కులలో గాని లవలేశమేని మార్పు గనిపించని తెఱగున ప్రశాంతముగ నీరీతి సమాధానముల జెప్పసాగినది.

"భీమరూపులగు రాక్షసులనుగూర్చి తెలిసికొనుటకు నాకేమి శక్తిగలదు? ఈతఁడెవరో? ఏమిచేయునో? మీకే యెఱుగవలయును. పాముల గమనలీల పాములకే యెఱుక. ఇందు సంశయము లేదు. నేనును వీనికి భయపడితిని. ఈతఁడెవరో నే నెరుగను. వీనిని కామరూపియై వచ్చిన రాక్షసుడనియే యనుకొనుచున్నాను.

"రక్షసాం భీమరూపాణాం విజ్ఞానే మమ కా గతిః
యూయ మేవాభిజానీత యోఽయం యద్వా కరిష్యతి"

అహి రేవ హ్యహేః పాదా న్విజానాతి నసంశయః
అహ మప్యస్య భీతాస్మి నైనం జానామి కోన్వయమ్.

వేద్మి రాక్షస మేవైనం కామరూపిణ మాగతమ్."

రాక్షసస్త్రీలకు సీత యిచ్చిన సమాధానములను వాల్మీకి మహర్షి యీపై శ్లోకములలో వ్యక్తీకరించినాడు. జానకి పలుకులకు నిరుత్తరులైన దానవకాంతలు రావణునివద్దకరిగి యిట్లు విషయమును తెలిపిరి.

"ప్రభూ! భయంకరస్వరూపుడైన వానరుడొకడు వచ్చి అశోకవనము నంతయు విధ్వంస మొనర్చినాడు. జానకితో

సంభాషించిన యాతఁడివ్వడు నచటనే యున్నాడు. వానివివర ముల దెలుపుమని యెన్నివిధముల ప్రశ్నించినను సీత మాఁకెరి గించుటలేదు.

న చ తం జానకీ సీతా హరిం హరిణలోచనా
అస్మాభి ర్బహుధా పృష్టా నివేదయితు మిచ్ఛతి.

ఆత డెవ్వరిదూతయో తెలియుదు. కాని యశోకవనము నంతయు జెల్లాచెదఱుగావించిన యీ వానరుడు సీత యున్న ప్రాంతమునకు మాత్రము రవ్వంతయేనియు నష్టమును గల్గింప కుండుట వింతగనున్నది. జానకీ సంరక్షనార్థమే యట్లు గావిం చెనా? ఏమో! లేక యచ్చటికి వచ్చుసరికి యలసటజెంది విర మించెనో! తేటతెల్ల మగుటలేదు. మాకు జూడ నతనికి శ్రమ యుండునా? యను శంక గల్గుచున్నది. కావున సీతను గాపా డుటే పరమధ్యేయముగ నెంచి యతి డాప్రాంతమును కావలె ననియే వదలివేసియుండునని మేము సుదృఢముగ నమ్ము చున్నాము.

"జానకీ రక్షణార్థంవా శ్రమాద్వా నోపలక్ష్యతే
అథవా కః శ్రమ స్తస్య సైవ తేనాభిరక్షితా"

ఆప్రాంతమున గన్నుపడనీయక తదితరప్రాంతము నంతయు భగ్నపరచిన వానరుడు జానకీరక్షకుడనియే తోచుచున్నది. తెలియు టేమిటి? సుస్పష్టమగుచున్న విషయమే యది. సీత కా యశోకవృక్ష మాశ్రయము నిచ్చినది. మరియును సీతకు

దాని యవసర మెంతగనో గలదు. అశోకవృక్షమే భగ్నమైన పై దేహి కాశ్రయమే యుండదుకదా! కావుననే యిట్లా మెకు మేలొనర్చిన యాతడెవ్వరో! తప్పక సీతకు తెలిసియుండ వలెను. కాని! ఆమె తెలుపుట కిచ్ఛగింపకున్నది.'' రావణు నెదుట దనుజభామలు వెల్లడించిన విషయము లివి.

## సీత అసత్య మాడినదా ?

ఈ సన్నివేశమును బఠించుతరి మారుతి విషయము తెలిసియు తెలియదని దానవస్త్రీలతో సీత పలికిన పలుకు లసత్యములా? అనెడి శంక గలుగుచున్నట్లు నేడు పలువురు విమర్శకులు పనిగట్టుకొని ప్రచారము జేయుచున్నారు. నేటి విమర్శకు లర్థరహితముగ నేమేని వాకొందురుగాక! నైతికవాదుల మనుకొనువారు కొందరు, చరిత్రకారులు కొందరు సైతమీ పాటనే మరలమరల పాడుచున్నారు. మన మీ వాదమునగల సత్యము నరయవలసియున్నది. ఈయాక్షేపణల కాధారము లేవేని యున్నవా! యని పరిశీలింపవలసియున్నది. మహాసాధ్వి సీత అనృతదోషమునకు గురియగునా? లేక యిది యామెపై రాక్షసాంగనలవలె కొందరు విమర్శకులు పడవైచిన అభాండమా! సర్వసామాన్యదృష్టితో పరిశీలించినవారి కెల్లరకును నిందు సీత యనృతమాడినట్లుగనే తోచును. అనృతమాడవలసిన యవసర మామె కేమియున్నది? కానిచో! మారుతిని గూర్చి యామె యేల సూటిగ వివరింపదు? ఆ సన్నివేశమున

సీతాపాత్రమున కిదియొక విషమపరీక్షయే. ఆమె సౌహార్ద యము నిజమున కీ సమస్యమీఁదనే యాధారపడియున్నది.

అసత్యము నైచ్ఛికముగ నాడవలయునని కాని - అనురాఁగసల నమ్మించి పెడదారి బట్టించవలయునని కాని సీత యుద్దేశము కానేకాదు. ఆమె ప్రళయమువచ్చినను సత్యమునే వచించును. వాస్తవముగ ననృతము పలుకవలసిన యవసరమామెకు లేదు. సందర్భమును వివరింప నిచ్ఛయే యామెకు లేదు. కావుననే ఆంజనేయునిగురించి సైతము పూర్తిగ వివరించుట వెఱ్ఱితనమే యగునుగాని వివేకవంతమైన విషయమనిపించుకొనజాలదు. కావుననే సీత మారుతినిగూర్చి అడిగినవారికి వివరము లందింప దలచ లేదు. ధర్మానుకూలమైన రీతిలో శీలరక్షణము గాపించుకొనుటకు యత్నించుట పరవంచన యెట్లు కాగలదు ?

"అత డెవరో నాకు తెలియదు. కామరూపియగు రాక్షసుడే యగునేమో! నాకేమి యెఱుక?" అనుటలో సీత రాక్షస స్త్రీలను మోసపుచ్చుట కని ద్యోతకమగునా? కాక వారిమూలమున రావణుని మోసగించుట వ్యక్తమగునా? తాను పలికిన పలుకులు వేదవాక్కులుగా రక్కసులు విశ్వసింతు రనునమ్మకము సీతకు గలదా ? సీత కున్నదో! లేదో! మనమైన నమ్ముదుమా!

గడచినరాత్రి త్రిజట యొకకల గనెను. స్వప్నగత దృశ్యముల నెల్ల రక్కసులకు స్పష్టీకరించినదికదా!

"లంకా దృష్ట్వా మయా స్వప్నే రావణే నాభిరక్షితా
దగ్ధా రామస్య దూతేన వానరేణ తరస్వినా"

"రావణునిచే రక్షింపబడుచున్నలంక- రామదూతయైన యొకవానరునిచే దగ్ధముచేయుబడినట్లు కలగాంచితి"నని త్రిజట చెప్పిన యనంతరము మరల రాక్షసాంగనలు వచ్చినవనచరు డెవ్వడని ప్రశ్నించు టేమిటి? ప్రశ్నించెరే యనుకొందము. స్వప్నగత వృత్తాంతమునుగూర్చి సమగ్రముగ సీతతో తర్కింపకుండుటకు హేతు వేమి ?

అదియునుగాక లంకాప్రవేశము గావించిన నవనాటక సూత్రధారియైన హనుమంతుడే లంకలో ప్రవేశింపబోవుతరి లంకిణికి తననుగురించి విశదముగ చెప్పియున్నాడా ? లేదు.

"నాపంక తేటపార జూడుము. నేనొక నిరపాయుడ నయిన ప్రేక్షకుడనే. లంకను దర్శింపవచ్చినాను." చారుడుగా వచ్చిన మారుతి తనవిషయమును గుప్తముగ నుంచుటలో ధర్మమే కలదు గదా! రాక్షసుల బారినబడి పలుకష్టముల పాలగుచున్న సీతకు నిరంతరముగ దనను కనిపెట్టి కావలిగా యుచున్న రాక్షసస్త్రీలకు తనవిషయమును వివరింపవలసిన యవసరమేమి? వివరింపకుండుట న్యాయమనియే భావింపవలెను ఆమె యావిషయమును చాటకుండుటలో అసత్యమేమున్నది? అయినను సీత యనృతమాడలేదని సహేతుకముగ నిరూపించు

టకుగూడ నవసరములైన సాక్ష్యములున్నవి. వానిని బరిశీలించిన సీత యసత్యమాడలేదని విస్పష్టముగనే తెలియుచున్నది.

అబద్ధమాడుటవలన యీ సందర్భమున సీత కేదేని ప్రత్యేకప్రయోజనము గలదా? కాక ! స్వార్థము నభిలషించి యామె యిట్లసత్యమాడుట కుద్యమించినదా?

"అస్తి సూక్ష్మతరం కించి దత్ర"-ఇచట కొలదిగ నేదో సూక్ష్మధర్మ మున్నది. తదనుగుణముగ దిలకించిన మనము సఫలీకృతులము కాగలమా?

నిజ మాలోచించినచో భయపడుటయే అబద్ధమాడుటకు మూలము. అట్టిజం కేదేని కలిగి సీత యబద్ధమాడెనా? తనప్రాణరక్షణ కుద్యమించి సీత యసత్యాలాపములకు బూనుకొనెనా? అట్టిశంకల కీసంఘటనమునం దెచ్చటను తావులేదు.

"రాముని యాజ్ఞ లేక మానితిని. లేకున్న యెన్నడో నిన్ను భస్మ మొనర్చియుందు" నని రావణునితో నే సూటిగ నిర్భయముగ బలుక నేర్చిన సీత-భయ కారణమున నసత్యమాడె ననుటకు వీలులేదు.

ఒక వేళ నిజముచెప్పినచో తనపలుకులవలన ఆంజనేయున కేమైన రాక్షసులు ముప్పు వాటిల్ల జేయుదురని శంకించి బొంకె నని యనుకొందమా?

"నహి త్వాం ప్రాకృతంమన్యే వానరం వానరర్షభ
యస్య తే నాస్తి సంత్రాసో రావణాన్నాపి సంభ్రమః"

“వానరశ్రేష్ఠుడవైన మారుతీ! నీ వసామాన్యవానరుడవని నేనెరుగుదును. రావణునివలనగూడ నీకెట్టి భయసంభ్రమములుండజాలవు.”

సీతయూహ యాంజనేయునిగూర్చి యిట్లున్నది. అట్టితరి హనుమంతుని క్షేమము కొరకై సీత యనృతమాడెననుటకు గూడ దగిన యవకాశములేదు. తనను తాను నిరాటంకముగ నాంజనేయుడు రక్షించుకొనగల శక్తిమంతుడని సీతకు ప్రగాఢ విశ్వాసమున్నది. ఆంజనేయునికిగల సకలశక్తులు సీతకు తెలియనివికావు.

“తవ సత్వం బలంచైవ విజానామి మహాకపే!
వాయోరివ గతిం చాపి తేజశ్చాగ్నే రివాద్భుతమ్.”

అట్టిశక్తి ఆంజనేయునకున్న సీత వానికొరకై అసత్యమాడవలసిన యవసరమే లేదు.

ఇక రామకార్యభంగ మగునని భీతితో ఆంజనేయుని గుట్టును బయల్పరుప నిచ్ఛగింపక సీత యబద్ధమాడెనా?

“యది రామో దశగ్రీవ మిహ హత్వా సబాంధవమ్
... ... ... ... ...
శరైస్తు సంకులాం కృత్వా లంకాం పరబలార్దనః”

నయనాభిరాముడగు శ్రీరాముడు సబాంధవముగ విచ్చేసి దశగ్రీవ గర్వభంజన మొనర్చి నన్ను కాపాడగలడను విశ్వాసముగలదని మారుతితో పలికిన సీత,రామకార్యభం

గము జరుగునని యేల శంకించును? తదర్థమై యేల యసత్యముల బల్కును?

రావణునకు తనరాక దెలుపవలయుననియే యుద్దేశపూర్వకముగ హనుమంతుడు అశోకవన విధ్వంసమునకు బూనుకొనినాడు.

విషయములన్నియు నిట్లుండ సీత యసత్యమాడుటకు కారణమేమి? పలుకారణముల పరిశీలించితిమి. వీనిలో నే యొక్క-కారణమున నేని సీత యబద్ధమాడవలసిన యవసరము లేదు. కాని! సీత యసత్యమాడెననుట వాడుకకు వచ్చినది. కారణములు గనిపింపకున్నను నిక్కముగ ననృతమాడెననుట లోకవంక సాక్ష్యము గన్పడుచున్నది.

అయిన-నిజముగ సీత యసత్యమాడెనా? ఆడిన-యామె సౌశీల్యమునకు గళంకమురాదా? సీత యేయగత్యమును పురస్కరించుకొని యనృతమాడినది? అనృతమువలె గన్పట్టెడి యా పలుకులలో - అసత్య పరిహారమున కవకాశ మేదేనియుగలదా? పలుకులకుగల యంతరార్థములశక్తితో సీత కేర్పడిన యసత్య కథన దోషము తొలగునా?

విచారింపదగిన విషయ మిది. సూక్ష్మధర్మముల ప్రస్తావన యిచ్చటనే. మహాకావ్యమున నాయికగా-ఆదర్శ పతివ్రతా తిలకముగా - మహాసాధ్విగా వర్థమానమగుచున్న సీతాదేవి వ్యక్తిత్వము నెట్లు సంరక్షించుట? భాషాచమత్కృతితో, భావ

విశేషములతో సీతమాటలయందే మహర్షికవి అత్యద్భుత శబ్ద వైభవమును బ్రదర్శించి అసత్యదోష నివారణ మొనర్చియు న్నాడు. దీనినే మన మరయవలయును. ప్రతిభావంతులయిన పలువురు పండితు లీయంశముపై నెన్నియోవిధముల వ్యాఖ్యాన ములు వ్రాసియున్నారు. ఆ విబుధవరేణ్యుల "భాష్య" శక్తితో సీతకు-అసత్యకథన దోషనివారణ మెట్లుచేయవలెనో! గమనించి నిర్ణయించుదము. త్రిజటా స్వప్నకథనము జరిగిన కొలదికాలము నకే సీత హనుమంతుని గాంచుటయు-హనుమంతుడు జానకి కభి వందనము గావించి శ్రీరామక్షేమవార్త నెరిగించుచు తనను గూర్చి సీతా హృదయమందిరమున విశ్వాసము నెలకొల్పు కొనుచు సంభాషణ సాగించుటయు - తదనంతరము మారుతి సీత వసించియున్న ప్రాంతమువరకు గిరిగీచినట్లు వదలివైచి శేషించిన యశోకవనము నంతయు గనుమూసి - తెఱచునంత కాలములో సమూలవిధ్వంసన మొనర్చుటయు - వాయునంద నుడు వెడలగనే రాక్షసాంగనలెల్లరు భయవిహ్వలులై - సీత చెంతజేరి యతడెవరనియు, నతనికి నీకును గల సంబంధ మెట్టి దనియు. వాడేమి నీతో రహస్యముగ సంప్రదించెనని ప్రశ్నించు టయు-వాని వృత్తాంతము నతకేమి తెలియుననియు, కామరూ పులైన రాక్షసుల మాయలు రాక్షసులకే తెలియగలవనియు, నింతకన్న మిన్నగ దాను జెప్పదగిన దేమియు. లేదని జానకి నిర్ద్వంద్వముగ బ్రత్యుత్తర మిచ్చుటయు, దానవకాంతలు రాక్షస చక్రవర్తియగు రావణునిచెంత కత్యంత శీఘ్రగమనమున

జరిగి యావద్వృత్తాంతమును క్షణములమీద వానికి విపులముగ విన్నవించుటయు జరిగినది. కథ యిది.

జరిగినచరిత్ర యిట్లున్నది. సర్వసామాన్యదృష్టితో జూచిన జానకి యిచట నన్నృతాపరాధమునకు బాల్పడినట్లుగ దోచును. కాని! ప్రత్యంశమును స్థూలదృష్టితో గాక సూక్ష్మదృష్టితో గూడ బరికింపవలసిన యవసరము సహృదయులగు శ్రోతలపై గలదుకదా! అట్టి నిశితపరిశీలనాత్మక సమీక్షకు గడంగక - అనాలోచితముగ జానకికి అసత్య కథనదోషము నంటగట్టుట యోగ్యతగల విషయము గానేరదు.

సీత భర్తృపదపల్లవ నిత్యకైంకర్య నిరతితో సకలసుఖములను త్యాగమొనర్చి - నాథునివెంట కాననసీమల జరింప గోరి యనుమతిగొని బయలుదేరివచ్చిన పతివ్రతాశిరోరత్నము.

రాముని చరిత్రముతో బాటుగ - మరొక్కింత యధికముగనే యనవచ్చునేమో! - ఆదర్శప్రాయముగ సీతా మహా చరిత్రమును చిత్రణమొనర్చిన కవికులతిలకుడు-మునిలోకచూడామణి - మహర్షి వాల్మీకి. సజ్జనులయిన లౌకికులగు వారిపలుకు లర్థముల ననుసరించి ప్రవచితము లగుచుండు నట. ఋషుల వాక్యముల ననుసరించి యర్థములు వ్యవహృతము లగుచుండు నట. 'ఋషీణాం పునరాద్యానాం వాచ మర్థోనుధావతి - లౌకికానాం హి సాధూనాం అర్థం వాగనువర్తతే." సిద్ధాన్తమిది. అయినతఱి మహాపతివ్రతయైన సీత యబద్ధమాడు టెట్లు

పాసగును? మహోన్నత దోషమగ్నరైన జానకిని ఆదర్శసాధ్విగ మహర్షి వాల్మీకి యెట్లు చిత్రించును?

మహాపతివ్రత యబద్ధమాడె ననుటయే నిర్ధారింపబడిన మహర్షిచంద్రుడైన వాల్మీకిగూడ యనృతదోషమున భాగస్వామ్యము వహింపక తప్పదు.

ఆదికావ్య స్రష్టగా - అనంత మనోబలసంపన్నుడుగా - ధర్మశాస్త్ర భాష్యకారుడుగా - మధుర సత్య వచస్విగా - మాననీయ తేజస్విగా - సర్వలోకాదర్శపాత్ర మహోజ్జ్వల పావన చరిత్రకు (శ్రీ) కారముచుట్టిన వాల్మీకి దోషముగా నీయంశమును మనము పరిగణింపవచ్చునా?

తనవ్యక్తిత్వపు వెలుగుజిలుగులతో వనితాప్రపంచమున ధర్మప్రతిష్ఠాపన మొనర్చి - సుగుణగణ తేజోవిరాజమాన సురుచిర సౌశీల్య సమన్విత సచ్చరిత్రగా సాధ్వీలోకమున మన్ననల గనుచున్న సీతాదేవి మహాపరాధముగ దీనిని లెక్కింపవలెనా? ఇందలి యంతరార్థ మేమి? పరమరహస్య మేమి? ఔచిత్య మేమి? వైశిష్ట్య మేమి? వాస్తవ మేమి?

సీత మహాసాధ్వి. అగుటవలన అనృతములని భ్రమింప జేయుట కవకాశమిచ్చునవియే యైనను దత్సందర్భమున సీత పలికినపలుకులు నిక్కముగ నసత్యములు గావు.

సన్నివేశ బలమునుబట్టి - ఉక్తివైచిత్ర్యమును ప్రస్ఫుటీకరింపజేయుచు జానకిచే మహర్షి వాల్మీకికవి యాసన్నివేశమున

బలికించినపలుకులు నర్మగర్భములైన యనృతములా? యన్న ట్లున్నను నిస్సంశయములుగ నవి యబద్ధములు గానేకావు.

పాత్రలపట్లను, గాథావి శేషముపట్లనుగల యలక్ష్యభావ మున నట్లు భావించెడివారు భావించురుగాక! స్పష్టముగ నద్దము నంబోలె జానకి యనృతము లాడినట్లున్న యీసంఘటనమునం దౌచిత్యమును పిండుగొన బూనుట - వివేకవంతమైన పనిగా దని యనువా రుండిన నుందురుగాక!

ధర్మసూక్ష్మ పరిశీలనాత్మక వివేచన మొనర్చిన స్వల్ప సంఖ్యాకుల కేని యిందలి యాథార్థ్య మెరుకకు రాకపోదు. వారి విశదీకరణమును విన్న పిమ్మట పలువురు శిరఃకంపన మాచ రించి -"ఓహో ! అట్లనా ! అవునవును - సీత నిజమే చెప్పెనే" యను వారుండకపోరు.

బహుకాలమునుండి సాగుచున్న చర్చయిది. పడుచున్న మథన యిది. జరుగుచున్న తర్జనభర్జన యిది. పరిష్కరింపబడ వలసియున్న సమస్య యిది.

ఈ విషయముపై రేగిన దుమారమునంతయు నేకత్ర సంపుటీకరించి సమీక్షించవలసియున్నది.

"సీత యనృత మాడెనా !"

అనెడి వివాదాస్పద విషయముపై బహుకాలమునుండి వాదోపవాదములు జరుగుచున్నవి. అవియన్నియు నొకయెత్తు.

1941-1946 సంవత్సరములమధ్య తమిళనాట చెన్నపట్టణమున మహోద్దండ పండితాఖండులుల మండలి మధ్య జరిగిన తీవ్రవాద పరంపర యొక్క యెత్తు; "హిందూ" వంటి సుప్రసిద్ధాంగ్ల పత్రికలు - వైదుష్య ప్రతిభా ప్రకటనాత్మకములయిన యిట్టి చర్చలను పతాక శీర్షికలతో ప్రకటించుచుండెడివనిన నా డీ సమస్య-యెందరు ప్రతిభావంతుల, విద్వన్మూర్తుల మనముల నెట్లాకర్షించెనో నేడు మనము కొంతకు గొంతగ నేని యూహింపవచ్చును.

కుతూహలమును రేకెత్తించెడి గూఢములు-రూఢములు నయిన యెన్నెన్నియో యంశములను విశ్లేషించి-పరామర్శించి వింగడించి- వివరించి నాటి తార్కికులు తాము ప్రకటించెడి వ్యాసముల ద్వారా సీతాదేవి శీలమునకు లవలేశమేని కళంకము గలుగకుండు పగిది మహర్షి వాల్మీకికవియొక్క మహోదాత్త భావధార కలుషితముగాని తెఱగున సముచిత సమాధానముల జెప్పియుండిరి.

వానిలో ముఖ్యాతిముఖ్యములయిన వానిని గొన్నింటిని పరిశీలించు టెంతేని యవసరము.

ప్రస్తుత విమర్శనము శ్రీమద్రామాయణాంతర్గత సుందర కాండ యందలి కథాభాగమునకు జెందినట్టిది.

"అథాబ్రవీత్ తదా సాధ్వీ సీతా సర్వాంగసుందరీ
రక్షసాం భీమరూపాణామ్ విజ్ఞానే మమ కా గతిః ?

యూాయ మేవాభిజానీత యోాయం యద్వా కరిష్యతి
అహి రేవ హ్యహేః పాదాన్ విజానాతి న సంశయః.
అహ మప్యస్య భీతాస్మి నైనం జానామి కోన్వయమ్,
వేద్మి రాక్షస మే వైనం కామరూపిణ మాగతమ్."

"భీమరూపులగు రాక్షసుల విషయము నేనేమి యెఱుగుదును? పాముల గూఢచరణజ్ఞానము పాములకేగదా తెలియునది! ఇతనిని గాంచిన నాకును భయమగుచున్నది. ఇతఁడెవఁడో? కామరూపియగు రాక్షసుడే యై యుండవచ్చును."

విపులముగనే విస్పష్టముగనే యీ శ్లోకముల భావము వివరింపబడియున్నది.

కాని! ముఖ్యముగ గమనింపవలసిన విషయ మొకటి కలదు. సమస్యను పరిశీలించునపుడు పూర్వాపరముల పరామర్శించుట ముఖ్యము. తత్సందర్భమున కవి ప్రత్యేకార్థ స్ఫోరకములుగా గర్భితార్థ పరిపూర్ణములుగా ప్రవచించిన పదముల యాంతర్యమును, సారమును గుర్తింపవలసియున్నది. సన్నివేశ హృదయముతో తత్పదములు బహిర్గతమొనర్చెడి యర్థములను, విశేషార్థములను, పరమార్థములను సమన్వయించుకొనవలసియున్నది. తదనన్తరమే సహృదయ పాఠకుఁడొక నిర్ణయమును గైకొనవలెను. సమ్యగ్దృష్టితో సావధానముగ సమస్యా నవగాహన మొనర్చుకొనిన పిమ్మటనే సరస హృదయుడైన సమీక్షకుఁడొక పరిష్కారమార్గమును ప్రకటింపవలసి

యుండును. కాదనుటకు వీలుపడని యంశమిది. వాదనలకు తావు లేని వ్యవహారమిది.

ఆయాసందర్భములలో కవి సీతను గూర్చి వాడిన పదము లెవ్వి? ఆ సంబోధనలకు గల ప్రాముఖ్యము గుర్తింపబడినదా? సీత రాక్షసాంగనలకు ప్రత్యుత్తర మొసగుతరి యెట్టి మానసికస్థితికి లోనై యుండెనో యూహింపబడెనా? వీని జోలికేగకయే కొందరు విమర్శకులు త్వరపడి సీత రాక్షసాంగనలకు సత్యసంబద్ధ సమాధానము నొసగలేదని సాహసాత్మక నిర్ణయమొనర్ప గడంగిరి.

ఒక వ్యాఖ్యాత "నైనం జానామి" నేనీ వానరు డెవరో యెరుగ ననెడి మాటను సమర్థించుటకై "వివాహకాలే రతి సంప్రయోగే ప్రాణాత్యయే సర్వధనాపహారే విప్రస్యచార్థే హ్యనృతం వదేయుః పంచానృతా న్యాహు రపాతకాని" అనెడి ప్రమాణము నుట్టంకించి యీ అయిదు సందర్భములలో చెప్పెడి ప్రత్యుత్తరము సత్య సమ్మతమైనదిగ గన్పట్టకున్నను - పాపమును ఘటింపనేరదని పెద్దల యభిప్రాయముగ దెలిపినాడు. సరిపెట్టుకొనదగిన సమాధానము వంటిదే యిది. ఎట్లాలోచించినప్పటికి నిది తృప్తి నిడజాలదు. పైన పేర్కొనబడిన ప్రమాణమున గల "విప్రస్య" అనెడి పదమునకు మారుగ 'మిత్రస్య' అను పదమును జేర్చుకొనినచో-తనకు హితకాముడైన మిత్రుడగు మారుతి రక్షణార్థము సీత యనృతమాడినదనియు,

కాని! అది అఘమును గలుగ జేయనేరదని చెప్పకొనవచ్చు
ననియు రైట్ ఆనరబుల్ శ్రీ శ్రీనివాస శాస్త్రిగారొకవిధ
మైన యభిప్రాయమును వెల్లడించియున్నారు. సీతా మహా
సాధ్వీత్వము నిదియును సమర్థించుకొన జూచుకొనుటకు సాగిం
చిన కృషి యే యగునుగాని అనృతకథన దోషనివారణాదక్షమైన
ప్రయత్నము కాజాలదు. "విప్రస్య" అనుచోట "మిత్రస్య"
అనుట గ్రుడ్డితో మెల్ల వంటిది మాత్రమే.

వేరొక వ్యాఖ్యాత "వై దేహ్యాః వచనం-అజ్ఞాన ప్రతిపాద
కమ్ అనేన ఆత్మత్రాణాదా మృషావాదో నదోషాయేతి
ధ్వనితమ్" అనినాడు. 'సీత యజ్ఞానమూలకముగ పలికిన దబ
ద్ధమేయనియు - నిజము వెలువరించిన ప్రాణాపాయము తన
కేర్పడగలదనెడి భీతితో నిట్టిసందర్భములం దసత్యమాడుట
దోషముగాదనియు ధ్వనించుచు" న్నట్లు వివరించినాడు.

సీత యాత్మసంరక్షణకు -. దానవకాంతల దౌర్జన్య
ప్రయోగమును దప్పించుకొనుటకు కావలెననియే యనృతమును
బలికెననిన నిక యామె మహాసాధ్వీత్వమున కర్థమేమి? అది
దోషముగా నేరదని ధ్వనించుటవలన సీతా సౌశీల్య పరిరక్షణము
జరిగినట్లు కాగలదా? అసంభవాంశము లివి.

"పరంతు - ఆగతం ఏనం రాక్షసం - రాక్షససదృశం
కామరూపిణం వేద్మి బోధయామి" "రాక్షససదృశుడై కామ
రూపమున వచ్చిన యీరాక్షసు నేనెఱుగుదు" నని సీత యనిన

ట్లీసందర్భమునుగూర్చి తికశిరోమణి నుడువుటయు నసంగతము గనే యెంచవలయును. "నే నెఱుగుదు ననునదొక్కటి సత్యమే యగుగాక - రాక్షససదృశుడైన కామరూప రాక్షసునిగా నే నెఱుగుదు ననుటలో నసృతము వ్యక్తమగుచు నేయున్నది కదా!" ఇట్లనుట సామాన్య లౌకికసత్యమేమైన నగుగాక! పరమసత్యము మాత్ర మెన్నటికిని కానేరదని తికశిరోమణి వ్యాఖ్యను ఖండించుచు 1929 లో శారదావిలాస ప్రెస్, కుంభ కోణమువారు ప్రచురించిన "రామభక్త కల్పలత" అనెడి గ్రంథము నిష్కర్షగ వాకొనుచున్నది.

తిరువాన్కూరు గ్రంథాలయమున "మఖ" కవి విరచిత "ధర్మాకూత" మను గ్రంథ మొకటి కలదు. దానిలో కేవల ముగ సుందరకాండాంతర్గతమైన 42వ సర్గ యందలి శ్లోకమున కొక్కదానికే వ్యాఖ్య గావించుచు, నిదమిత్థమని నిశ్చితార్థ మును వ్యక్తీకరింపక "తటస్థ" పద్ధతి నాలంబనముగగొని తప్పు కొని పోవుటకై యొనర్చినయత్నము చిత్రతమముగ నుండును.

"యథా అహేః పాదాన్ అహి రేవ జానాతి తథా మాయావినాం మాయాం మాయావిన ఏవ జానత ఇత్యుక్తం భవతి"

"పాము పాదముల జాడలు పామునకే తెలియునట్లు మాయావుల మాయలు మాయావులకే తెలియు" ననుటవలన

చెప్పబడిన దేమి? దోషనివారణ మెట్లు గావింపబడినది? అనృత కథనపాతక మేరీతి తొలగినది?

"ఉక్తమ్ భవతి" అని ఊరుకొనిన సరిపోవునా? ఇట్టి తటస్థ వ్యాఖ్యానవైఖరి యెట్టి ఫలితమును, ప్రయోజనమును గూర్పనేరదు.

పరంపరాగతములైన నిట్టి ప్రయోజనదాయకములు గాజాలని వ్యాఖ్యానములే ఆధునిక కాలపు కొందరువ్యాఖ్యాతల సందేహములకు తగినయవకాశము నిచ్చుచున్నవి. పాము చావని-బడితె విరుగని పనులకు బూననేల? పరిహాసములపాలు గానేల? ఇట్టి వారి వివరణముల చదివిచదివి తలలు బొప్పులు కట్టిపోయి, ఆ పరిధిదాటి యాలోచనలను పైకి జరుగనీయక - ఆధునికవ్యాఖ్యాతలు పలువురు సీత పలికినది విశ్వజనీనసత్యము కానేరదనుటకు వెనుకాడరైరి.

వీరెల్లరు వాల్మీకి కవీంద్రుని శ్లోకముల యంతరార్థము లను చక్కగ నవగాహన మొనర్చుకొనలేదనియే భావింప వలెను.

పూర్వాపర పరామర్శయు - పదపదార్థ వివేచనాత్మక ప్రజ్ఞయు - సన్నివేశమునగల యౌచితియు - పాత్రల పవిత్రతయు గుర్తునందుంచుకొని వ్యాఖ్యాత తనయూహను వెల్లడింప వలెననియు - నిశ్చయమునకు రావలెననియు, నిర్ణయము గావింపవలెననియు ననుకొనియున్నాముగదా!

ఉదాహరణమున కొక వ్యాఖ్యాన మిట్లున్నది. చూడుడు.
"ఈరాక్షసుల మార్గములలో దేనినైన నేనెరిగిన ట్లెట్లు నటింప
గలను? వారు కామరూపులుగదా! వారినిగూర్చి నాకంటె
మీకే బాగుగ తెలియును. పాములే యితరపాముల నడక
లను గుర్తింపగలవు. ఇత డెవరో? నాకు తెలియదు. వానిని
గూర్చి నేనును భయపడుచున్నాను."

ప్రముఖులే కొందరిట్లు సంప్రదాయమునందున్న పూర్వ
వ్యాఖ్యాతల ధోరణికి దాపుగా సూక్ష్మాతిసూక్ష్మములైన
మార్పులతో నీశ్లోకమునకు వ్యాఖ్యానముల గావించిరి. వాని
వలస దేలిన దేమియును లేదు. పలువురు పండితప్రకాండు లిట్టి
వ్యాఖ్యానపు పోకడలనే మన్నించి యంగీకరించి సీతాదేవి
కనృతదోషము నాపాదించినారు. కాని! మరికొందరు మహో
ద్దండపండితు లీవిచిత్రవాదముల దిరస్కరించి సీతామహాసాధ్వి
శీలసంరక్షణకే - ఆమె కాపాదింపబడిన కళంక విచ్ఛిత్తికే గట్టి
కృషి కొనసాగించిరి. "ఆమె మానవ వనిత. కావుననే సీతాదే
వియు మానవసహజమైన బలహీనతనే కలిగియున్నది. ఏకా
వ్యమునందు చిత్రింపబడిన యేపాత్రయైన నింతకంటె సర్వాసం
పూర్ణ తేజోవిశేషవిరాజితగా, కళంకములేనిదిగ నుండుట కవ
కాశ మేమాత్రమేనియు నుండదు" అని సీతాదేవికి క్షమా
ర్పణ జెప్పుకొనుచు వివరించెను.

"దీర్ఘకాల మానసిక విషాదానంతరము స్వజను డను
కొనదగినవానిని - స్వభర్తృక్షేమసమాచారముల దెల్పిన

వానిని చూచుటతో జానకి సంబర మంబరము నంటినది. ఆమె మోదప్రమోదస్థితిలో నమాయికత్వమునకు ప్రతీకమైనది. ఆ సమయమునం దామె పలుకులయం దేకాదు- దేహమునందును రోమాంచముల నొడిసియగమే వెల్లి విరిసినది."

ఇది మరియొక పండితుని యూహ. ఇందొక వినూత్నత మనకు గోచరించును.

మరియొక విద్వాంసుడు సీత యీసందర్భమున వ్యవహరించిన 'తీరు' ను నీతిశాస్త్రబద్ధమగు రీతిగ వర్ణించినాడు. మరియొక విబుధవరేణ్యుడు మిత్రజీవిత సంరక్షణాత్మక పరమాశయములో సీత నుడివినదానిని సత్యసమ్మతముగనే సంభావింపవలెనని స్పష్టీకరించినాడు. మిత్రసంరక్షణ మనెడి యూహతో సీ సన్నివేశమును సమర్థించుటలో గల యౌచిత్యమును మనము పరిశీలించియేయున్నాము.

"త్రిజటా స్వప్నానంతరము రాక్షసస్త్రీల సంరక్షణ మునే దృష్టియం దిడుకొని - ప్రథితశపథమును మానసికముగ నొనర్చుకొనినసీత - ఆదమరచి నిద్రించుచున్న దానవకాంతల తలలు మారుతి పాద తాడనమున బంతులవలె నెగురకుండ జేయుటకే - అపూర్వమైన ఆత్మత్యాగభావనతో ఆమె యిట్లు సత్యమును వాకొనక మిన్నకుండె" నని మరియొక ప్రాజ్ఞుడుద్ఘాటించినాడు.

ధర్మసూక్ష్మమునకు తర్కమునకు నెదురుగ నిలిచి యీవాదనయును దట్టుకొని నిలువనేరదని మన మనుకొనియే యున్నాము. మఱి మార్గాంతర మేమి? సీత యసత్య మాడి నట్లా? కాదా? ఆమె కళంకపంకమునుండి పులుగడగిన ముత్తె మువలె వెలువడునా? లేదా! అదియే తేలవలయును. తేలని దియు నదియే.

సీతా పాత్రచిత్రణమున కొక ప్రత్యేకమైన యంతరార్థము కలదనియు, మహోజ్జ్వల పరమాదర్శమును కనులముందిడుకొనియే వాల్మీకిమహాకవి సీతామహాసాధ్వీపాత్ర సృష్టి కుపక్రమించెననియు మరియొక పండితుడు వక్కాణించుచు గొన్ని విశేషాంశముల నిట్లు విశదీకరించినాడు. వాని నిట బరిశీలించుదము.

"సీత తదితర స్త్రీలవంటిదికాదు. కావుననే యీపాత్ర చుట్టును కథ నల్లిబిల్లిగ నల్లుకొనునట్లొనర్చి పాఠకుల మానస సీమలలో పావనత్వమునే హత్తుకొనజేయ వాల్మీకికవి ప్రత్యేక శ్రద్ధ వహించినాడు. కావుననే సీత యారీతి సమాధానము నిచ్చినది. అందు లేశమేని దోసము లేదు"

"వాల్మీకియే యొకానొక నిశ్చయ భావనకు వచ్చి సీత కళంకరహిత యని నిర్వచించుచున్నట్లుగ దోచుచుండ మన మీసంఘటనమును గూర్చి వివాదపడవలసిన యవసరమేమి?" అని యాపండితప్రవరుని యభిప్రాయమై యుండవచ్చును.

సర్వసామాన్య భౌతిక ప్రపంచమునకన్న భిన్నమైన - సమున్నతమైన-సర్వోత్కృష్టమైన - సర్వవిధ సత్యసమ్మతమైన విసూత్న ప్రపంచమును కవి రామాయణదర్పణమున మనకనుల ముందు ప్రతిఫలింపజేయ దలపెట్టినాడు. ఆ మహాకవి నిజముగ నపరబ్రహ్మ. ఆయన కావ్యలోకసృష్టి యనితర కవిలోక సాధ్యమైనదని యెల్లరు నంగీకరించుదురు. వాల్మీకి భావజగత్తున నడయాడు పాత్రములన్నియు సముదాత్తములు- రసోచితములు - విశిష్టతమములు - మహౌచిత్య సమన్వితములు. కావున నా మహాకవి సృజించినపాత్రల చిత్రణమున లోపమేదేని యున్నట్లుగ దోచిన నయ్యది మనచూపునకుగల దోసమేగాని అన్యము గానేరదనియు నామహాకవికిగాని, యాయన పాత్రలకు గాని యెట్టి కళంకమేనియు నెట్టిపరిస్థితులందును సంభవింపనేరదనియు నామహాపండితుని సమ్యక్పరిశీలనాత్మక నిర్ణయము.

"వాల్మీకి పదములను నేర్పుతో కూర్పుగావించి గ్రంథమును పరిపూర్తి యొనర్చెడి సర్వసాధారణ కవిమాత్రుడు గాదనియు, గావుననే యాయన పలుకుల నంత తేలికగ గొట్టివేయుటకు వీలుపడదనియు శ్రీమద్రామాయణ మహాకావ్యమునే ప్రత్యేకగౌరవదృష్టితో పరిశీలించి పఠించవలెననియు" మరియొక పండితుడు స్పష్టపరచినాడు.

పలువురు పండితు లీరీతి కవిని గురించియు, కావ్యమును గురించియు, నందలి యున్నతములైన పాత్రలయందద్రేసరమన

దగు సీతనుగురించియు పలు తెఱగుల మహోదాత్తముగ దెలియ జేసిరి. నేటికిని దెలియజేయుచు వివిధదృక్కోణములతో దిల కించి రామాయణగాథపై - సీతాసౌశీల్య వైభవముపై వారు గావించిన వివరణ వినసొంపుగనే యుండును. విన్నకొలదివినెడి యంశముపై గౌరవభావన మెండగును. కాని! వినినవారందరు శంకాసంకులితాంతరంగులుగనే యుండిపోవుచున్నారు. వినవల సినదంతయు వినినపిమ్మటగూడ - చదువవలసిన దంతయు జదివిన యనన్తరముగూడ వారిడెందములయం దొకవంక సందియము దోబూచులాడుచునే యున్నది. తీరనియనుమాన మొకటి గట్టిగ నిలిచిపోవుచునే యున్నది. మఱి యెప్పటికీ సమస్యకు పరిష్కారము లభ్యపడును? మఱి యెన్నటికీసందేహ నివృత్తి యగును? సర్వజనాంగీకారము నందుటకొకే యొక మార్గ మున్నట్లు బుధాగ్రగణ్యులు వివరించుచున్నారు.

ఈవ్యవహారమునంగల వాస్తవము వెల్లడి గావలెననిన సీతాదేవి రాక్షసస్త్రీలతో గావించిన సంభాషణమునకు ముందు వెనుకలగల కొన్నిపదములను - సంబోధనలను వివరణాత్మక దృష్టితో పరిశీలింపవలయును. నాడే యాశంకలు నివారింపబడు టకు రాజమార్గము గనిపించును. నాడే యీయంశమునం దంతర్లీనములై యున్న విశేషాంశములు బహిర్గతములగును.

తాదృశమైన సమీక్ష నెవరేని జరిపిరా? అట్టి దృక్పథముతో నీసమస్య నెవరేని పరిష్కరింప యత్నించిరా? అట్లు

జరుగకుండుటవలననే - అభిప్రాయ ప్రకటనములసంఖ్య పెరిగి నది. అంతియేకాని శంకానివారణానుకూలమైన పరిష్కృతి యొక్కటియును గనిపించలేదు.

కావుననే అట్టి ప్రయత్నమునకు బూని యందలి సారాంశ మున నిగ్గుదేల్చి - తీర్పునిచ్చిన న్యాయమూర్తి పగిది యీ సమస్యపై పరిష్కారమున కవకాశము గల్గించిన యొకమహ నీయుని వాదము నిచట పొందుపరచవలసిన యవసరమేర్పడినది. ఆమహనీయుడే కల్లిడైకురిచ్చి సంస్కృతకళాశాలా ప్రధానా ధ్యాపకులు బ్రహ్మశ్రీ శంకరశాస్త్రిగారు. వారు పై అంశముల నన్నింటిని క్షుణ్ణముగ బరిశీలించి పరిశోధించి వాల్మీకి మహాకవీం ద్రుని భావతరంగభంగిమలను సర్వజనసమ్మతమగు ధోరణిలో మనోజ్ఞమగు రీతిలో "సీతారాక్షసీ సంవాదతత్త్వము" అనెడి పేర గ్రంథరచన గావించి ప్రచురించినారు.

సీతాదేవి నిత్యసత్యవాక్య కథనతత్పరయనెడి యంశ మిందు సుస్పష్టముగ నుద్ఘాటింపబడినది. ఆయన యాసన్ని వేశ మునేగాక యాసందర్భమున పూర్వాపరములలో ప్రియుక్తము లయిన పదములను, సంబోధనములను బాగుగ మథించి నిగ్గు దేల్చుటవలననే ఈగ్రంథమున కొకప్రత్యేకప్రశస్తి లభ్యమైనది. అదియే నాటికి- నేటికి- రేపటికి- గూడ నీవిషయమున ప్రమాణ గ్రంథముగా నిల్చినదనుట నిర్వివాదము. అందు శ్రీ శంకర శాస్త్రిగారు ప్రకటించిన భావధారనే శ్రీకాకర్లాల యస్. సుందర

రామయ్యగారు. "ఎటర్నల్ ట్రూత్ ఆఫ్ సీతాదేవి" (సీతాదేవి విశ్వజనీన సత్యవాక్కు) అనెడి చిన్నయాంగ్ల గ్రంథమున సంతరించి అనువదించుటయు నీగ్రంథ విశిష్టత కొక విశేషగౌరవమును ఘటించినది.

శ్రీశంకరశాస్త్రిగారు సుందరకాండమున 42-వ సర్గలో గల మొదటి 21 శ్లోకములకు సంప్రదాయపద్ధతిలో- తదితరులు వంకలుజూపుటకు వీలుకలుగని స్థాయిలో-సముదాత్తవైఖరిలో-మనోహరవ్యాఖ్య యొనర్చినారు. తనవాదమునకు ప్రబలముగ నుండుటకై యెన్నియో వాల్మీకి కవిచంద్రుని రామాయణాంతర్గత శ్లోకముల నటనట నుదహరించుచు వచ్చినాడు. సీతాదేవి సమాధానసరళి యంతయు సత్యసమ్మతమైన దేయని నిర్ద్వంద్వముగ నిరూపించు నిమిత్తము శ్రీ శంకరశాస్త్రిగారు ప్రకటించిన యసాధారణ మనోజ్ఞ విమర్శనాపద్ధతి, సమీక్షావైఖరి కడుంగడు రమణీయమై యలరారుచున్నది. సీతాదేవి శీలమునకు కళంకమును దొలగించివై చెడి యీామహనీయుని సముచిత సమర్థనము మనోహరముగ గొనసాగినది. అంతకుపూర్వము భిన్నభిన్న ధోరణులలో వ్యాఖ్యానములు రచించినవారెల్లరు, పండితశిరోమణు లందరు శ్రీ శాస్త్రిగారి సమీక్ష వెలువడగనే వెనుక ముందు లరయక యాయన రచించిన గ్రంథమునగల సమస్త విషయసంపత్తిని సాదరముగ నామోదించి శిరసావహించి సంతోషముగ స్వీకరించిరి. సత్యపరిశోధన ప్రవణులైన వారికిది మహానందమును సమకూర్చినది.

వానినన్నింటిని వరుసవరుసగ విశదీకరించి శ్రీశాస్త్రిగారి ప్రతిభను ప్రకటింప ప్రయత్నించవలసిన పనిలేదు. ప్రస్తుతమున కవసరములైన యీక్రిందిశ్లోకములకుగల పదముల యాంతర్యమును గమనించిన చాలును. సర్వవిధముల సందేహానివృత్తి కాగలదు. జానకీసౌశీల్య వైభవము వ్యక్తము కాగలదు. సుందరకాండమునగల 42-వ సర్గయందలి 6 నుండి 14 వరకు గల శ్లోకములే యవి.

శ్లో॥ కోఽయం కస్య కుతో వాయం
కిం నిమిత్త మిహాగతః
కథం త్వయా సహానేన
సంవాదః కృత ఇత్యుత. 6

శ్లో॥ ఆచక్ష్వ నో విశాలాక్షి
మాభూత్తే సుభగే భయమ్,
సంవాద మసితాపాంగే
త్వయా కిం కృతవానయమ్. 7

శ్లో॥ అథాబ్రవీత్తదా సాధ్వీ సీతా సర్వాంగసుందరీ
రక్షసాం భీమరూపాణాం విజ్ఞానే మమ కా గతిః. 8

శ్లో॥ యూయ మేవాభిజానీత యోఽయం యద్వా కరిష్యతి
అహి రేవ హ్యహేః పాదా న్విజానాతి న సంశయః. 9

శ్లో॥ అహ మప్యస్య భీతాస్మి నైనం జానామి కోన్వయం
వేద్మి రాక్షస మేవైనం కామరూపిణ మాగతం. 10

శ్లో॥ వైదేహ్యా వచనం శ్రుత్వా రాక్షస్యో విద్రుతాదిశః
స్థితాః కాశ్చి ద్గతాః కాశ్చిద్రావణాయ నివేదితుమ్. 11

శ్లో॥ రావణస్య సమీపేతు రాక్షస్యో వికృతాననాః,
విరూపం వానరం భీమ మాఖ్యాతు ముపచక్రముః. 12

శ్లో॥ అశోకవనికా మధ్యే రాజన్ భీమవపుః కపిః,
సీతాయా కృతసంవాద స్తిష్ఠ త్యమిత విక్రమః. 13

శ్లో॥ నచ తం జానకీ సీతా హరిం హరిణలోచనా,
అస్మాభి ర్బహుధా పృష్టా నివేదయితు మిచ్ఛతి. 14

–ఇవి యాశ్లోకములు. వీనికిగల సామాన్యార్థమునే దృష్టియం దిడుకొని పదములకు మామూలుగాగల సాధారణార్థమును స్వీకరించి యన్వయించుకొనినచో సీత యబద్ధమాడినట్లుగ స్ఫురించుచుండును. పలువు రీవిధముగనే సమన్వయమును గుదుర్చుకొని సీత యసత్యకథనమే యొనర్చెననుచున్నారు. కాని! యథార్థముగ వాల్మీకి యభిప్రాయ మయ్యది కానేకాదు. తనసృష్టిలో మహోజ్జ్వలపాత్రిగా విరాజిల్లి, యుగయుగాంతములవరకును మహిళాలోకమున కాదర్శప్రాయచరిత్రగ వర్ధిల్లవలసిన సీతయొక్క పాత్రౌచిత్యమునకే భంగము వాటిల్లుట – మహాకవి యభిమత మెట్లు కాగలదు ? సానలుదీరిన వజ్రముగా నొరపిడిబట్టిన మణిగా దీపించవలసిన చరిత్రము సీతామహాసాధ్వీచరిత్రముగదా !

కావుననే కవియూహను బాగుగ గుర్తించి శ్రీశంకర శాస్త్రిగారీవిధముగ వ్యాఖ్యానించిరి. దానవకాంతలు ధరణీ సుతతో పల్కిన దేమి? మొదటినుండియు క్రమసమీక్ష యొనర్చినగాని తేలనివ్యవహార మిది. ప్రథమతః రాక్షసస్త్రీలు సీతతో మారుతినిగూర్చి "వీడెవడు? దేనికి వచ్చినాడు? ఎక్కడ నుండి వచ్చినాడు? నీతో నేమి మాట్లాడినాడు? విశాలాక్షీ! నీవు మాకు వినిపింపవలయును. సుభగే! నీకేమియు భయము లేదు. అసితాపాంగే! వాడు నీతో సంభాషించిన దేమియో మాకు చెప్పితీరవలయును."

వారిమాట లివి. వారొనర్చిన సంబోధన లివి. సర్వాంగ సౌందర్య సమన్వితయైన సీత వారి మాటల కిట్లు ప్రత్యుత్తర మిచ్చినది.

భయంకర స్వరూపులగు రాక్షసుల మాయలు నాకేమి తెలియును? నాకట్టిశక్తి కలదా? ఈత డెవరో? ఏమి చేయునో? మీరే ఎఱుగగలరు. పాము పాదచ్ఛాయ పామునకే కదా తెలియునది. నిస్సంశయముగ నేనును వీనిగని భయపడితిని. నావరకు నేను వీనిని కామరూపుడైన రాక్షసునిగనే తలంచు చున్నాను". ఇది జానకి సమాధానము.

సామాన్యులు గావించిన వివరణమిది. సీత ప్రత్యుత్తరము దనుజభామినులను బాగుగ కలవరపరచినది. వారడలి పోయి పలుదెసలకు బరుగెత్తిరి. కొలదిమందిమాత్రమే గుండె

లను కుదుటపరచుకొని నిలబడిరి. మరికొంతమంది రావణున కీవృత్తాంతము నెరిగింప బరువులెత్తిరి. వికృతవదనలగు స్త్రీలు-వికారాకృతితో భీతిబుట్టించుచు సంచరించి యశోకవన విధ్వంసన మొనర్చిన వానరుని యకృత్యములగూర్చి బలు తెఱగుల ప్రకంపచి త్తలై పలుకసాగిరి.

"వచ్చినవాడు వానరుడు. భయంకరాకారుడు. బహుముఖ పరాక్రమశాలి. సీతతో వాడేమియో మాటలాడినాడు. మే మందర మెన్నెన్ని విధముల బ్రతిమాలినను సీత వానిని గూర్చి మాకేమియు తెలుపలేదు - చెప్పదలచుటలేదు."

రావణునిముందు జరిగిపోయిన సంఘటననుగూర్చి దానవ స్త్రీలు వివరించిన విధానమిది.

ఇక శంకరశాస్త్రిగారి దృష్టితో నీసన్ని వేశమునంగల యౌచిత్యానౌచిత్య వివేచనము గావింపవలసియున్నది. తొలుత నవగాహన మొనర్చుకొనవలసినది ముఖ్యముగ కవిహృదయము. తదుపరి తత్కాల జానకీ మానసికస్థితి వీనిపై నాధారపడియున్నది. విషయమంతయు సీత సమాధానము చెప్పునపుడు పలికినపలుకులయందే - ఆమె పలికిన దంతయు సత్యమేయని పాఠకుల యూహ కందుటకై కవి ప్రత్యేకముగ సీతద్వారా కొన్నిపలుకులను పలికించినాడు. తాను కొన్నింటి నుపయోగించినాడు.

సీతనుగూర్చి చెప్పునప్పుడు కవిప్రయోగించిన తొమ్మిది విధములైన సంబోధనల నిట సంప్రదాయ సమ్మతములయిన వానిని జాగ్రత్తగ నధ్యయన మొనర్చి మన మవగాహన చేసి కొనవలసియున్నది. అప్పుడుగాని సత్యము మనకు సమగ్రముగ నర్థముగాదు. అప్పుడుగాని విషయమునంగల యౌచిత్య మెద్దియో మనయూహ కందదు.

7-వ శ్లోకమున రాక్షసస్త్రీలు సీతను ప్రశ్నించుతఱి యామెను సంబోధించుచు పలికినపలుకులు మూడున్నవి. అవి సుభగే! విశాలాక్షీ! అసితాపాఙ్గే! యనునవి. 8, 9, 10 శ్లోకములలో సీత ప్రత్యుత్తర మున్నది. సమాధానము చెప్పు నప్పుడు సీత మానసికస్థితి యెట్లుండునో! సూచించుటకై వాల్మీకి వర్ణించుచు వ్రాసినమాట లున్నవి. "సాధ్వీ - సీతా- సర్వాంగసుందరీ" ఈమూడుమాట లవియే. కవియొనర్చిన యీసంబోధనలు 8-వ శ్లోకమునందలి ప్రథమార్థముననే యున్నవి. సీతాదేవి యిచ్చిన సమాధానము దానవకాంతల మనఃఫలకములపై నద్దినముద్రయు, వారు రావణునితో భీతావహముగ విషయమును వివరణజేయుటయు 11-వ శ్లోకము నుండి 21-వ శ్లోకమువరకుగల పంక్తులలో నున్నవి. 14-వ శ్లోకమునం దుపయోగించిన "జానకీ, సీతా, హరిణలోచనా" అనెడి సంబోధనలనుబట్టి పై విషయముల నవగాహన మొనర్చు కొనవచ్చును. ఈసందర్భమును పురస్కరించుకొనియే పండిత

ప్రకాండులైన (బహ్మ[శ్రీ శంకరశాస్త్రి) వ్యాఖ్యాన మీాక్రింది విధముగ గొనసాగినది.

రాక్షసస్త్రీలు భయంకర స్వరూపుడగు మారుతిని గాంచిన వెంటనే జనకసుతతో "కథమ్ త్వయా సహానేన సంవాదః కృత ఇత్యుత" యని పలికిరి.

ఈవాక్యమునకు నీతో వీనిచేత సంవాద మేవిధముగ జరుపబడినదనియు, వీనితో నీచేత సంవాద మేవిధముగ జేయబడినదనియు నుభయరీతుల సమన్వయము గావించి యర్థమును సాగదీయుటకు వీలుకలదు.

వానితో నీవు సంభాషణ ప్రారంభించితివా? కాక నీతో వాడు సంభాషణ ప్రారంభించెనా? ఎట్లనుటకేని వీలుగలదు. కాని యొకవిధముగ నర్థము జెప్పుకొనిన సీత యేమియు దెలియని యమాయకురాలగును. మరియొక విధముగ జెప్పుకొనిన చతురతయు, యుక్తియు రహస్యగోపనశక్తియు గల నిశితబుద్ధి గలది కాగలదు. "సంవాద మసితాపాంగే త్వయా కిం కృత వానయమ్" - ఇచట స్పష్టముగ దేలిపోవుచున్నది. "నల్లని క్రీగన్నులు గలదానా! వీడు నీతో నేమి సంభాషించినాడ"ని రాక్షసస్త్రీలడిగినట్లు దీనిభావము. కావున వానరుడే సీతతో చొరవగైకొని సంభాషించినాడనుట వ్యక్తమగుచున్నది. ఆ చొరవ లేనిదియగుటచే మిన్నకున్నది సీత. పల్లెత్తలేదు. పలుకలేదు. కావున రాక్షసాంగనల మాటలయందే "మాట్లా

డించి సంభాషణ కొనసాగించినవాడు వానరుడేకాని సీతకా''
దని తేటతెల్లమగుచున్నది.

తరువాత దానవాంగన లనిన దేమి? "త్వయా సహ సం
భాషణం కృతమ్ కిమ్?" "సీతతో వాడేమని సంభాషణ ప్రారం
భించెను?" ఇదియును వానరుడే సంభాషణ సీతతో దేనిని గూర్చి
ప్రారంభించెననుటను వ్యక్తమొనర్చుచున్నదిగదా!

తాను పరపురుషునితో కావలెనని సీత సంభాషణ
మారంభించెననుట కేమేని యవకాశముగలదా? అజ్ఞాత
వ్యక్తితో స్త్రీ తానే మొదలుపెట్టి సంభాషింప సాహసింప
రాదుగదా! అది న్యూనతనే సతీమణుల కాపాదించును. జాన
కికీ సంఘటనమునం దట్టిన్యూనత లవలేశమేని యేర్పడుట కవ
కాశము లేదని ఆసందర్భమున కవి యుపయోగించిన పదములను,
సంబోధనలను విభజించి - పాత్రలు వేసిన ప్రశ్నల మాటున
దాగియున్న యంతరార్థముల వెల్లడించి శ్రీశంకరశాస్త్రిగా
రొకవిధముగ వ్యవహారము నొకకోవకు లాగుటకు అవకాశము
గల్పించినారు. చిక్కుముడుల దొలగించినారు.

"పరస్త్రీలతో - అపరిచిత వ్యక్తులతో - విశేషించి
ప్రభుపత్నితో - అంతఃపుర పరిరక్షితతో - ఏకాంతముగ
నిర్బంధమునందున్న సీతవంటి కాంతతో - రావణాపహృతయై
లంకలో మరొకరి రక్షణకిందగల జానకితో మాట్లాడుట పర
పురుషునకు నిక్కముగ దగనిపనియే. అదియే జరిగిన పురుషుడు

నింధార్హుడే కాగలడు. కాని యిది మాత్రము సీతాహను మంతులమధ్య సమన్వయింపజనదు. దానికి కారణములు పెక్కులుగ నున్నవి.

సీతను దర్శించి - ఆమెవిషయముల బరామర్శించి- సర్వ మును దెలిసికొని బోవుటకై వారిప్రభువుయొక్క యాజ్ఞ మేరకు బయలుదేరివచ్చిన రామకార్యార్థి ఆంజనేయుడు. అపరిచితయే యగుగాక! సీత. శ్రీరాముని బంటుగా - దూతగా - బిడ్డగా- స్వామికైంకర్యమునకు గడంగిన మారుతి కామె మాతయే. అమ్మతో తనయుడు భాషించుట వంటిదే సీతతో హనుమం తుడు సంభాషించుట. కావున సంభాషణ ప్రథమతః ప్రారం భించని సీత కేరీతిగ గళంక మంటదో! కావలెనని సీతతో సంభా షణ కుపక్రమించిన ఆంజనేయునకుగూడ కళంక మల్లే యుంటదు. బ్రహ్మచర్య నిష్ఠాగరిష్ఠుడై- కామజితుడై -తన యోగక్షేమాదిక ముల విచారింపవచ్చిన బంధుతుల్యుడైన మారుతితో! తరువాత తరువాత ప్రస్తావన వశమున రెండుపలుకులు పలికినదే యను కొనుడు. దానంజేసి యామెకు వచ్చిన దోష మేమి? ఆపాదిత మైన పాప మేమి ? ఆందోళితచిత్తులైయున్నను రాక్షసాంగన లీవిధముగ సీత నిర్దోషియని గుర్తించుటవలననే యామెను గురించి సంబోధించుతరి దైత్యకాంతలు "సుభగే" యని సంబో ధించిరి. ఈచిక్కుసమస్యను విడదీయగల ముఖ్యములు - శక్తి మంతములునగు తొమ్మిది సంబోధనలలో నిదియొకటి. కుల శీలాదుల సంరక్షణదీక్ష - పాతివ్రత్య పరిపాలనానురక్తి - జీవ

ద్భర్తృకత్వాదికముగల వనితను మాత్రమే శబ్దశాస్త్ర సమ్మతముగ “సుభగ” యని యనవలెను. సౌభాగ్యవతి యనుమాట తత్సంబంధమైనట్టిదే.

“సుమంగలీ రియంవధూః” అనునది శాస్త్రము. కావుననే వాల్మీకి సీతాదేవినట్లు సంబోధింపజేసినాడు.

శ్రుతిసిద్ధమై సౌభాగ్యరేఖ యేదికలదో! అది సీతయందు స్వయం ప్రకాశమానమై యున్నదనుట కామె ముఖకమలమే ప్రబలసాక్ష్యము. సౌభాగ్య సంపద తొణికిసలాడుచున్న కన్నులుగల యన్నుమిన్న యగుటంజేసి సీతవిషయమున “విశాలాక్షి” అనెడి సంబోధనయు ప్రయోక్తమైనది. సన్నివేశమునగల శంకానివారణకు కవి యుపయోగించిన తొమ్మిదిపదములలో నిదియు నొకటి. విశాలాక్షి యనగా “మిక్కిలి విశాలముగనున్న - ఆకర్ణాంతములై భాసించుచున్న - కన్నులుగల యామె యని తాత్పర్యము.

విశాలాక్షిగ నుండుట-ఉత్తమనారీత్వమున కొకచిహ్నము. సీత యుత్తమ నారీరత్నము. కావుననే యామె విషయమునం దీసంబోధన యెంతయు సమంజస మనియే యనిపించును. చూడజూడ ‘అసితాపాంగే’ యను సంబోధనయు ప్రత్యేకార్థబోధకముగనే కన్పించును. విశాలనేత్రము లందంతట పరచుకొని నీలిమరేఖయుండు టొకవిశేషార్థ విలసితమైన విలక్షణ విశిష్ట కాంతాలక్షణము.

అసిత యనగా అబద్ధమ్ (బంధింపబడనిది) అనెడి యర్థ మును జెప్పినచో "అసితౌ - అపాంగౌ యస్యాస్సా అసితా పాంగా" అనెడి యర్థము వచ్చుచున్నది. బంధింపబడని చూపులు గలది. అనగా మనస్సు నెచట బంధించునో! నయన ములుసైత మచ్చటనే సులగ్నములై యుండునని యంత రార్థము. సీత శ్రీరామ దివ్యమంగళకర మోహనరూప మునే తనమనస్సునందు బంధించుకొనియున్నది. నయనములు సైత మచటనే నిల్చియుండునుగదా! కనుక నే "అసితాపాంగే" యనెడి సంబోధనయు నాసందర్భమునం దామెకు చక్కగ సమర్థవంతముగ సరిపోయినది.

ఈయభిప్రాయమునకు ప్రోద్బలకముగా సుందరకాండ మున 16-వ సర్గయందలి 25-వ శ్లోకము నిట మనము గమనింప వలసియున్నది.

నైషా పశ్యతి రాక్షస్యో నేమాన్ పుష్పఫలద్రుమాన్
ఏకస్థ హృదయానూనం రామ మే వానుపశ్యతి."

ఈమె రాక్షసస్త్రీలను గన్నెత్తియేనియు గాంచదు. పుష్పఫలభరితములై చూడముచ్చటగొల్పు చెట్లనేనియు దిల కింప నేరదు.

దీనులయందును, రక్షణీయులయందును సదయాపాంగావ లోకనము అసితాపాంగత్వము - అహితులు, అరక్షణీయులు నగు నీచులపట్ల నిష్కరుణాపాంగావలోకనము నిరసితాపాం

గత్వము సీతకు సహజమని కవి చెప్పదలచి "అసితాపాంగే" అనెడి పదము నుపయోగించినాడు.

"అపి తేషు, అరక్షణీయేషు తు అసితవత్ + ఆచరితౌ, అసితాపాంగౌ యస్యాః సా - అసితాపాంగా" అని ఖండాన్వయము చెప్పుకొనినచో, దుష్టులపట్ల జానకి చూపులు ఛురికలవలె ప్రసారములగుచుండు ననెడి యర్థము ద్యోతకమగును.

శ్లేషార్థానుగుణముగ భావించినచో - సమదృష్టి సమన్విత దయార్ద్ర వీక్షణపంక్తిని నిరంతర పీడకులుగా వ్యవహరించెడి దానవాంగనలయెడ సైతము వ్యక్తీకరించు సీత ధర్మభావనకు రాక్షసస్త్రీలే వివశులై - వారికి తెలియకయే - వారి నోటివెంట సీతతో సంభాషించుతటి - "అసితాపాంగే" అనియు వ్యవహరించుట జరిగియుండును.

శత్రు ప్రశంసలకుగూడ పాత్రురాలైన యొకపవిత్రాంగన అసత్యమున కుద్యమించునా ? అనృతమాడ నుంకించునా? అబద్ధప్రలాపముల నాడునా ? ఇది యాలోచింపదగిన విషయము. తర్కింపదగిన యంశము.

"వీనిని చూచుటకే మాకు భయముగనున్నది. వాడు స్వజనునివలె నీతో సంభాషించినాడు. దీనిని మా ప్రభువునకు తెలుపకున్న మాకు ముప్పువాటిల్లును. తెలిపినచో రావణుని వలన వానికి కేదేని కీడుమూడునని నీవు జంకవలసిన పనిలేదు. నీవట్టి కీడు వానికి వాటిల్లి నను నివారింపగలశక్తి యున్నదానవు.

విషయము నెరింగియు మేము రాజునకు నివేదించక దాచిన మాకు ప్రమాద మేర్పడును. నీకది యనిష్టమే యగునుగదా! ఉన్న విషయమును శ్రుత మొనర్చినచో రావణునివలన మాకు కలుగనున్న భయప్రమాదములు నివారితములగును. కాని యెడల దండింపబడుదుము. వివరించిన నీకేమియు నపాయము రాదు. నీప్రాణరక్షణమున రావణున కట్టి శ్రద్ధాసక్తులు గలవు. వీడు నీకు సంబంధించినవా డనుట తథ్యము. వాడేమి మాట్లా డెనో నీవు విశదీకరించిన రావణుని భయంకరశాసనమునకు వాడే గురియగును. నీకును, నీకుసంబంధించి యున్నవారలమగు మాకును నిస్సంశయముగ నెట్టి యాపదయును గలుగదు. వీడు నిన్నుద్దేశించి పల్కినదేమో! మాకు వివరింపుము. నీకిది తప్పని సరియగు విధి" అని దానవాంగనలు సీతను మిక్కిలిబలవంతము చేసిరి.

విషయమంతయు నాకళింపునకు దెచ్చుకొని స్థిరచిత్తయై-భర్తృగతప్రాణయైన భూపుత్రి రాక్షసస్త్రీలకు ప్రతివచన మిడక తప్పదని నిశ్చయించుకొనినది.

'అథాబ్రవీత్ తదా సాధ్వీ
సీతా సర్వాంగ సుందరీ'

మారుతిచే వర్ణింపబడిన పతివృత్తాంత శ్రవణకుతూహలాయత్తచిత్తయు - మహోజ్జ్వల సౌందర్య సమన్వితయు -

సదాచార సముపేతయు - సాధుస్వభావ సహితయు - మహా పతివ్రతయునగు జానకి వారితో మాట్లాడ నారంభించినది.

"సర్వాంగసుందరి" సీతయం దప్పుడున్న మహోత్సాహమునకు సూచకముకాగా - "సాధ్వీ" యను మాట సీతాదేవి హృదయాంతర్గత సత్యవచనతత్పరత్వాకాంక్షకు తార్కాణమని యనజెల్లును. కాగా "సీత" యను పద మామెపుట్టుకకు కారణభూతమైన నాగేటిచాలువలె నిర్వ్యాక్రమైనట్టిది. నిరుపష్టమైనట్టిది - తిన్న నినడక గల్గినట్టిది- శీలసంపన్నమైనట్టిది యనెడి భావమును జాటుచున్నది.

"రక్షసాం భీమరూపాణాం
విజ్ఞానే మమ కా గతిః"

'రక్షస్' శబ్ద మొకవిధముగ రాక్షసస్త్రీసమూహమునకు రాక్షసరాజైన రావణునకుగూడ సమన్వయించునట్టిది. 'రక్షస్' శబ్దము నపుంసకలింగము. తత్కారణమున భయంకరాకారులగు రాక్షసులకు - రాక్షసస్త్రీలకు-రాక్షసరాజునకు గూడ - నన్ను గురించి తెలిసికొనదగిన (మమ విజ్ఞానే కా గతిః) విజ్ఞాన మిసుమంతేనియు లేదని విశేషార్థము.

"భయంకర స్వరూపిణులగు దానవస్త్రీల మాయలను గూర్చియు రావణుని తంత్రములనుగూర్చియు నాకేమి తెలియును ?"

మనకు వెంటనే స్ఫురణకువచ్చెడి సర్వసామాన్యార్థ మిది. ఇచట సీత కనృతదోష మంటగట్టెడి యంశ మేదియో! యిపుడు పరిశీలింపుడు. సమాధానము రాదు. కారణము- సీత యనృతమాడెననుట కిచట వ్యక్తము లయ్యెడి సామాన్య విశే షార్థములలోనే యొకటియు నవకాశము నొసగుట లేదు.

"యూయ మేవాభిజానీత యో౽యం యద్వా కరిష్యతి" "ఈత డెవరో! ఏమి చేయునో! మీరే యెరుగగలరు"-పైశ్లోక భాగమునకుగల సామాన్యార్థమిది.

"నాతో భాషణజరిపిన దెవ్వరు? ప్రసంగాంశ మేమి? వక్త యెట్టివాడు? అతని కెవరితో నెట్టిసంబంధము గలదు? తరువాత నితడు చేయబోవునది యేమి?"-ఈయంశములన్నియు ముందుముందు మీరే గ్రహింపగలరని సీతాదేవి ప్రవచించిన విశేషార్థమును సైత మీశ్లోకభాగమే తెలుపుచున్నది. అయి నపుడు సీత చెప్పని దేమున్నది? చెప్పినదానిలో అనృత మెచట గలదు? నామాటలతో, సమాధానములతో మీకేమిపని? ఆవిషయములన్నియు క్రమముగ మీకెరుకకు రాగలవని సీత విశదీకరించిన విశేషార్థము స్పష్టముగనే యున్నదిగదా!

"సర్పముల నిగూఢసంచరణాత్మక జ్ఞానశక్తి సర్పములకే తెలియునను" మాటలద్వారా నాకును, నాతో సంభాషించిన వానికినిగల పరస్పరసంబంధము మాకొండొరులకు మాత్రమే తెలియును. పరుల కది యనవగాహ్య విషయము. సర్పముల

కాలిజాడల నెరుగ నొరులు యత్నించు టేపాటి వివేకవంతమైన పని? యనెడిధ్వని యిందు వ్యంజకమగుచునే యుండెను. కావు ననే మాయిరువురి విషయముగూడ తర్కించి గుర్తించుటకు యత్నించుట వాస్తవముగ వివేకవంతమైనపనిగాదు.. అట్టియవ సరము మీకు లేదు. యోగ్యత యంతకన్నను మీకడ లేదని సీత నిర్ద్వంద్వముగ వ్యంగ్యధోరణిలో చెప్పినట్లే. ఇది అర్థము గాకున్న అది వారి దురదృష్టము. గమనార్హ విషయమిదికాగా— ఇక యసత్యకథ ఆరోపణకు దావెక్కడ?

"అహ మప్యస్య భీతాస్మి నైనం జానామి కోన్వయం"— మహాకవి యిట నొకచిత్ర మొనర్చినాడు. "నైనం జానామి కోన్వయం?" "అహ మప్యస్య భీతాస్మి?" ఉచ్చారణమునం దిట ప్రశ్నార్థకము వచ్చునట్లాదిపలికిన జాలును. చమత్కార గర్భిత విశేషాంశము వెల్లడింపబడును.

'అపి' శబ్దము కాకువునకు సూచకము. 'నేనుగూడ వీనికి భయపడితినా? లేదు' అనిభావము. దురాలోచనపరులు, ద్రోహులునుగనుక మీరు భయపడుట సహజమే. వానిం జూచి నేను భయపడ లేదు.

'ఈత డెవరో నేనెరుగనా? ఎరుగుదును' అని సీత చెప్పెను.

"వేద్మి రాక్షస మేవైనం కామరూపిణ మాగతమ్"— "సందర్భోచిత రూపధారణ సమర్థుడు— యథేచ్ఛా రూపధా

రణ దక్షుడు - మనయెదుట జరించుచున్నవ్యక్తి రాక్షసుల నిగూఢ రహస్యములను సమూలముగ గుర్తింప నరుదెంచిన వాడనియే నేనెరుగుదును. పై శ్లోక భాగమున కిట్టర్థమును జెప్పుటలో నెట్టి విప్రతిపత్తియు రాదు. వాస్తవముగ లేదు.

ధైర్యస్థైర్య సాహసహృదయయగు జానకి మీ గుట్టు నెరిగి మట్టుపెట్టుటకై వచ్చినవాడే యతడని చెప్పనే చెప్పినది. ఇక చెప్పని దేమి? ఆడినయనృత మెద్ది?

"మీరు పలువు లొక్కుమ్మడి బహుభంగుల ప్రశ్నించుచున్నారు. నాకు తెలిసినప్పటికి నితనినిగూర్చి వివరించి మీకు చెప్పవలసిన యవసరము నాకేమిటి? అందరి కన్ని తెఱగుల ప్రత్యుత్తరము లొసగుట సాధ్యముగానిపని. అందరికి నొకే యొకసారి సత్యమును వివరించి చెప్పుచున్నాన"ని జానకి పై విధముగ నర్మగర్భముగ సాహసాత్మకముగ నొక్కి వక్కాణించినది. ఇక సీతావాక్యవైఖరి నెట్లు శంకింపగలరు? జానకి యనృతమాడెనని యెట్లనగలరు?

ఇక సీతను గూర్చి రావణునితో రాక్షసాంగనలు పలికినపలుకు లిట్లున్నవి.

13) అశోకవనికా మధ్యే రాజన్ భీమవపుః కపిః
సీతయా కృత సంవాద స్తిష్ఠ త్యమిత విక్రమః

14) న చ తం జానకీ సీతా హరిం హరిణలోచనా
అస్మాభి ర్బహుధా పృష్టా నివేదయితు మిచ్ఛతి.

"రాజా! అశోకవనమున భీతిగొల్పు కోతియొకటి ప్రవేశించినది. ఆవానరుడు గొప్పబలవంతుడు. వాడు సీతతో సంభాషించినాడు. వాడేమి మాట్లాడెనో మేమెన్ని విధముల ప్రశ్నించినను జానకి మాకు సమాధాము చెప్పుట లేదు."

పై శ్లోకభాగమున ద్యోతకమయ్యెడి సామాన్యార్థ మిది. సీతనుగురించి రాక్షసస్త్రీలు ప్రయోగించినపదములు "జానకీ, సీతా, హరిణలోచనా."

'హరిణలోచన' యనగా లేడి కన్నులవంటి కన్నులుగల యామె యని యర్థము.

లేడి విశాలనేత్రములతో చూపరుల నాకట్టుకొనును. సీత తనవిశాలనయనయుగళముతో రాక్షసాంగనల హృదయముల నావర్జించుకొనగలదని భావము. సొగసైన ఉత్ఫుల్ల లోచనద్వయిగల లావణ్యారాశి యామె.

'జానకి' యనగా జనకనందన యని తాత్పర్యము. సకల విషయములందును నైష్ఠికమైన ఆత్మశక్తిని ప్రదర్శించగల రాజర్షి జనకుడు. జనకునిచే సుశిక్షితయై – ఆయన పెంపకమున వృద్ధినందిన జనకనందన దానవకాంత లెన్ని తెఱగుల నెన్ని ప్రశ్నలు వైచినను మనోదార్ఢ్యతను గోల్పోవని నిశ్చలచిత్త

యనియు, నిబ్బరము - నిండుగుండెయుగల నిష్ఠాతత్పర యనియు వ్యక్తమొనర్చుటకే వాల్మీకి యిప్పట్టున 'జానకి' యను పదము నర్థవంతముగ నుపయోగించినాడు.

"సీత" యన నాగేటిచాలువలె తిన్ననైన నడత గల్గినట్టి దని యర్థము. కావుననే దానవకాంత లుద్రేకపరచినను తా నుద్రేకపడక - ఉద్విగ్నగ మారక హర్షవికసిత వదనార విందయై అడిగిన ప్రశ్నలన్నింటికి సముచితసమాధానమును సంక్షిప్తముగ నొసగుచు రాక్షసస్త్రీల నొప్పింపక మెప్పించి తన సాధ్వీత్వమును సంరక్షించుకొనజాలినది.

"అస్మాభి ర్బహుధా పృష్టా"

అని రాక్షసస్త్రీలు చెప్పినారు. వా రెన్నిమారులడిగినను తా నెక్కువగ మాట్లాడక యొక్కపరియే ప్రత్యుత్తర మిచ్చినది. అదియును సంక్షిప్తముగనే యుండెననుటకు రాక్షసకాంతల పలుకులే సాక్ష్యములు. దానవస్త్రీల మాటలలో "మాప్రయ త్నము సీత మనస్సును మార్చి-సమగ్రసమాధానము జెప్పించు కొనుటలో శక్తిమంతులము కాజాలకపోయితి మ"నుట స్పష్ట ముగనే విశదపడుచున్నది. ఆమెయెడ సదభిప్రాయమునే వెలువ రింపక వారికి తప్పలేదు, కావుననే "సీత నిర్దోషురాలనియు - ప్రతిక్రియాచరణ దక్షురాలుగానిదనియు, నామెవలన నెట్టి ముప్పుగాని సంభవింప నేరదనియు - సర్వవిధముల దండనీయుడు రావణుడే యనియు వారు వాక్రుచ్చిరి. నీతిలేనివాడై -అశోక

వన విధ్వంసన మాచరించుటే కాక సీతతో సంభాషణగూడ సాగించిన యీతని దండించితీరవలసినదే” యని రాక్షసాంగన లనిరి. అశోకవన రక్షణబాధ్యత తలపైగల రాక్షసస్త్రీలు గూడ నీక్రమమున నాలోచించిన దండనీయులే యగు దురుగదా !

“వచ్చినవాడు శత్రుకోటికి జెందినవాడు. రాక్షసుల గుట్టుమట్టు లెరుగుటకై వచ్చినవాడు. వానరసమూహ బలాధిక్యత రాముని కెంతగనున్నదో లంకాపట్టణమున జాటిచెప్ప బయలుదేరివచ్చినవాడు” అని సీత పలుకుల సారాంశము.

వాల్మీకిమహర్షి సీతనుగూర్చి సంబోధించుచు వాడిన పదములు - సుభగే - విశాలాక్షీ - అసితాపాఙ్గే - సాధ్వీ - సీతా - సర్వాంగసుందరీ - జానకీ - హరిణాలోచనా - సీతా” అనునవి. ఇవి తొమ్మిది. వీని మూలమున సీత సాధ్వీత్వము మాత్రమేగాక సత్యవాదినీత్వముగూడ సువ్యక్తమగుచున్నది. వ్యంగ్యమును సాయముగగొని పదములకుగల ప్రత్యేకార్థముల శక్తితో సందర్భమునకుగల యౌచిత్యమును దృష్టియందిడు కొని సమన్వయాత్మక వ్యాఖ్యతో, సముదాత్త భాష్యప్రవచన ముతో సీతనోట పరమసత్యమే పలుకబడెననుట నిర్వివాదాంశము. పదపదార్థ వివేచనవంకకు సమీక్షకుల మనస్సుల ద్రిప్పి, యీసన్నివేశమునకుగల పరమార్థమును, పదములకుగల యంత రార్థములద్వారా వివరించి, మహాకవి వాల్మీకిమహర్షి యొక్క

హృదయమును గుర్తించి తదనుగుణ వ్యాఖ్యాన విశేషములతో సీతాదేవి సత్యకథనవిషయ నిరూపణమును నిస్సందేహముగ నిష్కర్షగ స్పష్టపరచిన విద్వద్వరేణ్యుడే బ్రహ్మశ్రీ శంకర శాస్త్రి మహనీయుడు. శ్రీరామనామ ధ్యానపరాయణమైన సీత ప్రత్యక్షరమును సత్యముగనే వచించెననుట కెన్నియో యుపపత్తుల జూపి - పూర్వ వాదముల నన్నిటిని గాదని ముక్తకంఠమున వక్కాణించినారు శ్రీశాస్త్రి మహాశయులు.

ఎవ్వరెన్ని విధముల ప్రశ్నించినను రాక్షసస్త్రీల ప్రశ్నల పరంపరకు దట్టుకొని తొణకక బెణకక తిన్నగ సూటిగ సుస్పష్టముగ సత్యమునే పలికి 'సీత' యను నామము నామహాసాధ్వి సార్థక మొనర్చుకొన్నది.

వాల్మీకి వర్ణించిన నయనవిశేష వర్ణనాదులబట్టి, సంబోధనలనుబట్టి సీతాదేవియొక్క ధైర్యసమ్మిళిత హర్షోత్తేజక భావధోరణి పఠితులకు సులభముగనే యవగాహన కాగలదు. కాని! యాపదములకుగల యాంతర్యమును పరిశీలించుటయందు దృష్టిని లగ్నమొనర్చు టొక్కటే చేయదగిన పని.

అట్లొనర్చి యాలోచన కొనసాగించినచో సీతా మహాదేవి పలుకులలో సత్యబద్ధములయిన సమాధానములలో అసత్యస్ఫూర్తిగాని - అనృతస్పర్శగాని లవలేశమేని లేదని సులభముగనే గ్రాహ్యము కాగలదు. నిర్వివాదాంశ విషయ మిది యనియు, జానకి పలికినదంతయు పరమసత్యమే యనియు

రూఢమగుటకు శ్రీ శాస్త్రిగారి వాదబలమెంతగనో తోడ్పడుచున్నది.

"వచ్చినవాడు నాకు సంబంధించిన వాడే. రాక్షస రాజ్యమునకు జెందిన నిగూఢరహస్యములను దెలిసికొనుటకు వచ్చినవాడే. దానవుల బలమెంతయో, ఎట్టిదియో అంచనా వేయుట కొఱకై వచ్చినవాడే" అనెడి తాత్పర్యము సీతాదేవి మాటలలో సమగ్రముగ నభివ్యక్తమగుచుండ జానకికి ఈయుపనింద నంటగట్ట నేల యనెడి యావేదనయే శ్రీ శాస్త్రిగారిచే నిట్టి చర్చను సాగింపజేసినది. ఆచర్చయొక్క సమగ్రస్వరూపము, సీత సత్యకథనతత్పరత శ్రీ శంకర శాస్త్రిగారిచే యీవిధముగ నిరూపితమైనది.

అథాబ్రవీ త్తదా సాధ్వీ సీతా సర్వాంగసుందరీ,
రక్షసాం భీమరూపాణాం విజ్ఞానే మమ కా గతిః
యూయ మేవాభిజానీత యోఽయం యద్వా కరిష్యతి
అహి రేవ హ్యహేః పాదా న్విజానాతి న సంశయః
అహ మప్యస్య భీతాస్మి నైనం జానామి కోన్వయం
వేద్మి రాక్షస మే వైనం కామరూపిణ మాగతమ్.

"నాకు సంబంధించిన యంశములను తెలిసికొనుటకు-భయంకర స్వరూపులైన రాక్షసుల కేమి జ్ఞాన మున్నది?

వచ్చినవా డెవడో? ఏమి చేయునో? ముందు ముందు మీకే యెఱుకకు రాగలదు. పాము పాదములజాడ పాములకే

తెలిసినట్లు నాతో మాట్లాడినవానికిని, నాకునుగల అన్యోన్యత యెట్టిదో మా యిరువురకే తెలియును. కాని ! ఇతరులకు తెలియని విషయమది. నిస్సందేహాంశ మది. అతనిని గురించి నేను భయపడుచున్నానా ? లేదు. అతడెవరో నే నెరుగనా ? బాగుగ నెరుగుదును. లంకలోగల రాక్షసులకు రాక్షసప్రభువగు రావణునకు గల నిగూఢరహస్యములను సమూలముగ గుర్తించుటకై కామరూపధరుడై వచ్చినవానినిగా నేను బాగుగ నెరుగుదును.''

8) సర్వాంగ సౌందర్యసంపన్నయు మహాసాధ్వియునగు సీత - భయంకర స్వరూపులయిన రాక్షసులకు, నాకు సంబంధించిన విషయములను తెలిసికొన విజ్ఞాన మేమి కలదని పలికెను.

9) వా డెవడో ? ఏమి చేయుచున్నాడో ? ముందుముందు మీాకే తెలియగలదు. పాముపాదముల జాడ పాముకే తెలియునట్లు వచ్చినవానికి, నాకునుగల అన్యోన్యసంబంధము నితరు లెరుగజాలరు. అది మాయిరువురకే తెలియును. ఇందు సందేహము లవలేశమేనియు లేదు.

10) నేను వానికి భయపడలేదు. అత డెవరో బాగుగ నే నెరుగుదును. లంకలోగల రాక్షస సంబంధములు, రావణ సంబంధములునగు రహస్యముల నన్నింటిని

గూఢముగ తెలిసికొనుటకు గామరూపధారియై వచ్చిన వాడని నేను బాగుగ నెరుగుదును.

సీత యబద్ధమాడినట్లును - వచ్చినవా డెవడో? నాకు తెలియదని సీత యన్నట్లును, తత్కారణమునంజేసి సీతాదేవి కనృతదోష మంటుచున్నదనియు వాదించువా రందరు విస్తుపోవునట్లుగ శంకరశాస్త్రిగారొనర్చిన యీభాష్యము సర్వలోకాంగీకారమును బడసి, సర్వజ నాభినందన పాత్రమై యలరారుచున్నది. ఇట్టి వ్యాఖ్యాన మొనర్చి యెల్లరి యపోహల బోగొట్టుటనిన సామాన్యవిషయముగ భావింపరాదు.

మహావిద్వాంసులు, మహోద్దండపండితులు, సంస్కృత భాషాపారంగతులునగు మహనీయులు శ్రీశంకరశాస్త్రిగారు. ఆయన కలముతో వ్రాసిన వ్యాఖ్యగాదిది. హృదయముతో వ్రాసిన భాష్యము. బాహ్యదృష్టితో లౌకికకుతూహలతో జేసినవివరణగాదిది. అంతర్దృష్టితో అలౌకికభావనతో గావించిన సమాలోచన యిది. శంకరశాస్త్రి హృదయమున వాల్మీకియే ప్రవేశించి తనయంతరంగమునగల యీసన్నివేశమునకు సంబంధించిన సత్యముల నన్నింటిని వ్రాయించెనేమో! వాల్మీకి కవి వాడినపదములకుగల నిగూఢార్థములను వ్యక్తీకరించి తన సత్యదృష్టిని వివరించి - వాల్మీకి సత్యసంధతను నిరూపించి సీతాదేవీ సత్యకథనవైశిష్ట్యము నెలుగెత్తి లోకమునకు జాటిన పుణ్యమూర్తి శ్రీశాస్త్రిగారు. చాటుటయేకాదు-తనవాదనతో

సర్వపండితలోకమును మెప్పించి సీతసత్యకథనతత్పరయే - ఆమె పలికిన ప్రత్యక్షరము పరమసత్యమే అని అందరి నొప్పించినాడు. సంతృప్తి పరచినాడు. సమస్తమైనవారిచే నేకగ్రీవముగ తల లూపించినాడు. హృదయపూర్వకమైన యెల్లరియామోదము నడును పాత్రమైన వాఖ్యయది.

మధురపద ప్రయోగముద్వారా వాల్మీకిమహర్షి వెల్లడింప నెంచిన సత్యము- సీతనోట సత్యసమ్మతవాక్కులలో వెల్లడింప బడినది. ఆ సందర్భమున సీతచే వాల్మీకి పలికించిన పదములకు గల సహజములు - సరలములు - సలక్షణములు - సార్థకములునగు పదములకు స్పష్టమైనవ్యాఖ్య వ్రాసి శ్రీశంకరశాస్త్రి గారు వాల్మీకిమహర్షి యొక్క సత్యసంధతను - సీతాసత్య వాక్తత్పరతను ధ్రువీకరించినారు. సీత పల్కినది అసత్యము కాదనియు - ముమ్మాటికి గాదనియు నిరూపించినారు. సీత సత్యమునే పలికెననెడి వాల్మీకి భావమును నిర్ధరించి - నిశ్చయించి - నిర్ణయించి - శ్రీశంకరశాస్త్రిగారు ముక్తకంఠమున నుద్ఘోషించిన తీరుగాని - ఉద్ఘోషించుటలో చూపిన సాహసముగాని పండితలోక ప్రశంసల జూరగొన్నది. విమర్శకుల సర్వసందేహముల నివారించి నిరుత్తరుల గావించినది. వితండ వాదులకు - మందబుద్ధులకు-పామరులకు-కేవల భౌతికదృష్టిగల వారికి-సామాన్యులగు మనవంటి వారికి వాల్మీకి శ్లోకములను స్థూలదృష్టితో పఠించినపుడు సీత యనృతమాడినట్లుగ దోచ వచ్చును. అట్లు తోచుటలో అబ్బురముగూడ లేదు.

త్రికాలజ్ఞుడు- యోగిశిఖామణి- మహర్షి -మహాకవియునయిన వాల్మీకి మహోదాత్త శీలసంపత్తితో విరాజిల్లుచున్న మణి దీపమువంటి సీతాదేవిని మహానృతదోషమునకు గురిసేయునా? ఆమెచే నబద్ధమును పలికించునా? జరుగని విషయమది. అచింతనీయాంశమది. నారీలోకమున కాదర్శప్రాయముగనున్న లలనారత్నముచే మహాకవివాల్మీకి యసత్యమును పలికించెననుట హాస్యాస్పద విషయము. కావుననే శ్రీ శంకరశాస్త్రిగారీవిషయమునగల చిక్కుముడులను జక్కగ విడదీసి సత్యనిరూపణ గావించిరి.

వాల్మీకి కవిచంద్రు డుపయోగించిన- సీతావిషయికములైన సంబోధనలను - విశేషణములను చక్కగ సమన్వయించుకొని సమర్థింపవలసిన యీసన్నివేశమునందలి యంతరార్థము నరసిన సీతాదేవి స్థైర్య ధైర్యములు వ్యక్తములు కాగలవు. వివేచనాత్మముగ నామె పరమసత్యము నే పలికెనని ధ్రువపడగలదు.

శ్రీ శంకరశాస్త్రిగారి వ్యాఖ్యానము - మానవుల మనోగత దుర్బలత్వమును తప్పక పరిహరించి లేశమాత్రమేని దురభిప్రాయము మిగిలియున్న యెడల దానిని గూడ తొలగించుగాక! మనమందరము సత్యశోధనప్రవణుల మగుదుముగాక !!

వాల్మీకి సత్యబల సమన్విత మనస్వియగు తపస్వి. వాల్మీకి కృత రామాయణమునం దసత్యము ద్యోతకమే కాదని బ్రహ్మ నిర్ణయము.

"కాదు కూడదనియు-సీత వాకొనినదంతయు నసత్యమే యనియు నందురా!" ఇక అదియొక పిడివాదమే కాగలదు. విషయమున గర్భితమైయున్న విశేషాంశములు వెలికివచ్చిన యనంతరముగూడ సహృదయతతో వాస్తవము నవగాహన మొనర్చుకొనకున్న నదిపిడివాదముగాక మరేమగును ?

'అలోక సామాన్య మచింత్య హేతుకమ్
ద్విషన్తి మందాశ్చరితం మహాత్మనామ్"

ఊహకందని యతిలోక సామాన్యమైన పావనగాథను మందబుద్ధులు ద్వేషింతురనుటలో వింతయేమున్నది? శంకింతురనుటలో నాశ్చర్యమేమున్నది?

## అగ్నిప్రవేశము

సీతను మహాసాధ్విగా నిరూపించి- శాశ్వతముగా పాఠక హృదయ గౌరవపీఠముపై నిల్పినట్టి ఘట్టములలో జానకి అగ్నిప్రవేశఘట్ట మొకటి.

రావణసంహార మైనది. శ్రీరామ విజయవార్తను రాక్షసీపరివృతయై - అశోకవనమున విలపించుచున్న జానకికి మారుతి వినిపించినాడు. రామాజ్ఞయే యది. కాని! జానకి నింతవరకు పీడించి- వేధించి-సాధించిన రాక్షసాంగనల నందర నొక్కుమ్మడి యుక్కడగింప సీత యనుజ్ఞ గోరినాడు హనుమంతుడు. సీతాసౌశీల్యమున కిది మరియొక పరీక్ష. సీత

నెన్నిమో తెఱఁగుల యిక్కట్టులపా లొనర్చిన దానవకాంతల తత్త్వము నెరిగినవాఁడు మారుతి. విజయోత్సాహమున నున్నా డతడు. తీవ్రముగ నిరోధించుటా? కాక! ప్రభువు శాసనము మేరకు - పరాన్నభుక్కు- లగుటంజేసి - వాడాడంచి నట్లాడి తనను దారుణబాధలకు విధిలేక గురికావించిన దానవస్త్రీలను చంపుట కనుమతి నర్థించిన మారుతికి సీత యిట్లు చెప్పినది.

"హనుమా! వీరిని వధించు టేలనయ్యా? పరప్రేరణచే పాపకార్యాచరణకు దిగిన యవివేకుల గని జాలిపడుట ప్రాజ్ఞుల లక్షణము. దానవకాంతలు రావణుని భృత్యావృత్తియం దున్న వారు. చెప్పినది చేయవలసినవారు. వారి నిందు నిందింపవలసిన యవసరమేమి? శిక్షింపవలసిన యగత్యమేమి? వారు పాప కర్ములే యగుదురుగాక! లేక శుభకర్ములే కావచ్చుగాక! కాని దయజూపదగినవారు. కరుణయే యార్యలక్షణము. పాప ముల నాచరించనివారు లోకమునం దెవ్వరున్నారు? క్షమా గుణము ప్రధానము నాయనా!" యనుచు మెల్లగ నాంజనేయు నకుగల రాక్షసస్త్రీవధోత్కంఠను సీత నిపుణతతో నివా రించినది.

ఆంజనేయు డిట్లుగ్రుడై హాతమార్ప నుద్యమించు నేమో! యనెడి సందియము రాక్షసాంగనలలో సముత్పన్నమయిన కావచ్చును. కాని! సీత యిట్లడ్డుపడి రక్షింప దీక్షవహించు నని దానవాంగన లూహింపలేదు. వా రామెను పెట్టిన

యాతన లెట్టివో! వారెరుగరా? అదియునుగాక హనుమంతుని బారినుండి మమ్ము రక్షింపుమని రాక్షసస్త్రీలు యాచింపకముందే సీత యీపనికి బూనుకొనుట వారిని నిశ్చేష్టుల గావించినది. ఆమె మహాసాధ్వియగుటవలననే కక్షలేని కారుణ్య దృష్టితో తనకుదానుగనే రాక్షసాంగనల రక్షణభారమును వహించి మాట్లాడినది. మారుతి యభిప్రాయమును మార్చి వైచినది.

"పరపీడన దానవులకు కేళిప్రాయము. కామరూపులై పాపకృత్యము లాచరించుట వారి జన్మలక్షణము. కాని! వారి కపకార మొనర్పకుండుటయే మనధర్మ"మని సీత సముదాత్త స్వభావముతో బలికినది.

సకలభూతకోటిపట్ల యెట్టివివక్షను జూపక కారుణ్యభావమున వర్తించుటే ఆర్యధర్మ మనెడి అత్యుత్తమాదర్శమును మహాసాధ్వి సీత యిచట సుస్పష్టముగ విశదీకరించినది. కోరి శరణుజొచ్చినవారికే అభయమునొసగినవాడు రాముడు కాగా, కోరనివారి సంక్షేమమును సైతము కాంక్షించి - అభయభిక్ష బెట్టి రక్షణవిషయమున రామునికన్న మిన్నగ జానకి ప్రస్తుతి పాత్రమైనది.

పెదవికదిలించినమాత్రమున యెదలోగల భావములను చదువనేర్చిన మహాజ్ఞాని ఆంజనేయుడు. జానకి యాహాను గమనించినాడు. "తల్లీ! నీకు నీవేసాటి. నీవు మహాసాధ్వివి.

శ్రీరామచంద్రమూర్తి కన్నివిధముల దగిన యర్ధాంగివి. నీ యాజ్ఞ శిరసావహింతును. పతి కేదేని ప్రతిసందేశమిచ్చిన నే నింక సెలవుగైకొనెద'' ననినాడు వినయ వినమ్ర భావమున మారుతి.

"రాముని సన్నిధికేగ వాంఛించుచున్నాను"-సీత పతికి పంపిన సంక్షిప్త సందేశమిది. మహాసాధ్వి పలుకవలసిన రీతిగ పలికినది. "సహధర్మ చరీ తవ'' అని వివాహమునాడు జనకుడు కుమార్తె నల్లున కప్పగించుచు పలికిన పలుకుల కనుగుణముగ నామె పలికినది. అట్లు పలుకుట సీతకే చెల్లినది. సీత కనుక అట్లు పలికినది. సీత మాత్రమే యట్లు పలుకగలదు. కనుక పలికినది.

మారుతి బయలుదేరి శ్రీరాముని సన్నిధికి వచ్చి జన కాత్మజ చెప్పిన దివ్యవాక్యముల నాయనకు వినిపించినాడు. వెంటనున్న విభీషణుడు సైతము మహాసాధ్వి విశాలహృదయ వినిర్గత పరమపావన వాక్యపరంపరలను విని ముగ్ధుడైనాడు.

రాము డపుడు విభీషణుని జూచి - "శిరఃస్నాన మాచ రింపజేసి దివ్యాంగరాగములతో దివ్యాభరణములతో నలం కృతయగు సీత నిటకు తక్షణమే తోడ్కొనిరమ్మ'' ని యాజ్ఞా పించినాడు.

విభీషణుడు సీతకడ కేగి విషయమును మనవి జేసినాడు. పతిదేవుని యాజ్ఞానుసారముగ తత్సందర్శన కుతూహలాయత్త

చిత్తయగు జానకి సర్వాలంకార భూషితయై- విభీషణునివెంట శ్రీరామచంద్రుని చరణసాన్నిధ్యమునకు జేరినది.

చిరకాల తపఃఫలముగ సిద్ధించిన మనోధవుని దివ్య సందర్శన శుభసమయమున సీతామహాసాధ్వి ధన్యయై- మాన్యయై నిలిచినది.

ఏదివ్యపురుషుని పాదసేవకు దూరమై తా నింతకాలము తపించినదో ! ఏమనోహరమూర్తి సందర్శనానందభాగ్యము కొరకై యిన్ని నెలనుండి నిముసములను యుగములనుగా నెట్టుకొనుచు వచ్చినదో ! ఏప్రేమస్వరూపుని పరిపూర్ణానురాగ లహరి నోలలాడ నిప్పటివరకు ప్రాణముల నరచేత బెట్టుకొని జీవించుచువచ్చినదో ! ఏనీలమేఘశ్యామలాకారుని ముగ్ధమోహన కరుణాకటాక్షవీక్షణముల పరిసారార్థ మీక్షణమువరకు నెదురు చూచుచువచ్చినదో! ఏయాజానుబాహువుయొక్క- దోర్బల ముపై గల ప్రగాఢవిశ్వాసముతో కష్టములు గడచి మబ్బువిడి పోయినతరి చంద్రునివెన్నెల వన్నెలు బయల్వాడిన పగిది - సుఖములు మనుగడమీద మధురరోచుల జిందిపోయగలవని నిరీక్షించుచున్నదో ! ఏఇక్ష్వాకుకులదీపకుడు తలవనితలంపుగా స్వయంకృతాపరాధఫలముగ తనభవిష్యత్తుపై గ్రమ్ముకొనిన తమస్సును దొలగించి వినూత్న సముజ్జ్వలదీపమును వెలిగించ గలడని యాశించుచున్నదో ! ఏ జగన్మంగళకర క్షత్రియ ధర్మ నిర్వహణదక్షుడు - జలధిని లంఘించి, స్వసంక్షేమ వార్తను గొనిపోవ నర్హతముడగులే కాక రాక్షసకోటికి

రామపరాక్రమప్రభల వ్యక్తముగావింప గూడ సమర్థుడగు బంటును తనకొఱకై పంపెనో! ఏదృఢవ్రతుడు శతయోజన విస్తీర్ణపరిమిత మహాంభోనిధి నవలీలదాటి బలోద్ధత సేనావాహినితో వచ్చి, లంకను లంకాధిపతిని ముంచివేయ- సముద్యుక్తుడై యుండెనో! ఏసత్యవాక్య పరిపాలకుడు సకలసంయమిలోక నిఖిలబాధానివారణార్థము కోదండపాణియై దుష్టశిక్షణ, శిష్టరక్షణ గావింప కంకణధారణ మొనర్చెనో! ఏఆత్మశక్తిసంపన్నుడగు సుగుణసుందరుడు వెంటనున్నతటి యరణ్యావాస మంతఃపురనివాసమునకన్న మనోహరమై, ఆయన చెంతలేనిసమయము సర్వవిధాంధకారబంధురముగ మారిపోయెనో! ఏరఘువంశ రత్నద్యుతుల వెలుగుజిలుగులతో తన కనులకు క్రొత్తకాంతిని సంతరించుకొన నాకాంక్షించుచున్నదో ఆస్వామిని - ఆనయన మోహనాభిరాముని-ఆజానకీ హృదయధాముని - ఆకౌసల్యానందవర్ధనుని - ఆదశరథ బహిఃప్రాణమును-ఆ అయోధ్యాసామ్రాజ్యలక్ష్మీమనోహరుని-ధవళ చంద్రచంద్రికాసమ సాంద్రకీర్తిని - శ్రీరఘురామమూర్తిని తన మనోధవుని జానకి సందర్శింపబోవుచున్నది. ఎన్నాళ్ళ కెన్నాళ్ళకీ గంగ పొంగినది. ఎంతకాలమున కీదుష్టరాక్షస గర్వాంధప్రమత్తచిత్తస్థైర్యము క్రుంగినది. ఎప్పటి కీశరత్పూర్ణిమాజ్యోత్స్న సీతాహృదయ విహాయస వీథుల నిండినది. ఎంతసమయము గడచినపిమ్మట జనకసుతా భావనానందనము-మల్లెలతో

మొల్లలతో - సంపెంగలతో -సన్నజాజులతో - పారిజాతములతో ఘుమఘుమాయించినది. సరసరసాలపంక్తితో విరగబండినది.

ఈక్షణము సువర్ణక్షణము. ఈముహూర్తము సుముహూర్తము. సీత మనస్సెట్లుండును? మాటలతో చెప్పుటకు వీలగునా? వాక్కులతో వర్ణించుటకు సాధ్యమగునా? ఆమెవదనము మధుర తేజోమయము. ఆమె హృదయము మధురభావాలయము. ఆమె పలుకు తేనెచినుకు. ఆమె ఆలోచన మధురరసభరితసూచన. ఇట్లున్నది అప్పటి యామెస్థితి. దీర్ఘకాలాన న్తరము భర్తృ పాద సందర్శనసౌభాగ్యమునకు నోచుకొన బోవుచుంటినని నేడి యానందప్రవాహ మొకవంక- నాథుని దివ్యానుగ్రహమునకు నేటికి పాత్రురాలనయితినిగదా! అనెడి సంతోష సంరంభ విజృంభణము వేరొకవంక. మధ్య జానకి - వెనుక విభీషణుడు- ఎట్టయెదుట పతియైన శ్రీరామచంద్రుడు. అహో! ఏమి యా సన్నివేశ వైశిష్ట్యము. వాల్మీకి కవితారసధార యిచట నుత్తుంగ తరంగ భంగిమలతో పరవళ్ళు ద్రొక్కినదేమో! కావచ్చును. ఆయన మహర్షియగు కవిగదా! ఆయనగాక యొరులింకెవ రిట్లు వ్రాయగలుదురు?

మహాసాధ్వియగు సీతాదేవియొక్క పరమపావన చరిత్రను వర్ణించిన సువర్ణలేఖిని యది. ఆ కలమునకుగల బలమది. ఆహృదయమునకుగల దివ్యశక్తి యది. అవాక్కునకుగల యమోఘప్రతిభ యది. పవిత్రత యది.

విభీషణుడు వెంటగొనివచ్చిన సీత శ్రీరాముని యెదుట నునుసిగ్గుదొంతరలలో లేతగులాబీమొగ్గలయందలి సౌరు బుగ్గలలో ప్రతిఫలించుచుండ నిల్చినది. ఆమె తలయెత్తలేదు. భక్తియు రక్తియు నిరుపమానసక్తియు ముప్పిరిగొనుచున్న గుండెలతో మూర్తీభవించిన నమ్రతవలె - ఆకృతిదాల్చిన సాధ్వీత్వసంపదవలె - ఆమె యెల్లరిదృక్కులను తనవంకకే త్రిప్పుకొన జాలినది.

ఎందరి దృక్కులేమనుకొనుచున్న నేమి ? ఎందరి భావన లెట్లున్న నేమి? ఎందరి యాలోచన లేతీరున బ్రసారితములైన నేమి ? లక్ష్మణ సుగ్రీవ హనుమంతుల యాలోచనలుమాత్రము భిన్నముగ నున్నవి. శ్రీరాముని మోముకరేఖల దిలకించి సీత పట్ల నాయనకుగల నిరపేక్ష భావమునుగాని-ఉపేక్షాభావమును గాని పసికట్టకలిగినది వారు మువ్వురే. స్తబ్ధత సర్వత్ర తాండవించుచున్నది. ఆనిశ్శబ్ద వాతావరణమున సముత్పన్నముగా నున్న సన్నివేశ మెట్టిదో !

చిరకాల వియోగానంతర ప్రథమదర్శన మాత్మీయుల కెంత యానందదాయకమగునో! అంతకంత కధిక బాధాకరము గూడ నగును. సర్వసాధారణవిషయ మది. సీతయు నందుకు భిన్నముగ నెట్లుండగలదు? శుభ్రస్వచ్ఛ ప్రఫుల్ల పద్మవదనయైె జానకి రాముని సందర్శింపగనే- శ్రీరామముఖచంద్రావలోకనముతో ఆమె గుండెలనుండి దుఃఖము దూసుకొని వచ్చినది.

సీతవచ్చి యెట్టయెదుట నిలుచుసరికి రాముని హృదయ సదనమునం దొకవిధమగు కలకల ముదయించినది. రాముడు సుక్షత్రియ వంశాలంకారప్రాయుడగు మహావీరుడు. కులీనులయిన రాచబిడ్డలు పురుషుల విషయమున ధర్మవీరమునకెట్టి ప్రాధాన్యము నిత్తురో స్త్రీలవిషయమున శీలసౌభాగ్యమునకట్టి ప్రాధాన్యము నిత్తురు. "పరదారలతో స్వైరవిహార మొనర్చుచు విశృంఖలముగ జరించిన రావణుని రాజధానియగు లంకానగరమున పలుమాసముల కాలము వసించిన సీత యిపుడు తనయెదుట నున్నది". విభీషణుడు 'సీత వచ్చె'ననగనే రామునిలోగలిగిన భావవైకల్య మది. హర్షవిషాదరోషము లొక్కమారుగ రాముని యుక్కిరిబిక్కిరి గావించినవి. స్థిరచిత్తుడు గనుక కొంతవరకా భయంకర ప్రళయంకర సంఘర్షణకు దట్టుకొని నిలువగల్గినాడు. సామాన్యు డెవ్వడైన నున్మాదిగ మారి తీరెడివాడే.

కోల్పోయిన యేవనితారత్నముకొరకై కొండలు గుట్టలు పుట్టలు సోదరునితో గలిసి తానన్వేషించెనో యారత్నము లబ్ధమైనది. హర్షమున కిది హేతువు.

"వియోగవ్యథతో దీర్ఘకాలము క్రుంగి కృశించియున్న సతిని సంశయరహిత స్వాంతమున గ్రహింపలేకపోవుచుంటినే!"— విచారమున కిది ప్రధాన కారణము. 'కేవలము పుత్రతుల్యుడైన లక్ష్మణుని నిర్హేతుకముగ దుర్భాషలాడి యిట్టియాపదను కోరి

కొని తెచ్చుకొనినది సీత'. రోషము రామునిలో తలయెత్తుట కిది ప్రబలతార్కాణము గావచ్చును.

వినమ్రమైయున్న సీతతో ధీరగంభీరముగ శ్రీరాము డిట్లనినాడు. "కల్యాణీ! ఉగ్రరణమున విరోధిని వధించితిని. నీకు విముక్తిని ప్రసాదించితిని. నేను చేయగలిగిన దంతయును సమగ్రముగ చేసితిని. నాకుగలిగిన యవమానమును, నన్నెది రించిన ప్రబలశత్రువును సమూలముగ నిర్మూలించివైచితిని. చపలుడు, కాముకియైన రావణుడు నిన్నపహరించుకొని పోవుట దైవకృతమైన దోషము. నే నాదోషమును మానవునిగనే యుద్ధరించి సరిదిద్దుకొనినాడను. జయించినాడను. పౌరుష ప్రతిభతో - కలిగినయవమానమును తొలగించుకొననేరని పురుషుడు పురుషుడా! అతని పౌరుష మెట్టిదైన నేమి? ఎంతదైన నేమి."

శ్రీరాము డీరీతిగ నర్థవంతములైన వాక్యము లెవ్వియో పలుకుచుండ - సీత బాష్పబిందు సందోహ పరివృతవదన సరోజ మైనది. రామునిలో క్రోధము ద్విగుణీకృతమైనది. నేయి వోయ భగ్గుమనెడి యగ్నివలె మహోగ్రభావమును వహించిన వాడై వానర రాక్షసబృంద మధ్యమునందున్న మైథిలితో సూటిగ మాట్లాడదొడగినాడు. "భద్రే! మిత్రమండలి సాయముతో నేను గావించిన సమరసన్నాహ సంరంభ మంతయు నీ కొరకుగాదని ముందుగ నీవెఱుంగవలయును. నీ విపుడు సందే

హాస్పదమైన చరిత్రగలదానవై యున్నావు. నేత్రరోగి దీపకాంతులగని సహింపజాలని తెఱగున - నాయెదుటనున్న నిన్ను గనుటకు నామనస్సు సహింపకున్నది. నీ వెచ్చటకేని యథేచ్ఛగ నేగవచ్చును. నీతో నాకుగాని, నాతో నీకుగాని పని యించుకేసియును లేదు. పరగృహవాస దోష సమన్వితయగు స్త్రీని కులీనుడు-పరాక్రమశాలియునగు రాజెవ్వడు పరిగ్రహించును?

నీయూహ కనుగుణముగ లక్ష్మణునికడకో! సుగ్రీవుని చెంతకో! భరతుని సమక్షమునకో! విభీషణుని వద్దకో! స్వేచ్ఛగ వెళ్ళవచ్చును."

రాము డిట్లు కఠినోక్తులాడుటతో సీత గుండె లవిసిపోయినవి. దయా దాక్షిణ్యా శూన్యములైన పతిదేవుని పలుకులు సీతకు కర్ణశూలములైనవి. ఆమెహృదయము పావనము; నవనీత సమము. చరిత్ర పవిత్రము. శీలము స్వచ్ఛ సౌజన్య సమన్వితము. తాత్కాలికముగ తలవంచి కనులనీరు నించుటకంటె యామె చేయదగినదేమియు లేకపోయెను. తాను వచ్చునపుడు వెంటగొని తెచ్చుకొనిన సంబరమంతయు క్రమముగ సన్నగిల్ల సాగినది. తనకల వికలమైనది. తనయాలోచనల తెరల పొరలు తనకనుల యెదుటనే తెగిపోవ దొడగినవి. తానెందులకచటికి వచ్చినది? తనస్థితి యేమైనది? కర్తవ్యమేమి? ధీరహృదయ యగుటవలన నిబ్బరించుకొని, కనులనీరు దుడుచుకొని గద్గదస్వరమున నిట్లు పలుక దొడగినది.

"మహాభాగా! అవివేకియైన యొకపామరుడు పామర స్త్రీని దుర్భాషలాడుపగిది కర్ణకఠోర వచనముల నన్నేల శంకించి హింసించుచున్నావో? తెలియకున్నది. నన్ను విశ్వసింప ప్రార్థన. ఈనిర్బంధమున రావణుడు నాశరీరము నంటెనందువా అట్టొకవేళ జరిగియున్నయది నాకు తెలియనివిషయము. దేహము నాయధీనమున లేదు గదా! హృదయ మొక్కటే నావశమునం దున్నది. అందు నీమూర్తియే యధిష్ఠించియున్నది. బుద్ధిపూర్వకముగ నాతనువు నొరుల వశ మొనర్చెడి నీచురాలనా? నీజానకి పట్ల నీ కామాత్రము నమ్మక మేనియు లేదా! లంకకు హనుమంతుని నాకొరకే పంపితివి. అప్పుడే నాపై శంకగలిగెననియు, పరిత్యజింప దలపెట్టితిననియు, లవలేశ మేని సూచనయిచ్చియున్నచో జానకికి నీముందు నేడిట్టి స్థితిలో నిలువవలసిన యవసరమే వచ్చెడిదికాదు. నీవు మెచ్చనిజీవితము నెన్నడో పరిసమాప్త మొనర్చుకొని యుండెడిదానను. నీసహృదయ మిత్ర వర్గమున కిట్టిశ్రమ యుండెడి దేకాదు. నేడు వారిశ్రమ యిట్లు వ్యర్థమగుట నాకు మిక్కిలి విషాదమునే ఘటించుచున్నది.

వసుంధరాగర్భసీమనుండి నేనుదయించిన తీరునుగాని; నిన్ననుసరించుచు నేనుపడిన పాట్లనుగాని నీవు కించిన్మాత్రముగ నేని గమనించినట్లే లేదు. పాణిగ్రహణ వేళ మీరొనర్చిన ప్రతిజ్ఞ యిప్పుడేమైనది? నీయెడ నేను చూపుచువచ్చిన వినయ భక్తి విశ్వాసములకు విలువయే సున్నయైనది."

ఈవిధముగ సీత విషణ్ణవదనయై దైన్యభావమున సౌమిత్రిని సంబోధించి – "లక్ష్మణా! నాకు చితిని గల్పింపుము. ఈ దుఃఖమును అందు దగ్ధమొనర్ప దలచితిని. దానికదియే పరమౌషధము; వృథాపవాదముల పాలై మనుగడ కొనసాగించుటకన్న జీవితమును కోరి ముగింపుజేయుట లెస్స." అదరుచున్న గుండెలతో కర్తవ్యపాలన మొనర్చుటకుముందు సౌమిత్రి శ్రీరాముని మొగమువంకకు జూచినాడు. రాముని వదనమునం దచంచల సునిశ్చితాభిప్రాయమే ద్యోతకమగుచున్నది. కనులు జ్వాలామాల లైనవి. అధోముఖుడై యున్న రాముని యభిప్రాయమును సుకరముగనే లక్ష్మణుడు పసికట్టగలిగినాడు. చితి పేర్చబడినది. పతిదర్శన కుతూహలమతియై యరుదెంచిన సతి చిరకాల వియోగవ్యథను దూరమొనర్చుకొనవచ్చునుగదా యనుకొన్నది. కాని చితిలో జేరవలసిన దుస్థితి యేర్పడునని భావించెనా! కష్టములన్నియు సహనభావముగలవారి మీదనే దండయాత్ర యొనర్చునేమో! పండువెన్నెలలో సంబరముల సంసారరథమును నడుపనెంచిన మైథిలి గుండెలు బ్రద్దలగునట్లు రోదించుచు ప్రళయాగ్ని జ్వాలలమధ్య దుముకవలసివచ్చినది. అగ్ని పరీక్షయన నింతకన్న వేరొండు గలదా? ఇట్టి తీవ్రాశనిపాతమునకు దట్టుకొనగల్గుట– సముచిత నిర్ణయమును స్వీకరించుట సీత వంటి మహాసాధ్వికే చెల్లినది. ఆమె రవంతేనియు వంతకు గురికాలేదు. హృదయ సామ్రాజ్య చక్రవర్తియైన శ్రీరామచంద్రమూర్తికి ప్రదక్షిణ మాచరించి

నది. భక్తిశ్రద్ధలతో వందన మొనర్చినది. ప్రజ్వలించుచున్న చితికడకు నిర్భయముగ నిండుగుండెతో నడచినది. సకలదేవతా కోటిని స్మరించి యంజలి ఘటించినది. నాలుకలు గోరుచున్న పావకు నుద్దేశించి "నేను రాఘవుని సతిని. నామనస్సునం దన్య చింతన లేదనుట నిక్కమేని లోకసాక్షియైన యగ్నిహోతృుడు నన్ను రక్షించుగాక! శుద్ధచరిత్రనగు నన్ను దాశరథి దుష్ట చరిత్రగ సంభావించెనేని లోకసాక్షియైన పావకుడు నన్ను కన్న బిడ్డవలె గాపాడి నాపాతివ్రత్యమును లోకమునకు నిరూపించు గాక! నేను కౌసల్యాతనయుని యడుగుజాడల దప్పినదానని దానఁనేని నన్ను లోకసాక్షియగు వీతిహోత్రుడు సర్వవిధముల దయజూచుగాక!

అహోరాత్రములు, సూర్యచంద్రులు - ఉభయసం ధ్యలు - పంచభూతములు - సర్వదిశలు నా పవిత్రచరిత్రకు సాక్షులుగా నిలిచెదరుగాక! నాకేమి భయమనుచునే - సీత శ్రీరామపాదారవింద సంలగ్నమానసయై అగ్నియందు ప్రవే శించనే ప్రవేశించినది. ఏమి యాపాతివ్రత్య తేజోవిరాజమాన ధీరగంభీరప్రవృత్తి! ఏమి యామనోబల ప్రభావ వైభవ వైశి ష్ట్యము! ఏమి యాయచంచల నిర్ణయాచరణ చణ సముజ్వల సాధు సాహసవైఖరి! ఏమి యాయకుంఠి తాత్మగౌర వాభిమాన పూర్వక ప్రతిజ్ఞాపాలన తత్పరత! ఏమి యానిరుపమాన నిర్దుష్ట నిర్మల ప్రవర్తన! జను లెల్లరు భయవిహ్వలులైరి. కాంతఅంధ

రాక్రందించిరి. రాక్షస వానర సేనాపారావారము విచార తరంగ సంక్షుభితమైనది. అది అగ్నిపరీక్ష. రాముడు జానకి శీలమునకు బెట్టిన కఠోరపరీక్ష. ఆపరీక్ష నామమాత్రమే యెదు ర్కొనగల్గినది అగ్నిప్రవేశ సమయమున సీత పలికినప్రతిపలుకు ములుకుగ మారి రాముని హృదయమును గలతపెట్టినది. అశ్రు బిందువులు నయనయుగళమునుండి జాలువారుచుండ రాముడు నిర్విణ్ణుడై నిశ్చేష్టుడై నిలబడినాడు.

దిక్పాలకులు, దేవేంద్రుడు, బ్రహ్మ మున్నగువారెల్ల రాసన్నివేశమును గని సంభ్రమాశ్చర్య చకితులై రాముని సన్నిధికి వచ్చి, "దేవా! నీవే భగవానుడవు. ఎట్టి సమయము నందేని పరివర్తనకు గురిగాక యెల్లరి ప్రవర్తనలకు సాక్షీభూతు డవై – సంచలన రహితుడవై – సర్వనిర్వహణ మొనర్చు నీవే నిక్కముగ లోకకర్తవు" – అని పలుతెఱగుల కీర్తింప దొడ గిరి.

ఇది యిట్లుండగనే పరమ పావన చరిత్రమైన సీతామ తల్లి నంకము నందిండుకొని, చందనశీతల సదృశ స్వరూపుడై సాక్షాత్తుగ పావకుడే బయలుదేరి రామునికడకు వచ్చినాడు. అగ్నిసాక్షిగనే కదా! సీతారామకల్యాణము జరిగినది! ఈమె నీ "కనుంవ్రత" యని యగ్నియెదుటనే కదా! జనకుడు సీతను రామున కప్పగించినది! పరిస్థితులలో విపర్యయ మేర్పడినతఱి– అఖిలలోక మహామహిమ సముపేతుల విషయమునం దాయన యెట్లు మిన్నకుండగలడు? తప్తకాంచన భూషణపంక్తితో

సప్తజిహ్వాలతో రక్తాంబరధరుడై యగ్నిహోత్రుడు విరాజిల్లు చుండ, నల్లనికురులను ముడుచుకొని వాడిపోవని పూలమాలలు గళసీమలో శోభిల్లుచుండ, సీతామహాసాధ్వి దేదీప్యమానముగ ప్రకాశించుచుండెను. వారి యాగమనముతో నట ప్రశాంత ప్రసన్న స్తబ్ధత యలముకొనినది. అగ్నిహోత్రుడు మాట్లాడ నారంభించినాడు.

"రామా! ఈమె నీ వైదేహి. ఈమె నిష్కళంక. పాపరహిత. సర్వదా సర్వవిధముల నిన్నే నీడవలె యనుసరిం చుచు వచ్చుచు - నిన్నే మనమున ధ్యానించుచు-నీరూపము నే యంతఃకరణమున నిల్పుకొనుచు - జీవించుచున్న పతివ్రతా శిరోమణి. వృత్తశౌండీర! ఈమె సువృత్త. పుణ్యాచరిత్ర- విశుద్ధ భావ విభవోపేతయైన యీసీతను నీవు నిస్సందేహముగ పరిగ్ర హింపు" మనినాడు.

రాము డాపలుకు లాలించిన వెంటనే సంతుష్టి నంది నాడు. ఆనందబాష్పములు జాలువార నారంభించినవి.

"అవశ్యం త్రిషు లోకేషు న సీతా పాపమర్హతి-ముల్లో కములందును జానకి పాపాచరణమునకు బూనదు. పాప మామె నెన్నడు నంటదు. యథార్థముగ నిది నిత్యసత్యమే. కాని! యిట్టి పరీక్షకు గురిసేయకయే సీతను స్వీకరించిన లోకము దశరథనందనుడు బాలిశుడాయెనని గర్హించుట తథ్యము. సీత మచ్చిత్తానువర్తిని యని నే నెఱుగుదును.

కాని! ఎల్లరికిని విశ్వాసమును గలుగజేయుటకే నే నీ యగ్ని ప్రవేశమునకు సీతను బురికొల్పవలసివచ్చినది.

తీరమును సాగరుడు కాపాడుకొనుభంగి తనదివ్యతేజో విశేషమున జానకి తనను తాను సంరక్షించుకొనగలదనియు, సీతపై రావణు డెట్టియకృత్యము నేని యొనర్ప సాహసింపడ నియు నే నెరుగుదు" నని చెప్పుచు నచట జేరినవారి నెల్ల ర నానందింపజేయుచు సీతాలక్ష్మణసమేతుడై పుష్పకవిమానము నధిష్ఠించి అయోధ్యకు బయనమాయెను.

రోజులను లెక్కించుకొనుచు - అగ్రజునిరాకకై యెదు రు తెన్ను లరయుచున్న భరతుని సంప్రార్థనముమేరకు వసిష్ఠ మహర్షి సుముహూర్త నిర్ణయము గావించి, వార యోధ్యకు జేరగనే సీతారాములను రత్నమయపీఠమునం దధిష్ఠింపజేసి పట్టాభిషేక మొనర్చి పరమానందమునందినాడు. మహర్షి వసిష్ఠు డీపుణ్యకార్యమును జగత్కల్యాణార్థము తనచేతులమీదుగ నిర్వహింపదలపెట్టి యెన్నేళ్ళనుండి యువ్విళ్ళూరుచున్నాడో! నా డాయన యభీష్టము సఫలమైనది. దేనికైన నొకసమయ ముండును. సమయము సమీపించిన తరి యెవ్వ రెన్ని యడ్డం కుల గల్పించినను కార్యము నిర్విఘ్నముగ కొనసాగియేతీరును. సమయముగాని సమయమున దలపెట్టిన యత్నముల నెట్లు ఫల వంత మొనర్పవలెననుకొన్నను మిన్ను మన్నేకమైనను-స్వల్ప ఫలమేనియు దక్కదు.

ఒకనాడు శ్రీరామపట్టాభిషేకము విఘ్నమగుటయు - మరొకమారు జయప్రదమగుటయును మనకెరిగించెడి పరమసత్యమిదియే. మహాసాధ్వీసీత యీవైభవమున భాగస్వామిని గావలసిన మహాదృష్టవంతురాలు. కావుననే యెన్నియిడుములు వెన్నంటి యామె నెన్నికఠోరపరీక్షలకు గురిచేసినను మంచి సమయముగాగానే యామె శ్రీరామభద్రుని పట్టమహిషియై పట్టాభిషేకశోభ కొకవినూత్నశోభను సంతరింపగల్గినది. నిరీక్షించుచున్న తాదృశమైన శుభసమయ మేతెంచుటవలననే వసిష్ఠుని చేతులమీదుగనే యామహర్షి యాశీర్వాద పరంపరల మధ్యన మాత్రమే శ్రీరామపట్టాభిషేకము నిర్వహింపబడినది. అనిర్వచనీ యానంద సంధాయకములైన సంఘటన లనిన నిట్టివే.

"తతః స్వప్రయాతో వృద్ధో వసిష్ఠః బ్రాహ్మణైస్సహ
రామం రత్నమయే పీఠే సహ సీతం న్యవేశయత్"

సీతామహాసాధ్వి జీవితకల్పవృక్షమున పక్వదశకు వచ్చిన ఫలమది. కష్టములు కలకాలము కాపుర మొనర్పవనియు - సహించి దీక్షవహించి నిరీక్షించిన వారిని మంచిరోజులు వెదకుకొనుచు రాగలవనియు సీతాదేవి బాధామయగాథలో మెఱసిన యీపట్టాభిషేక విద్యుల్లత మానవాళికొక మహత్తర సందేశము నొసగుచు రామాయణకథావీథుల రామణీయకతను వెలార్చుచున్నది.

సీతాసమేతుడై రాముడు చిరకాలము రాజ్యపాలన మొనర్చినాడు. రాజ్యసుఖముల ననుభవించినాడు. ఈతిబాధల

కతీతముగ సుఖశాంతులతో కొనసాగిన పాలన మది. రామ రాజ్య మనుపేర శాశ్వతత్వమును ఘటించుకొనుట కవకాశ మును ప్రసాదించిన సందర్భమది. సర్వసంపత్సమృద్ధులతో శాంతిమయ జీవితమును ప్రజ లానాడు హాయిగ – స్థాయిగ గడుపగల్గిరి.

ఇదియంతయు గమనించిన సీతయెడ రాముడు కఠోర ముగ వ్యవహరించెనని భావింపవలసిన దే. తీవ్రముగ ద్వేషించె ననుకొని తీరవలసిన దే. కాని! వా స్తవమేమిటి? నిజముగ రామునకు సీతయం దనురక్తి లేదా! సీతపట్ల రాముడు క్రౌర్య మునే ప్రకటించెనా? నిండుప్రేమ యుండుటంజేసియే రాముడు సీతను నిర్దోషిగ నిరూపింప నెంచి యామె నగ్నిపరీక్షకు నిలబెట్టి నాడు. ఆ మాణిక్యముపై గ్రమ్మిన మసిని తుడిచివైచుటకు ప్రత్యేకశ్రద్ధ వహించి యొనరించిన ప్రయత్న మది. అంతియే కాని! అదిమాణిక్యమని యెరుగక గంద్రశిలగా భావించి కఠిన ముగ నొరపిడి పెట్టు గావించిన యవివేకచర్య యేమాత్రమును గాదు.

శ్రీరాముని తాత్త్వికదృష్టికి – ధార్మికవైఖరికి జోత లందజేయవలసిన సంఘటన యిది.

రాముని శాసనమును విని భయవిహ్వలయైన సీత, పామరునివలె భాషించుచుంటివే యిది యేమి న్యాయము రామా! అనినదేగాని పతియాజ్ఞ నొదల దాల్చక పోవలేదే!

ఆయన వాక్యమును శిరసావహించి మన్నించి అగ్నిప్రవేశ మొనరించుటకు సిద్ధపడిన దేగాని యన్యభావన యొనర్పలేదే! అగ్నిప్రవేశ మొనర్చుటతో సీతనిర్దోషిత్వము నిరూపితమైనది. రాఘవుని యనన్యదీక్షయు లోకమున కవగాహనమైనది.

సీతాసౌశీల్య ప్రకటనమున కిది ప్రతీక. హనుమంతుని తోకకు నిప్పంటింపగనే జానకి హృదయము విలవిలలాడినది.

"శీతో భవ హనూమతః - ఆంజనేయునియెడ చల్లనివాడవుగావయ్యా! అగ్నిదేవా!" అని యాపతివ్రతామతల్లి పలుకుటతోడనే వీతిహోత్రుడు శీతలమూర్తిగ మారి - ఆంజనేయు నాహ్లాద పరచినాడు. పాతివ్రత్యమహిమతో మహాసాధ్వీసీత యొనర్చిన పరోపకార ప్రశస్తియిది. ఆమెపలుకు నగ్నిహోత్రుడే సత్యముగావించెననిన యామె వైశిష్ట్య మెట్టిదో యెఱుకపడును గదా!

"పాపం మయి న విద్యతే- నాయం దెట్టిపాపముగూడ లేదు"-జానకి యనినమాట యిది. ఆమె యగ్నిప్రవేశ మొనర్చి సురక్షితముగ బయటపడుటతో "పాప మస్యాం న విద్యతే -ఈమెయం దెట్టిపాపముగూడ గన్పట్టుటలే" దని - అగ్నిహోత్రుడే ముక్తకంఠమున నుద్ఘోషించి నట్లయినది. సీతామతల్లి పలుకులనే పావకుడు ధ్రువపరచిన ట్లయినది. ఆమె యాశించిన పగిది- ఆంజనేయుని విషయమునను, ఆమె సంప్రార్థించినరీతి యామెవిషయమునను శీతలత్వమును వహించి యగ్నిహో

త్రుడే సీతా పాతివ్రత్యమహిమ నెలుగెత్తి చాటినాడు. నిజముగ నిది యామె సౌశీల్యమున కొక ఘనవిజయము. అట్టి మహాపతివ్రత యగుటవలననే యామె శ్రీరామ కీర్తిసామ్రాజ్య జయపతాకగ భాసించినది. ఆమెవలన శ్రీరామునకు పరిపూర్ణత సిద్ధించెననుట యతిశయోక్తి గానేరదేమో!

ఆమె యిల్లాలుగనుండి పతిపాలనమున కెట్టికళంకమును గూడ రానీయక తనయాత్మశక్తిచే విభ్రాజిత మొనర్పజాలినది. తాను సకలకష్టముల కాలవాలముగ నిల్చి తనభర్తృ ధర్మనిష్ఠకు లోటువాటిల్లనిపగిది వ్యవహరించినది. తత్కారణముననే ప్రజలు సర్వకాలములలో శ్రీరాముని దివ్యాదర్శనమును సంస్తుతించుట కవకాశ మేర్పడినది. రామరాజ్యము రామరాజ్యమని యభినందనల నందజేయు టిందువలననే. రామరాజ్యమున ప్రభువునకు ప్రజలకునుగల యన్యోన్యత యెట్టిదో! ఈకారణముననే ప్రవర్ధమానమై ప్రకాశించెననుట తథ్యము. ధర్మభావ తత్పరులగు ప్రజలు సుఖశాంతుల జూరగొనుచు రామరాజ్యమున స్థాయిని - హాయిని యనుభవింపగల్గుట కయ్యదియే మూలకారణము.

విషయముల నన్నింటిని పరిశీలించి పరీక్షించినకొలది వ్యక్తమయ్యెడి సత్యమేమి? రామరాజ్య వైభవాభ్యుదయమునకుగూడ సీతామహాసాధ్వియే హేతుభూతయని ఋజువగుటయే ఆమె సౌశీల్య సౌజన్య సౌభాగ్యములవలననే "రామరాజ్య"

మను నామము సార్థకమైనది. "సీతాయా శ్చరితం మహత్" అని వాల్మీకిమహర్షి యనుటలోగల యంతరార్థమయ్యదియే. గాంధీ - మహాత్ముఁడై లోకమున నవతరింపజేయ సంకల్పించిన రామరాజ్య మయ్యదియే. సార్వకాలికమై - సార్వజనీనమై - శాశ్వతత్వమును వింగడించుకొని సముదాత్తస్థాయిలో నాటికి - నేటికి - రేపటికిఁగూడ నాదర్శప్రాయముగ నుండుటకు సర్వ విధార్హతలుగల సామ్రాజ్యము రామరాజ్యమై విరాజిల్లుచుం డుట కతననే బాపూజీ గ్రామసీమలలో రామరాజ్యము వెలయ వలయుననియు - నాకలలన్నియు రామరాజ్యముమీఁదనే యుండెననియు - రామరా జ్యావతరణమే జీవితధ్యేయమనియు ముక్తకంఠమున నుద్ఘోషించినాఁడు. రామరాజ్యమున కట్టి ప్రత్యేక ప్రతిష్ఠయు - విశిష్ట ప్రతిపత్తియు లభ్యపడుటకు సీతా మహాసాధ్వియే నిక్కముగ కారణభూతురాలు. నేటిప్రభుత్వము రామరాజ్య పరమాదర్శము నాదరించి యాచరణమునం దిడి సఫలమగుగాక !!

## సీ తా ప రి త్యా గ ము

శ్రీరామపట్టాభిషేకానంతరఘట్టము రసవత్తరము - రమణీయము - విచారకరము - విషాదకరము. రామరాజ్య పరిపాలనాకాల మాదర్శప్రాయముగ గొనసాగిపోవుచున్నది. కాలము కలిసివచ్చెఁగదా యని మహానందమున శ్రీరామ దంపతు లానందరస తుందిల హృదయులై ముదమున దేలు

చున్నారు. జీవితమే కష్టసుఖముల పడుగుపేకల యల్లకము. మానవుడు సుఖమునే యాశించును. కాని! ఆకాంక్షించిన దంతయు ననుభవమునకు వచ్చునా?

దీర్ఘకాల వియోగవ్యథతో క్రుంగిపోయిన హృదయములు గల సీతారాములు స్వరాజ్యమున బ్రవేశించి సుఖసంపదలతో తులదూగవచ్చుగదా యని యాశించిరి. కన్నబిడ్డలపగిది రాజ్యమునగలవారినెల్లర చల్లగ బాలించుకొనుచు సంబరమున కాలము గడుపవచ్చుగదా! యని యాకాంక్షించిన సీతారాములు కనినకలలన్నియు పండగలవనియే భావించిరి. కాలమల్లీ లీలగ సాగుచున్నది. అదృష్టవశమున సీతగర్భవతియైనది. ఇక్ష్వాకుకుల దీపాంకుర ముదయింపనున్నవార్త విని శ్రీరాముడానందపరవశుడై నాడు. సీతయెడ రామునకుగలప్రేమ శుక్లపక్ష చంద్రజ్యోత్స్నపగిది క్రిమక్రమాభివృద్ధి నందుచున్నది. పెదవి కదపుటయే తడవుగ జానకి యభిమతముల నీడేర్ప రాముడు సర్వసన్నద్ధుడై యున్నాడు.

పుష్పోద్యానమున విహరించుచు రాముడొకనాడు సీత నుపలాలించుచు నిట్లనుటతో కథ క్రొత్తమలుపునకు దిరిగినది.

"జానకీ! నీవు గర్భవతివి. నీవాంఛ లెవ్వియున్నను నా కెఱిగింపుము. నేను వెంటనే వానినన్నింటిని సఫలమొనర్చి నీ కానందమును సమకూర్చెదను. నీ కోరికల దాచుకొనవలదు. నీయభిమతముల ఫలింపజేయ నేను సర్వవిధముల సంసిద్ధుడనై

యున్నాడన''ని యనురాగ తరంగి తాంతఃకరణుడై తనయుద్దే
శము నా మెదుంటదు వ్యక్తీకరించెను.

సీతయు నాథునకు తనయెడగల యపరిమితానురాగము
నకు మురియుచు "ప్రభూ! ఫలమూలాశనులై యుగ్రతపము
నాచరించెడి మహర్షులు - గంగాతీర నివాసులుగల యాశ్రమ
ప్రాంతములలో మనము మున్ను విహరించియున్నాము. నా
కేలనో! మరల నొక్కపరి యాపరిసరముల జరించుచు కొంత
కాలము గడపి రావలెవ నెడికోర్కె మెండుగనున్నది. మీరు
నావాంఛను తప్పక సఫలీకృత మొనర్పగలరని యాశించు
చున్నాను. తాము తప్పక నాముద్దు దీర్పగలరని విశ్వాసము.
మీయనుమతికొరకు నిరీక్షించుచున్నదాన'' నని జానకి
శ్రీరామునితో వినయ వినమిత మస్తకయై విన్నవించెను.
విచిత్రమైన కోరిక. ఏకష్టపరంపరనుండి విముక్తి నందితిమిగదా!
అని వారింతవర కనంతసంతోషము ననుభవించుచుండిరో!
వాని యనుభవమునే మరల రుచిజూడవలయు ననుకోర్కె
జానకియం దుదయించుట వింతయైన విధివిలాసము. జీవితగమ
నము సహజముగనే నిమ్నోన్నతముగ నుండుననియు-నద్దా
నిని సమతల మొనర్చు కోరికని సాధ్యముగాదనియు - మను
గడ యంతయు పూలబాటగ నుండుననుకొనుట వెఱ్ఱితన
మనియు - ఆయిరప్పలతో, ముళ్ళపొదలతో, కంచెలతో
గూడ నది యటనట గప్పబడి యుండుననియు - నేర్పుగ వాని
నన్నింటి నధిగమించి పురోగమించుటయే విజ్ఞుల లక్షణమనియు

సూచించుటయే యీసన్నివేశాంతరార్థమై యుండునా? ఏమో! ఏమైన నేమి? సీత యట్టికోరిక కోరినది. గర్భవతియై కోరినకోరిక కాదన జనదు. సమ్మతించి సంతోషముగ సకల సౌకర్యములతో నామెకోర్కె దీర్ప బయలుదేరదీసి పంపుట కును వలనుపడదు. విచిత్రమగు సమస్య. 'బుద్ధిః కర్మానుసారిణీ' యను సూక్తి యూరకనే వ్యాప్తికి వచ్చెనా? జానకి భవిష్యత్తు నకు సూచకముగనే యిట్టివాంఛ నామె వెలువరించినదేమో! రాముడు వెనుకముందు లరయక గృహిణి మనోగతాభిమత మును నెరవేర్చుటకే యుద్యుక్తుడైనాడు.

"సీతా! నీయభిమతము ఫలప్రదమగుగాక! నీయీప్సి తము సమకూర్చుటకేను సమ్మతించుచుంటి" నని శ్రీరాముడు తనయంగీకారమును బ్రకటించినవాడాయెను.

ఇంతలో భద్రుడనువాడు వచ్చి, "రాజా! రావణుడు చెరబట్టి తనరాజ్యమునందుంచుకొనిన సీతను గొనితెచ్చుకొని మనప్రభువు సుఖించుటలేదా? మనముగూడ మనభార్యలతో నటులనే యుండవచ్చును. 'యథా రాజా తథా ప్రజాః' అనిరి గదా యని కొందరు పామరులగు ప్రజలు మిమ్ములనుగురించి యాడిపోసుకొనుచుండి ర"ని శ్రీరామునకు విన్నవించెను.

భద్రునిపలుకులు రాముని కర్ణేంద్రియములకు బాధాక రము లయినవి. సహించలేక పోయినాడు. వెంటనే యనుజుల రావించి, మనయిక్ష్వాకువంశ గౌరవప్రతిష్ఠలకు కళంకము

నాపాదించుకార్య మెద్దియును మనవలన జరుగరాదు. సీత మహోన్నతవ్యక్తిత్వముగల స్త్రీరత్నమే యగుగాక ! జనకుని వంటి మహనీయుని పెంపకమున వర్ధిల్లవచ్చుగాక! దైవయోగమున రావణునిచే నపహృతయైనది. అగ్నిప్రవేశమొనర్చి తన నిరపరాధిత్వమును జాటుకొనినప్పటికిని లోకు లామెను కాకుల వలె బొడుచుచునే యున్నట్లు భద్రునిపలుకులవలన దెలియుచున్నది. దేవత లామెను మెచ్చిరి. కాని! మానవుల కామె ప్రవృత్తి నచ్చినట్లుగ లేదు. ఆమెనుగూర్చి నావిశ్వాస మెన్నడును సడలదు. కావుననే అయోధ్య కామెను గొనివచ్చితిని. కాని ! అయోధ్యయందలి ప్రజలలో - కొందరే యగుదురుగాక - ఆమె యపరాధినియే యనుచున్నారు. జనాపవాదమునుపేక్షించుట క్షత్రియునకు దగనిపని. ఆలస్యమున కిది యదనుగాదు. వాస్తవము నామె కెరిగించుట కిది సమయమునుగూడ కాదు. విషయమును విప్పిచెప్పక యామెను తమసాతీరమున గల వాల్మీక్యాశ్రమ ప్రాంతమున వదలిరమ్ము. దైవ మెట్లు సలుపనెంచిన నట్లగును. నా కెట్లయినను సంతసమే. ఆమె మున్యాశ్రమముల దర్శింపవలెననియు నుత్సుకత జూపుచున్నది. ఈ నెపమున నీ వీపని పూర్తిచేసి రమ్మ"ని లక్ష్మణుని యాదేశించినాడు.

జానకి జీవితమంతయు కష్టములపై కష్టములు వచ్చిపడుటతోనే గడచిపోవసాగినది. కాకున్న - యీవిపర్యయ మేమి ?

లక్ష్మణుడు సర్వము నెరిగినవాడయ్యును ప్రతిపర్యాయము సంకటమయు కష్టకార్యముల నాచరింపవలసినవాడే యగుచున్నాడు. సీత స్థితి యది. లక్ష్మణుని పరిస్థితి యిది. కొందరి మనుగడల గమనవైఖరియే యట్లుండునేమో !

తా ననుభవింపవలసిన ఖేదమును తానే యనుభవించి వాస్తవమును బహిర్గతముగానీయక లక్ష్మణుడు సీతకు పాదాభివందన మాచరించి మున్యాశ్రమముల దర్శింప జానకిని ప్రయాణముగావలసినదిగా కోరినాడు. గంగనుదాటి యవ్వలియొడ్డున కేగినపిదప గరళమును మ్రింగినట్లు గత్యంతరము లేక లక్ష్మణుడు తలవంచి నమస్కరించుచు సీతకు జనాపవాదగాథ వినిపించినాడు. సీత విస్తుపోయినది. విషణ్ణవదనయైనది. నిరాధారమైన యీనిందను మోయలేనని వగచినది. గుండెలు బాదుకొనినది. తుద కిట్లనినది.

"సౌమిత్రీ! బ్రహ్మ నన్ను దుఃఖములకే సృష్టించినట్లున్నది. దుఃఖములు నాయందు మూర్తీభవించినవి. నేను మహాపతివ్రతను. నాప్రాణముల నిట త్యజింతును. చూడుము! నేను గర్భవతిని. కానిచో నాప్రాణములను త్యజించుటకు నిచ్చగించెడిదాననే. మీయన్నగారికి పెద్దలకు నాకడసారి వందనముల నర్పింపుము. ప్రాణపరిత్యాగమునకన్న నాకు మార్గాంతరమున్న యని మరల రోదింపసాగినది. లక్ష్మణు డామెను పలు తెరగుల నోదార్చి యేమిచెప్పవలెనో, యెట్లు ధైర్యమును

గూర్పవలెనో! తెలియక మెల్లగ నామెకడ సెలవుగైకొనుట కేని మొగముచెల్లక స్పృహాకోల్పోయియున్న సీత నొంటిగ వదలివైచి అయోధ్యకు మరలి వెళ్ళినాడు.

ఘోరముగ నాక్రందించుచున్న సీతను గురించి యరణ్యమున జరించు మునిబాలకులు వాల్మీకికి నివేదించి యామె నెట్లని రక్షించవలయునని ప్రార్థించిరి.

"పురా యత్తత్ర సర్వ్వృత్తం పాణావామలకం యథా" జరిగినదంతయు వాల్మీకికి కరతలామలకముగ నర్థమైనది. అది యొక యోగము. యోగమున కట్టిశక్తు లుండును. నూతనవిజ్ఞానమును మహర్షులీయోగశక్తివలననే యందగలుగుచున్నారు. వాల్మీకి యట్టి మహాద్భుతయోగమును సర్వమును గుర్తింపగల మహర్షి.

"తతః పశ్యతి ధర్మాత్మా తత్సర్వం యోగ మాశ్రితః" ధర్మాత్ముడైన యా మునికులతిలకుడు యోగబలము నాశ్రయించి సమస్తమును దిలకింపగలిగినాడు.

ఉదారవృత్తార్థ పదై ర్మనోరమై
స్తతః సరామస్య చకార కీర్తిమాన్
సమాక్షరైః శ్లోకశతై ర్యశస్వినో
యశస్కరం కావ్య ముదార ధీ ర్మునిః !!

బాల. కా. 2-వ సర్గ. 42-వ శ్లో.

మనోహరములు సమాక్షరసహితములునగు వృత్తపాదములతో యశస్కరమైన రామాయణమహాకావ్యము నంతయు నుదారధీమహిమతో రచింపజాలిన మహర్షి వాల్మీకి. సీతయెడ రాముడు ప్రకటించిన కఠోరవైఖరికి- మహోగ్రధీయుతుడై డాయె ననుట గమనార్హము.

'సీతాం రుదంతీం దృష్ట్వా తాం తత్రవై మునిదారకాః
ప్రాదవన్ యత్ర భగవా నాస్తే వాల్మీకి రుగ్రధీః ! !'

ఉ. 49. స. 1. శ్లో.

వాల్మీకి వెంటనే యంతేవాసులతోగలిసి సీతకడ కరిగి "మహాపతివ్రతారత్నమా! మాననీయ నారీలోకభూషణమా! నీకథ సమస్తము నా కెరుకయే. నీవు నిర్దుష్టవర్తనగల సాధ్వివి. నీవు భయపడవలసిన పనిలేదు. నావెంట రమ్ము, నాయాశ్రమమునే స్వగృహముగ భావింపుము. సంతానవతివై సౌభాగ్యవతిగ వర్ధిల్లుము. శోకమును మానుము. ధైర్యమునుబూనుము" -అని యెన్నియో రీతుల నామె నూరడించెను. తండ్రివెంట బిడ్డవలె జానకి మహర్షి ననుగమించి యాశ్రమమున కరుదెంచెను. వాల్మీకి మునిపత్నుల కందరికిని సీతను పరిచయ మొనర్చి తనవచనానుసారముగ నెల్ల రామెను దయతో జూడవలెనని చెప్పి యామెను వారి కప్పగించి తనయాశ్రమమునకు దానేగెను.

లక్ష్మణుడు సీత నడవిలో విడిచిపోవుచు పతివ్రతాతిలకమగు సీతామతల్లి కిట్టియాపదలు సంప్రాప్తమగు టేలనా యని

విచారించుచుండ విష్ణువునకు దుర్వాసు డిడిన శాపఫలముగ తదంశావతారుడగు రామున కిపుడు పత్నీవియోగము గల్గెననియు, సీత కిరువురు పుత్రులు గల్గుదురనియు, నెట్టియాపదలును గలుగవనియు నూరడించి సూతుడు లక్ష్మణు నయోధ్యకు గొనిపోయెను. మహాపురుషుడైన తనయన్న ప్రాకృతునివలె దుఃఖించుచుండ లక్ష్మణుడాయన నూరడించెను.

సీతతో పరిత్యాగ విషయమును రాముడు రహస్యముగ వినిపించరాదా? నిందలు వినుటయే తడవుగ ననాలోచితముగ సీత నరణ్యములకు మున్యాశ్రమ సందర్శనమను నెపమున గెంటి వేయుట వంచనగాదా ? ఇది మహాపరాధము గాదా? రాముడిందు ప్రధానభాగస్వామి గాడా!

ప్రజల మనములం దుద్భవిల్లు సందియము లివి. విమర్శకుల మనముల గలతపరచు విషయము లివి. ప్రజానురాగమగ్నమానసుడగు రాముడు - ధర్మవ్రతుడైన రాముడు నిర్దోషురాలైన ధర్మపత్ని నీపగిది త్యజించుట ధర్మమా? లేక అధర్మమా? ఎట్టయెదుట పరిష్కరింపబడక యెల్లరిని డోలాయమాన మానసులను గావించుచున్న సమస్యయిది. సీతాపరిత్యాగఘట్టము ధర్మరసపూర్ణమైన దయార్ద్రభావనకు తార్కాణముగ నిల్చునది. ఇట్టి ధర్మసందేహముల బరిష్కరించుటకు దగిన యాత్మశుద్ధియు చిత్తస్థైర్యమును గావలెను. పవిత్రహృదయు లంతర్వాణి ప్రబోధమునకు దలవంచి - ఆశూదేశ

కాలముల కనుగుణముగ వ్యవహరించుచుందురు. వారి నిర్ణయములను దప్పుపట్టుటయా! అది దోష భూయిష్ఠమైన విషయము. పవిత్రహృదయు లంతరాత్మ ప్రబోధము నొదలదాల్ప సందియ మేర్పడినతరి వివేక వయో జ్ఞాన వృద్ధులగువారి యాదర్శములను నొరవడిగ గైకొని నడచుచుందురు. వారిని దప్పుబట్టబోవుటకు ముందుగ విమర్శకులు సునిశితముగ వారిని వారే విమర్శించుకొనవలసియున్నది. పెద్దలగు పూజ్యుల నిర్ణయములు సర్వకాలములకు సమన్వయించునవి కాకపోవచ్చును. తాత్కాలికము లయినవిగనే ప్రతిభాసింపవచ్చును. విజ్ఞులెప్పటికప్పుడు సందర్భోచిత నిర్ణయముల గైకొని యాచరణమునం దుంచుచుందురు. సమయోచితముగ నెదురైన సందియముల దీర్చుకొనుచుందురు. వారియూహల నొక్కపెట్టున గొట్టివేయుటకు వీలు లేదు. ప్రసన్నచిత్తముతో ప్రశాంతహృదయముతో పరిస్థితుల నన్నింటిని పూర్వాపరముల దడవుచు పరిశీలన మొనర్చుకొని పాత్రల ప్రకృతుల కనుగుణమగు వైఖరిని గుర్తించి దీర్ఘముగ యోచించి యిట్టిసందర్భములం దొకనిశ్చయమునకు రావలెను. యోగ్యతమమైన పరిష్కారమార్గమప్పుడే సాక్షాత్కరించును. సమున్నతము, సముదాత్తమునగు సమన్వయ మప్పుడే యేరికేవి గుదురును. పరపురుషస్పర్శయే పాతక హేతువనియు, పాతివ్రత్యమే పరమ ధర్మవ్రతమనియు భావింపబడెడి యాకాలమున

"స్వ ధర్మో రక్షసాం భీరు! సర్వథైవ నసంశయః
గమనం వా పరస్త్రీణాం హరణం సంప్రమథ్యవా"
(సుం. కా. స. 20. శ్లో. 8.)

అని బహిరంగముగనే చాటువానియింట నిర్బంధితమైన భార్యను ప్రాప్తచారిత్రసందేహగా రాము డూహించుటవలననే సీతామహాసాధ్వికి అగ్నిప్రవేశము తప్పనిసరియైనది. "ధర్మేణార్థశ్చ కామశ్చ" ధర్మసమ్మతములైన యర్థకామములే అనుభవ యోగ్యములని యెల్లరు విశ్వసించురోజులలో - తాదృశ ధర్మసూత్రముల యద్ధతిక్రింద నలిగిపోయిన ప్రాణులలో జానకి ప్రథమశ్రేణికి జెందినది.

ఆమె కడగండ్లు గాంచిన కరుణ యుప్పొంగి మన యెడందల సానుభూతి నామెవంకకే మ్రొగ్గజేయును.

ధర్మార్థమో ! రాజ్యార్థమో దేనికొరకైన నేమి ఋజువుగాని నేరములను నెత్తిపై రుద్ది యెవరికొరకో, ఎవరి నామోదింపజేయుటకో సీతను పలుకష్టముల పాల్జేసిన శ్రీరాముని చరిత్రము నిట దృష్టియందిడుకొని మనము శ్రీరాముని వర్తనమును బరిశీలించి విమర్శించుదము.

"అంతరాత్మా చ మే వేత్తి సీతాం శుద్ధాం
యశస్వినీం" (ఉ. రా. స. 45. శ్లో. 10)

"సీత యశోమయ జీవితము నడిపిన పరిశుద్ధ హృదయ యని నాయంతరాత్మ కెరుకయే" యని యుద్ఘోషించిన రాము

డొనర్చిన దేమి? ఇక్ష్వాకు మహావంశ గౌరవదీప్తులు కళంకిత ములు గాకుండుటకై పామరులువేసిన నిరాధారమైన నింద నాధారముగొని జానకి నడవుల కంపినాడు. తా నట్లొనర్చుట కన్న యన్యమార్గమున వంశకీర్తిని గాపాడజాలనని భావించినా డాయన. తన మహాన్వయ ప్రశస్తిపై బడిన మచ్చ దొలగించు కొనుటకు భార్యాపరిత్యాగమే ప్రధానకారణముగ నుండవలె ననెడి నిర్ణయమునకు వచ్చినవాడు శ్రీరాముడు.

సర్వంచ విదితం మహ్యాం త్రైలోక్యే యద్ధి వర్తతే
అపాపాం వేద్మి సీతే! త్వాం తపోలబ్ధేన చక్షుషా॥
(ఉ. రా. స. 49. శ్లో. 14)

ముల్లోకములయందును నీకన్నమిన్నయగు పుణ్యశీల యెవ్వరునులేరు. తపోబలమువలన లబ్ధమైన జ్ఞాననేత్రముతో నే నీవిషయము నంతయు గుర్తించితినని నొక్కివక్కాణించి నాడు వాల్మీకి. విధాతను తనవద్దకే రప్పించుకొని తాను సృజిం చుచున్న రామకథయందలి ప్రత్యక్షరము సత్యసమ్మతమైనదే యని పరమేష్ఠిచేతనే ప్రశంసలందుకొన్న రసజ్ఞకవిశిరోమణి వాల్మీకి.

రాము డట్లన్నను - వాల్మీకి యిట్లన్నను సీతకు వన వాసక్లేశము మాత్రముతప్పలేదు. ధర్మసూక్ష్మ మెచటనున్నది? ప్రజలదృష్టిలో ప్రభువు యోగ్యతముడుగ నుండవలసినదే! ధర్మపరాధీనుడైన రాము డట్లొనర్చుట లగ్గగునా! నిర్హేతుక

ముగ శుష్కప్రలాపములు ప్రల్లదములును బలుకువారి సాక్ష్యములనై సీతవంటి పవిత్రచరిత్ర పునరరణ్యావాస మహోగ్రబాధల నెదుర్కొనవలసివచ్చినది. రాముని జూచిన కన్నులతో సీతను-సీతం గనిన నేత్రములతో శ్రీరాముని మార్చి మార్చి నిశితపరిశీలన మొనర్చుచు దిలకింపుడు. ధర్మనిర్ణేతలదృష్టిలో రెండును ముఖ్యాంశములే. ప్రజానురంజకమైన పరిపాలనాన్యాయనిర్వహణ మొకరికడ గన్పట్టుచుండ - నిర్దోషురాలియెడ నెల్లరియెడదలలో సహజముగనే యుదయించెడి హృదయానుకంప రెండవవారిపట్ల కలుగుచునేయుండును. ఈ రెండు దృక్పథములును లోకకళ్యాణకరములే. కాని! యిట్టిసందర్భములలో రెంటికిని సమన్వయము గుదుర్చుటయే తపోమయ జీవను లొనర్పదగిన మహత్తరకృషి. పరస్పర వైరుధ్యముగల యంశములతో సృష్టి విచిత్రతమముగ నుండును. ధర్మపరతంత్రుల యనుభూతియు - నిర్దోషుల యావేదనయు మన కీసన్నివేశమున సాక్షాత్కరించును. దేని కదియే మిన్నగ నున్నట్లుగనే తోచును. దేని కదియే సమర్థనీయమైన దానివలె గన్పట్టును.

ధర్మప్రధానముగనే వాల్మీకి రామాయణరచన గావింప నెంచినాడు. మహాకవి ప్రవృత్తిలో నంతర్గర్భితములై నిరాజిల్లెడి హృదయార్ద్రత - పవిత్రానుకంప - బీజరూపమునందున్నవి. 'సీతాయా శ్చరితం మహ'త్తని యెలుగెత్తి చాటిన మహర్షి యాంతర్య మేమి? సీతారాముల నిరువురను కళంకరహితులుగను; పవిత్రజ్యోతులుగను దీర్చిదిద్ది యాదర్శమూర్తులుగా

రామాయణ కథాభాగమున సాక్షాత్కరింపజేయవలెను. కావుననే పైన పేర్కొన్న దృక్పథద్వయమున ఏకత్వమును సంఘటించుట కాయన పూనుకొనెను.

భవభూతి సీతను శ్రీరామునిదృష్టితో గాంచగా - తిక్కన సీతాదృష్టితో తిలకించి తదనంతరకాలమున యీ వేదనల ననుభవించుచు రచనల గావించిరి. పరిపూర్ణత వాల్మీకిరచనయందే మనకు ద్యోతకమగును. ప్రజలు "లలితాతిలలితమ్ - మధురాతిమధురమ్" అనుటకు దగినరీతిగ నమృతస్రోతస్సు నొకదానిని రామాయణరూపమున వాల్మీకి ప్రవహింపజేసినాడు.

కర్తవ్యనిర్వహణ హృదయానుపంకముపై నాధారపడి యుండెననుట సత్యమే. మహర్షి వాల్మీకి హృదయార్ద్రత హృదయానుకంపమునకు మూలమని విస్పష్ట మొనర్చ నెంచినాడు.

"మా నిషాద" శ్లోకము శోకభరిత హృదయానుకంపా జనితమైనట్టిదే యగునుగదా!

అపవాద నెపమున సీత నడవులకంపిన రాముని వైఖరిని గూడ వాల్మీకి నేరముగ నెంచలేదు. సీతవంకకే తాను మ్రొగ్గెను. తనయంతరాత్మ ప్రేరణతో దయను వెలార్చినాడు. కరుణావేశమును బ్రకటించినాడు. తన సహజహృదయార్ద్రభావ విశదీకణమువద్దకు వచ్చుసరికి - మొగమోటమి జూపక విస్పష్టముగనే చెప్పదలచినదానిని జెప్పినాడు.

మహర్షి వాల్మీకి సరళ సాధుభావ సంభరితాంతఃకరణుడు మరియు ధర్మపక్షపాతి. కావుననే సీతారాములమధ్య నే యొక్కరో దోషులనక యిదమిత్థమను నిర్ణయమునకు గడంగక యేయొక్కరిని దోషులని వ్రేలెత్తిచూపక ధర్మపోషణ గావించినాడు. కర్తవ్యపాలనకు హృదయార్ద్రతయు బ్రధాన మని నిరూపించి శ్రీరాముని తదర్థము ప్రోత్సహించి – తదాచరణమునకు గడంగు వాతావరణమును గల్పించినాడు.

ప్రజలలో నపోహాలు ప్రభువుల పరిపాలనపై నేర్పడుట యెచటనేని సహజమే. విషయవివరణ గావించి ప్రజలకు నచ్చ జెప్పవలసిన బాధ్యత రాజుదే. రాముడట్లొనర్చెనా? వారు పామరులే యగుదురుగాక! పండితులే యగుదురుగాక! నేరారోపణ మొనర్చినవారిని ప్రశ్నింపలేదు. సమాధానము జెప్పుకొనెడి సదవకాశమును జానకి నొసగలేదు. విచారణకు దావీయక క్షణముమీద శిక్ష నమలుపరచుటయా? ఇదేటి న్యాయము? ప్రభుత్వపీఠమున కిది యుచితవిధియా?

రాముడు దుఃఖభారమున నుండవచ్చును. సీతకు దుర్వార్తను వినిపించలేక పోవచ్చును. మార్గాంతరములు లేవా? జానకికి వాస్తవము నెరిగింపవలసిన ధర్మము ప్రభుత్వముదే యగునుగదా! సరిపెట్టుకొనవచ్చును, సమర్థించుకొనవచ్చును. కాని విధాన మట్లుండరాదని యాక్షేపకు లందురు.

పాతివ్రత్యముపట్ల ప్రజలవిశ్వాసములపట్ల గల యౌచిత్యమును సమసమముగ దూచి చూచి విలువగట్టగల మరాబు

శ్రీరాముడు. కావుననే సీతకుగాని, యిక్ష్వాకు వంశమునకుగాని అపనిందకు సంబంధించిన ఛాయయు సోకరాదని యాయన నిర్ణయము. కావున నట్లొనర్చెనేమో! యని కొందరు మరొక రీతి సమర్థింప జూచుదురు.

దోషరహితస్త్రీని విచక్షణాత్మకదృష్టితో బరిశీలింపక ప్రమాదకరశిక్షకు గురిచేయుట - అపనిందలు వేయువారిని సమర్థించుటయే యగునుగదా! అని కొందరివాదము. సంశయములు కుప్పలు తెప్పలుగా నొక్కొక్కటి మనయెదుట నుప్పతిల్లుచుండును. తార్కికులు వీని సర్వసాధారణాంశములక్రింద గొట్టివేసిన గొట్టివేయుదురుగాక! సమరస దృక్పథములో నుభయుల స్థితిగతులను - వారున్న తీరును తెన్నును గమనించిన సహృదయపాఠకులు సీతారాముల నిరువురను నిర్దోషులుగనే భావింపగలరని విశ్వాసము. సకలవిధబాధలను సంతోషముగ ననుభవింప సన్నద్ధయై నిలిచిన సీతాదేవియే శ్రీరామునికి దోషము నంటగట్టలేదే! సామాన్యులమైన మన మా ప్రసక్తిని దెచ్చి పలుతెరగుల బలుకబూనుట సాహసమే కాగలదు.

రాముడు సీతను స్వార్థబుద్ధితో త్యజించెనా? ఈమాట రాముని విరోధులుగూడ పలుకవెఱచుదురు. రామున కేదేని దురుద్దేశ ముండెనా? అట్లనుటకు మనసొప్పదు. రామునకీ పరిత్యాగమువలన ప్రత్యేకప్రయోజన మేదేనియుగలదా? వీనిలో నేయొక్కటియునుగాదు. కానేరదు.

సీతాపరిత్యాగము రామునకు కడుంగడు మనోవేదననే సంఘటించినది. రాము డాదర్శప్రాయ రాజ్యపాలనమును రాణకెక్కింప నవతరించిన పుణ్యమూర్తి. సీత ధర్మమునకు భిన్నముగ నడుగు వేయుటకు సమ్మతింపని సాధ్వీతిలకము. వారిరువురును వారివారి ధర్మములను ప్రశస్తతమధోరణిలో పాటించినారు. స్త్రీపురుషుల యన్యోన్యతయేకాక వారిధార్మికదృష్టియు నేతీరున గొనసాగవలెనో! వారు వారిజీవితములద్వారా వివరించి చెప్పిరి. భార్యాభర్తలై ధర్మనిర్వహణ గావించుచు మానవాళిని సముద్ధరింప దక్షములగు ధర్మసోపానముల సృష్టించిరి. మానవజాతి యాపుణ్యదంపతులు నిర్మించిన మెట్లపై నడుగిడుచు క్రమముగ నాదర్శ ధర్మశిఖ రాధిరోహణ మొనర్తురుగాక! సుఖమయ సుందర శాంతిపూర్ణ జీవితానుభూతులలో విశ్వకల్యాణమును సుస్థిర మొనర్చెదరుగాక!!

ఆంతర్య పరిశీలనకు బూనుట తప్ప - ఎవరు దోషులో! ఎవరు నిర్దోషులో అనెడి చర్చ కిచట దావులేదు. సంశయములకవకాశమున్నది. అట్టివాని కవకాశము లెల్లపుడు నుండును. వానిపై జర్చకుబూనుటేల? సీతారాములే వారిలో నెవరు దోషులో నిర్ణయించుటకు బట్టుపట్టలేదు. వాస్తవమున కావ్యవహార మట్టిది. ఎటువైపునుండి తిలకించినను ధర్మనిష్ఠాపరతయే యిట ప్రధానాంశమని మన మెల్లర మంగీకరించుదముగాక!

# సీత రసాతల ప్రవేశము

లవణాసురుని వధింప మధురకు బయనమైన శత్రుఘ్నుడు మధ్యేమార్గమునం దొకరేయి వాల్మీక్యాశ్రమమున విశ్రమించు నిమిత్త మాగినాడు. నాటిరాత్రియే జానకి కవలను గన్నది. ముష్టిప్రమాణముగల కుశలతో పెద్దవానిని దీవించుటవలననే వానికి కుశుడనుపేరు సార్థకమయినది. లవప్రమాణముగల కుశలతో చిన్నవానిని దీవించుటవలన వానికి లవుడని నామకరణ మొనర్పబడినది.

దైవబలమున్న తృణము మేరువగును. అనాథు లెవ్వ రేని సనాథులుగనే వర్థిల్లగలరు. కాంతారమున జంతుకోటి కాహారముగ మారిపోవలసిన పూర్ణగర్భవతియగు సీత సురక్షితయై సులక్షణలక్షితులయిన బిడ్డల కిరువురకు మాతయై మాన్య చరిత్ర కాగల్గుట దైవానుగ్రహముగాక యేమగును. ధర్మ బలము గలవారికిగాక దైవానుగ్రహసంపద యెవరికి లభ్య పడును! వాల్మీకి కవలను క్రమముగ వృద్ధికిగొని తెచ్చెను. విద్యలన్నిటిం గరపెను. తనచేరచింపబడిన రామాయణమును రాగయుక్తముగ స్వరసమన్వితముగ మధురాతిమధురముగ గానముచేయు శక్తిసంపన్నుల నొనర్చెను.

అయోధ్యలో రాము డశ్వమేధయాగ మొనర్చునాటికి వాల్మీకి యొకకుటీరమును గంగాతీరమున నిర్మించుకొనినాడు. తనశిష్యులయిన కుశలవుల బిలిచి శ్రీరాము డొనర్చుయాగ

మునుగురించి వివరించి మీరిరువురు నయోధ్యకరిగి మధురకంఠములతో నచ్చటివారినెల్ల ముగ్ధులగావించుచు శ్రీమద్రామాయణ గానమొనర్చి రండని యాజ్ఞ యొసగి యాశీర్వదించి పంపినాడు. అట 'మీ రెవరని?' ఎవరేని ప్రశ్నించిన, 'వాల్మీకి మహర్షి శిష్యులమ'ని మాత్రము చెప్పుడు.

వారు బయలుదేరి వెళ్ళినారు. వారినిజూడగనే ముద్దు వచ్చుచున్నది. వారి గాన మంతకన్న ముద్దుగనున్నది. రాముడు వారిని దగ్గరకుబిలిచి 'మీరెవరు నాయనా! రామాయణము నింత మధురాతిమధుర ముగ గానమొనర్చెడి దివ్యశక్తి మీకు ప్రసాదించినగురుదేవు లెవ్వరు?

రాగయుక్తముగ శ్రోతల కింపునింపు రామాయణగానముతో పులకితగాత్రుడయిన శ్రీరాముడు - మీరు వినిపించు గాథను రచించిన మహనీయు లెవ్వ?"రని ప్రశ్నించెను.

కుశలవు లానందముతో నిట్లు వివరించిరి. "ప్రభూ! మీచే నాహ్వానింపబడి-ప్రస్తుత మిచటనే కొలదిదూరమున నివసించుచున్న పూజనీయులు వాల్మీకి మహర్షియే యీకావ్యకర్త" అని వారు సవినయముగ బదులుచెప్పిరి.

రామాయణ కథాభాగమున చివరిఘట్టములలో వచ్చిన కుశలవుల ప్రసక్తివినగనే రాముడు తప్పక వారు సీతపుత్రులనియే గుర్తించెను.

వెంటనే రాముడు దూతలను రావించి వారికిట్లు వివరింప సాగెను.

"సీత విశుద్ధచరిత్ర యను పగిది మీకావ్యమున మీరు వక్కాణించియున్నారు. అయిన రేపటి ప్రాతఃకాలము ననే సభకువచ్చి - సీత నిర్దోషిత్వమును నిరూపించుకొని నాకు విశ్వాసమును గలిగింపవలసినదిగా కోరుచు" దూతల నా వార్త వాల్మీకికి వినిపించి, సత్వరమే మరల రావలసినదిగా చెప్పి పంపినాడు.

దూతలు దివ్యతేజస్వియైన వాల్మీకిని దర్శించిరి. వినమ్రులై మృదుమధురవాక్కులతో శ్రీరామసందేశమును విని పించినారు. వాల్మీకి సర్వము విని "స్త్రీకి పతియే దైవముగదా! కావున నట్లే యగుగాక" అని తనసమ్మతిని వెలిబుచ్చినాడు.

రామున కావార్తను దూత లందించిరి. రాముడు వెంటనే సభ యేర్పాటుగావించి ఋషిసత్తములను, నానాదేశ రాజప్రముఖులను, పెద్దలను సీతానిర్దోషిత్వ నిరూపణ సన్నివేశమును దిలకింప రావలసినదిగా యాహ్వానించెను. సీతాసమేతుడై వాల్మీకియు నాసభ కేతెంచెను.

సీత రామున కంజలిఘటించి శిరస్సువంచి యొకప్రక్క నిలువబడినది. జానకి కనులబడగనే సభ కోలాహలమున మునిగి పోయినది. సాధువాదములు ప్రతిధ్వనించినవి. సీతపట్ల పరిపూర్ణ సానుభూతిని కొందరు ప్రకటించిరి. రామునకుగూడ

కొందరు జేజేలు చెప్పిరి. దంపతుల నిరువురను కొంద రభినందించిరి.

ఆకృతి దాల్చిన ఆర్యతేజోనిధిగా సభారంగమున వాల్మీకి లేచి నిలువబడినాడు. లోకాపవాద కలుషీకృతవర్తనగా పేర్కొనబడుచున్న సీతాదేవి పవిత్రతను ముక్తకంఠమున జాటనాయన యుద్యుక్తుడైనాడు.

"శ్రీరామచంద్రా! అపవాదపువంకతో నాయాశ్రమ ప్రాంతమున వదలిరాబడిన నీయర్ధాంగి జానకి పూతచరిత, పుణ్యశీల. తన నిష్కలుషత్వము నామెయే వక్కాణించుట కెట్టి యవకాశముగూడ నింతవర కామె కొసగబడియుండ లేదు. మనోవాక్కాయకర్మల నే నింతవర కెట్టిపాపము నెరుగనివాడను. నేడామె తననిర్దోషిత్వమును నిరూపించుటకు కవకాశము నందజాలినది. ఆమె నిర్దోషియని మీరెల్లరు సమ్మతించినపుడే నాచిరతపఃఫలమును నే నందగల్లుదును. పంచభూతముల సాక్షిగా, ఆత్మసాక్షిగా నేను సీత విశుద్ధచరిత్ర యని విశ్వసించుచున్నాను. కావున నే యామెను నాయాశ్రమమునందుంచి బిడ్డవలె కాపాడుకొన్నాను. పతినే దైవముగ నారాధించు యీ పావనచరిత్ర లోకాపవాద భీతితో వెలచు నీకు ప్రగాఢ నైతిక ప్రత్యయమును గలుగజేయుగలదని నావిశ్వాస" మనుచు గూర్చుండినాడు. అంత రాము డామహర్షి వంకకు జూచుచు "మీవచనము లన్నియు నాకు విశ్వసనీయములే. లంకలో

సీతాపరీక్ష జరుపబడినది. పిమ్మటనే యామె నిర్దోషిత్వమును మనసార విశ్వసించియే స్వీకరించినాను. లోకాపవాదము వచ్చినమాటయు నందువలననే. సీతాపునఃపరిత్యాగమునకు బూనుకొనిన మాటయు వాస్తవమే. నాదోష మేదేని యిందున్నట్లు మీరు భావించుచో క్షమార్హుడనే. కవలను నాపుత్రులుగనే నమ్ముచున్నాను. సీత దిగంతవిశ్రాంత యశోవిభూషిత యగుట నాకును ముదావహమే" యనుచు సభ వారి నందర జూచుచు, "మహనీయులారా! మాన్యులారా! సీత పవిత్రచరిత్ర యను పరిపూర్ణ విశ్వాసము నాకున్నది. మునివరేణ్యుడైన వాల్మీకి సీతా నిష్కల్మషగాథను మీయెదుట నుద్ఘాటించినాడు. మహర్షి వాక్కులు నాకామెయెడ సంప్రీతిని, సమాదరణభావమును సమకూర్చుగాక !" యనుచు బలికెను.

పూర్ణగర్భిణియైన సీతను బరిత్యజించుటకు నాడు శ్రీరామున కేకారణ మెదురయ్యెనో నేడుగూడ నాకారణ మట్లే యెదురగుచుండ ధర్మానుగుణముగ నాత డామె నిప్పు డెట్లు స్వీకరింపగలడు ? రాజధర్మరక్షణయే రాముని కర్తవ్యమగును. కాని ప్రేమభావమునకు గాని, సమాదరణ వాదమునకుగాని, సముపలాలన వైఖరికిగాని యిట్టిపట్టుల స్థానమే లేదనుట తథ్య" మని తార్కికులగు మహాపండితులు కొందరు వాదింపవచ్చును.

కాని! భర్తకు భార్యయెడ కొన్ని ప్రత్యేక బాధ్యతలనునవి లేవా ? పతి సతి కాశ్రయమునొసగి తీరవలదా ? సంఘనీతి

గాని, రాజధర్మముగాని యీయంశముల నంగీకరింపవా ? ఆద
రింపవా? స్త్రీ పురుషునికి విలాసవస్తువైన ఆటబొమ్మయా ?
అట్లగుట న్యాయమా ? పతికివలె సతికిని హృదయము కలదు
గదా ! సుఖదుఃఖ మానావమానాదుల యనుభవము కలదు
గదా ! ప్రజలయం దెవడో యొకమూర్ఖు డేదోయనెనని వాని
వాక్కులగల సత్యము నరయకయే, విచారణ సలుపకయే శిక్షిం
చుట రాజధర్మమా ! సింహాసనమునకే కళంకమును గూర్చెడి
చర్య గాదా యిది? ప్రభువే యిట్లొనర్ప సాహసించిన ధర్మమున
కింక బ్రతు కెక్కడ ? రాజట్లొనర్చుటకన్న ప్రభుత్వపీఠమును
విసర్జించి యడవుల కరుగుట సముచితము. ధర్మపరిణామములను
స్వీకారార్హములుగా నెంచనిచో వానిపై నింక విశ్వాసము
నుంచెడి వారెవరు ? ప్రేమకన్న ధర్మకర్మాచరణమే మిన్న
యుందురా ? అట్లయిన విజ్ఞతకు దూరమైన, వివేకమునకు దాపి
యని ధర్మాచరణమునకన్న ప్రేమాదర ప్రకటనకు ప్రాధాన్య
మిచ్చుటయే యోగ్యతమమని యేల యనరాదు. ప్రేమ పయ
నింపవలసిన మార్గమును జూపుచుండ కర్తవ్యము తత్పాలనపట్ల
మక్కువను బెంచును. ప్రేమ కేవల భ్రమప్రమాద జనితాం
శముగాదు. స్వప్నసంగీతము గాదు. సత్య శివ సుందర పవిత్ర
భావన గదా ! ప్రేమ. దానిని మిథ్యగా నెంచి యప్రాధాన్య
మైనదానిగ నెంచరాదు. ప్రేమ చక్రవర్తి యనుకొన్న
కర్తవ్య నిర్వాహణ మద్దానికి భృత్యుని వంటిదే. ప్రేమ పరి
త్రాయమాత్రముచే బంధితముగుటచే నిత్యనూతనసృష్టి జరుగు

చుండును. కర్తవ్య మనునది నిర్జీవపాషాణతుల్యము; జడము దానికి తేజస్సు ననుసంధించి చైతన్యమును చేకూర్చునది; నవనవోన్మేష రేఖల ప్రసరించునది ప్రేమయే.

శుష్కాస్థిపంజర సమాన కర్తవ్యభావనకు రక్తమాంసాదుల నమర్చి జీవకళను ప్రసాదించునది ప్రేమభావనయే. మోడువారిన వృక్షసంతతిని పుష్పఫల సమృద్ధ మొనర్చునది ప్రేమయే. ఆతపతప్తమగు భూమికి శీతలత్వమును బ్రసాదించునది ప్రేమయే. వినీలగగనభాగమున ప్రేమబలమువలననే జగచ్చక్షువు ప్రకాశించుచున్నాడు. మేఘములు వర్షించుట, నదులు ప్రవహించుట, తమస్సులోనుండి జ్యోతిర్దీప్తులు వెల్లివిరియుట ప్రేమవలననే. ఇది ప్రేమశక్తి. ప్రేమమయహృదయమున భగవానుడుండునని భారతీయుల విశ్వాసము. ప్రేమను కాదను టెట్లు? కర్తవ్యనిర్వహణదీక్షయే ముఖ్యమను టెట్లు? సభాసదుల గుండెలలో నేవేనియో భావము లుత్పన్నము లగుచున్నవి. ఈసన్నివేశ ప్రాధాన్యమును గుర్తించినవా రెల్ల రిది కృతయుగకాలపు సంఘటనయా! యని విస్తుపోవుచున్నారు. సర్వము సంభ్రమాశ్చర్యజనకముగనే యున్నది.

ఏమి కానున్నదో! ఏమి జరుగనున్నదో! ఎట్లుగానున్నదో! కాషాయాంబరధారిణియై మహాసాధ్వి- సాధుశీల- స్వచ్ఛహృదయ యగు జానకి సకలసభ్యలోకమున కొక్కసారి సవినయముగ శిరమువంచి నమస్కరించి సంభాషణ సాగించి

తనశపథమును వినిపించుచు గుండెలువిప్పి యెల్లరిముందు తన యూహలను గుప్పపోయ దొడగినది.

"యథాహం రాఘవా దన్యం మనసాపి న చింతయేత్
తథామే మాధవదేవీ వివరం దాతు మర్హతి''
ఉ. కాం. 97 స. 15 శ్లో.

మనసా కర్మణా వాచా యథా రామం సమర్చయేత్
తథామే మాధవీదేవీ వివరం దాతు మర్హతి. 16-వ శ్లో.

యథైత త్సత్య ముక్తం మే వేద్మి రామా త్పరం న చ
తథామే మాధవీదేవీ వివరం దాతు మర్హతి. 17-వ శ్లో.

శ్రీరామునిదప్ప తదితరుల మనస్సునందేని తలంపనిదానను నే నగుచో నాతల్లి భూమాత నాకు దారి నొసగుగాక! త్రికరణ శుద్ధిగ దాశరథినే సదా నే నారాధించుదాననేని నాతల్లి ధరణీ మాత నా కాశ్రయానాసముల నిడుగాక!! రాఘవునిగాక యితరు నెవ్వనినేని నేను నిక్కముగ నెఱుగనిదాననగుచో నాతల్లి పృథ్వీమాత నాకు నెలవు నిచ్చుగాక!!!

ఆమె ముమ్మా రట్లనినదో! లేదో! ఢణంఢణాయ మాన ధ్వనితరంగములు సభాసదుల చిత్తైకాగ్రతకు భంగము గలిగించుచుండ దివ్యాలంకారపరివృత సుందరసింహాసనము నొక దానిని వెంటనిడుకొని భూదేవి సభామధ్యమున సాక్షాత్కరించినది. అటనున్న వారెవ్వరితో పనిలేనిదానివలె - ఎవ్వరినేని లక్ష్యముచేయవలసిన యవసరము లేనిదానివలె- కర్తవ్యాకర్త

వివరణకు బూనవలసిన విధినేపాటింప నిష్టము లేనిదానివలె - పలుకొక్కటేని పలుకక చూపు నేవంకకేని ద్రిప్పక - ప్రేమ భావన కొక్కదానికే ప్రాధాన్యము నిచ్చుచు మూర్తీభవించిన వాత్సల్యజలధియై యత్యంతానురాగము వెల్లివిరియ బాహువుల జాచి సీతను సింహాసనమునం దధిష్ఠింపజేసి - తన వెంట కనురెప్పపాటు కాలమున రసాతలమునకు గొనిపోయెను. జరిగిన దేమియో! ఎట్లు జరిగినదో! ఎవరు జరిగి చిరో! ఏమయినదో! ఎవ్వరికిని యెరుకలేనంత - ఎఱుకకు రానంత శీఘ్రముగ నంతయు వింతగ గొనసాగినది. రథము భూతలమున బ్రవేశించుచున్నది. సింహాసనమునగల సీత క్రమముగ మెల్లగ కనుచూపులకు దూరమగుచున్నది. దేవతలు పుష్పవృష్టి గురియించుచున్నారు. మహర్షులు సాధువాదములతో జనకనందన నభినందించుచున్నారు. సభాసదులు, సచివులు, చక్రవర్తులు. సామంతులు, సామాన్యప్రజలు తెచ్చవడి చూచుచున్నారు. చూచుటకు మాత్ర మేమున్నది? బొమ్మలవలె నిశ్చేష్టులై నిర్విణ్ణులై చూచుచుండగనే సర్వము జరిగిపోయినది. చలించని జాజితీగ రెమ్మలవలె వారెల్లరును చైతన్య రహితులైనారు.

రాముడు దుఃఖభార వివశుడైనాడు. జానకి యిట్లొనర్చునని - ఈసభ యిట్టి విషాదసన్నివేశమునకు దారితీయునని యూహించెనో లేదో! ఇట్టి యాఘాతముల నెదుర్కొనినతరి సామాన్యుల మానసికస్థాయి యెట్లుండునో రాముని భావనయు

నట్లుగనే మారినది. కోపము పెరిగినది. క్రోధోద్వేగస్థితి యున్మాదమునకు ప్రథమదశ. ఇంత జరుగుచుండ కథనంతయు నింతవరకు దానే నడపుకొనుచువచ్చి కోపావేశముతో ప్రజానురంజనముకొరకై పామరునిమాట నాధారముగగొని విచారణ లేక యే- కనీసము సూచనామాత్రముగ నేని జానకికి దెలుపక యే యడవుల కామెను నెట్టివైచిన రాము డేమనుచుండెనో వినుడు. "నాసీతను నాకొసగనిచో భూదేవిని కేవల మూరక యే వదలుదునా! ప్రపంచమునంతయు దగ్ధమొనర్చి వైచెదను."

ఒక్క పామరుని మాటకొరకు బహిఃప్రాణమైన జానకిని త్యజించుటకు సిద్ధపడిన ధర్మవీరుడు దయామయుడునగు రాముడు కారుణ్యశూన్యుడై ప్రపంచమును దగ్ధమొనర్చునట - భూదేవి నూరకవదలడట. సీత తనజానకి యట - ఈ ప్రేమ యొకనాడు కర్తవ్యనిర్వహణ కూడిగము సలిపెనే! నాడు తా నొనరించిన దేమి? లక్ష్మణుని త్వర పెట్టి సీతకు మాటమాత్రముగ నేని విషయమును వినిపింపక తరిమివైచెనే! నాడు "నాజానకి" యనుమాట గుర్తులేవా! లేకేమి? ఉన్నది. క్రోధోద్వేగము సామాన్యుల నెట్లాడించునో! ఎట్లుపలికించునో! వివరించుటకే యీసంఘటన.

బ్రహ్మ రాముని గాంచి "రామా! క్రోధమునుండి విముక్తుడవు గమ్ము. భూజాతయగు నీసీత సాధుచరిత. రసాతలమున తల్లి యొడిలో చల్లగ కాలము గడుపుచున్న మహాపతివ్రత యామె. నీవు శ్రీమన్నారాయణాంశ సంభూతుడవు. నిన్ను వైకుంఠమునం దామె తిరిగి కలియుగలదు. నీసతిని నీ

నుండి వేరుపఱుప నెవరికిని దరముగాదు. కావ్యలోకమునకే మకుటాయమానమైన వాల్మీకిమహాకవియొక్క శ్రీమద్రామాయణోత్తరకాండ శేషమును శ్రద్ధగ వినుము. సర్వము శుభమగు ననుచు తనత్రోవన తానేగెను. మిగిలినవారెల్లరు వింతవింతగ కథలు కథలుగ నీజరిగిన సంఘటనపై భాష్యముల జెప్పుకొనుచు వారివారి నెలవులకు వారేగిరి. శ్రీరాము డశ్రుధార లురలుచుండ మ్లానవదనుడై, యుత్తరకాండమునంతయుం సావధానముగ వినినవాడాయెను. సుఖదుఃఖముల కతీతమైన నిర్ద్వంద్వప్రవృత్తినే యలవరుచుకొనజాలిన గంభీరవైఖరినే యాయన ప్రదర్శింపగల్గెను.

'సీతాయా శ్చరితం మహ' త్తనెడి వాల్మీకి సంకల్పమున కనుగుణముగనే కథ కొనసాగినది. జనకునిచేత సుశిక్షితయైన సుదతిచరిత్ర యెట్లు ముగియవలెనో యట్లే ముగిసినది. ఆమె అయోనిజయైన కతన సాగవలసిన ధోరణిలోనే యామెచరిత్ర సాగినది.

భూపుత్రి యగుటచే సహన మామెకు సహచరియైనది. అరణ్యావాసములకు జంకలేదు. రాక్షసచక్రవర్తి తర్జన భర్జనలకు జడియలేదు. దానవాంగనల ప్రలోభలీలలకు లొంగలేదు. సమదృష్టితో, ధర్మభావనతో, పాతివ్రత్యమహిమతో పరనిర్బంధబాధల ననుభవించినది. రామవియోగవ్యథకు క్రుంగక యేనాటికేని భర్తృపాదసేవాభాగ్యము సిద్ధించగలదనెడి యాశతో జీవించినది. దూరస్వభావుల నిందలకు దలయొగ్గినది.

ఇక్ష్వాకువంశమునకు భావికాల ప్రభువుల నిరువుర సమర్పించినది. విశ్వనారీలోకమున ధ్రువతారయై విరాజిల్ల గల్గినది. ఉదారత కామె నిలయము. మహోదరణభావమున కామె ఆలయము. దయాభావమునకు నిధి. ధర్మతత్పరతకు పెన్నిధి. అశోకవనమున సీతను దర్శించినపు డాంజనేయుడు "తల్లీ! నా వీపుపై నిడుకొని నిన్ను నీనాథునికడకు గొనిపోవుదును. రమ్మని" యర్థించినాడు. కాని! అది పతివ్రతకు లక్షణముగాదనియు, తానట్లు రాననియు సీత నిష్కర్షగ నిరాకరించినది. నా భర్తయే వచ్చి నన్ను గొనిపోవవలెనని యామె హనుమంతున కెట్లో నచ్చజెప్పుకొనినది.

పతి సందర్శనార్థము పరితపించుచున్న యేస్త్రీయైనను మారుతిసూచన నంగీకరించి యుండెడిదే కాని! సీత పతిసందర్శనాలస్యమునైన సహింపగలదు. కాని! పరపురుష స్పర్శ నించుకేనియు సహింపదు. కావుననే యిట్లనినది. అగ్నిదేవునివంటి మహనీయుడే యామెకోరిక మేరకు హనుమంతుని విషయమున చందనసము శీతలుడగు యామె పాతివ్రత్యప్రభావమున కొక నిదర్శనమే యగునుగదా! లోకమునగల కష్టముల నన్నింటి నామె సహించగలదు. కాని! పరుల దుఃఖమునుమాత్ర మామె సహింపజాలదు. విశ్వప్రేమ కామె యేకైక నిదర్శనముగ వర్తించు పావనచరిత్ర.

"శీతో భవ హనూమతః" అని యగ్నిని శాసింపగలిగిన సాధ్వి నగ్నిహోత్రు డేరీతి పరీక్షింపగలడు? రామునకు విశ్వాస

మును గలుగఁజేయుటకే యామె యగ్నిప్రవేశ మొనర్చినది. రామునితృప్తి యామె కభిమతాంశము.

సీత నంకమున బెట్టుకొనివచ్చి రామున కర్పించి "రామా! ఆమె చెప్పినదానికన్న మిన్నగ నేను చెప్పదగిన దేమియును లేదు". - పావకుడు పలికిన పలుకులివి.

"పాపం మయి నవిద్యతే" అని సీత పలికినదానినే తిరుగవైచి "పాప మస్యాం నవిద్యతే" యని యగ్నిహోత్రు డనినాడు. కాని! యట్లగ్నిహోత్రుడనునని యెరిగియు భౌతిక దేహముపై గల మమతను లెక్కింపక నిప్పులలో దుమికి పాతి వ్రత్యమహిమ నుద్ఘాటించిన యామె యౌన్నత్యము - నౌచి త్యము మహోన్నత శిఖరసీమల నధిష్ఠించినవి. తాను జన్మించిన దిట్టి యుజ్జ్వలప్రతిభను బ్రకటించుట కొరకే యనున ట్లామె నిరూపించినది. జానకి వీరాంగన. రాముడు పెట్టిన పరీక్ష కొక్కదానికే యామె యంగీకరించినది. రెండవమారు రాముడు సంశయాస్పదుడు కాగా భూమాతను బ్రార్థించి యామె యొడిలో జేరి యామెలో లీనమై యెవ్వరి పరీక్షలకేని యెట్టి యవకాశము నేని యొసగక తన హృదయాంతర్గత మహత్తర దుఃఖము నమృతసమముగ మార్చుకొనజాలినది. దుఃఖమయ నిజజీవితమ నెడి ఫలమును పిండి మధురరసమును లోకమున కొసగినది.

పాతివ్రత్య సంరక్షణార్థ మాత్మత్యాగము గావించుటలో గల ప్రశస్తి పతితో సుఖముల ననుభవించుటయందు గలుగ

బోదని యామె సిద్ధాన్తమేమో! సాహసముతో సహనమును, సాధుత్వముతో సరలత్వమును సమ్మిళితమొనర్చి - తనమ్నాలమున స్వచ్ఛసువర్ణసమ పాతివ్రత్యము పవిత్రీకరించుకొనుటయే గొప్పవిషయము. తాదృశ పాతివ్రత్యమున కామె శీలముసద్వృత్తము ననెడి మనోహర పరిమళములను గూడ సంతరించి విశిష్టత జేకూర్చినది. సీత పతివ్రతయే కాదు. దివ్య తేజమును ధరణీతలమున వ్యాపింపజేసిన పుణ్యాంగన. ఆమె యాదర్శసతీతిలకము. త్రికరణశుద్ధిగా తనయిష్టదైవమైన శ్రీరాము నారాధించి పతియౌన్నత్యము నాకాంక్షించిన సాధ్వీతిలకము. వాత్సల్యభావతరంగములు పొంగులువార సకలప్రపంచమును కరుణామయదృష్టుల తరింపజేసిన సాధుశీల, పురుషకారభూత, జగన్మాత.

ప్రతిమాటయు నామెయెడ నర్థవంతముగనే ప్రయోగింపబడినది.

"త్వం మాతా సర్వ భూతానామ్"

అని పరాశరభట్టు చెప్పినట్లు సీత సకలలోకమాతయే.

కటుగంధేన విద్ధాయ భూమ్యాం నవతృణాంకురం
యా న జిఘ్రతి సా ధేను స్వయోని ద్వార మార్గతః
సద్యో జాతస్య వత్సస్య దేహమాలిన్య సంపదమ్
యథా లిహాతి సోల్లాసం తథా జీవస్య కిల్బిషమ్.

కటువైన వాసనగల క్రొత్తగడ్డిపరకను సైతము వాసనచూడని గోమాత తనయోనిమార్గముద్వారా వెడలిన దూడయొక్క మాలిన్యమును మిక్కిలియుల్లాసముతో నాకివైచి నిర్మలత్వ మును బిడ్డకు ప్రసాదించినట్లు జగన్మాతయగు మహాసాధ్వి సర్వ జీవుల పాపములను హరించి పాపరహితుల గావించుచున్నది.

ఆమె మనోహరగాథాసుధ మిక్కిలిమధురము, మహ నీయము. లోకమునం దెందరో స్త్రీలున్నారు. వారిచరిత్రలను మనము గాంచుచున్నాము. విశ్వగాథలో జానకివంటి పూజ నీయు మెచ్చటను గన్పింపదు.

సాధ్వీరత్నమైన జానకినిగూర్చి వివేకానంద సంయమీం ద్రుని మధురవాణి యేమనుచున్నదో! ఆలింపుడు.

“పూర్వసారస్వతము నామూలచూడముగ నవలోకిం పుడు. వర్తమాన సాహిత్యమును దిలకింపుడు. రానున్న వాఙ్మయవైభవము నూహింపుడు. మరియొకసీత మనకు సాక్షాత్కరింపదు. నిశ్చితార్థముగ నే నీమాట వక్కాణింప గలను. అట్టి దివ్యసాధ్వి యొకమహాకవి లేఖినినుండి యొక మారే యుదయించినది. శ్రీరామచంద్రమూర్తులు పెక్కు రుద్భవింపవచ్చును. సర్వకాలములకు సీతమాత్ర మొక్కతెయే. ఎవ్వ రెన్నిమారులు వాకొన్నను మహాసాధ్వియని చెప్పవలసి వచ్చినపుడు సీతపేరునే చెప్పుకొనవలెను. భారతనారి విశ్వచరి త్రలో మహోన్నతస్థానమును గడించుట కవసరములైన

యుత్తమలక్షణముల నన్నింటిని సీతనుండియే యలవరచుకొన్నది.

యుగయుగముల - తరతరముల భారతచరిత్రలో స్త్రీ పురుష బాలవృద్ధ తారతమ్య రహితస్థితిలో నెల్లరి యారాధనల నందుకొనజాలిన మహాసాధ్వి జానకియే.

పవిత్రత కామె పావిత్ర్యమును సంఘటించినది. యోగ్యత కామె యోగ్యతను జతజేసినది. దేవ మానవ రాక్షసకాంతలందరి యభినందల నామె యందుకొనగల్గినది. ఈమె సకల మానవ హృదయ కమల నిత్యనివాసిని. మనపురాణములు స్వస్వరూపముల గోల్పోవవచ్చును. వేదములు మరుగున బడవచ్చును. సంస్కృతభాషయే తెరమాటునకు జేరవచ్చును. ఏది యేమైనను గావచ్చును. వసుంధరపై కేవల మైదుగురనిన నైదురుగు భారతీయులు జీవించి యుండినజాలును. వారు పామరభాషనే భాషించువారు గావచ్చును. కాని! సదా వారికంఠసీమలనుండి సీతాదేవి దివ్యనామము మాత్రము వినిర్గత మగుచునే యుండును. ఈజాతిమీాద నామహాసాధ్వీచరిత్రము నకుగల ప్రభావముద్ర యట్టిది. ఈగడ్డపైగల ప్రతిస్త్రీపురుష రక్తనాళములయందును వినిర్మల జాహ్నవీ తోయ ధారా పరంపర లీల సీతామహాసాధ్వీ పరమపావనచరిత్ర యెడతెగక జాలువారుచునే యుండగలదు. భారతీయాంగన లందరు సీతాదేవి ప్రతిబింబము లే. భారతీయులందరు జానకీ వాత్సల్యామృతలహరిలో దేలియాడు బిడ్డలే." —వివేకానందస్వామి

వివేకానందుని వాక్కులు హృదయమును పులకరింపజేయు జానకి విశిష్టతకు చక్కని దర్పణములై ప్రత్యేక ప్రతీకలై ప్రతిభాసించుచున్నవి.

సీత పుట్టుక యెట్లు నిగూఢమైనదో! జీవితచరిత్రయు నట్లే గంభీరోదాత్తమైనట్టిది. జలోపరిభాగమున క్షణక్షణమునకు రూపములు దిద్దుకొను తరంగములలీల యామె మనుగడయందలి కష్టపరంపర లన్నియు మనకన్నులయెదుట సదా సాక్షాత్కరించుచుండును. సంకుచితభావనయు, హ్రస్వదృష్టియుగల పాషాణహృదయుల కవి కన్పింపక పోవచ్చును. మందబుద్ధులయినవారికవి సహేతుకములుగను, సత్యసమ్మతములుగను దోచక పోవచ్చును. కాని! పతిని సర్వదా అంతరంగమున నిలుపుకొని లోకమును నుద్దీప్త మొనర్పజాలిన దివ్యాచరణ వైభవముతో నెల్లర ముగ్ధుల జేయుచు మహోన్నతమైన మనుగడ సాగించిన యామెపాతివ్రత్యవైశిష్ట్యము మాటలతో వర్ణింప సాధ్యముగానిది. భౌతికమైన చూపునకు జానకి యంతరాత్మకు సంబంధించిన విలువలు కన్పించకపోవచ్చును.

ఆ సముజ్జ్వలశక్తి యెట్టిదో! మనమెంతగ తర్కించినను, మథించినను, విశ్వప్రయత్న మొనరించినను గమనించజాలము. నిర్వచింప జాలము. తాదృశదివ్యశక్తికి జోతలర్పించు టొక్కటే మనము చేయదగినపని. దివ్యచక్షువులు మాత్రమే అంతరాంతములవరకు చూపులను బ్రసరించి

యాకృతిని దర్శించగలవేమో! అప్పుడు కలిగెడి యనుభూతి నిత్యానంద సంధాయకమైనట్టిది.

ఆమె జీవిత సన్నివేశములలో నంతర్లీనమైయున్న భావ పరంపర అగాధసాగర గర్భమునం దట్టడుగుననున్న రత్నము వలె నయనములకు విభ్రాంతిని గొల్పుచుండును. నక్షత్రముల నడుమ చందమామవలె విశ్వమునగల నారీలోకమునం దామె భాసమాన దీప్తులతో విరాజిల్లుట కాభావపరంపరయే ప్రధాన కారణము.

అహో! ఎట్టి దివ్య తేజోమయ పవిత్ర జీవిత మామె గడిపినది? ఎట్టి పవిత్రావేశముతో పాతివ్రత్య మహిమకు పతాకగా భాసించినది. ఎట్టి దివ్యయత్న విశేషములతో నెల్లరి చూపులను దనవంకకు ద్రిప్పుకొనగల్గినది? అభినందన లందుకొనగల్గినది?

ఇవియన్నియు గుర్తునకువచ్చి మన మనఃఫలకమున కాంతిపుంజపుటలల బొరలించు మానసముల విస్మయమున ముంచివేయగలవు.

జానకిగాథ పఠించినను శ్రవణమొనర్చినను సోదరీమణుల కందరికి నామె యోర్మికార్పులే యలవడుననుట నిస్సంశయము. కాంతలెల్ల రంతరంగములలో సీతాదేవి దివ్యగాథను స్మరణ మొనర్చుచు జీవితమునం దాచరణలోనుంచుచు, తప్పక యనుష్ఠింతురుగాక!

నదులు, నదములు కొండలు, గుట్టలు, పుట్టలు, పొదలు వేయేల! సకలము ధరణీతలమునం దున్నంతకాలము సీతాదేవి దివ్యమూర్తి సమస్త స్త్రీలోక హృదయసదనములందు దేదీప్యమానముగ ప్రకాశించుచునే యుండుగాక! పుటము బెట్టిన పదునాఱువన్నెల బంగారము పగిది ప్రకాశించెడి మహాసౌశీల్యవతి, అభిమానవతి సీత.

అన్నింట నామె యున్నతి సమున్నతమై కన్నుల మిఱుమిట్లు గొల్పుచునే యుండును. ప్రత్యంశమునం దిట్లు ప్రశస్తిం గన్న ప్రశంసనీయాంశములు జానకీచరిత్రమునం దుండుటవలననే "సీతాయా శ్చరితం మహత్" అనిరి. ఈ వాక్యము సీతయెడ వాల్మీకికిగల పరమాదరభావమునే ప్రకటించుచుండును. కావున నిట్టి దివ్యగాథ, రమణీయచరిత్ర, సర్వలోకములను పావన మొనర్చుచు పదికాలములపాటు ప్రజల జల్లగ గాచుగాక!

యావత్ స్థాస్యంతి గిరయ స్సరితశ్చ మహీతలే
తావత్ సీతాచరితం హై లోకేషు ప్రచరిష్యతి.

—: ఇతి శమ్ :—

జూపిటర్ ప్రింటింగ్ వర్క్స్, గుంటూరు-2. ఫోన్ : 21907

691